# వ్యాసకౌముది

2013

## వ్యాసాలు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 130

# విషయ సూచిక


| ఏడాది | నెల | వ్యాసం పేరు | వ్యాస రచయిత(త్రి) | పేజి |
|---|---|---|---|---|
| 2013 | 1 | గురు జాడ డైరీలు – భాష విశేషాలు | డా శిరీష ఈడ్పుగంటి | 3 |
| 2013 | 1 | పరిశోధకుడుగా  గురజాడ | డా తన్నీరు కళ్యాణ్ కుమార్ | 8 |
| 2013 | 3 | ఆంగ్ల భాషలో తెలుగోడి గోడు | ప్రొఫెసర్ వంశీ జూలూరి | 13 |
| 2013 | 3 | తెలుగులో అనువాద ప్రక్రియ | డా శిరీష ఈడ్పుగంటి | 15 |
| 2013 | 3 | మహాప్రస్థానం వెనక? | కర్ల పాలెం హనుమంత రావు | 20 |
| 2013 | 4 | సాహితీ  భీష్ముడు పెమ్మ రాజు | వంగూరి చిట్టెన్ రాజు | 24 |
| 2013 | 4 | మరాఠీ రేవి మహా కవి తాంబే | కర్లపాలెం హనుమంత రావు | 33 |
| 2013 | 5 | తెలుగు తానీషా యస్వీ జోగారావు | డా శిరీష ఈడ్పుగంటి | 37 |
| 2013 | 5 | తెలుగువారి వలసలు | డా తన్నీరు కళ్యాణ్ కుమార్ | 43 |
| 2013 | 6 | జాతశ్రీ కథలు | మండవ సుబ్బారావు | 51 |
| 2013 | 8 | సతీ సావిత్రి | పి వి లక్ష్మణ రావు | 55 |
| 2013 | 9 | కాళిదాస కవితా వైభవం | విద్వాన్ తిరుమలపెద్దింటి నరసింహాచార్యులు | 62 |
| 2013 | 11 | నారాయణ బాబు అసంకలిత రచనలు | డా యు ఎ నరసింహమూర్తి | 67 |
| 2013 | 11 | నారాయణీయం | ఆర్ శర్మ దంతుర్తి | 74 |
| 2013 | 12 | తెలుగు వ్యాఖ్యానాలు సి పి బ్రౌన్ కృషి | డా జడా సుబ్బారావు | 80 |
| 2013 | 12 | వేమన తత్త్వంలో స్త్రీ | డా తన్నీరు కళ్యాణ్ కుమార్ | 84 |
| 2013 | 3 | మహాకవి తెనాలి రామకృష్ణ విరచిత పాండురంగ మహత్యం | బాలాంత్రపు వేంకట రమణ (ఏడు భాగాలూ)(2013 03 – 2013 09) | 89 |
| 2013 | 8 | ఆదిభట్ల నారాయణదాసు | ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి (రెండు  భాగాలూ)(2013 08 – 2013 09) | 126 |

# వ్యాస కౌముది

## గురజాడ డైరీలు - భాషావిశేషాలు

డా. శిరీష ఈడ్పుగంటి

**తెలుగు సాహిత్యంలో వ్యావహారిక భాషకు** పట్టం కట్టిన మహనీయుడు గురజాడ వేంకట అప్పారావుగారు. ఈయన 1862 సెప్టెంబర్ 21 తేదీన విశాఖ జిల్లా యలమంచలి తాలుకాలోని రాయవరం గ్రామంలో జన్మించారు. చీపుర పల్లిలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. విజయనగరం కళాశాలలో పట్టభద్రుడై అనంతరం అదే కళాశాలలో కొంతకాలం ఉపన్యాసకుడుగా పనిచేశారు. ఆ సమయంలో విజయనగర సామ్రాజ్య ప్రభువైన ఆనంద గజపతి సంస్థానంలో ప్రాచీన లిపి పరిశీలకుడిగా వ్యవహరిస్తూ తెలుగు భాషా స్వరూపాన్ని బహుముఖంగా పరిశీలించి పరిశోధించి తన రచనా పద్దతికి అనుకూలంగా తెలుగు పలుకుబడిని మలుచుకున్నారు. ఇతర భాషలకు తీసిపోని శక్తివంతమైన సంభాషలు తెలుగు వాడుక భాషలో కూడా రచించడం సాధ్యమని నిరూపించిన వారిలో అగ్రగణ్యులు.

డైరీ అనే పదం డయారియం అనే లాటిన్ శబ్దం నుండి పుట్టిన ఆంగ్లపదం. ఈ పదాన్నే తెలుగులో కూడా పిలుస్తున్నాం. దినచర్యను తెలిపేది అనే అర్థంలో వాడుతున్నాం. రోజువారీ కార్యక్రమాల సమూహం అని చెప్పవచ్చు. ప్రతిరోజు చూసిన, చేసిన, వినిన, అనుభవించిన సంఘటనల సమాహారాన్ని లిఖిత రూపంగా చేయడం. ఇది రోజునే కానవసరంలేదు. అప్పుడప్పుడు కూడా కావచ్చు. ఈ డైరీల వలన డైరీ రాసిన వ్యక్తి సంపూర్ణ జీవితాన్ని మనం తెలుసుకోవచ్చు. అది ఏ కాలంలో అయినా సరే. అంతేకాకుండా ఆనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థికపరమైన విషయాలను కూడా తెలుసుకోవచ్చు. ఇటువంటి విషయాలు ఒకవ్యక్తి రచనల ద్వారా కేవలం కొంతవరకు మాత్రమే తెలుసుకోగలుగతాం. కానీ వారి సంపూర్ణ జీవితాన్ని తెలుసుకోలేము. అందుచే గురజాడవారి వ్యక్తిగత జీవితం, ఆనాటి పరిస్థితులు, సాహిత్యం, భాషపై వారు చేసిన కృషి, మొదలైన విషయాల గూర్చి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో వారి డైరీల పరిశీలన గూర్చి ప్రస్తావిస్తున్నాను. అందులోని భాషా విశేషాలను పేర్కొంటున్నాను.

***డైరీలలోని ముఖ్యాంశాలు***

1889-1915 వరకు గురజాడవారు రాసుకున్న డైరీలు సాహిత్యం పట్ల, భాషపట్ల, సమకాలీన సమాజం పట్ల వారి అభిప్రాయాల్ని, వ్యక్తిత్వ వికాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి. సాహిత్యం సామాజిక ప్రయోజనాలకు ఉపయోగపడాలనేవారు. జనవ్యవహారంలో రచనలు ఉండాలనేవారు. సామాన్యులు మాట్లాడుకునే భాషలోనే రచనలు రాయాలని కోరినవారు. ఎప్పటికప్పుడు నవీనతను ఆశించేవారు.

***వ్యావహారిక భాషోద్యమం***

"నాది ప్రజల ఉద్యమం దానిని ఎవరిని సంతోష పెట్టడానికైనా వదులుకోలేను" (సూర్యారావు, అవసరాల. 1954:223) అని గురజాడవారు డైరీలలో రాసుకున్నట్లుగా తెలుస్తుంది. వ్యావహారికభాషా వ్యాప్తికై ఆంధ్రసారస్వత పరిషత్ స్థాపన జరిగింది. దాని

మూలస్థంభంగా నిలిచారు. ఉన్నత పాఠశాల బోధనా సంస్కరణలకు స్థాపించిన సంస్థలలో ప్రధాన సభ్యులుగా ఉన్నారు. వ్యావహారిక భాషలో రచనలు చేయడం తప్పుగానూ, చేతగానితనంగాను భావించే ఆ రోజులలో ఆయన ప్రజలందరికీ అర్థమయ్యే జీవభాషలో రచనలు చేశారు. తెలుగు సాహిత్యంలో వాడుక భాషా ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యులు. గిడుగు రామమూర్తి పంతులగారితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు.

భాష అనేకనేక కారణాలవల్ల వివిధప్రాంతాలలో వివిధరకాలుగా మార్పులకు లోనవుతూ ఉంటుంది. మార్పులకు లోనుగాని రూపాలు కొన్ని ప్రాంతాలలో అలాగే మిగిలి ఉంటాయి. ఒకే అర్థాన్నిచే వేర్వేరు పదాలు వివిధప్రాంతాలలో ప్రాచుర్యంలో ఉంటాయి. అందువల్ల ఏ పదం వాడిన వారినీ మనం సంస్కారహీనులనీ వారి భాషకు పునాదివేసిన వ్యక్తి. ఆ రోజులలో ఉండే దురాచారాలు కన్యాశుల్కం, బాల్య వివాహాలు, కులమత వర్గాల రూపు మాపు నిరక్ష్యరాస్యత మొదలైన వాటిపై తన రచనల ద్వారా పోరాటం సాగించారు. తన రచనల ప్రయోజనాన్ని సామాన్య ప్రజలు సైతం అర్థం చేసుకోవాలని వాడుక భాషను ఉపయోగించారు. తానేకాదు అందరు రచయితలు వాడుక భాషలో రచించాలని కోరుకున్నవారు. వాడుక భాషను వ్యవహారిక ప్రమాణభాషగా చేసే ఉద్యమం నెలకొల్పారు. అయితే ఈ ప్రభావం సమకాలీనుల పైన తక్కువగాను తర్వాత తరాల మీద ఎక్కువగాను కనిపిస్తుంది. గురజాడవారు తన సమకాలీనులతో పాటుగా రచనలు చేశారు. మొదట్లో ఆనాటి పాత పద్ధతులు, విలువలతోనే రచనలు చేశారు. కొంతకాలం తర్వాత రచనా పద్ధతిలో పరిపూర్ణత సాధించి పాతపద్ధతులకు స్వస్తి చెప్పి కొత్త విలువలతో నవతరానికి ఉపయోగపడే ఆలోచనలతో రచనలు చేయడం మొదలుపెట్టారు. రచనలలో నవ్యతను కోరుకున్నారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి నూతన ఒరవడులు దిద్దారు. గురజాడ ఆధునికత భావంలో హేతువాద దృక్పథం, మానవతావాద దృక్పథం, శాస్త్రీయదృక్పథం, మూడు కనిపిస్తాయి. అయితే ఆ రోజులలో ఇంతటి ఆధునిక భావాలను చెప్పిన వ్యక్తిమాత్రం గురజాడే మానవతావాదం అనేది ఒక జీవనదృక్పథం. నిత్యనూతనంగా ఉండేది. స్వేచ్ఛను కలిగి ఉండటం. సత్యం, జ్ఞానం, నీతిగా ఉండటం, సహనంతో ఉండటం, మంచి చెడులను విశ్లేషించగలడం, స్వార్థంలేని ప్రేమ, మొదలైనవాటిని గురజాడ తన రచనలలో మానవతావాదపు విలువలుగా చిత్రీకరించారు.

***రచనలలో ఆధునికత***

నవ్యాంధ్ర సాహిత్యం గురజాడ రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది. సాహిత్య ప్రక్రియలలో ముందుగా నాటక రచనను చేపట్టడమేగాక సమకాలీన నాటక ప్రదర్శన రీతులనుకూడా సునిశితంగా విమర్శించారు. పటిష్టమైన నాటకీయ సంభాషణలతో ఆంధ్రనాటక పురోగమనానికి దారితీసిన నాటకం కన్యాశుల్కం. ఈ నాటకంలో చూపించిన సంభాషణలు నేడు నిత్యజీవితంలో కనిపిస్తున్నాయి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆధునికరీతిలో ఆనాడే రచనలు చేశారు. ఆ రోజులలో బాల్యవితంతువులు, వేశ్యలు, సంఘదురాచారాల వల్ల ఎంతో బాధపడేవారు. వారి జీవితాల్నే నాటకంగా చిత్రించారు. అంతేగాకుండా వ్యావహారిక భాషా ప్రయోజనం, సంఘసంస్కరణ, సమకాలీన పండితుల ధోరణుల గూర్చి కన్యాశుల్కం ద్వితీయ ముద్రణ పీఠికలో 1909 మే నెలలో కూలంకషంగా చర్చించారు. వాస్తవికతకు, సాంఘిక జీవన చిత్రణకు, మానవీయ విలువలకు, అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. సమాజంలో ఉన్న దురాచారాలను రూపుమాపడానికి రచించిన నాటకం కన్యాశుల్కం. ఇందులోని ప్రతిపాత్ర ఈనాటికి సజీవంగా సమాజంలోని వ్యక్తులకు యదార్థాలుగా నిలిచి ఉన్నాయి. అలాగే గురజాడ వారు రాసిన కథానికలు దిద్దుబాటు, మాటామంతి, పెద్దమసీదు, నీ పేరేమిటి? సంస్కర్త హృదయం, మెటిల్డా మొదలైనవి ఆనాటి సామాజిక వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబంగా ఉండి సజీవంగా నేటికీ దర్శనమిస్తాయి. కన్యక, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, ముత్యాలసరాలు వంటి దేశభక్తిగేయాలు, సారంగధర మొదలైన కవితాఖండికలు, కొండు భట్టీయం రచనలు ఆయనలోని దేశభక్తిని, సంఘసేవా దృష్టిని, సాహిత్య ప్రతిభని, ఆధునిక ధోరణిని కనబరుస్తున్నాయి.

<u>*భాషా విశేషాలు*</u>

గురజాడ వారు ప్రత్యేకంగా భాషపై రచనలు చేయకపోవచ్చుగానీ భాషపై వారు చేసిన కృషి మాత్రం చెప్పుకోదగినది. గొప్ప భాషా పరిశోధకుడు. వీరు భాషపై చేసిన కృషి రచన రూపం దాల్చితే భాషా శాస్త్రంలో ఒక మంచి రచనను మనం చూసి ఉండేవాళ్ళం. ఇందుకు ఉదాహరణగా గురజాడ వారు వారి డైరీలలో రాసుకున్న భాషాంశాలను కొన్నింటిని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

1. భాషా పరిశోధనలో భాగంగా ఉచ్చారణ లేఖనాల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచినట్లు తెలుస్తుంది. తెలుగులో మాట్లాడుతున్నప్పుడు తమిళుల ఉచ్చారణ పదాలలో కలిగే మార్పును గుర్తించారు.

ఉదాహరణ - ఉండాది, పూడుస్తాడు, బెసి అయింది, వెధవ కొడుకు, తీస్తిని Bought, అద (అదిగా), యక్కడనో (కో), సామి(అయ్యా).

2. ఉచ్చరించేటప్పుడు పదములోని మొదటి అక్షరం మీద ఊనిక హెచ్చుగా ఉంటుంది. ఉదాహరణ - రెండు మనిషి, బిల్లుయత్తు, చేస్తిని, వెనుకుంటమూ, ఏమిదండుగ, కత్తిదార పోసినాడు Last mislaid.

3. తమిళ దేశం సంగీతంలో తెలుగుదేశం కంటే మిన్న అయినప్పటికీ తమిళులు పాడే పాటలన్నీ తెలుగు కృతులే అయి ఉండనేల? దీనికి కారణమేమిటో అని గురజాడవారు ప్రశ్నించుకున్నారు? చాలామందిని అడిగారు.

తమిళ భాష కంటే తెలుగు భాష ఎక్కువ సంగీత మయంగానూ, మధురంగానూ ఉండటమే ఇందుకు కారణమని మిత్రులు అన్నారు. కాని గురజాడవారు దీన్ని అంగీకరించలేక పోయారు. దీనికి బలవత్తరమైన కారణాలేవో ఉండి తీరాలి. ఒకదేశం తన రహదారిని వదిలి మాతృభాషను త్యజించి అన్యభాషను ఎందుకు స్వీకరిస్తుందో సరియైన సమాధానం గ్రహించాలి అనుకున్నారు.

ఎన్నెన్నో పుస్తకాలు చదివారు. గ్రంథాలయాలకు తిరిగారు. చివరకు సమాధానం తెలుసుకున్నారు. ఆనాటి దక్షిణ దేశస్థితిగతులే ఇందుకు కారణం అని గ్రహించారు. అప్పుడు దక్షిణదేశాన్ని పరిపాలించిన పాలకులు తెలుగువారు (మధురనాయక రాజులు) కంచిని ప్రధాన నగరంగా చేసుకున్న చోళ చాళుక్యులు, విజయనగర రాజులు మొదలైనవారు.

4. తెలుగు అజంత భాష, అచ్చుల ఉచ్చారణము హెచ్చు. ఎటువంటి పరిమితులు లేకుండా తెలుసు సంస్కృత భాషాపదాలను స్వీకరిస్తుంది. తమిళభాషలో కంఠ్యములు మిక్కుటము ʻరʻ తరచు వినిపిస్తూ ఉంటుంది. ʻర,ళ,డʻలకు ప్రాచుర్యం అధికం. సంయుక్తాక్షరములు కూడా తరచు వినిపిస్తూనే ఉంటాయి. చాలా శబ్దాలు హలంతములు.

5. ఆంగ్లంలో ఎన్నో లాటిను భాషాపదాలు ప్రయుక్తమవుతుండేవి. లాటిను క్రియా విభక్తులను విడిచిపెట్టి ఆ పదాలను ఆంగ్లంలో వాడుతూ ఉండడం కనిపిస్తుంది. ఆంగ్లక్రియా విభక్తులు అవసరం కాదనుకునేవారు. క్వారల్ - లాటిన్ పదం. డెబైల్ అనే పదం వాడుకలో లేదు. డెబిలిటీ అనే శబ్దం ఉంది. డెబిలిటేట్ క్రియాపదం.

6. ద్రవిడ భాషా శబ్దశాస్త్రమును గూర్చి గురజాడవారివద్ద తెలుసుకోమని కెల్లెటుగారు ఒక విద్యార్థితో అన్నట్లుగా డైరీలలో ఉంది. భాషలు ఏవిధంగా మార్పు చెందుతున్నవి, దూరదూరంగానున్న ప్రదేశాలలో భాషలు ఏకకాలమున మారుటకున్నూ కొన్ని కొన్ని ప్రాంతాలలో ఒకేరీతిని మారుటకున్నూ, మరికొన్ని చోట్ల ఈ మార్పు అనేది వేరువేరుగా ఉండుటకున్నూ కారణమేమయి ఉండును? మూలద్రావిడ భాష దక్షిణాన తమిళంగాను ఉత్తరాన తెలుగుగాను ఏవిధంగా మారింది? తమిళ భాష మూలద్రావిడ భాషకు చాలా సన్నిహితంగా ఉన్నదనీ, అందు గొప్ప సాహిత్యం కలదనీ బర్నలు దొర అన్నట్లుగా పేర్కొన్నారు. తమిళ భాషలో గొప్ప సాహిత్యం కలదని చెప్పినంత మాత్రాన అది అతి ప్రాచీన భాష అని చెప్పడానికి వీలులేదు. అర్వాచీన సోదర సాహిత్యం కంటే ప్రాచీన సాహిత్యం పాత భాషారూపాలను, పదాలను ఎక్కువగా నిక్షేపించుకుంటుందనడంలో సందేహం లేదు. కానీ తమిళ సాహిత్యం కంటే అత్యంత ప్రాచీనమైనదని గట్టిగా చెప్పలేము అని గురజాడవారు ఆయన మాటలలో రాసుకున్నారు.

7. భాషలు మారు విధానాన్ని గూర్చి క్రిందివిధంగా రాసుకున్నారు. కొన్ని కొన్ని ప్రదేశాలలోని ప్రజలు కొన్ని కొన్ని ధ్వనులు పలికేటప్పుడు వారి ఉచ్చారణాంగాలైన తాల్వాద్యవయవాలను బట్టి భాషాపదాలు మారుతూ ఉంటాయి. అలాగే ప్రజల అలవాట్లు, ఆచార వ్యవహారాలు, మతం, వారి పాటలు, సంగీతం, సాహిత్యం, మొదలైనవి భాషలపై తమ ప్రభావాన్ని స్పష్టంగా చూపుతున్నాయి. ఈ విధంగానే ఇరుగు పొరుగు ప్రదేశాలలో ఉన్న భాషలు కూడా.

8. ఒక భాషా కుటుంబంలో అనేక రూపాంతరితపదాలు, ఒకే జాతిభాషలో పలురూపాంతరములు కనిపిస్తాయి. బోసందు అనే పదం యలమంచిల ప్రాంతంలో వాడుకలో ఉంది. అంటే భూసంధి కాబోలు అని రాసుకున్నారు.

9. ఒక గ్రంథంలో వాక్యసముశ్చయం గూర్తి ఏర్పడిన వివావదం గూర్చి రాశారు. దానిమీద రాజావారు గంటల తరబడి వ్యాకరణ విశేషాలను గూర్చి ప్రసంగించారట. మహారాజావారి వ్యాకరణ పరిజ్ఞానం అపారం అని డైరీలలో పేర్కొన్నారు. వీరిమధ్య సాహిత్యపరమైన చర్చలు నిత్యం జరుగుతుండేవి.

10. క్లాసికల్ కృతులు, పాప్యులర్ కృతులు (సామాన్యకావ్యాలు) గూర్చి రాశారు. క్లాసికల్ కృతులు సాధారణంగా పద్యాలలో రాయబడినవి. వీటికి శబ్దాడంబరం ఎక్కువ. కానీ పద్యపాదాలలో అభిరుచి కలిగించే గుణ, సౌకుమార్యం ఉందనడానికి సందేహం లేదు. పాప్యులర్ కృతులు పాశ్చాత్య సాహిత్యంలోని కథాగేయాల వలె ఇవి జన బాహుళ్యానికి పరిచితమైన శైలిలో రాయబడినవి.

11. చాలా పద్యాలలో ముఖ్యంగా ఒకే ఒక భావం పదే పదే మూడునాలుగు సార్లు ఆవృతమవుతూ ఉంటుంది. భావం ఒకటే. కొద్దిగా పదాలు మాత్రం తేడా. ఇవి తెలుగు భాష నేర్చుకుందామనుకునే విదేశీయుడికైతే బాగా ఉపయోగపడతాయి. అతనికి అమరకోశం అక్కరలేదని పేర్కొన్నారు.

12. పదాడంబరం లేని ద్విపదకావ్యాలు విదేశీయుని అభిరుచులకు సరితూగగలవు. ఇవి సహజంగానూ, లలితంగానూ ఉంటాయి. ఇవి పండితుల దృష్టిలో చాలా తక్కువ.

13. జానపద గేయాలలో శబ్దసౌష్టవం లేకపోయినా, కవితాశిల్పం లేకపోలేదు. విదేశీయులను ఆకర్షిస్తాయి.

14. ప్రత్యేకమైన ఒక విధమగు సంగీతం వీరకథలలో సహజం. బొబ్బిలికథ (రంగారావు చరిత్ర), నాగమ్మ కథ మొదలైనవి. ఆ నోటా ఆనోటా ప్రచారంలోనికి వచ్చి జనులవల్ల పదిలపరచబడ్డాయి. కథలు దేశం నలుమూలల బహుళవ్యాప్తి చెందాయి.

15. సంధి వ్యావహారిక భాషలో గల ఉచ్చారణకు సన్నిహితంగా ఉండేటట్లు చేద్దామనే ప్రయత్నం కనిపించదు. సంధికార్యములు భాషలో స్వతస్సిద్ధంగా ఏర్పడినవే తప్ప, అవి కృతకమైనవి మాత్రం కాదు. సంధికి సంబంధించిన చర్చలు చాలామందితో చేశారు. వారి వారి అభిప్రాయాలను రాశారు.

16. భాషాపరిశోధనలో చారిత్రక దృష్టి యొక్క ఆవశ్యకతను గుర్తించారు. భాషాపరిణామం పైన ఆధారాలతో తర్కబద్ధంగా వివరించిన వ్యాసాలు సందర్భాలు అనేకం ఉన్నాయి. ద్రావిడ భాషలను, తెలుగు భాషాపరిణామాన్ని, వచన రచన పరిణామాన్ని, వాడుక భాషల ప్రాశస్త్యాన్ని చారిత్రక దృష్టితో పరిశీలించారు. మూలభాష స్వరూప స్వభావాలు, దాని పరిణామం వంటి వాటిని కూడా చారిత్రక దృష్టితో పరిశీలించి వాస్తవ పరిస్థితులను కనుగొనాలని ఆశించిన వ్యక్తి.

17. ప్రపంచ సాహిత్య, విజ్ఞానాలను తెలుసుకోవడానికి, భారతీయ భాషా, సాహిత్య సంస్కృతులను ప్రపంచానికి అందజేయడానికి ఇంగ్లీషు ఒక మాధ్యమంగా రూపొందుతున్న విషయాన్ని గుర్తించమంటారు. ఇంగ్లీషులో రచన చేసే ప్రయత్నం హర్షణీయం కాకపోయినా అభ్యంతరకరం కాదని అంటారు. భారతదేశం పట్ల ఆసక్తి ఉన్న పాశ్చాత్యులకు మనదేశ గతానికి, వర్తమానానికి సంబంధించిన జాతీయ జీవితాన్ని తెలుసుకోవాలనే కోరిక ఉంటుందని, మన జీవితంలోని గొప్ప సంఘటనలను అన్యదేశీయులకు చూపుతూ ఆంగ్లభాషలో రచనలు సాగించే భారతీయులు తమ మాతృదేశానికి అపారమైన సేవ చేసినవారవుతారని గురజాడవారి

అభిప్రాయం. భిన్న భాషాసాహిత్యంలో దాదాపు అర్ధశతాబ్దంపాటు కృషిచేశారు. తను నిత్యజీవితంలో చూసినవి, విన్నవి, అనుభవించినవి ఇలా ఎన్నెన్నో విషయాలను రచనలలో కనబరిచారు. ఈ రచనలు సహజత్వానికి, వాస్తవికతకు అద్దం పట్టాయి. ఈనాటికీ ప్రజల మన్నలు పొందుతున్నాయి. ఈయన సాహిత్య కృషిలో కొన్ని దేశభక్తి గేయాలుగానూ, కవితా ఖండికలుగానూ, కథానికలుగానూ, నాటకాలుగానూ పుస్తకరూపం దాల్చినవి. కానీ పుస్తకరూపంలేని భాష పరిశోధనలు, విమర్శనా దృష్టి, చారిత్రక పరిశోధనలు మొదలైనవి ఎన్నో ఉన్నాయి. కావున సాహిత్యంలో గురజాడవారి స్థానం అన్ని కోణాలలోనూ కనిపిస్తుంది. కవిగానూ, నాటకకర్తగానూ, విమర్శకుడుగానూ, భాషాపరిశోధకుడుగానూ, చరిత్రకారుడుగానూ, దేశభక్తుడుగానూ చెప్పుకోదగిన గొప్ప రచయిత.

### ఉపయుక్త గ్రంథసూచి

*సూర్యారావు, అవసరాల నవంబరు, 1954. మహాకవి డైరీలు (ఆంగ్లమునకు తెలుగు). విశాలాంధ్ర ప్రచురణలు: విజయవాడ.*

●●●




# పరిశోధకుడుగా గురజాడ

## డాక్టర్. తన్నీరు కళ్యాణ్ కుమార్.

**గురజాడ యొక్క సృజనాత్మక రచనలు** ఆయన ఇతర సారస్వత కృషిని మరుగున పరిచాయన్నది చారిత్రక వాస్తవం. గురజాడ వారి సృజన శక్తి అంత గొప్పది. అందుకు కన్యాశుల్కం నాటకమే నిదర్శనం. తెలుగు సాహిత్య చరిత్రను ప్రభావితం చేసిన ఆయన రచనల వెనుక విస్తృతమైన పరిశోధనాత్మక అధ్యయనం ఉంది. గురజాడ వారి వ్యాసాలు, లేఖలు, డైరీలు పరిశీలిస్తే ఈ సంగతి స్పష్టమౌతుంది. స్వతస్సిద్ధంగానే గురజాడ వారు పరిశోధనాత్మక దృక్పథం కలిగిన వ్యక్తి. చరిత్ర పరిశోధన, భాషలతో తెలుగు తులనాత్మక సింహావలోకన, కావ్య విమర్శ మొదలైనవన్నీ ఆయన పరిశోధన కృషిని వివరిస్తాయి.

గురజాడ వారి పరిశోధనలు మౌలికంగా మూడు విభాగాలకు చెందినవి. అవి శాసన పరిశోధన, చారిత్రక పరిశోధన, భాషా పరిశోధన. సందర్భాన్ని బట్టి, అవసరాన్ని బట్టి ఒక్కోసారి దేనికదే విడివిడిగాను, పలు సందర్భాల్లో సంయుక్తంగానూ ఈ పరిశోధనలను ఆయన నిర్వహించారు. అందుకోసం తన అనారోగ్యాన్ని సైతం లక్ష్యపెట్టకుండా చారిత్రిక ప్రాంతాలను విస్తృతంగా పర్యటించారు.

1. ***శాసన పరిశోధన:***

గురజాడ అనుభవజ్ఞుడైన శాసన పరిష్కర్త. శాసన లిపిని బోధపరుచుకునేందుకు, దాని వృద్ధిని గమనించేందుకు సోదర భాష అయిన కన్నడాన్ని కూడా నేర్చుకున్నారు. గురజాడ శాసన పరిశోధనల్లో యుద్ధమల్లుని బెజవాడ శాసన పరిష్కరణ ప్రధానంగా పేర్కొనదగినది. గురజాడకు శాసన పరిశోధనలలో గిడుగు వెంకట రామమూర్తి, వేటూరి ప్రభాకర శాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు పంతులు, జయంతి రామయ్య పంతులు, కృష్ణశాస్త్రి, హెచ్.కృష్ణమూర్తి మొదలైన వారి సహకారం కూడా ఉండేది.

ప్రథమాంధ్ర కవి ఎవరు? అన్న చర్చ విస్తృతంగా జరుగుతున్న ఆ రోజుల్లో కొత్తగా దొరికిన శాసనాలను గిడుగు వారితో కలిపి పరిశీలించిన పిదప నన్నయ కంటే పూర్వమే తెలుగు సాహిత్యానికి సుస్థిరమైన స్థానం ఉందని గురజాడ గుర్తించారు. బెజవాడ యుద్ధమల్లుని శాసనాన్ని పరిశోధించి అందలి లిపిని బట్టి, అది రాజరాజ నరేంద్రుని కన్నా ప్రాచీనమైనదని గురజాడ నిర్ధారించారు. ఐతే గురజాడ వారి ఈ అభిప్రాయంతో కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, టేకు మళ్ళ రాజగోపాలరావు పంతులు, కోటేశ్వర శర్మ మొదలైన పండితులు ఏకీభవించలేదు. అందుకు గురజాడ అనేక చారిత్రిక, శాసనం ఆధారాలను చూపి తన వాదన నిజమని నిరూపించారు.

ఈ క్రమంలోనే గురజాడ యుద్ధమల్లుని బెజవాడ శాసనంతో పాటుగా రెండవ అమ్మరాజు వేయించిన మల్లియపూడి శాసనం,

నెల్లూరి శాసనం,రాజరాజ నరేంద్రుని కోరుమిల్లి శాసనం, వేంగీ రాజైన మహాదేవరాజు శాసనం, రెండవ పులకేశి సతారా శాసనం, పశ్చిమ చాళుక్య రాజైన ఆరవ విక్రమార్కుని శాసనాలను పరిశోధించారు.

యుద్ధమల్లుని సంతతికి చెందిన శాసనాలను గురజాడకు పూర్వమే ఇలియటు దొర, నూయల్ దొర వంటి పాశ్చాత్య పరిశోధకులు కొందరు పండితుల సహాయంతో పరిశోధించడానికి ప్రయత్నించినప్పటికీ సఫలీకృతులు కాలేకపోయారు. అందుకు కారణం 6-9 సంఖ్యల మధ్య వ్యత్యాసాన్ని లేఖకులు గుర్తించలేకపోవడమేనని గురజాడ పేర్కొన్నారు. అంతేకాక ఈ శాసనాలు శక సంవత్సరం ప్రకారం ఉండటం చేత పండితులు కూడా పొరబడ్డారని గురజాడ వివరించారు.

గురజాడ వారి శాసన పరిశోధనను ప్రోత్సహించిన వారిలో ఆనంద గజపతి రాజు కూడా ముఖ్యులు. అప్పటి విజయ నగరం మహారాజైన ఆనంద గజపతి చిన్నతనంలో తన పూర్వులకు సుబేదార్, మహా మండలేశ్వర, బిరుదులుండేవని విజయరామ గజపతి ద్వారా విని విన్నాడు. ఈ విషయంలో వాస్తవాలను తెలుసుకోవాలనే వాంఛ ఆనంద గజపతికి కలుగగా, దాన్ని పరిరక్షించుకోవడానికి ఆశ్రితుల సహాయం కోరారు. ఆ బృందంలో గురజాడ ప్రధానుడు.

అప్పటికే గురజాడ విజయనగరం మహారాజా వారి కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా పని చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పని ఒత్తిడి వల్ల గురజాడ ఆరోగ్యం క్షీణించింది. గురజాడ పరిశోధనలు భావితరాలకు ఎంతో అవసరమని గుర్తించిన ఆనంద గజపతి గురజాడను అధ్యాపక వృత్తి నుండి తప్పించి, నాటి నుండి సంస్థాన శాసన పరిశోధకునిగా నియమించారు. ఈ వెసులుబాటు గురజాడ వారి పరిశోధనలకు ఎంతగానో ఉపకరించింది. తన పరిశోధనకు మెచ్చి అప్పట్లోనే మహారాజావారు 2,350 రూపాయలను పారితోషికంగా ఇచ్చారని గురజాడ తన డైరీలో రాసుకున్నారు.

ఆనంద గజపతిరాజు 1897లో మరణించగా, సంతాన హీనుడౌట చేత విల్లు ప్రకారం అతని మేనమామ కొడుకుని దత్తత చేసుకుని స్వీకార మహోత్సవం జరిపించారు. అది చెల్లదని బంధువులు దావా వేశారు. గురజాడ సంస్థాన ఆంతరంగిక కార్యదర్శి కావడం చేత ఆ దావాలో వంశ పురుషుల వృత్తాంతాన్ని శాసన ప్రమాణాలతో సహా నిరూపించారు. అందుకు గానూ గురజాడ ఉషాభ్యుదయం, శ్రీకృష్ణ విజయం మొదలగు ప్రబంధాలను, విజయనగర రాజుల శాసనాలను పరిశోధించి దావాను విజయవంతంగా పరిష్కరించారు.

***2. చారిత్రక పరిశోధన:***

గురజాడ చరిత్ర అధ్యాపకుడు. విజయ నగర సంస్థాన పరిశోధకుడు కావడం చేత ఆయన ఇల్లే ఒక గ్రంథాలయంలా ఉండేది. తెలుగు - సంస్కృత సాహిత్య గ్రంథాలు, శిలా శాసనాల రికార్డులు గల ఎపిగ్రాఫికా ఇండికా, ఇండియన్ యాంటిక్వరీ వాల్యూములు, నెల్లూరు జిల్లా శాసనాలు, విజయనగర సంస్థానానికి చెందిన శాసనాలు, విజయ నగర రాజుల బంధువుల వంశ వివరాలను తెలిపే పద్యకావ్యాలు, వచన గ్రంథాలు ఉండేవి. అందువల్లనే రాజులు, పండితులు చరిత్రకు సంబంధించిన సమాచార వివరాలకోసం గురజాడతో తరచుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్లు ఆయన లేఖల ద్వారా తెలుస్తుంది.

గురజాడ కళింగ చరిత్ర, ఆంధ్ర కవుల చరిత్ర రాయడానికి ఎంతో ప్రయాసపడ్డారు. కులాల చరిత్రలను కూడా శోధించాలని ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ ఈ పరిశోధనల విషయంలో గురజాడ ప్రయాస సఫలం కాలేదు. అందుకు నాటి సంస్థాన వారసత్వపు తగాదా, గురజాడ వారి అనారోగ్యం, వ్యావహారిక భాషా ప్రయోగం అనేవి ప్రధాన ఆటంకాలయ్యాయి. ఈ చరిత్ర పరిశోధనలో గురజాడ

వారి కృషిని గమనించిన ఆయన మిత్రులు ఆయనను ఎంతగానో ప్రోత్సహించారు. గురజాడ పరిశోధనా ఫలాలు భావి తరాలకు ఎంతో అవసరమైనవిగా గుర్తించి, వాటిని పూర్తిచేయడానికి తమ వంతు సహకారాన్నందించారు. అప్పట్లో ప్రముఖ శాసన పరిశోధకులైన హెచ్.కృష్ణశాస్త్రి గురజాడకు కావలసిన సామాగ్రిని అందజేస్తుండేవారు.

కళింగ దేశ చరిత్రను రాయడానికి గురజాడ సంకల్పించారు. అందుకు అవసరమైన శాసనాలను, రికార్డులను సేకరించి పరిశోధించారు. అన్ని వివరాలనూ సమీకరించి మంచి ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నారు. ఐతే ఆ చరిత్ర రచనలో ప్రయోగించే భాష విషయమై గురజాడకు, కొమ్మరాజు లక్ష్మణరావు గారికీ ఏకీభావం కుదరలేదు. గురజాడ వ్యావహారిక భాషలోనే రాయడానికి సంకల్పించగా, ప్రచురన కర్తలైన కొమ్మరాజుగారు అందుకు అంగీకరించలేదు. ఐనా గురజాడ తన ప్రయత్నాన్ని విరమించలేదు.

ఈ సమయంలోనే విజయనగర సంస్థాన వారసత్వపు దావాలో తలమునకలైపోవడంతో గురజాడ వారి చరిత్ర రచనకు అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు అనారోగ్యం కూడా ఆయనను తీవ్రంగా కృంగదీసింది. గురజాడ అనారోగ్యం నుండి కోలుకోలేకపోయారు. గురజాడ తన అవసాన దశలో కూడా ఈ చరిత్ర రచన విషయమై విపరీతమైన వేదన పొందినట్లు ఆయన మిత్రులకు రాసిన లేఖల ద్వారా అర్థమౌతుంది. గురజాడ మరణాంతరం ఆయన మిత్రుడైన గిడుగు రామమూర్తిగారు దీన్ని సమకూర్చాలని ప్రయత్నించారు. కానీ పూర్తి చేయలేదు. ఈ కారణంగానే గురజాడ విశేషంగా పరిశోధన గావించిన పూసపాటి గజపతుల చరిత్ర గానీ, విశాఖ జిల్లా చాణుక్యుల చరిత్ర గానీ వెలుగులోకి రాలేకపోయారు.

ఆంధ్రకవులు రాసిన ప్రబంధాలలోని ప్రథమాశ్వాసాలలో కృతిపతి యొక్క కృతిభర్త యొక్క వంశావళులను వెల్లడి చేసే పద్యాలను తీసి, అందుండే చారిత్రక విషయాలను విడదీసి, శిలాశాసనాలలోని రాజుల, మంత్రుల జీవిత కాలాల ఆధారంగా ఆంధ్ర కవుల, వారి పోషకుల కాల నిర్ణయం చేసి కవుల చరిత్రను రాయడానికి కూడా గురజాడ ఉపక్రమించారు. ఐతే గురజాడ ఆ కవుల చరిత్రను పూర్తి చేయకముందే కందుకూరి వారి కవుల చరిత్ర వెలువడింది. కానీ ఈ రెండు కవుల చరిత్రలలోని కాల నిర్ణయాలలో కొంత బేధ భావాలున్నాయి. ఆంధ్రకవుల చరిత్రను పూర్తిచేసి ప్రచురించాలని గురజాడ ఎంతో ప్రయత్నం చేశారు. కానీ ఈ ప్రయత్నం కూడా పూర్తికాలేదు. ఆ ప్రణాళిక అలాగే మిగిలిపోయింది.

***3. భాషా పరిశోధన:***

గురజాడ పరిశోధనలన్నింటిలో కెల్లా తలమానికమైనది భాషా పరిశోధన. గురజాడ తన జీవిత కాలంలో అత్యంత విలువైన అత్యధిక సమయాన్ని కేటాయించింది భాషా పరిశోధనకే. అందుకు కారణం వాడుక భాషకు సాహిత్య గౌరవం కల్పించాలన్నదే గురజాడ ధ్యేయం. అప్పటి పాశ్చాత్య ఆంగ్ల విద్యాప్రభావంతో తన చుట్టూ ఉన్న ప్రపంచంలో గురజాడను ప్రధానంగా ఆకర్షించినవి రెండే రెండు. ఒకటి భాష, రెండోది నాటకం.

ప్రపంచంలోని పలు దేశాల్లో సంబంధించిన పరిణామాలను తనకు లభ్యమైన ఆధారాలను గురజాడ వారు సూక్ష్మంగా పరిశీలించారు. పొరుగు భాషలైన తమిళం, కన్నడం, బెంగాలీ భాషల్లోనూ, యూరోపియన్ భాషల్లోనూ సంభవించే మార్పులు - చర్చలు ఎలా జరుగుతున్నాయో ఎప్పటికప్పుడు ఉత్సుకతతో గురజాడ తెలుసుకునేవారు. ఈ సమాచారం కోసం వివిధ ప్రాంతాలకు చెందిన భాషా శాస్త్ర వేత్తలతో పరిచయాలేర్పరచుకుని వారి నుండి ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సమాచారాన్ని సేకరించి అవగాహన చేసుకునేవారు.

అంతర్జాతీయ పత్రికల్లో వెలువడే భాషా విశేషాలను అధ్యయనం చేసేవారు. దీని వెనుక ఉన్న బలమైన కారణం ఒక్కటే. తెలుగును నిత్య నూతనంగా, సజీవ భాషగా నిలపాలన్నది గురజాడ వారి ఆకాంక్ష.

సాహిత్యం, విద్య సమాజంలోని కొందరి సొత్తుగా భావించడాన్ని గురజాడ ఆక్షేపించారు. అవి సమాజంలోని అన్ని మూలలకు వ్యాపించాలని, అందుకు వ్యావహారిక భాషే సరియైన సాధనమని గురజాడ వారి వాదన. ఈ ప్రయత్నంలో గురజాడకు గ్రాంథిక భాషా వాదుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దీన్ని ఎదుర్కొనే ప్రయత్నంలోనే విస్తృతమైన భాషా పరిశోధన చేశారు. ఆ పరిశోధనకు ప్రతి రూపమే 'అసమ్మతి పత్రం.'

ఈ పత్రంలో గురజాడ చేసిన భాషా పరిశోధన చారిత్రకమైనది, వర్ణనాత్మకమైనది, తులనాత్మకమైనది, అనువర్తితమైనది. గురజాడ అసమ్మతి పత్రంలో భాషకు సంబంధించిన ప్రతీ సూక్ష్మాంశమూ పరిశీలించబడింది. దీన్ని చదివే కొద్దీ ఇన్ని అంశాలను సూక్ష్మాతి సూక్ష్మంగా, ఇంత విస్తృతంగా ఎలా చర్చింగలిగారా! అనే ఆశ్చర్యం కలుగక మానదు. ఒక ప్రత్యేకమైన పరిశోధన చేయగలిగినంత విషయ ప్రధాన్యత కలిగినటువంటిది ఈ 'అసమ్మతి పత్రం.'

ఇంటర్మీడియట్ పరీక్షలో విద్యార్థులు రాసే సమాధాన పత్రాలలో అనుమతించదగిన తెలుగు భాషా శైలి ప్రమాణాన్ని నిర్ణయించడానికి మద్రాసు విశ్వవిద్యాలయం 1911 వ సంవత్సరంలో ఒక సంఘాన్ని నియమించింది. అందులో గురజాడ కూడా సభ్యులు. ఈ విషయమై అనేక తీవ్ర వాదోపవాదాలు, తర్క వితర్కాలతో సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. అనంతరం 1914లో ఈ సంఘం తీసుకున్న నిర్ణయాలు విద్యాభివృద్ధికి మేలు చేయకపోవడమే కాకుండా, తప్పక కీడు చేస్తాయని నిరూపిస్తూ విశ్వవిద్యాలయానికి గురజాడ సమర్పించిన విశ్లేణాత్మక - పరిశోధనాత్మక నివేదికయే 'అసమ్మతి పత్రం'.

సాహిత్య రచనలో వ్యావహారిక భాష ప్రయోగాన్ని నిరసిస్తూ లక్ష్మణరావుగారు 'గ్రామ్య రూపాలన్నీ దేశంలోని ప్రతి పాంతంలోనూ వాడుకలో ఉన్నాయన్న' గురజాడ వాదనను ఆక్షేపించారు. (అపుడు గ్రాంథిక భాషా వాదులు వ్యావహారిక భాషకు పెట్టిన పేరు 'గ్రామ్యం') అందుకు గురజాడ 'అవిస్తే' అన్న సంయుక్త హల్లు ఉండే క్రియా రూపాలను వందల కొలది ఉదాహరణ లిచ్చారు. (వస్తూ, చేసే, చూస్తూ, రాస్తూ, ప్రార్థిస్తూ మొదలైనవి.) అతి ప్రాచీన కాలం నాటి శాసనాది సాహిత్య గ్రంథాలు మొదలుకుని తన కాలం వరకు గల రచనల్లో ఆ ప్రయోగం ఎంత విస్తృతంగా వాడబడిందో వందల కొద్ది ఆధారాలతో నిరూపించారు.

సాహిత్యంలో వ్యావహారిక భాషను ఉపయోగించడం ద్వారా భాషకున్న పవిత్రత, పటుత్వం పోయి సాయిత్యం సామాన్య స్థితికి దిగజారుతుందనేది గ్రాంథిక భాషా వాదుల వాదన.

ఈ భ్రమను పోగొట్టడానికి గురజాడ ప్రపంచంలోని పలు భాషల వికాసాన్ని చారిత్రక ఆధారాలతో వివరించారు. ఇలాంటి గ్రాంధిక భాషావాదుల ప్రతిదేశంలోనూ ఉన్నదేననీ, ఈజిప్టు - యూరోపిన్ భాషలలో కూడా ఆరంభంలో ఇలాంటి ప్రతిఘటనలే ఎదురయ్యాయని గురజాడ ఉదాహరణలను చూపించారు. ఐతే కాలక్రమంలో ఆయాదేశాలలో వ్యవహారిక భాష సాధించిన ఫలితాలను, వికాసాన్ని చూపిన పిదప వారు తమ అభిప్రాయాలను మార్చుకున్నారని కూడా అసమ్మతి పత్రంలో వివరించారు.

అసమ్మతి పత్రం వ్రాయడానికి పూర్వమే మన భాషల్లో సంస్కరించుకోవాల్సిన సందర్భాలను తరచుగా మిత్రులకు లేఖల ద్వారాను, వ్యాసాల్లోనూ గురజాడ సూచిస్తూ ఉండేవారు. వ్యాకరణ బద్ధంగా రాయాలనే పండితులే ఎన్ని రకాలుగా వ్యాకరణ

నియమాలను ఉల్లంఘించారో వారి రచనల నుండే ఉదాహరణలు చూపారు. వాడుక భాషకు 'గ్రామ్యం', 'మ్లేచ్ఛం' అనే పేర్లు పెట్టి హేళన చేసే గ్రాంథిక వాదులు, అసలు ఆ పదాలనే ఎంత తప్పుగా అర్థం చేసుకున్నారో చూపించడానికి పతంజలి 'మహాభాష్యం' మొదలుకుని పలు వ్యాకరణ గ్రంథాల నుండి ఉపపత్తులు చూపిస్తూ అసలు అర్థాన్ని గ్రహించమన్నారు.

గురజాడ అప్పారావుగారి పరిశోధనా కృషి అపారం. విద్య, భాష, చరిత్ర సాహిత్యం, శాసనాలు, నాటక రంగం మొదలైన విషయాలకు సంబంధించి అప్పారావుగారు చేసిన పరిశోధన అపరిమితమైనది. కానీ మనకు అందిన ఫలాలు పరిమితమే. అయినప్పటికీ అవి ప్రామాణికంగా చరిత్రలో నిలిచిపోయాయన్నది గమనార్హం.

***ఉపయుక్త గ్రంథాలు***

1. అప్పారావు గురజాడ (1914): అసమ్మతి పత్రం (అను. బి. రామచంద్రరావు, సం.సెట్టి ఈశ్వరరావు 1987), హైదరాబాదు, విశాలాంధ్ర.

2. అప్పారావు గురజాడ (1958): లేఖలి (సం. అవసరాల సూర్యారావు), విజయవాడ, విశాలాంధ్ర.

3. రంగనాథా చార్యులు కె.కె. (1979): సింహావలోకనం; తెలుగు సాహిత్య వికాసం, హైదరాబాదు, ఆంధ్ర సారస్వత పరిషత్తు.

# వ్యాస కౌముది



## ఆంగ్ల భాషలో తెలుగోడి గోడు.

### ప్రొఫెసర్ వంశీ జూలూరి

***ఏ ప్రాంతీయ భాషైనా ఇతరులు వినగలిగే గొంతుతో మాట్లాడాలి.***

గత నలభై సంవత్సరాలలో ఈసారి, దివ్యక్షేత్రమైన తిరుపతి పట్టణంలో నాలుగవ ప్రపంచ మహాసభలు వేదికగా తెలుగు రచయితల, సాంస్కృతిక ప్రముఖుల బృహత్ సమావేశం జరిగింది. ఈ ప్రపంచ తెలుగు మహాసభలు మా కుటుంబానికి ఓ ప్రత్యేక అనుభవం. ఎందుకంటే అమ్మగారు శ్రీమతి జమునగారు మీ మహాసభలన్నింటిలోనూ ఆదరణీయమైన అతిథి కనుక. అయినా అక్కడ జరిగిన విషయాలు అన్నీ తెలుగులో నిర్వహించబడడం వల్ల వాటి గురించి నేను చదవగలిగింది బహు స్వల్పం. ఎందుకంటే నేను తెలుగు బాగా చదవగలను, వ్రాయగలను, దాని అద్భుత సౌందర్యాన్నీ, భావప్రకటనా సామర్థ్యాన్నీ అభినందించగలను. అయితే దాన్ని ఎంత నాదిగా భావించి ఆరాధించగలిగినా నాకు సన్నిహితంగా సంభాషించగలిగిన 'భాష' ఆంగ్లేయమే. నాకున్న పరిమితులకు లోబడి ఈ సందర్భంగా నాలో ఒక ప్రశ్న ఉదయిస్తున్నది. అదేమంటే మనం నివసిస్తున్న బహు సంస్కృతుల సమీకృత, సమ్మిళిత సమాజంలో భాష యొక్క ప్రాధాన్యత ఎంత? అటువంటి పరిస్థితులలో తెలుగు తెలుగుకే పరిమితం కావలసిన అవసరం ఉందా?

ఆంగ్లంలో వ్రాసే ఒక రచయితగా నాకు తరచు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమంటే, 'ఈ ప్రాంతీయ భాషా ప్రపంచంలో ఆంగ్లం యొక్క పాత్ర ఏమిటి' అని. ప్రాంతీయ సాహిత్యాల గురించి మనం చేసే చర్చలన్నీ వాటి సాధికారత గురించే, ఆంగ్ల రచనలుచే భారతీయ రచయితల గ్రంధాలలో ఈ సాధికారత లేకపోవడం గురించే. అయితే నా దృష్టిలో ఆంగ్లంలో రచనలు చేయడం ఒక ముఖ్యమైన విధిని నిర్వహిస్తాయి, నిర్వహించాలి. సాధికారత మన దృష్టికి గంతలు కట్టి నడిపించకుండా విశాల దృష్టితో చూచేటట్లు చేస్తాయి. ఆంగ్లంలో రచనలు చేయడం, నా దృష్టిలో, మనల్ని ప్రాంతీయ తత్త్వం లేకుండా ప్రాంతీయుల్ని చేస్తుంది. ఇంగ్లీషు లేకుండా, లేక అటువంటి ఇతర భాషలతో సంబంధం లేకుండా ప్రాంతీయ భాష ఉంటే, అది యాంత్రిక భాషగానో, కాకుంటే సీసాలో పోసిన ఒక ప్రదర్శనా వస్తువుగానో ప్రభుత్వ రక్షణలో బంధింపబడే ప్రమాదం ఉంది. అంతేకాక అలాంటి స్థితిలో అది తనకు తానుగా ప్రపంచంతో మాట్లాడడానికి వాహిక లేని భాషగా మారే ఇబ్బంది కూడా ఉంది.

ఇంగ్లీషు ద్వారా, తర్జుమాలు, అనువాదాలు మొదలైన రచనలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో కృషి చేస్తున్న ఉపన్యాసకుల గురించీ, రచయితల గురించీ ఈ విషయంలో ఇదే పరిస్థితో కాదో నాకు తెలియదు. కానీ, సాంస్కృతిక పరంగా ఇలా బృహత్తర రీతిలో ప్రాతినిధ్యం వహించే విషయంలో మాత్రం తెలుగు తీవ్రంగా వెనకబడి ఉందనిపిస్తుంది. ఒక గొప్ప చైతన్యవంతమైన, విజయవంతమైన వలస జాతిగా ఉన్నా, తెలుగు జాతి, ఇతర భాషా వర్గాల వారు తమ సంస్కృతిని ఇతరులపై ప్రభావం చూపేటంతగా, ప్రదర్శించలేకపోయారనిపిస్తుంది. తను మాతృ ప్రాంతాలను వదిలి వెళ్ళాక మనం అన్నిచోట్లు, అన్ని వృత్తులలోనూ ఉన్నట్లు కనిపిస్తాం.

భారతీయ సినిమా పరిశ్రమల్లో మనది అత్యంత బృహత్తర మైనవాటిలో ఒకటి. అత్యధికంగా అభివృద్ధి పొందుతున్న పసార ప్రచార మాధ్యమాల్లో మనది ప్రధానమైంది అయినా మనకి మనం తెలుసున్నంతగా మనం ఎక్కడా ఎవరికీ తెలియం. ఇప్పటికీ ఆంగ్లంలో తెలుగు అన్నది తప్పుగానే  - అంటే - టెలుగు - అని ఉచ్చరింపబడుతున్నది. ఇంజనీరింగ్ కాలేజీ హాస్టళ్ళలో గుల్ట్ అని వెటకారపు పేరు తెచ్చుకుంది. కనీసం ఒక విషయంలోనైనా అభివృద్ధి సాధించామని చెప్పుకోవచ్చు. అదేమంటే మదరాసే అనే ముద్ర నుంచి బయట పడడం.

1980 దశకంలో ఎన్.టి. రామారావు చూపించినట్టుగా తెలుగు స్వాభిమానం ఈనాడు ఒక రాజకీయ శక్తికాదు, కాకపోవచ్చు. కాని ఇంతవరకు సాధించిన దానికన్న మిన్నగా తెలుగు వారు తమ సాంస్కృతిక శక్తిని అభివ్యక్తీకరించే దిశగా విస్తృత మార్గాలను అనుసరించవలసిన అవసరం ఉంది. తెలుగు మహాసభలు తమ తెలుగుదనం గురించి గొప్పగా చెప్పుకోడానికీ, దానిని పరిరక్షించుకోడానికీ, భాషాభివృద్ధి చేసుకోడానికీ అధికారికంగా స్పష్టం చేయడానికి మంచి అవకాశం కల్పించాయి. భాషాభివృద్ధికి కావలసింది పాఠశాలల్లో తెలుగును నిర్భంధ బోధనా భాషగా చెయ్యడం కాని, షాపుల బోర్డులమీద తెలుగులో పేర్లు వ్రాయడం, వ్రాయించడం మాత్రమే కాదు. మన ప్రాంతీయ సాంస్కృతికాభివృద్ధికి వాహినిగా మనకొక గళం కావాలి. అలాకాకుంటే నా మితవాద భావనలో - మనమాట మనభాష మాట్లాడేవారిని దాటి ఇతరులు వినగలిగేటట్లు చేయాలి. బహుశా మన పదాలకు ప్రత్యేకత కల్పించడంతో మనం సంతృప్తి పడుతున్నాం. మన అంతరవ్యవహారాలలో తెలుగును వాడుకుంటూ ఆనందిస్తున్నాం. మరొకవైపు ఇతరులతో మాట్లాడేటప్పుడు అవసరాన్ని బట్టి ఆంగ్ల, హిందీ పదాలను వాడి సర్దుకుపోతున్నాం. మన పిల్లలను ఇంజనీరింగ్, వైద్య విద్యారంగాలే కాకుండా ఇతర రంగాలలోకి ప్రోత్సహించాలి. మనం అందరితో, ఇతరులతో సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకోవాలి. కళలు, పత్రికలు, రచనా వ్యాసంగం మొదలైన రంగాలలో ప్రోత్సహించాలి. మన సినిమా చరిత్రను మరింత సమగ్రంగా పరిరక్షించి ఆ గొప్ప వారసత్వాన్ని పదిలం చేసుకోవాలి. మంచి నైపుణ్యంగల డి.వి.డిలుగా చేసి వాటికి లఘువాఖ్యానాలు జతచేసి ఇతర భాషలలోకి తీసుకు వెళ్ళాలి. ఏదో కారణం చెప్పి ఈ దిశగా వెళ్ళకపోవడం తెలుగు సంస్కృతి వ్యాప్తికి నిరోధంగా నిలుస్తుంది.

మనలో చాలామంది ఇంగ్లీషులో, ఇతర భాషలలోనూ కూడా రాయగలిగి ఉండాలి. వాటిలోకి మన తెలుగుదనాన్ని చొప్పించాలి. తెలుగుదనం అంటే నా దగ్గర నిర్వచనంలేదు. అయినా అది నా అంతరాంతరాలలో పాతుకు పోయింది. నేనెవరో అదే అది. ఏనాడూ కూడా నన్ను నేను ఆంగ్లంలో వ్రాసే ఒక భారతీయుడిలా మాత్రమే ఊహించుకోలేను. నేను ఇంగ్లీషులో రచనలు చేస్తున్న ఒక తెలుగువాడిని. భారతీయుడంటే ఎవరో ఏమిటో నేను తెలుగు సంస్కృతీ గవాక్షం ద్వారానే చూస్తాను. హిందువుగానైనా, భారతీయుడిగా అయినా, అసలు ఒక మనిషిగా అయినా నన్ను నేను తెలుగు సంస్కృతి ద్వారానే చూసుకోగలను. ఏది ఏమైనా ఏ ఇతర భాషకన్నా నేను ఇంగ్లీషులో సహజంగా ఉండగలను. నా తరం పద్ధతి ఇదే  నా ఆశ అదే కనుకనే వచ్చే తెలుగు మహాసభలు ప్రపంచాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటాయి. ఇతర గళాలు విప్పే తెలుగువారిని, తెలుగు కాని వారిని తీసుకుంటాయి. మనకన్నా విశాలమైన బాహ్య ప్రపంచానికి తెలుగు కాంతి పుంజంగా వెలుగు చూపిస్తుంది. తెలుగు, తెలుగుకు బయట ఉన్న ప్రపంచంలో కూడా తన సాంస్కృతిక సౌధాన్ని నిర్మించుకుంటుంది.

*(డిసెంబర్ 29,2012 ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో వచ్చిన వ్యాసానికి అనువాదం. రచయిత శాన్‌ఫ్రాన్సిస్కోలో మీడియా స్టడీస్‌లో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఈయన ‘ది మైథాలజిస్ట్‘ అనే ఆంగ్లనవలా రచయిత కూడా )*




# తెలుగులో అనువాద ప్రక్రియ

## డా. శిరీష ఈడ్పుగంటి

తెలుగు సాహిత్యం అనువాదంతోనే ప్రారంభమైంది. కవిత్రయ మహాభారతం వ్యాస భారతానికి అనువాద గ్రంథమని అప్పటినుండి మొదలైన తెలుగ అనువాదం నేటివరకు కొనసాగుతూ, అభివృద్ధిచెందుతున్నది. కవిత్రయయుగం నాటికి అనువాద నిర్వచనాలు గాని, సిద్ధాంతాలుగాని వెలువడలేదు. అందువల్లనే పూర్వకవుల అనువాదాలలో స్వాతంత్ర్యం కనిపిస్తుంది, తరువాత కూడా వివిధ కాలాలో అనేక అనువాద రచనలు వస్తూనే ఉన్నాయి.

ప్రాచీనయుగంలో తెలుగులో నన్నయ తరువాత నన్నెచోడుని కుమారసంభవం రచన కూడా అనువాదగ్రంథమని చెబుతారు. వీరి తరువాత సోమన అనువాద ప్రక్రియను అంతగా అదరించలేదు. గోనబుద్ధారెడ్డి రంగనాథరామాయణాన్ని సంస్కృతం నండి తెలుగులోకి అనువదించాడు. తిక్కనకాలంలో తిక్కన నుండి అతని సమాకాలీనులైన కేతన, మారన మంచన అందరూ అనువాద గ్రంథాల్ని రాశారు. సంస్కృతంలో దండి రచించిన దశకుమారచరిత్రను కేతన తెలుగులోకి అనువాదించాడు. మారన మార్కండేయపురాణం, మంచన కేయూరబాహుచరిత్ర కూడా అనువాద గ్రంథాలే. ఎర్రన హరివంశం, నాచనసోమన ఉత్తరహరివంశం వంటి అనువాద గ్రంథాలకు సంస్కృతం మూలం. నన్నయ నుండి ఎర్రన వరకు వచ్చిన అనువాదాలన్నీ స్వేచ్ఛానువాద పద్ధతిలో వచ్చాయి. శ్రీనాథునికాలంలో కూడా ఒక తరహా అనువాదాలు వచ్చాయి. ఈయన శ్రీహర్షుని నైషధాన్ని శృంగారనైషధం అనేపేరుతో అనువదించాడు. నైషధాన్ని ఎలా అనువాదం చేశాడో తానే చెప్పుకున్నాడు. రాయలయుగంలో అనువాదాల కంటే స్వతంత్రరచనలే ఎక్కువగా వెలువడ్డాయని చెప్పవచ్చు. ఈయుగంలో వచ్చిన అనువాదాలు పూర్వపు అనువాదాలకంటే భిన్నంగా ఉన్నాయి. ప్రబంధకవులు కేవలం కథను మాత్రం గ్రహించి సొంతంగా కావ్యాలు రాశారు. దక్షిణాంధ్రయుగంలోను, క్షీణయుగంలోను స్వతంత్రకావ్యాలు ఎక్కువగా వెలువడినప్పటికి అనువాదగ్రంథాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా కథనో, భావాన్నో ఏదో ఒకటి సంస్కృతం నుండి గ్రహించి రచనలు చేశారు. కనుక ప్రాచీనయుగంలోని రచనలు ఎక్కువగా సంస్కృతకావ్యాలకి అనువాదాలని చెప్పవచ్చు.

**తెలుగుసాహిత్యంలో నన్నయ, ఆ తరువాత తరాలవారు పాటించిన అనువాదపద్ధతులు - కథానువాదపద్ధతి (స్వతంత్రానువాద పద్ధతి)**

మూలకథతో పాటు వివిధ పాత్రల్ని సన్నివేశాలను గ్రహించి రచయిత తనకు నచ్చిన విధంగా అనువాదరచన చేయడం. కవిత్రయం వారిది స్వతంత్రానువాద పద్ధతి.

నన్నయ యథామూలానువాదం చేయలేదు. శ్లోకానికి పద్యం అనేపద్ధతి పెట్టుకోలేదు. "భారతబద్ధ నిరూపితార్థం తెలుగువారికి అందించడమే నాలక్ష్యం" అన్నాడు. దానికి తగినట్టుగా ఫద్దెనిమిది పర్వాలకూ ప్రణాళిక రచించి తన స్వేచ్ఛానువాదాన్ని ప్రారంభించాడు. తిక్కన, ఎర్రనలు అదేమార్గంలో అదే లక్ష్యంతో దాన్ని పూర్తి చేశారు. అప్పటినుంచి ప్రాచీన తెలుగుకవులు అందరికీ అదే ఒరవడి అయింది. స్వేచ్ఛానువాదాలే తప్ప యథామూలానువాదాలు అవతరించలేదు. నన్నయ ఈ మార్గం తొక్కడానికి ఒక చారిత్రక కారణం ఉంది. పదకొండవ శతాబ్దానికి ముందే వ్యాసభారతం కన్నడంలోకి వచ్చింది. అయితే అది కన్నడ భారతమే తప్ప వ్యాసభారతం కాదు. వ్యాసుడి లక్ష్యమూ, పరమార్థమూ పూర్తిగా భంగపడ్డాయి. కథాగమనమూ, పాత్రలపేర్లు మాత్రం మిగిలాయి. స్వభావాలు మారిపోయాయి. భారతరచనకు పరమార్థమైన వైదికధర్మం స్థానాన్ని జైనమతం ఆక్రమించింది. ఈ అన్యాయాల్ని చక్కదిద్దడం కోసం నన్నయ గంటం అందుకున్నాడు. అందుచేత భారత పరమార్థన్ని పునః ప్రతిష్టించడమే సత్వరకర్తవ్యంగా స్వేచ్ఛానువాద పద్ధతిని స్వీకరించాడు. బహుశ ఇందులోని స్వేచ్ఛ అనంతర కవులను ఆకర్షించింది. స్వీయప్రతిభా ప్రదర్శనకు అవకాశం ఇచ్చింది. అందుచేత కథాకల్పన కోసం శ్రమపడకుండా ప్రఖ్యాత వస్తులేశాన్ని స్వీకరించి స్వతంత్రకావ్యాలను రచించారు. వస్తుపరంగా తెలుగులో స్వతంత్రకావ్యాలు లేవు. ఏవో కొన్ని శతకాలు, ద్విపద రచనలు, ఒక కళాపూర్ణోదయం మినహాయిస్తే తెలుగుకావ్యాలకు సంస్కృత కావ్యాలలోనో తమిళ కన్నడాది ప్రాంతీయభాషలలోనో మూలాలు ఉన్నాయి. అయితే ఇవి ఏవీ యథామూలానువాదాలు కాకపోవడమూ, ఇంచుమించు స్వతంత్రరచనలు అన్నట్టు సాగడమూ గమనించవలసిన అంశం.' (రామబ్రహ్మం, బేతవోలు.2007:1)

**భావానువాద పద్ధతి(స్వతంత్రానువాద పద్ధతి)**

మూలంలోని కథతో పాటు భావాల్ని అనుసరిస్తు మూలభావాలని ఉచితమైన భాషలో సుందరమైన శైలిలో కొన్ని సందర్భాలలో మూలవిధేయుడై అనువదించడం. శ్రీనాథుని అనువాదాలు ఈ కోవకే చెందుతాయి.

**పదపదానువాద పద్ధతి**

మూలం నందలి కథను, భావాల్ని గ్రహించి ప్రతిపదానికి సమానార్థకాన్ని చేకూర్చి అనువాదం చేయడం. పూరాణేతిహాసాలను అనువదించడానికి స్వతంత్రానువాద పద్ధతిని, కావ్యాలను అనువదించడానికి స్వతంత్రానువాద పద్ధతిని, నాటకాలను అనువదించడానికి అస్వతంత్రానువాదపద్ధతిని అనువాదకులు అవలంబించారు.

ప్రాచీనకాలంలో వచ్చిన అనువాదాలన్నీ సాహిత్యపరమైనవి. కాని ఆధునికకాలంలో సాహిత్యపరమైన అనువాదాలతో పాటుగా సాహిత్యేతర అనువాదాలు కూడా వచ్చాయి. శాస్త్రానువాదాలు, గణితానువాదాలు, రాజకీయానువాదాలు,

సాంకేతికానువాదాలు, సాంఘికానువాదాలు, మనస్తత్వానువాదాలు, గణాంకానువాదాలు, చారిత్రాకానువాదాలు, ఆర్థికానువాదాలు, వైద్యశాస్త్రానువాదాలు మొదలైనవి. విషయాన్ని బట్టి రకరకాల అనువాదాలు వస్తున్నాయి. ప్రాచీనకాలంలో వచ్చిన తెలుగు అనువాదాలకు మూలం సంస్కృత గ్రంథాలు. అధునికకాలంలో వచ్చిన తెలుగు అనువాదాలు మూలం ఆంగ్లగ్రంథాలు. ప్రాచీనులు సంస్కృత పదాలను యధాతథంగా వాడుకునట్లే అధునికులు అంగ్లపదాలను యధాతథంగా వాడుకుంటున్నారు. అంతేకాకుండా తమిళ, మళయాల, కన్నడ, హిందీ, బెంగాలీ, మొదలైన భాషలలోని గ్రంథాలు కూడా అనువదింపబడుతున్నాయి.

ఒకప్పుడు సంస్కృతంలో గాని ఇతర భారతీయభాషలలో గాని అనువాదానికి అంతగా ప్రాధాన్యం లేదు. పూర్వీకులు భావానువాదాలు, స్వేచ్ఛానువాదాలు ఎక్కువగా చేశారు. మూలగ్రంథాలకు వ్యాఖ్యానాలుగానూ, లేదా టీకా తాత్పర్యాలుగానూ రాసిన గ్రంథాలే కాని అనువాదాలు కావని కొంతమంది అభిప్రాయం కాళిదాసు రచనలకు సంజీవనీ వ్యాఖ్య రాసిన మల్లినాథసూరి "నా మూలం లిఖ్యతే కించిన్నా నపేక్షిత ముచ్యతే" అన్నాడు. కాని అది తన వ్యాఖ్యానపద్ధతిని గూర్చి చెప్పిందే తప్ప అనువాదం గూర్చి చెప్పింది కాదు. కాళిదాసు రచనలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న మల్లినాథుడు తన వ్యాఖ్యానాల ద్వారా కాళిదాసును పునర్జీవింపచేశాడు. మల్లినాథుడు రాసినవి వ్యాఖ్యాన గ్రంథాలే గాని అనువాదాలు కావు. బృహత్కథ మొదలైన రచనలకు సంస్కృతంలో వచ్చిన రచనలు భావానువాదాలు లేదా ఛాయానువాదాలే తప్ప శబ్దానువాదాలు కావు. సంస్కృతంలోని నీతిగ్రంథాలను వైద్యగ్రంథాలను, నాటకాలను ఆయా కవులు, పండితులు తమతమ భాషలలో రాశారు. అవి అనువాదాలుగా గాక మౌలిక రచనలుగానే భాసిస్తున్నాయి. కాబట్టి వీరెవరూ అనువాదం, అనువాదసిద్ధాంతాలుమొదలైన వాటిని గూర్చి శాస్త్రీయంగా చర్చించలేదు.

ఆధునికయుగంలో చిన్నయసూరి ఆంధ్రశబ్దచింతామణి వంటి వ్యాకరణసూత్రాలను, నీతిచంద్రికగా హితోపదేశాన్ని అనువదించారు. ఆధునికయుగారంభంలోనే వస్తుపరంగా కూడా స్వతంత్ర రచనలు ప్రారంభమయ్యాయి. ప్రాంతీయచరిత్రలు, ఐతిహస్యాలు, సామాజికసంఘటనలు కావ్యావస్తువులయ్యాయి. ఇవి లఘుకావ్యాలుగా ప్రారంభమై మహాకావ్యాలకు విస్తరించాయి. ఇదేసమయంలో యథామూలానువాదాలు ప్రారంభమయ్యాయి. శ్రీపాదకృష్ణమూర్తిగారు భారత, భగవత, రామాయణా లన్నింటినీ అనువదించారు. శ్లోకానికి పద్యం అనే పద్ధతిలో తుచ తప్పని అనువాదం చేశారు. ఇరవైవ శతాబ్దంలో ఆంగ్లసాహిత్య ప్రభావం వలన అనేక అనువాదగ్రంథాలు వెలువడ్డాయి. నవల, కథానిక, స్వీయచరిత్ర, విమర్శ మొదలైన సాహిత్యప్రక్రియలు అంగ్లభాషాప్రభావం వలన తెలుగులో తమ సౌరభాలను వెదజల్లాయి. కందుకూరివారు అనేక కథల్ని అంగ్లం నుండి తెలుగులోకి అనువాదించారు. కాళిదాసు అభిజ్ఞానశాకుంతలాన్ని యథామూలంగా అనువదించారు. ఈయన రాసిన రాజశేఖరచరిత్ర నవల గోల్డ్ స్మిత్ వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ కు అనువాదం. క్రీశ. 1841 లో శ్రీహర్షుని రత్నావళిని, షేక్స్పియర్ కామెడి ఆఫ్ ఎర్రర్సు ను అనువదించారు. గురుజాడ శ్రీరామమూర్తి అరేబియన్ నైట్స్ లోని ది స్లీపర్ అవేకన్డ్ ని చిత్రరత్నాకరమనే పేరుతో అనువదించారు. అంతేగాక మర్చంట్ ఆఫ్ వెనిస్ అనే షేక్స్పియర్ నాటకాన్ని కూడా అనువదించారు. మృచ్ఛకటికం, ముద్రారాక్షసం వంటి సంస్కృత నాటకాలు కూడా అనువదింపబడ్డాయి. వేదంవారు హర్షనాటకత్రయాన్ని, మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు

ఉత్తరరామచరిత్ర నాటకాన్ని అనువదించారు. వేదం వేంకటరాయశాస్త్రిగారు హితోపదేశాన్నే గద్యపద్యాత్మకంగా అనువాదం చేశారు. పానుగంటి, తిరుపతి వేంకటకవులు అనేక సంస్కృతనాటకాల్ని అనువదించారు. క్రీ.శ. 1874 లో వావిలాల వాసుదేవశాస్త్రి జూలియస్ సీజర్‌ను అనువదించాడు. ఆదిబట్ల నారాయణదాసు బాటసారి గోల్డ్ స్మిత్ ది ట్రావెలర్‌కు అనువాదం. జాన్ మిల్టన్ కోమస్ ని విశ్వనాథశాస్త్రి కామవిలాసం అనే పేరుతో అనువదించారు. డికెన్స్ ఎటేల్ ఆఫ్ టు సిటీస్ ను కనకసుందరం గుప్తజ్ఞానమని అనువదించారు. జోనాథన్ స్విఫ్ట్స్ గలివర్ ట్రావెల్స్ ను కాళ్ళకూరి హనుమంతరావు గాలివరు నౌకాచరిత్రలని అనువదించారు. షేక్స్పియర్ కింగ్ లియర్ నాటకాన్ని చెన్నాప్రగడ భానుమూర్తి మందపాలచరిత్ర గాను, పరమహంస విద్యానందస్వామి ప్రళయంతకరాజు గాను అనువదించారు. తెలుగు నుంచి అంగ్లంలోకి కావ్యాలను అనువదిస్తున్న వారిలో వెలిచేరు నారాయణరావుగారు ఒకరు. కళాపూర్ణోదయం, క్షేత్రయ్య పదాలు, అన్నమాచార్య కీర్తనలు, శ్రీకాళహస్తీశ్వర శతకం చాలా ఉన్నయి. క్షేత్రయ్య పదాలకు బాలాంత్రపు రజనీకాంతారావుగారు అనువాదం చేశారు.

అంగ్లభాష నుండి మాత్రమే కాకుండా వంగ, హింది, రష్యన్, తమిళభాషల నుంచి కూడా రచనలు తెలుగులోకి అనువదింపబడ్డాయి. వంగభాష నుండి శరత్ సాహిత్యాన్ని బొందలపాటి శివరామకృష్ణ అనువదించారు. రవీంద్రుని రచనలు కూడా తెలుగులోకి అనువదింపబడ్డాయి. గీతాంజలిని చాలామంది అనువదించారు. చలం, బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు, జగ్గయ, టి. అనసూయాదేవి, ఆచంట జానకీరామ్ ముదలైనవారు ఎన్నో అనువాదరచనలు చేశారు. రష్యాభాషలో మాక్సిమ్ గోర్కీ రచించిన మదర్ ని క్రోవ్విడి లొంగరాజు *అమ్మ* అనే పేరుతో అనువదించారు. హిందీభాషలో ప్రేమ్‌చంద్, యశపాల్, జయశంకర్ ప్రసాద్ ముదలైనవారి నవలలు తెలుగులోకి అనువదింపబడ్డాయి. ప్రేమ్‌చంద్ *గోదాన్* ని పిచ్చయ్యశాస్త్రి అనువదించారు.

క్రీ.శ. 1953 లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. 1966 లో ప్రాంతీయభాషలుగా నిర్ణయించడం జరిగింది. తత్ఫలితంగా ప్రాథమిక, ఉన్నత విద్యాబోధన ప్రాంతీయభాషలోనే జరగాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలుగు పాఠ్యగ్రంథాలను తయారుచేసే బాధ్యత తెలుగు అకాడమీ  స్వీకరించింది. ఒకటవ తరగతి నుంచి విశ్వవిద్యాలయస్థాయి వరకు వివిధ అంశాలకు సంబంధించిన పాఠ్యగ్రంథాలను నిష్ణాతుల చేత తయారుచేయించింది. తెలుగును అధికారభాషగా చేయడం వలన పరిపాలనకు సంబంధించిన విషయాలను అనువాదించాల్సిన అవసరం ఏర్పడింది. 1980లో పరిపాలన, న్యాయపదకోశాలను తెలుగుఅకాడమీ తయరుచేసింది. శాస్త్రానువాదాల్లో కూడా ముందంజ వేయాలనే దృక్పథంలో విభిన్న శాస్త్రపదకోశాలను తయారుచేశారు. భౌతిక, రసాయనిక, జీవ, గణిత, గణాంక, రాజనీతిశాస్త్రాలు మొదలైనవి. తెలుగుఅకాడమీ కృషిఫలితంగా నేడు ఎన్నో అనువాదగ్రంథాలు వెలువడ్డాయి. వివిధభాషల నుంచి తెలుగులోకి సాహిత్య, సాహిత్యేతర గ్రంథాలు అనువదించబడ్డాయి. ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించబడిన కథలు, నవలలు నేడు వివిధ పత్రికలలో (**చతుర, విపుల**) ప్రచురింపబడుతున్నాయి. చందమామ పత్రిక ఒకభాషలోకి కథలను వేర్వేరు భాషలలోనికి అనువదించి ప్రచురిస్తుంది. అకాడమీసంస్థలే గాక బుక్ ట్రస్టులు, విశ్వవిద్యాలయాలు కూడా తమవంతు కృషి చేస్తున్నాయి. అంతేగాకుండా **కౌముది**.... ముదలైన అంతర్జాలీయ పత్రికలు సాహిత్యంలో నవల, నాటకం, కథానిక వంటి ప్రక్రియలతో

పాటుగా అనువాదప్రక్రియకు సంబంధించిన వాటిని కూడా ప్రచురిస్తున్నాయి. విద్యాసంస్థలలో అనువాదప్రక్రియ పాఠ్యాంశంగా బోధించి అనువాదశాస్త్రంలో నైపుణ్యాన్ని కలిగిస్తే అనువాదకార్యక్రమం మరింత సమర్థవంతంగా జరుగుతుంది. తెలుగులో అనువాద సిద్ధాంతానికి, సమస్యలకు సంబంధించిన రచనలు కూడా వచ్చాయి. రాచమల్లు రామచంద్రారెడ్డిగారి అనువాదాసమస్యలు (1987). డా.ఎస్. అక్కిరెడ్డిగారి అనువాదాసిద్ధాంతాలు (1989) గోవిందరాజు చక్రధర్ రావుగారు అనువదించడం ఎలా? (1998), ఆచార్య భీంసేన్ నిర్మల్ గారి అనువాదశాస్త్రం (2000) ముదలైనవి.

ఆధునికకాలంలో కందుకూరి వీరేశలింగంపంతులుగారు, వావిలాల వాసుదేవశాస్త్రిగారు మొదలైనవారు సంస్కృత, ఆంగ్లభాషల నుండి అనువాదాలు చేశారు. ఇతర భాషల నుండి కూడా ఎన్నో అనువాదాలు తెలుగులోకి వచ్చాయి. అయితే ఆ అనువాదకులెవరూ కూడా సిద్ధాంతపరంగా అనువాదం గూర్చి తెలుగులో చర్చించలేదు. కాని ఇతర భాషలలో అనువాదసిద్ధాంతపరమైన చర్చలు, రచనలు ఉన్నాయి. పాశ్చాత్యులు కూడా అనువాదం గూర్చి చాలానే నిర్వచనాలు ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అనువాదం యొక్క ఆవశ్యకత, ప్రాధాన్యతను బట్టి ప్రత్యేకమైన అనువాదసిద్ధాంతాన్ని తెలుగులో రూపొందించుకోవలసిన అవసరం ఉంది. తెలుగులో అనువాదప్రక్రియ పై రచనలు కూడా తక్కువగానే ఉన్నాయి. వీటిపై ఇంకా రచనలు రావాలి. తద్వారా మనం ఉత్తమ అనువాదరచనలు పొందాలి.

**ముగింపు**

ఆధినికయుగం వైజ్ఞానికయుగం. నేడు అన్ని రంగాలలోను వైజ్ఞానిక అభివృద్ధి కనిపిస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని రంగాలలోను జరుగుతున్న అభివృద్ధిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. వివిధదేశాలలో వివిధభాషలలో వెలువడుతున్న శాస్త్ర, సాహిత్య, ఇతర విషయాలను ప్రతివ్యక్తి చదివి అర్థం చేసుకోవడం సాధ్యమయ్యే పనికాదు. కాబట్టి ప్రపంచభాషలలో వెలువడుతున్న ఈ విషయాలను ఎప్పటికప్పుడు అన్ని దేశాలకు వ్యాపింపజేసే ఏకైక సాధనం అనువాదం. ఈ అనువాదప్రక్రియ మరింత పురోగతి సాధించాలి.

**ఉపయుక్తగ్రంథసూచి**

**రామబ్రహ్మం. బేతవోలు.2007. అనువాదాలు అరసున్నాలేనా?**

**బేతవోలు రామబ్రహ్మం/ నన్నయ వికిపిడియా.**

# వ్యాస కౌముది



# మహాప్రస్థానం వెనక?!
# కర్లపాలెం హనుమంత రావు

**'ఆరంభించరు నీచ మానవులు'** అని మనకొక ఏనుగు లక్ష్మణ కవి అనువదించిన భర్తృహరి సుభాషితం ఉంది. నీచులమని అనిపించుకోవడమెందుకని పోనీ ఏదైనా ఒక పని తలపెడదామంటే..తలపెట్టిన తరువాత కానీ తెలిసిరాదు... పూర్తి చేయడం ఎంత తలకుమించిన పనో!

**"రావద్దు రావద్దు లోనికి**

**రాస్తున్నానొక గీతం**

**రావద్దు రావద్దు లోనికి...**

**నను చూడ కాదిది వేళ**

**నామనః కార్మికశాల**

**క్రక్కేది చండాగ్ని సెగలు**

**క్రమ్మేది......."**-అని శ్రీశ్రీ ఒక అసంపూర్తి గీతం.

అలా**...** మొదలు పెట్టి పూర్తి చేయనివి... గీతాలే కాదు... కథానికలూ శ్రీశ్రీ గారి ఖాతాలో చాలానే ఉన్నాయనుకోండి.

**"సముద్రం సముద్రం స్మేర సముద్రం**

**వినీల విశాల విలోల సముద్రం**" అనేది శ్రీశ్రీ ప్రారంభించి పూర్తి చేయని మరో గీతం. ఆ గీతం రాసే రోజుల్లోనే "ది సీ ది సీ ది స్మైలింగ్ సీ" అనే పల్లవితో మొదలయ్యే ఒక ఆంగ్లగీతం ఆయన కంటబడటంతో కలం మూత పెట్టేసారుట! రాసిందంతా ఒరిజనల్ గానే ఉండాలనే పంతం ఒక స్థాయికొచ్చిన తరువాత చెల్లుబాటవుతుందేమో కానీ కవిత్వం రాసే తొలిదినాల్లోనే అలాంటి పట్టింపులు పెట్టుకుంటే కథ ముందుకు సాగదు కాక సాగదు. శైశవదశలో ఆలోచనలెంత తాజావైనా **...**సానబట్టే సమయంలో

మాత్రం ముందు తరాల నుంచీ కొద్దో గొప్పో ప్రేరణ పొందక తప్పదు. ాది తప్పు కాదు. అసమాన ప్రతిభాపాటవాలున్నాయని మనం చెప్పుకునే గొప్ప గొప్ప కవుల పసిరచనల్లో సైతం ఇలాంటి నీడలు దోబూచులాడుతూనే ఉంటాయి.

'**బారులు బారులు తీరిన**

**మబ్బు గుబ్బలుల దారుల**

**దారి తప్పి చరించె ఆ రేయి**

**తరళ సర శేరమ్మదములు- - -**" శ్రీశ్రీ స్వతంత్రంగా రాసిన మొదటి వచన గీతం ఇది.

పాశ్చాత్యకవులతో సంతృప్తి కలగక ఫ్రాన్సు, జర్మనీ కవులనుంచీ ప్రేరణ పొందిన కవి ఆయన. మహాప్రస్థానంలోని కొన్ని గీతాలను శ్రద్ధగా గమనిస్తే శ్రీశ్రీలోని ఈ పార్శ్వం మనకు మరింత స్పష్ట పడుతుంది.

చతురస్రగతిలో నడిచే ఎనిమిది మాత్రల చందస్సు 'మరో ప్రపంచం'. 'పుత్తడి బొమ్మా పూర్ణమ్మా', బొబ్బిలిపదం 'కొయ్యోడిపాట' లాంటి గేయాల్లో కనిపించే చందస్సు అది.

**ఎముకలు క్రుళ్ళిన వయస్సు మళ్ళిన**

**సోమరులారా చావండి!**

**నెత్తురు మండే శక్తులు నిండే**

**సైనికులారా రారండి!**"-

జయదేవుని 'గీతగోవిందం'లోని

"**ముఖర మధీరం త్యజమంజీరం**

**రిపుమివ కేళిషులోలం**

**చలసఖి కుంజం సతిమిర పుంజం**

**శీలయ నీల నిచోళం**" అనే పోకడ ప్రతిధ్వనిలాగా ఉంటుందది!

"**మరో ప్రపంచం మరో ప్రపంచం**

**మరో ప్రపంచం పిలిచింది**" అని మహాప్రస్థానం ప్రారంభంలోనే ముమ్మారు పలికించడానికి శ్రీశ్రీ -

శ్రీశంకరభగవత్పాదుల అమేయ గేయంలోని

'**భజ గోవిందం భజ గోవిందం**

**గోవిందం భజ మూఢమతే**'

లోని లయను స్ఫూర్తిగా తీసుకున్నారంటే ఆశ్చర్య పోనక్కర్లేదు.

ఆంగ్ల కవయిత్రి 'ఎడిత్ సిట్ వెల్' తన గీతాల సంపుటి ఉపోద్ఘాతంలో 'సెమాంటిక్స్'

అని ఒక పదం వాడారు.సెమాంటిక్స్ అంటే'కవిత్వం చేసే సవ్వడి'.

'**త్రిభువన శుక ధృఢ పంజర**

**విభవ మహితునకు సమస్త విష్టప నిర్మో**

**క భుజగపతికి, నిఖిలజగ**

**దభిన్న రూపునకు**'**...**.లాంటి పద్యాల్లో వినిపించేలాంటి సవ్వడి .

'**ఆ చెలరేగిన కలగాపులగపు**

**విలయార్తపు**

**బలవత్ ఝురవత్ పరివర్తనలో**

**నేనేయే వీధులలో**

**చంక్రమణం చేశానో**'..అన్న శ్రీశ్రీ గీతం పంక్తుల్లోనూ వినిపిస్తుంటుంది.

తిక్కన మహాభారత వచనం నిండా మనకు గణగణ వినిపించేదీ ఇలాంటి అంతర్లయే. ఈ ప్రజ్ఞ రాత్రికి రాత్రి ఏ కవికీ మహాకవి కాళిదాసుకి మల్లే అబ్బిందంటే నమ్మలేం. 'ఏదీ తనంత తానూ నీ దరికి రాదూ**...**శోధించి సాధించడమే ధీరగుణం'అని కదా ఉవాచ!సృజనరంగంలో ఐతే తొలి అడుగునుంచే ఈ 'తాడు మీది నడక ఒడుపు' సాధన చేయాల్సుంటుంది. ప్రసిద్ధుల పేరుప్రఖ్యాతుల వెనుక ఎంత కఠోర పరిశ్రమ దాగి ఉంటుందో అందుకే తెలుసుకోవాలి. అలా తెలుసుకోవాలంటే విస్తృతంగా చదవాలి.

1934, ఏప్రిల్ 12న ఐదు నిమిషాల్లో రాసి ముగించినట్లు చరిత్రలో నమోదయిన 'మరో ప్రపంచం'... నిజానికి శ్రీశ్రీ రాయాలనుకున్న గీతరూపం కానే కాదు. 'మరో ప్రపంచం' అని శీర్షిక పెట్టి ఒక వ్యాసం రాయడానికి కూర్చుంటే కలంలో సిరా ఐపొయిందట. సిరా పోస్తూకూర్చుంటే కాలహరణమైపోతుందని పక్కనే ఉన్న కాపీయింగ్ పెన్సిల్ అందుకుంటే అది మరోప్రపంచంలోకి అలా అలా నాన్-స్టాప్ గా నెట్టుకుంటూ వెళ్ళిపోయి భుగభుగలు దగ్గర హఠాత్తుగా ఆగిపోయిందిట. ఒక్క మార్పు చేయకుండా ఏదో ప్రసిద్ధ పత్రిక్కు పంపిస్తే తిరుగుటపాలోచక్కా తిరిగి వచ్చిన గేయం అది. అప్పటికింకా ఆ గీతానికి 'మహాప్రస్థానం' పేరు లేదు. ఒక్క చిన్న మార్పు చేసి(కదం తొక్కుతూ పదం పాడుతూ/కాంద్రు కాంద్రుమని గర్జిస్తూ**...**'లోని రెండో పాదం'హృదంతరాళం గర్జిస్తూ" అని చేసిన మార్పు) కొన్ని నెలల తరువాత జ్వాల పత్రికలో మొదటిసారి ప్రచురించారా గేయాన్ని. ఆ తరువాత చరిత్రంతా మనకు తెలిసిందే.

తెలియాల్సిందేమంటే ఈ పాటలోని ఆవేశానికి 'లా మార్సెయ్యే, లా ఇంటర్ నేషనాల్, బరస్సు 'బెన్నాక్ బరన్', అలెగ్జాండర్ బ్లాక్ 'ది ట్వెల్వ్'లాంటి గీతాలు ప్రేరణ.హరీంద్రకవి 'ఘరూహుఆ హై జంగ్' అనే పాటా, నజ్రుల్ ఇస్లామ్ గీతాలు కొన్ని,

కవికొండల కంఠధ్వని, ఫలానాచోట  అని చెప్పటానికి వీలుపడని ఎడ్గర్ అలన్ పో, గురుజాడ అప్పారావుల ప్రభావం..అలా... 'మహాప్రస్థానా'న్ని వెనకుండి నడిపించిన శక్తులని శ్రీశ్రీనే ఓ ఆకాశవాణి ప్రసంగంలో చెప్పుకున్నారు. వేమనవాదం ఎంతలా మనసుకు హత్తుకునుండక పోతే 'తలుపు గొళ్లెం/హారతి పళ్ళెం/గుఱ్ఱపు కళ్ళెం/కాదేదీ కవితకనర్హం/ఔనౌను శిల్ప మనర్ఘం' అనే అంతటి సాహసం శ్రీశ్రీ చేసుండేవారు?!

శ్రీశ్రీని ఉదాహరణగా తీసుకుని ఇంతలా చర్చించుకున్నది **...** ప్రతిభావంతుల శిశుదశ సైతం సాధారణకవి ప్రారంభానుభవాలకేమీ భిన్నంగా ఉండదని అర్థం చేసుకోవడానికే. ఆత్మవిశ్వాసంపెంచుకోవడానికి మహాకవులు నడిచి వచ్చిన దారిని అందుకే  మనం విధిగా శ్రద్ధగా  గమనించాలి. అలా పరిశీలించడం  వారి గౌరవానికి భంగం కలిగించడంగా భావించరాదు

***

# వ్యాస కౌముది



# సాహితీ భీష్ముడు - పెమ్మరాజు

## వంగూరి చిట్టెన్ రాజు



అది 1980 వ ఏడు ఒక రోజు సాయంత్రం. అది మామూలు రోజు కాదు. నా జీవిత గతిని మార్చేసిన భలే మంచి రోజు. తాము స్వయంగా మంచి మార్గాన్న నడవడమే కాకుండా, ఎవరి జీవితాన్నైనా మార్చేసి, మంచి మార్గాన్న నడిపించే వ్యక్తిత్వం అందరికీ ఉండదు. అటువంటి మహోన్నత వ్యక్తిత్వానికి మరో పేరు పెమ్మరాజు వేణుగోపాల రావు గారు. స్వరాజ్య లక్ష్మి గారికి ఆయన "మా వారు". నళినికీ, సలీనాకీ ఆయన "డాడీ". చాల మందికి ఆయన సింపుల్ గా "రావ్ అంకుల్". నాకు ఆయన ఫ్రెండ్, ఫిలాసఫర్ & గైడ్. ఆ రోజు ఇవన్నీ నాకు తెలియదు.

ఆ రోజు సాయంత్రం ఏడు గంటలకి ఆయన ఫోన్ చేశారు. "నా పేరు పీ.వీ రావ్. అట్లాంటా నుంచి మీ ఊళ్ళో జరుగుతున్న న్యూక్లియర్ ఫిసిక్స్ కాన్ఫరెన్స్ కి పొద్దున్న వచ్చాను. అది అవగానే ఇప్పుడే హోటెల్ కి వచ్చాను. వీలుంటే నేను ఎల్లుండి వెనక్కి వెళ్ళిపోయే లోపుగా కలుద్దాం. మీ మధుర వాణి ఎలా ఉంది " అని అత్యంత మధురమైన గొంతుకతో, ఎంతో ఆప్యాయంగా పలకరించగానే ఆశ్చర్య పోయాను. అంతకంటే ఎక్కువగా మహదానందపడ్డాను. ఆశ్చర్య పడడానికి కారణం "తెలుగు భాషా పత్రిక" అనే పేరిట ఆయన సంస్థాపించిన అమెరికాలో తొలి తెలుగు పత్రిక గురించీ, ఆయన కవిత్వం గురించీ నేను అంతకు ఐదేళ్ళ ముందు అమెరికా వచ్చినప్పుడు వినడమే కానీ, ఎప్పుడూ ఆయనతో మాట్లాడే అవకాశం రాలేదు. మా ఇద్దరిదీ పరోక్ష పరిచయమే అయినా ఆయన హ్యూస్టన్ అనగానే నేను జ్ఞాపకం వచ్చి, నా ఫోన్ నెంబరు కనుక్కుని పిలవడం నిజంగానే ఆశ్చర్యం వేసింది. ఇక మహదానంద పడడానికి కారణం ఆయన "మధుర వాణి ఎలా ఉందీ?" అని ప్రస్తావించడం. "మధుర వాణి"

హ్యూస్టన్ లో మా తెలుగు సాంస్కృతిక సమితి వారు స్థాపించిన తెలుగు పత్రిక. అప్పటికి బహుశా కొన్ని మాస పత్రికలూ, మూడు ఉగాది ప్రత్యేక సంచికలు ప్రచురించి ఉంటాం. నేను ప్రధాన సంపాదకుడిగా వచ్చిన ఆ సంచికలు ఆయన చూసి ఉంటారు. నా "మానస పుత్రిక" అయిన ఆ పత్రిక క్షేమ సమాచారాలు ఆయన అడగగానే మహదానందపడిపోయి, వెంటనే..కిచెన్ లో ఉన్న మా ఆవిడతో "ఎవరు పిలుస్తున్నారో తెలుసా?" అని గర్వంగా చెప్పేసి, "ఎప్పుడో ఎందుకు సార్. ఇప్పుడే నేనూ, మా ఆవిడా వచ్చేస్తున్నాం. మీరున్న హోటెల్ కి రావడానికి అరగంట పడుతుంది" అని హడావుడి పడ్డాను. "ఇప్పుడా, అప్పుడే రాత్రి ఏడు దాటింది. రేపు వస్తామని చెప్పు" అనే మా ఆవిడ మాటలు పట్టించుకోకుండా ఆవిణ్ణి కూడా బయలు దేరదీసి రావు గారు బస చేసిన హోటెల్ కి వెళ్ళిపోయాం. అప్పటికి మా ఆవిడ అమెరికా కాపురానికి వచ్చి కొన్ని నెలలు మాత్రమే అయింది కాబట్టి ఎక్కడికెళ్ళినా బుద్ధిగా ఇద్దరం కలిసే వెళ్ళే వాళ్ళం.

మేము ఇద్దరం ఆయన హోటెల్ గదిలో అడుగుపెట్టగానే అంతవరకూ కాస్త రుస, రుస లాడుతున్న మా ఆవిడ మొహం మతాబాలా వెలిగిపోయింది. ఆయన చూడకుండా నన్ను డొక్కలో ఒక పోటు పొడిచి "ఎంత బావున్నారో? మగాళ్ళలో ఇంత అందమైన వాళ్ళూ, ఇంత హుందాగా ఉండేవాళ్ళు ఉంటారా?" అని మహదానందపడిపోయి "మా నాన్నలా ఉన్నారు.." అని కొస మెరుపు తో మురిసిపోయింది. ఆ తరవాత గంట సేపూ వాళ్ళిద్దరూ ఆప్యాయంగా మాట్లాడేసుకున్నారు. ప్రత్యక్షంగా కలుసుకున్న పది నిముషాలలోనే మమ్మల్ని ఆయన తన కుటుంబంలో కలిపేసుకున్నారు. ఇలాంటి అనుభవం అమెరికాలో చాలా మందికే కలిగింది. అందరినీ తమ కుటుంబంలాగానే చూడడం ఆయనకీ, ఆయన సతీమణీ స్వరాజ్య లక్ష్మి గారికీ వెన్నతో అబ్బిన విద్య. ఆయన అట్లాంటా వెనక్కి వెళ్ళిపోయిన తరవాత ఫోన్ చేసినప్పుడు మా ఆవిడ మీ అందాన్నీ, హుందాన్నీ పొగిడేసింది సార్ అని చెప్పగానే "గుడ్...షి హేజ్ ఎ గుడ్ టేస్ట్" అన్నారు నవ్వుతూ.

ఆ విధంగా, 1980 లో రావు గారి చొరవతో ప్రారంభం అయిన మా పరిచయం దిన దిన ప్రవర్ధమానమై, ముఖ్యంగా గత ఇరవై ఏళ్ళగా కనీసం వారానికి ఒక సారి అయినా మాట్లాడుకోలేకుండా ఉండే పరిస్థితికి వచ్చింది. ముందు మా కుటుంబ క్షేమం తెలుసుకుని, తరవాతే ఇతర విషయాలు మాట్లాడే అలవాటు ఆయనది. నాకున్న కష్టాలనీ, సుఖాలనీ పంచుకునే ఏకైక మహానుభావుడు పెమ్మరాజు గారే. "నేను మీకంటే చిన్నవాణ్ణి కదా..నన్ను నువ్వు.. అని పిలవండి సార్", అని నేను ఎన్నిసార్లు బతిమాలినా "పరవా లేదండీ" అంటూ నన్ను ఎప్పుడూ "మీరు" అనే సంబోధించిన మంచి సంస్కారం ఆయనది. తెలుగు సాహిత్యం గురించీ, కథలూ, కవిత్వాల గురించీ, కూచిపూడి గురించీ..నాటకాల గురించీ...ఒకటేమిటి అన్ని కళారూపాల గురించీ, అమెరికాలో తెలుగు వారి గురించీ నేను ఆయన దగ్గర నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. నా "సొంత సుత్తి" నీ ఓపికగా వినే వ్యక్తి కూడా ఆయనొక్కరే! ఇప్పుడు నేను ఏకాకినై పోయాను.

రావు గారి గురించి రావు గారికే తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదు. సమాజంలో తనకున్న ఉన్నత స్థాయిని అతిశయంతో కాకుండా సరి అయిన దృక్పథంతో తూకం వేసుకుని, అనేక మందికి స్ఫూర్తి ప్రదాత అయిన మహానుభావుడు పెమ్మరాజు గారు. ఎంతో మంది భారతీయుల మధ్య తెలుగు భాషే ఊపిరిగా, తెలుగు కళారూపాలే ప్రాణప్రదంగా జీవిస్తూ తెలుగు జాతికి అమెరికాలో ఒక ఉనికిని కలిగించిన తొలి ప్రవాస భారతీయుడు, తొలితరం తెలుగు వెలుగు పెమ్మరాజు గారు.

పశ్చిమ గోదావరి జిల్లా తిరుపతిపురం లో జన్మించిన పెమ్మరాజు వేణుగోపాల రావు గారు విశాఖ పట్నం లో ఆంధ్ర విశ్వ కళా పరిషత్ (ఆంధ్రా యూనివర్శిటీ) లో ఫిజిక్స్ ఆనర్స్ (1953), ఎమ్.యెస్సీ (1954) పూర్తి చేసి 1959లో అమెరికా వచ్చారు. 1964 లో University of Oregon (Eugene, Oregon) లో డాక్టరేట్ పూర్తి చేసి, 1967 నుంచి సుమారు 45 సంవత్సరాలు, శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్న 2012 వరకూ అట్లాంటా లోని Emory University లో Nuclear Physics విభాగంలో "అవిశ్రాంత" ఆచార్యుడిగా, పరిశోధకుడిగా తన వృత్తి పరమైన జీవితాన్ని కూడా అత్యున్నతంగా తీర్చి దిద్దుకున్నారు. ఫిజిక్స్ లో ఎమొరీ విశ్వవిద్యాలయ పాఠ్యాంశాల సంపూర్ణ రూప కల్పన, అంతర్జాతీయ శాస్త్రవేత్తల సమావేశాలలో శతాధికంగా పరిశోధనా పత్రాల సమర్పణ, అనేక మంది విద్యార్ధులని డాక్టరేట్ పట్టాదారులుగా తీర్చిదిద్దడం, అనేక సంస్థలకి శాస్త్ర సలహాదారుడిగా తమదైన ముద్ర వేసుకుని పెమ్మరాజు గారు తెలుగు వారందరూ ఎంతో గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎంతో విజయం సాధించారు. ఇదంతా ఒక ఎత్తైతే, శాస్త్రపరమైన సిద్ధాంతాలకీ, మత పరమైన ఆధ్యాత్మిక సిద్ధాంతాలకీ అనుసంధానం చేయగలిగే అతి కొద్ది ప్రపంచ ప్రముఖులలో పెమ్మరాజు వేణుగోపాల రావు గారు అగ్రగణ్యులు. ఉదాహరణకి, భారతీయ శాస్త్రీయ నృత్యాలకీ, వాటిల్లో అంతర్లీనంగా ఉండే ఆధ్యాత్మికతకీ ఉండే సంబంధమూ, సృష్టి ఆవిర్భావ శాస్త్రం లో హిందూ మత విశ్వాసాలను శాస్త్రపరంగా విశదీకరించడం మొదలైన పరిశోధనా పత్రాలు పెమ్మరాజు గారికి ప్రపంచ



వ్యాప్తంగా ప్రఖ్యాతి తెచ్చిపెట్టాయి. దాని ప్రభావంగా బౌద్ధ మతాచార్యులు దలైలామా వారి కోరికపై పెమ్మరాజు వారు అనేక పర్యాయాలు ఇండియా లోని "ధర్మశాల" ని సందర్శించి, అక్కడి మత గురువులకి (monks) ఐదు సంవత్సరాల పాటు నేర్పబడే పాఠ్యాంశాల ప్రాతిపదికనీ, పాఠాలనీ పెమ్మరాజు గారు స్వయంగా తీర్చి దిద్దారు అని తెలిస్తే ఎంతైనా ఆనందం వేస్తుంది. పెమ్మరాజు గారి బహు ముఖ ప్రజ్ఞాపాటవాలకి ఆశ్చర్యం వేస్తుంది. దలైలామా తో పెమ్మరాజు గారి ఫొటో ఇందుతో జతపరుస్తున్నాం.

అమెరికాలో విద్యార్ధి దశ నుండి, ఉద్యోగ దశలోకి ప్రవేశించిన వెనువెంటనే, పెమ్మరాజు గారు తెలుగు భాషకి, సాహిత్యానికి, తెలుగులో శాస్త్రాలు బోధించడానికి కావలసిన పరిజ్ఞానం అందించే వ్యాసాలు సమకూర్చడానికీ కంకణం కట్టుకున్నారు. అమెరికా ప్రవాసం వచ్చిన తొలితరం తెలుగు వారిలో, తెలుగు భాషా, సాహిత్యాలపై దృష్టి సారించి, కార్యాచరణకి పూనుకొన్న తొలి తెలుగు వ్యక్తి పెమ్మరాజు వేణుగోపాల రావు గారు. అంతే కాకుండా, ఇప్పుడున్న దూరవాణి, విద్యుల్లేఖలూ లాంటి ఆధునిక సాంకేతిక సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ఆయన అమెరికా అంతటా ఉన్న తెలుగు వారిని తనతో కలుపుకోవడం ఆయన చిత్త శుద్ధికి నిదర్శనం. అలా ప్రారంభించబడినదే, ఆయన సంపాదకుడిగా, "తెలుగు భాషా పత్రిక" అనే పేరుతో ప్రారంభించబడిన తొలి అమెరికా తెలుగు పత్రిక. 1968-69 లో ముందు వ్రాతప్రతి గానూ, తరవాత ఇండియాలో ముద్రించబడిన అచ్చుపత్రిక గానూ "తెలుగు భాషా పత్రిక" 1976 వరకూ ఆరు సంవత్సరాలు అమెరికాలో ఒక ప్రభంజనం, యావత్ తెలుగు జాతికీ ఒక నూతన చరిత్ర సృష్టించింది. అమెరికా ఖండం నుంచి వెలువడిన తొలి తెలుగు రచనలన్నీ....కథ, కవిత, వ్యాసం, శాస్త్రపరమైన వ్యాసాలు, గళ్ళ నుడి కట్టు...ఇలా ఒక్కటేమిటి...అన్నీ తెలుగులో...పెమ్మరాజు గారి స్వదస్తూరీలోనే వెలువడ్డాయి. అది తల్చుకున్నప్పుడూ, ఆ తొలి "తెలుగు భాషా పత్రిక" ప్రతులు చూసినప్పుడల్లా... నాకు ఒళ్ళు గగుర్పొడుస్తూనే ఉంటుంది.

అమెరికా వలస వచ్చిన తెలుగు వారి జీవిత విధానాలను నిశితంగా, శాస్త్రదృక్పథంతో పరిశీలించిన పెమ్మరాజు వారు అనేక పత్రికలలోనూ, సావనీర్లలోనూ తమ విశ్లేషణా వ్యాసాలను ప్రచురించారు. ఆ విధంగా ఆయన ఒక చరిత్రకారుడు గా కూడా పేరు తెచ్చుకున్నారు. నాకు తెలిసీ 1978=79 లో ఆయన ప్రచురించిన ఒక వ్యాసంలో తెలుగు వారు కూడా జ్యూయిష్, జర్మన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్ వారిలా "తెలుగు డైస్పోరా" అని గుర్తించవలసిన సమయం వచ్చిందనీ, ఆ డైస్పోరా లక్షణాలను రోజు వారీ జీవితంలోనే కాకుండా, తమ భాషా, సంస్కృతులను ఈ పరాయి దేశంలో నిలబెట్టుకునే ప్రయత్నాలను సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా ఇతర దేశాల వారు తమ మాతృబాషలని నిలబెట్టుకునే ప్రయత్నాలను ఆయన పరిశోధన చేసి అప్పుడప్పుడే ప్రారంభం అవుతున్న తెలుగు భాషా పరిరక్షణ ప్రయత్నాలను క్రోడీకరించారు. బహుశా ఆయన వ్రాసిన అటువంటి వ్యాసాలను చదివి ఈ డైస్పోరా అనే మాటని అదేదో సరి కొత్త మాట తామే కనిపెట్టినట్టుగా మరికొంత మంది వాడి పేరు తెచ్చుకోడానికి ప్రయత్నించారు. అప్పటికే ఆరు సంవత్సరాలు తెలుగు భాషా పత్రిక నిర్వహణ అనుభవం ఆయన వ్యాస పరంపరకి తగిన బలం చేకూర్చింది.

రావు గారు రోజుకి 24 గంటలూ ఏదో ఒక పని చేస్తూనే ఉండేవారు అని అందరికీ తెలుసు. ఉదాహరణకి నా కోరిక మీద 1989 లో ఆయన తానా మహాసభలకి హ్యూస్టన్ వచ్చి, మా ఇంట్లోనే ఉన్నారు. వచ్చిన మర్నాడు పొద్దున్నే లేచాక "మీ కిచెన్ లో ఏమన్నా మార్పు కనపడుతోందా?" అని నన్ను అడగగానే...కిచెన్ లో మార్పు ఏమిటా అని ఆశ్చర్య పోయి చూస్తే...అప్పుడు తెలిసింది...మా వంటింటి సింక్ లో వాటర్ ఫాసెట్ లో నీళ్ళు కారడం లేదు. అసలు విషయం ఏమిటంటే...అంతకు వారం రోజుల ముందు ఆ కుళాయి, బహుశా దాని వాషర్ చెడిపోయి బొట, బొటా నీళ్ళు కారడం మొదలు పెట్టింది. నాకు టైమ్ లేక దాన్ని బాగు చెయ్య లేదు. కానీ అది ఇప్పుడు అది బాగానే ఉంది. ఘుళుక్, ఘుళుక్ అని చప్పుడు చేసుకుంటూ మూడు నిముషాలకి ఒక సారి నీటి చుక్కలు సింక్ లో పడడం లేదు. "అవును సార్...అదేమిటీ మాయ...నిన్న రాత్రి దాకా అది నా తలకాయ లాగా లీక్ అవుతోంది కదా" అని నేను ఆశ్చర్య పోతూ ఉంటే " ఆ...రాత్రి సరిగ్గా నిద్ర పట్టక పోతేనూ...దాని సంగతి చూశాను" అన్నారు రావు గారు. మా కిచెన్ లో చెడిపోయిన ఆ నీళ్ళ కుళాయిని ఆయన ఎప్పుడు గమనించారో నాకు తెలియదు. ఎలా దాన్ని రిపేర్ చేశారో అంతకంటే తెలియదు. దటీజ్ రావు గారు. ఆనాటి మహా సభలలో మేడసాని మోహన్ గారిని అవధానిగా ఆహ్వానించి మేము నిర్వహించిన అష్టావధానం అమెరికా తెలుగు వారి చరిత్రలో మొట్టమొదటిది. ఆ అవధానంలో పెమ్మరాజు వారు ఆశువు గానూ, నేను అప్రస్తుత ప్రసంగి గానూ పృచ్ఛక రంగ ప్రవేశం చేసి, ఆ తరువాత అనేక అవధానాలలో ఇద్దరం కలిసి పాల్గొన్నాం.

1994 తొలి మాసాలలో నాకు అమెరికాలో తెలుగు సాహిత్య ప్రపంచానికి తమదే అయిన ఒక వేదిక కలిగించాలనే ఆలోచన వచ్చింది. ఆయా సంస్థల ప్రస్తుత నాయకత్వానికి ఎంత వరకూ తెలుసునో నాకు తెలియదు కానీ, అప్పటికి అనేక సంవత్సరాలగా వేణుగోపాల రావు గారూ, నేనూ, విడివిడి గానూ, కలిసీ స్థానిక తెలుగు సంఘాలకీ, తానా వారికీ, అప్పుడే వెలిసిన ఆటా వారికీ సాహిత్య కార్యక్రమాలలోనూ, ఆయా సంస్థల రూప కల్పన లోనూ మౌలికమైన సహాయం చేసిన అనుభవం ఉంది. అందు వలన నా సరికొత్త ఆలోచనల మంచీ, చెడూ చర్చించడానికి మొట్టమొదటగా అమెరికాలో తెలుగు వారి "భీష్మాచార్యుడు" లాంటి పెమ్మరాజు గారిని పిలిచాను. నా ఆలోచన వినగానే ఆయన "చాలా మంచి ఆలోచన....ఈ సినిమా వాళ్ళ గోలా, కులాల వారీ గొడవలూ లేకుండా హాయిగా తెలుగు మాట్లాడుకోవచ్చును. కానీ ఒకటే కండిషన్ ".. అని ఆగారు. ఇందులో కండిషన్ ఏమిటా అని నేను ఆశ్చర్యపోతూ ఉంటే "అబ్బే, ఏం లేదు. ఏదైనా మంచి పని చేద్దామని ఆలోచన వచ్చినప్పుడు...తొందరగా చేసెయ్యాలి...పెద్ద వాళ్ళం అయిపోతున్నాం కదా...ఆట్టే టైమ్ ఉండకపోవచ్చును"....ఆ నాటి నుంచీ పద్దెనిమిదేళ్ళ పాటు....గత డిశంబర్ 25, 2012 నాటి పర్వదినం నాడు ఆఖరి శ్వాస విడిచేవరకూ ఆయన ఒక్కరే నాతో ఉండి, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికాని మంచి మార్గంలో నడిపించారు. ఆ తొలి రోజులలో నేను సంప్రదించిన కొంతమంది అప్పుడు నన్ను ప్రోత్సహించినా, కొంతమంది ఇంకా ప్రోత్సహిస్తూనే ఉన్నా, తన పనులు చేసుకుంటూనే, వేరే ఎజెండా పెట్టుకోకుండానే, సాహిత్య పతాకాన్ని సగౌరవంగా ఎగరేసిన నిత్య కృషీవలుడు

పెమ్మరాజు గారు. నా ప్రయత్నాలని సమర్ధించడంలో ఆయనతో బాటు ఆయన కుటుంబం కూడా కలిసి రావడం నా అదృష్టం.

నాకు వ్యక్తిగతంగా తెలియదు కానీ, నాటకాలు వేసే వాళ్ళు ఎందుకూ కొరగాని జులాయి వాళ్ళు అనుకునే ఆ రోజుల్లో, ఏలూరులో పెమ్మరాజు గారి సాహిత్య, కళాత్మక ప్రస్థానం మొదలయింది. ఆ తరువాత ఆయన విశాఖపట్నంలో 1950 నుంచి 1959 లో అమెరికా వచ్చే దాకా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ ఆనర్స్, తరవాత ఫిజిక్స్ లోనే మాస్టర్స్ డిగ్రీ చేసి ఆంధ్రా యూనివర్శిటీ నాటక సంఘానికి పెమ్మరాజు గారు నటన, నాటక వేదికల రూపకల్పన, నిర్మాత, దర్శకుడు మొదలైన అన్ని విభాగాలలోనూ ఉన్నత స్థాయి కృషి చేసి తెలుగు నాట పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. ఆ నాటి ఆంధ్రా యూనివర్శిటీ రిజిస్ట్రార్ కె.వి. గోపాల స్వామి నాయుడు గారు తెలుగు సంస్కృతికీ, నాటక రంగానికీ చేసిన సేవలు ఇప్పటికీ తెలుగు జాతి యావత్తూ గుర్తుకి తెచ్చుకుంటూనే ఉంది. కె.వి.గోపాల స్వామి నాయుడి గారు నెలకొల్పిన నాటక విభాగానికి, ఆయన చేత ప్రత్యేకంగా కార్యదర్శిగా ఎంపిక చేయబడిన పెమ్మరాజు గారు అనేక విధాలుగా తెలుగు నాట నాటక రంగ వైభవానికి కారణభూతులయ్యారు. ఉదాహరణకి ఆ రోజుల్లోనూ, ఇప్పటికీ యావత్ భారత దేశంలోనే అపురూపమైన సాంకేతిక నైపుణ్యంతో ఆంధ్రా యూనివర్శిటీలో నిర్మింపబడ్డ "Erskin College Open Air Theater" రూపకల్పన లో పెమ్మరాజు వారు ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఉదాహరణకి ఆ రోజులలో పెమ్మరాజు గారు వేసిన "విశ్వంతర" నాటకంలో ఆయన ఫొటో నేను మొదటి సారి చూసి అక్కినేని నాగేశ్వర రావు అనుకున్నాను. ఆ ఫొటో ఇందుతో జతపరిచాను. అలాగే



కన్యాశుల్కం నాటకాన్ని రెండు గంటల ప్రదర్శనకి అనువుగా ఆయనే స్వయంగా కుదించి, దర్శకత్వం వహించి, తానే గిరీశం పాత్ర ధరించి, 1982లో అట్లాంటాలో ప్రదర్శించారు. కన్యాశుల్కం ప్రదర్శన ఉత్తర అమెరికాలో అదే మొట్టమొదటి సారి. కేవలం యాదృచ్చికంగానే నేను కూడా అదే సంవత్సరం హ్యూస్టన్ లో మొదటి సారి గిరీశం ఏకపాత్రాభినయనం చేశాను. పెమ్మరాజు గారి అలనాటి గిరీశం ఫొటో ఇందుతో జతపరిచాను.

పెమ్మరాజు గారికి శాస్త్రీయ నృత్యం..ముఖ్యంగా కూచిపూడి చాలా ఇష్టమైన కళా రూపం. తన సుదీర్ఘ జీవితంలో ఆయన అనేక నృత్య రూపకాలకి నిర్దేశకుడిగా, కాస్ట్యూమ్ డిజైనర్ గా, దర్శకుడిగా, నిర్మాతగా, సెట్ డిజైనర్ గా, సాధికారిక వ్యాఖ్యాతగా వ్యవహరించారు. 1989 లో హ్యూస్టన్ లో జరిగిన తానా మహాసభలలో ఆయన పర్యవేక్షణలో, అట్లాంటా బృందం ప్రదర్శించిన "గిరిజా కళ్యాణం" కూచిపూడి నృత్యనాటకం ఉత్తమ ప్రదర్శనగా ప్రేక్షకుల చేత ఎన్నుకోబడింది. ఆ రూపకం సెట్స్ అన్నీ పెమ్మరాజు గారు స్వయంగా తమ ఇంటి గరాజ్ లో తయారు చేసి, రంగులు వేసి అట్లాంటా నుంచి తీసుకొచ్చారు. అలాగే, హ్యూస్టన్ లో రత్నపాప ఆధ్వర్యంలో,

ప్రపంచంలో అన్ని దేశాలనుంచీ నర్తకీ మణులూ, నాట్యశాస్త్రంలో నిష్ణాతులూ పాల్గొన్న మొట్టమొదటి అంతర్జాతీయ కూచి పూడి నాట్య సమ్మేళననానికి పెమ్మరాజు వేణుగోపాల రావు గారే ప్రధాన అతిధి మరియు సమ్మేళన సమీక్షకులు. ఆయన గిరిజా కళ్యాణమే కాకుండా శ్రీ కృష్ణ పారిజాతం, రుక్మిణీ కళ్యాణం, ఛండాలిక, స్వప్న విజయం, ఆండాళ్ కల్యాణం మొదలైన అనేక నృత్య నాటికలకి వెన్నెముకగా నిలిచి, వాటికి దర్శకత్వం వహించి విజయవంతం చేశారు.

పెమ్మరాజు గారు ఎటువంటి కార్యక్రమమైనా సరే, వేదిక నిర్వహణలో (స్టేజ్ మెనేజ్ మెంట్) అత్యంత ప్రతిభ, నిబద్ధత, సమయ పాలన పాటించే వారు. ఆయన వేదిక నిర్వహణలో ఎంతటి గొప్ప వారైనా సరే, రూల్స్ పాటించి తీరవలసినదే. తాము అవసరం లేని సమయంలో, మరొక కార్యక్రమం వేదిక మీద జరుగుతున్న సమయంలో స్టేజ్ లో పక్క తెరల దగ్గర అటూ, ఇటూ తిరుగుతూ ఉన్న సెలెబ్రిటీ సినీతారలని కూడా ఆయన నిర్మొహమాటంగా, మర్యాదగానూ, అవసరం అయినప్పుడు నిర్దాక్షిణ్యంగానూ బయటకి పంపించేసిన సందర్భాలు నేను స్వయంగా చాలా సార్లు చూశాను. ఇక సాహితీ సదస్సుల నిర్వహణలోనూ, ఆచరణలోనూ, రూప కల్పన లోనూ పెమ్మరాజు గారు ఆయనే ఆయనే సాటి. పెమ్మరాజు వారి ఆధ్వర్యంలో అమెరికాలో మొట్టమొదటి తెలుగు పత్రిక అట్లాంటాలో వెలువడిన కారణంగా, నేను హ్యూస్టన్ నివాసిని అయినప్పటికీ, మా ఊరి వారి మాటని కాదని, పెమ్మరాజు గారి మీద గౌరవంతో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా తరఫున 1998 లో అట్లాంటా "మొట్ట మొదటి అమెరికా సాహితీ సదస్సు" పెమ్మరాజు గారు విజయవంతంగా నిర్వహించారు. అట్లాంటా తో మొదలు పెట్టి, చికాగో, డిట్రాయిట్, న్యూ జెర్సీ, కాలిఫోర్నియా, హ్యూస్టన్, ఇండియానాపోలిస్ లలో జరిగిన ఎనిమిది అమెరికా జాతీయ స్థాయి తెలుగు సాహితీ సదస్సులకీ, గత సంవత్సరం (మార్చి, 2012) లో మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకీ ఆయన వచ్చి "సదస్సు సమీక్షకులు" గా అత్యంత కీలకమైన పాత్ర వహించారు. ప్రతీ సదస్సులోనూ, మొదటి నిముషం నుంచి, ఆఖరి నిముషం వరకూ సుమారు యాభై మంది వక్తల సాహిత్య ప్రసంగాలని వింటూ, తన నోట్ బుక్ లో ముఖ్యాంశాలు రాసుకుని, వాటిని క్రోడీకరించుకుని, ఆ సదస్సు ఆఖరి అంశంగా, అనర్గళంగా, రెండు గంటల సేపు అప్పటి దాకా ఇరవై గంటల సేపు ఏకాగ్రతతో విన్న ప్రసంగాలని సమీక్షించి, తప్పులనీ, ఒప్పులనీ ఎత్తి చూపి, ఆహూతులందరికీ సాహిత్య దిశానిర్దేశం చేసే సామర్ధ్యం కలిగిన అసాధారణ వ్యక్తి శ్రీ పెమ్మరాజు గారు. మరొక ఉదాహరణ ఆయన సారధ్యంలో అట్లాంటాలో స్థానికంగా జరిగే సాహిత్య సమావేశాలే! 2003లో హ్యూస్టన్ లో రత్నపాప ఆధ్వర్యంలో జరిగిన మొట్టమొదటి అంతర్జాతీయ కూచిపూడి నృత్య సమ్మేళనంలో కూడా పెమ్మరాజు గారు ముఖ్య అతిధిగా వచ్చి, రెండు రోజుల అనంతరం ఆ మొత్తం సమ్మేళన కార్యక్రమాలని సమీక్షించిన ప్రతిభా పాటవాలు ఆయనకి మన శాస్త్రీయ నృత్యాలపై ఉన్న సాధికారత అందరినీ సమ్మోహ పరిచింది.

పెమ్మరాజు వేణుగోపాలరావుగారి పేరు వినగానే అందరికీ జ్ఞాపకం వచ్చేది ఆయన కవిత్వమే. ఒక విధంగా చెప్పాలంటే కవిత్వమే ఆయన ఊపిరి. ఎప్పుడు చూసినా ఆయన చేతిలోనో, జేబులోనో ఒక నోట్బుక్ ఉండేది. ఏదైనా ఆలోచన రాగానే,

వెంఠనే అందులో రాసేసుకునే వారు. తెలుగులోనూ, ఆంగ్లం లోనూ ఆయన నిజమైన పాండిత్యం కలిగిన వ్యక్తి. అలాగని ఏ నాడూ ఆయన అవార్డుల కోసం తాపత్రయ పడక పోయినా, అవే ఆయన్ని వెతుక్కుంటూ వచ్చాయి. ఆయన ఇంటి వెనకాల వసారాలోనూ, నేల మాళిగ లోనూ కొన్ని వందల పుస్తకాలతో పాటు ఆయన కొచ్చిన పతకాలూ కుప్పలు, తెప్పలుగా ఉంటాయి. "లోకానికి చాటింపు" అనే పేరిట కవితా సంకలనమూ, ఆయన అనువదించిన "శృంగార భర్తృహరి" శతకమూ, బాపు గారి అద్భుతమైన బొమ్మల సృష్టి తో సహా శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రుల వారి రచనలకి పెమ్మరాజు గారు చేసిన మహత్తరమైన ఆంగ్ల అనువాదంతో "తిరుప్పావై" పవిత్ర గ్రంధమూ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ద్వారా ప్రచురించే అదృష్టం నాకు కలిగింది. ఇవి కాక, ఆయన "కాస్మిక్ కవిత" సంకలనమూ, నేటి నాటక పరిధులకి అనుగుణంగా "కన్యాశుల్కం" సంక్షిప్త రచనా, అలాగే "భువన విజయం" సంక్షిప్త రూప కల్పనా మొదలైనవి పెమ్మరాజు గారు ప్రచురించిన మరికొన్ని పుస్తకాలు.

ఒక మంచి కథకుడి గా పెమ్మరాజు గారు రాసి కంటే వాసి మిన్నగా "దాంపత్యానికి అనుబంధం", మహా స్వప్నం", "పిల్లల కోసం", "ఇంద్రప్రస్థంలో సీమంతం", "కొత్త కాపురం", "కిష్కింధలో రజతోత్సవం", "2092", "సమన్వయం", రియూనియన్" మొదలైన వైవిధ్యమైన కథలు అనేక పత్రికలలో, ముఖ్యంగా "తెలుగు జ్యోతి" లో ప్రచురించబడ్డాయి. అంతే కాక ఆయన ఒక ఉత్తమ సంపాదకులు. ఆయన సంపాదకత్వంలో అమెరికా లో తెలుగు సంఘాల సావనీర్ లకే కాకుండా "మచ్చు తునకలు" లాంటి అనేక పుస్తకాలకి ఆయన సంపాదకుడిగా వ్యవహరించారు. ఇక వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా విషయానికొస్తే....ఆ సంస్థ తొలి రోజూ నుంచీ, జీవితకాల గౌరవ సంపాదకులుగా పెమ్మరాజు గారు యాభై ప్రచురణలకి సంపాదకుడిగా తమ ఔన్నత్యాన్నీ, ఔదార్యాన్నీ చాటుకున్నారు. పుస్తక ప్రచురణ లోనూ, ఆలోచనా విధానంలోనూ ప్రముఖ పాత్ర వహించి మా సంస్థకి ఊపిరి పోశారు.



పెమ్మరాజు వారిలో చాలా మందికి తెలిసిన మరొక కళాత్మక కోణం చిత్రకారుడిగానూ, శిల్పిగానూ ఆయన ప్రతిభ. అట్లాంటా లో ఇండియా అసోసియేషన్ వ్యవస్థాపకులలో ఒక ప్రముఖుడిగా, తొలి చైర్మన్గా ఆ సంస్థ కార్యకలాపాలకి దిశా నిర్దేశం చేసి, తొలి దేవాలయం రూపకర్తగానూ, తొలి ఆడిటోరియం నిర్మాతగానూ ఆయన సేవలు అందరికీ తెలిసినవే! మూడు, నాలుగేళ్ళ క్రితం అట్లాంటా లో సహస్ర శివ లింగార్చన జరిగినప్పుడు 1008 శివ లింగాలూ



స్వహస్తాలతో తయారు చేసినది పెమ్మరాజు వేణుగోపాల రావు గారే. ఆ శివ లింగం ఇంకా శోభాయమానంగా వారి లివింగ్ రూం లో ఉంటుంది. అలాగే వారి ఇంట్లో అన్ని గోడల మీదా ఆయన వేసిన వర్ణ చిత్రాలు అనేకం అలంకరించి ఉంటాయి. అమెరికాలో అనేక మహా సభలలో ఆయన చిత్రాలు ప్రదర్శించ బడి అందరి ప్రశంసలకూ నోచుకున్నాయి. అంతెందుకూ....ఆయన ఇంటి వెనకాల తోటలో రాళ్ళ మీద ఆయన స్వయంగా చెక్కిన తెలుగు అక్షరాలు ఎంతో పొందికతో పేర్చి ఉంటాయి. పెమ్మరాజు వారి తెలుగు భాషాభిమానానికీ, శిల్ప చాతుర్యానికీ, భావ సౌందర్యానికీ అంత కంటే నిదర్శనం ఏం కావాలి? ఇందుతో పెమ్మరాజు గారు వేసిన "బ్రహ్మ-సరస్వతి" వర్ణ చిత్రమూ, ఆయన మలిచిన "నటరాజ" విగ్రహం ఫోటోలు జతపరుస్తున్నాం.

ఒక పరిపూర్ణ మయిన కళాత్మక జీవితాన్ని, అటు ఆంగ్లంలోనూ, ఇటు తెలుగులోనూ అత్యంత ప్రతిభావంతుడైన కవిగా, కథకుడిగా, ఉపాధ్యాయుడిగా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తగా, ప్రేమాభిమానాలు మూర్తీభవించిన భర్తగా, తండ్రిగా, అందరికీ ఆత్మీయుడిగా, నాకు ఆదర్శప్రాయుడిగా సహస్ర పూర్ణ చంద్ర దర్శన భాగ్యం కలిగిన నెల తరువాత డిశంబర్ 25, 2012 క్రిస్మస్ పర్వ్దదినాన పరమపదించిన ఆ మహనీయుడు పెమ్మరాజు వేణు గోపాల రావు గారికి యావత్ తెలుగు జాతీ, అందునా అమెరికాలో ఉన్న తెలుగు వారందరూ ఋణపడి ఉంటారు. ఎట్టి పరిస్థితిలో ఐనా అవతలి వారిలో మంచిని మాత్రమే ఆయన పరిగణలోకి తీసుకునే వారు. ఆయన నిరంతర ఆశావాది. అనేక రంగాలలో సవ్యసాచిలా అమెరికా తొలి తెలుగు తేజం గా ప్రకాశించి 80 సంవత్సరాలు జీవితాన్ని అందరికీ ఆదర్శప్రాయంగా మలుచుకున్న స్వర్గీయ పెమ్మరాజు వేణుగోపాల రావు గారికి ఇదే మా నివాళి. దాచుకుంటున్న జ్ఞాపకాల రవళి.

●●●

వ్యాస కౌముది



# మరాఠీ తీవీ...మహాకవి తాంబే!

## కర్లపాలెం హనుమంత రావు

అనుభవించే ఆసక్తి ఉండాలే కాని మానవ జీవితం రసప్లావితం. మానవత్వంలోని దివ్యత్వాన్ని కవిత్వంగా మలిచి ఈ లోకాన్ని స్వర్లోకంగా మార్చిన మహానుభావులు విశ్వాహిత్యంలో ఎందరో!మహారాష్ట్రకు చెందిన భాస్కర రామచంద్ర తాంబే స్థానం అందులో ముందువరస. మన పోతన, త్యాగయ్యల మాదిరి పేరుప్రఖ్యాతులకోసం, ప్రభువల మెప్పుకోసం కాక, ప్రజలకోసమే కవితాగానం చేసిన ప్రసిద్ధ పరాఙ్ముఖి మహాకవి తాంబే. జీవితంలోని ఆనందానుభూతులను అందుకోవడం కోసం నిష్కాపట్య సాత్వికమార్గాన్ని ఎంచుకున్న రుషిసత్తముడాయన.

పారలౌకిక సుఖాల పాకులాటలో పడి ఇహలోక సౌందర్యాలని ఈసడించుకునే ముముక్షుకత్వం గురించి పోతనగారి పద్యం ఉండనే ఉంది. 'పెంజీకటి కవ్వల' ఏకాకృతితో వెలుగొందే ఎవడి కోసమో వెతుకులాటలో పడి అందుబాటులో ఉన్న ఈఅందాలజీవితం మీద శీతకన్ను వేయడం శుద్ధమందమతులు చెసే వ్యర్థమైన పని. మట్టి మినహా ఇక్కడ ఏమీ లేదన్నది వట్టి మెట్ట వేదాంతం- అని యథార్థవాదుల గట్టివాదన. నిజమే. కానీ 'వాస్తవం' వస్తురీత్యా మాత్రమే ప్రదర్శనీయం-అన్న వాళ్ళ సూత్రంలోనూ అర్థభాగం బోళానే! భౌతికమైన అస్తిత్వానికీ భావనే ప్రధానభూమిక. అనుభూతే జ్ఞానవాహిక.వస్తువు నశించవచ్చు.వస్తుజ్ఞానం మాత్రం అనశ్వరం. అందుకే శూన్యవాదుల్లాగే..యథార్థవాదులూ సత్యాన్వేషణ బాటలో దారి తప్పిన బాటసారులు' అన్నది తాంబే సమన్వయ మతం. సమ్యక్ దృష్టి ఉండాలే గాని సర్వం సుందరాత్మకమే. సమ్యక్ భావనుండాలే గాని సమస్తం స్వహస్త ముష్టి బంధనమే. మానవ జీవిత మధురానుభూతుల్నిఅత్యంత శ్రావ్యంగా గానం చేసేందుకు తాంబేకి ప్రేరణ కలిగించిందీ సత్వసమన్వయ సౌహార్ద గుణభావ శబలతలే కావచ్చు.

తాంబే కవిత్వంలో కేవలం ప్రతిభావ్యుత్పత్తులే కాదు కొట్టొచ్చు కనబడే మరో గొప్ప తత్వం -సంగీత సాహిత్యాల సమపాళ్ళ సమన్వయం . ఈ సౌలభ్యమే సంగీత విద్వాంసులకా మహాకవి సాహిత్యాన్ని స్వరబద్ధం చేసి ముందుతరాల కందించే మహదవకాశం దక్కించింది.

ప్రళయంకురుడైన రుద్రుణ్ణి ఆవాహన చేసుకుని సృష్టించిన లయాత్మకమైన ఈ కవిత పర్వతంవంటి ఈ మహాకవి ప్రతిభావ్యుత్పత్తులకు పట్టిన చిరుదర్పణం.

"దుమదుమత్ దమరుయే-ఖణ్ ఖణత్ శూల్ యే
శంఖ పుంకీత్ యే- యేయి రుద్రా!
ప్రళయఘన భైరవా- కరిత్ కర్కశరవా
క్రూర విక్రాళ్ ఘే- క్రుద్ధముద్రా!
కడ్ వడా ఫోడ్ నభ్- ఉడవ్ ఉడుమక్షికా
ఖడ్ ఖడవి దిగ్గజా-తుడవ్ రవిమాలికా,
మాండ్ వాదల్, ఉఘళ్-గిరి జషీ మృత్తికా
ఖవలవీ చందుకడె-యా సముద్రా!"

అంటో చదువుతుంటే... అర్థం సంగతలా పక్కనుంచి... పక్కలెగిరి పడే ఈ కవిత పాదాలకి మన సరస్వతీపుత్రులు పుట్టపర్తి నారాయణాచార్యుల వారి 'శివ తాండవం'లో మాదిరి కదం తొక్కే రుద్రమూర్తి భయంరాకారం క...క... కళ్ళముందు సాక్షాత్కారం కావడం లేదూ!

సరే...ఇదంతా రూపాత్మకమైన భావనంటారా..ఉదాత్త కవిత్వానికిదే మాత్రం కొలబద్ద కాదంటారా. మరి..ఆ మహాకవే విరచించిన అపార సాహిత్యంలోని కొన్ని భావాత్మకమైన విశేషాలను ఇప్పుడు రుచి చూస్తే పోలా!

ప్రతి ఇంట్లోనూ వినిపించే అన్నా చెల్లెళ్ళ...అక్కా తమ్ముళ్ళ చిన్ననాటి చిలిపికజ్జాలను కజ్జికాయలంత లంత కమ్మగా ఈ కవి వర్ణిస్తాడు.

"తుఝ్యాగళా మాఝ్యాగళా -
గుంపూ మోత్యాచీ మాలా"

నీ మేళ్ళోనూ నా మెళ్లోనూ వేసుకోడానికి -ముత్యాల హారాలను గుదిగుత్తునా' అని అన్నగారినాప్యాయంగా ఆరాతీసే ఓ చిన్నారి చెల్లాయి చిట్టిపొట్టి పలుకుల సమాహారగీతంలోని ఈ చిన్నిముక్కల వెనక ఎంత పెద్ద భావం నక్కుందో తెలుసా! అన్నా చెల్లెళ్ళ గిల్లికజ్జాలు అందరిళ్ళలోనూ కనిపించే ఆనందవల్లరులే. 'పిల్లల అల్లరి లేని గూడు పిట్టలు వాలని మోడుచెట్ట'ని కథాసరిత్సాగరమూ సామెత చెబుతుంది. పిల్లల అల్లరి పెద్దలను అలరిస్తుందే కాని ఆగ్రహం కలిగించదు కదా!మరీ

ముఖ్యంగామురిపాల తల్లికి. అన్నా చెల్లెళ్ళు తగూలాడుకుని చివరి తీర్పు కోసం తన దగ్గరికొస్తే..తల్లి సహజంగా చిన్నపిల్ల అనే కాదు... ఆడపిల్లనీ చెల్లెలు పక్షమే వహిస్తుందిట. అలిగినా అనురాగం వదలని అమృతవల్లికదా ఆడపిల్ల! ప్రేమే ఆమె బలం బలహీనతా. మగవాడిది మాత్రం ఏ క్షణానికెలా మారుతుందో చెప్పలేని చిత్తచాపల్యం. అందుకనే ముందుగా తల్లి కొడుకునే మందలిస్తుందంటారు కుటుంబసంబంధాలని అత్యంత గాఢంగా ప్రేమించే తాంబే.

'భ్రాతా రాచ్యా రాజ్యీ-ఊణ్ రేవీ నా దేవ
బహినీ చీ మనీ-చోలీ చీ ఆశారేవ'

పిల్లదానికెట్లాగూ అత్తారింట్లో ఏ లోపమూ రానివ్వడా భగవంతుడు. ఐనా పుట్టింటివారి రవిక కోసం కొట్టుకులాడే అవకాశం పదికాలాల పాటీ పిల్లకి చల్లంగా అలాగే ఉండనీయమ'న్న తల్లి ఆరాటమే ఆమందలింపుల్లో మనకు కనిపించేది.

పసిపిల్లల్ని చూస్తే చాలు...

"ఝుణ్ ఝుణ్ యే ఝుణ్ ఝుణ్ యే -ఝుణకారిత్ బాలా
లుట్ లుట్ లుట్ -దుడ్ దుడ్ దుడ్- రమ్ కత్ యేబాలా'

అంటో చెంగు చెంగున బుజ్జి తువ్వాయిలా గంతులేస్తే చాలు... మన హృదయం పదిలంగా ఉన్నట్లే లెక్కంటారు మహాకవి తాంబే. మన మహాకవి శ్రీశ్రీ సైతం 'శైశవ గీతం'లో చెప్పిందదే బాలవేదం కదా!

అత్తమామలు, ఆడపడుచుల మధ్యఅత్తింట అడుగడుగునా అణకువగా నడుచుకోవాల్సిన భాధ్యత ఇంటి కోడలిది. ఐనా ఆబాలని చెలికత్తెల పరిహాసోక్తులు పతి సన్నిధికి పరాఙ్ముఖిని చేస్తుంటాయి. లజ్జావిలసితైన ఆ కులవధువు తన పరధ్యానానికి భర్తనే ఎంత ఉదాత్తంగా భాద్యుణ్ణి చేస్తుందో తాంబేజీ ఈ తమాషా పదాల్లో చూడండి!

"దోళేహే జుల్మ్ గడే-రోఖునీ మజ్ పాహు నకా
జాదుగిరీ త్యాంత్ పురీ-యేధ్ ఉభే రాహు నకా"

"నీ చూపుల్లో ఏం మాయుందో కానీ నా మనసునలా అలా వివశం చేసేస్తున్నది. ఇక్కడొక్క క్షణం నిలబడద్దు. పో...అదే పనిగా నన్నలా చూస్తుంటే. చా...చేసే పనిలో ఎన్ని పొరాపొట్లు!ఆనక నన్నని లాభమ్ లేదు సుమా... ఈ దోషమంతా నీ చిలిపి చూపులదే !' అని ఓ బాల బేలగా అనుకునే తాంబే ఈ కవిత చదువుతుంటే ఆ పడుచు గడుసుతనం వెనకంతా మనకు హాలుడి 'గాథాసప్తశతి' నీడలు తారాడటం కనబడటం లేదూ!

మరాఠీకవుల్లో అత్యధికులు అద్వైత పోకడలు పోయిన అలౌకికులు.సత్తుని విఠ్ఠలునికి...చిత్తును రుక్మాబాయికి సమర్పణ చేసి అక్షరయఙ్ఞం సాగించిన యోగులు. కొమర్రాజు లక్ష్మణరావు గారి మతం ప్రకారం ఆదిరసం వారికి అనాదరణీయమే కావచ్చు కానీ సాత్విక శృంగార దేవతనూ ఉపాసించినవారు కొద్దిమంది కద్దు. సత్వగుణ విలసితమైన ప్రణయరాగం మానవజీవితంలో మధుర రసానందాల నూరిస్తుందని గాఢంగా నమ్మే సాత్విక ప్రణయవాదుల్లో రామచంద్ర తాంబే ప్రముఖులు.

జీవితానందాలన్నింటినీ చిత్రిక పట్టి  పట్టుకుచ్చుల్లాంటి మేలిరకం 'పట్టీ'ని మానవాళికి కట్టబెట్టిన ఘనత అందుకే తాంబేకి తప్పకుండా దక్కుతుంది.

పరమసుందరమైన ప్రణయకవిత్వాన్నే కాదు ..వీరరసప్రధానమైన దేశభక్తికవిత్వాన్నీ రాసి ఉత్తమకవిత్వానికి మరాఠీమార్గం చూపెట్టిన అక్షర వైతాళిక రేవీ- భాస్కర రామచంద్ర తాంబే!

అన్నింటికన్నా మరీ ముఖ్యంగా మారే సమాజంతో పాటు సాహిత్యంలోనూ మార్పు రావాలనీ...కవిత్వం సమాజంలోని నవ్యతకు దర్పణం పట్టి  తీరాలని తీవ్రంగా అభిలషించిన నవ్యవాదుల్లో తాంబేది ప్రథమ పంక్తి. విస్తృతాధ్యయనం అంటే విశ్వసాహిత్యాన్ని శ్రద్ధగా పరిశీలించడమనే అర్థం. మన భాషనూ, భావననూ అనుక్షణం విశాలపరుచుకునే నిరంతర సాధనాప్రక్రియలో..వీలున్నంతవరకూ మన ఇరుగు పొరుగుల్లో జరిగే  అక్షర వ్యవసాయాన్నీ ప్రేమతో పరామర్శించడమూ ఒక ముఖ్యమైన భాగమే. అందులో భాగమే ఈ చిన్న వ్యాసం. జ్ఞానానికి అంతమనేదేముంది...మహాసముద్రం దానిముందు పిల్ల కాల్వ కదా!

(యాది'సామల సదాశివ" సారు ప్రసాదించిన పిడికెడు జ్ఞానభిక్షనుంచి కొన్ని మెతుకుల తునకలు మాత్రమే ఇవి.ఆ సామికి నిండు నమస్సులతో)




# తెలుగు తానీషా యస్వీ జోగారావు

## డా. శిరీష ఈడ్పుగంటి

**తెలుగు తానీషాగా** పిలువబడిన యస్వీ జోగారావుగారు సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషలను అవపోశనము పట్టిన అపర భగీరథుడు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియాలలో ఈయన చేయి కనిపిస్తుంది. పద్యం, గద్యం, ఛందస్సు, నవల, నాటకం, కథ, జానపదవాఙ్మయం, భాషాశాస్త్రం, యక్షగానం, అనువాదం, వ్యాకరణం, కవిత్వం, తదితర అంశాలన్నింటిలోనూ ఈయనకు ప్రవేశముంది. అన్నింటియందు వీరి రచనలు కనిపిస్తాయి. వీరెంత ప్రాచీనులో అంత నవీనులు. పద్యరచనలో ఎంత సమర్థులో గద్యరచనలో కూడా అంత సిద్ధహస్తులు. తెలుగులో 'ఊహాప్రహేళిక' అనే సాహిత్యప్రక్రియ ఈయన అపూర్వ సృష్టి. ఈయన విజయనగరం జిల్లా, పార్వతీపురంలో 1928 అక్టోబరు 2 న జన్మించారు. తల్లిదండ్రులు మంథా సరస్వతమ్మ, శిష్లా సాంబశివరావు. పరిశోధక పరమేశ్వరుడు. రచనల రూపంలో ఎంతో పరిశోధన చేశారు. ముప్పైమందికి పైగా విద్యార్థులకు ఈయన మార్గదర్శకత్వంలో డాక్టరేటు ఇప్పించారు. వీరు పరిశోధనకు ఎంచుకునే, విద్యార్థులకు సూచించే అంశాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. దేశ విదేశాలలో వివిధ విశ్వవిద్యాలయాలలో పనిచేశారు. పలు ఉపన్యాసాలు ఇచ్చారు. సాహిత్యంలో ఇంచుమించు అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు. మొత్తం తెలుగు సాహిత్యాన్ని భావితరాలకు చూపించారు. ఈయన రచనా విధానం చూస్తే మొట్టమొదట్లో సంవత్సరానికి ఒక పుస్తకం రాసేవారు. కొంతకాలం తర్వాత సంవత్సరానికి నాలుగైదు పుస్తకాలు కూడా రాసేవారు. ఇవన్నీ గ్రాంథిక భాషలోనే రాశారు. వీటిలో చాలావరకు రచనలు ముద్రించబడ్డాయి. కొన్ని అముద్రితాలుగానే ఉండిపోయాయి. అనేక గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. మరెన్నో సాహిత్య వ్యాసాలు రాశారు.

ఈయన రచనలలో ఒకటైనా **మణిప్రవాళము (వ్యాససంపుటి)** రచనను ఈ వ్యాసంలో చర్చిస్తున్నాను. ఇందులో మొత్తం ఇరవై ఒకటి సాహిత్య వ్యాసాలున్నాయి. ఒక్కొక్క వ్యాసంలో ఒక్కొక్క సాహిత్య ప్రక్రియ కనబడుతుంది. కవితలు, గేయ నృత్య నాటికలు,

కథానికలు, అనువాదాలు, వ్యాకరణం, మహాకావ్యాలు, నవలలు, నాటికలు, యక్షగానవాఙ్మయచరిత్ర, జానపదవాఙ్మయచరిత్ర మొదలైన అంశాలతో కూడిన వ్యాసమాలిక ఈ రచన.

**విశ్వనాథవారి మేనకా విశ్వామిత్రము** అనే వ్యాసంలో జోగారావుగారు మేనకా విశ్వామిత్ర ఘట్టమును విశ్వనాథవారు వర్ణించిన తీరును పేర్కొన్నారు. దీనిని విశ్వనాథవారు విశ్వామిత్రుని కథ అనుట కంటే మేనక కథ అనుటకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినట్లు తెలుస్తుంది. మేనకావిశ్వామిత్ర ప్రణయ ఘట్టమును సీతారాముల ప్రణయ ఘట్టముతో పోల్చి చెప్పడం బాగుంది. ఇందుకుగానూ రెండు మూడు సందర్భాలను కూడా వివరించారు. అలాగే సాహిత్యంలో మన సంస్కృతి సంప్రదాయాలను చూపించవచ్చు అనేందుకు ఉదాహరణగా కొబ్బరిచెట్టు వయస్సు లెక్కించడం వంటి సంఘటనలు పేర్కొన్నారు. ఇట్లాంటి తెలుగు సంప్రదాయాలను విశ్వనాథవారి కావ్యాలలో చాలా చూడవచ్చు. విశ్వనాథవారి కథ పాతదైన శిల్పం మాత్రం కొత్తదిగా ఉంటుందని జోగారావుగారు అన్నారు. **రాయప్రోలువారి వైమర్శిక దృక్పథము** అనే మరొక వ్యాసంలో సాహిత్యానికి కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని గూర్చి, సాహిత్యం-విమర్శ గూర్చి చాలా చక్కగా చెప్పారు. కవి అన్నవాడు తప్పకుండా విమర్శకుడు అయిఉంటాడు, కాని విమర్శకుడు కవి కానవసరం లేదు అనే విషయాన్ని విపులంగా పేర్కొన్నారు. రాయప్రోలువారి మాటలలో 'నేను ప్రాచీనపద్ధతిని నిరసించను కాని నవీనపద్ధతిని ఆదరిస్తాను' అని అనడంలో ఆయనకు కొత్తదనం మీద ఉన్న ఆసక్తిని, ప్రాచీన నవీనులయందు ఉన్న నిష్పాక్షిక సుందరమైన అభిమానాన్ని స్పష్టంగా ఈ వ్యాసంలో చూపించారు. శబ్దార్థాల అనుబంధాన్ని హాయిగా, స్వయంగా అనుభవించినట్టు చెప్పడం రాయప్రోలు వారికే సాధ్యమైందని అన్నారు. మన అనుభూతి పరిధిలో ఉన్న సామగ్రితో చెప్పగలగడం విశేషంగా పేర్కొన్నారు. రాయప్రోలువారి మరొక సిద్ధాంతాన్ని కూడా ఇందులో తెలియజేశారు. నవభావకుల అభిప్రాయం ప్రకారం ఒకే సన్నివేశాన్ని ఇద్దరు నవభావుకులు భిన్నంగా భావించినా అది సమంజసం, సహజం అని వారివాదన. పూవు తుమ్మెదల అనుబంధాన్ని ఒక కవి ప్రేయసి ప్రియుల అనుబంధంగా చెబితే, మరో కవి తల్లిబిడ్డల అనుబంధంగా చెప్తాడు. జోగారావుగారు రాయప్రోలు వారికి గల ఉన్నతమైన కవితాతత్త్వ దర్శనాన్ని ఈ వ్యాసంలో ప్రతిబింబించారు. **కృష్ణశాస్త్రి** వ్యాసంలో ఈయన రచనల వైశిష్ట్యాన్ని తెలియజేశారు. ఆనాటికి ప్రాచీనకవులలో అతినవీనుడు, ఈనాటికి నవీనకవులలో అతిప్రాచీనుడు అయిన కృష్ణశాస్త్రి పాండిత్యాన్ని వివరిస్తూ కుమార గంధర్వుడని కొనియాడారు. భావకవితా భారతరచనకు రాయప్రోలు నన్నయ అయితే కృష్ణశాస్త్రి తిక్కన అని జోగారావుగారు వ్యక్తంచేశారు. **శ్రీశ్రీకి శ్రద్ధాంజలి** అనే మరొక వ్యాసం రాశారు. ఇందులో శ్రీశ్రీ వివిధ సందర్భాలలో కవిత్వం గూర్చి వెలిబుచ్చిన అభిప్రాయాలను, భావాలను వాటి వెనుక ఉన్న ఆలోచనలను పేర్కొన్నారు. శ్రీశ్రీ అభిప్రాయాలలో ఆలోచన కంటె ఆవేశమే ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. ఆధునిక యుగంలో ఒక విశిష్టమైన విలక్ష ణమైన దృక్పథానికి శ్రీశ్రీ ఎంతమేరకు మార్గదర్శకుడైనాడో, అంతమేరకు అవ్యవస్థకు దురవస్థకు బాధ్యుడైనాడని జోగారావుగారి ప్రశంస, అభిశంస రెండూ. శ్రీశ్రీ మహాప్రస్థానం అసలు అచ్చువకముందే దానిమీద మొట్టమొదట సమీక్ష రాశారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయాలలో శ్రీశ్రీ కవితల మీద పరిశోధన చేయమని విద్యార్థులకు మంచి పరిశోధనను సూచించిన వ్యక్తి జోగారావుగారు. శ్రీశ్రీకి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ వ్యాసాన్ని రాశారు.

**జక్కన కవితాప్రస్థానం** వ్యాసంలో ఒక కవి ఇంకొక కవికి కృతిని సమర్పించుట విశేషంగా పేర్కొన్నారు. జక్కన సిద్ధనమంత్రికి కృతి సమర్పించాడు. తెలుగులో ఇతివృత్త త్రయాన్ని (ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రమము) గుర్తించిన కవి. జక్కన రచించిన విక్రమార్కచరిత్ర గూర్చి వివరించారు. జక్కన తర్వాత కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశికను గూర్చి చెబుతూ ఇందు జక్కన కథాసామ్యములు కలవని గుర్తించారు. అలాగే మాదయగారి మల్లన రాజశేఖరచరిత్ర ప్రబంధంలో కొన్నిమార్పులు చేశాడు. అయినపుటికీ దీనికి జక్కన కావ్యం నందలి రాజశేఖరుని కథయే మూలం. శైలి విషయంలో శ్రీనాథునికి, జక్కనకు ఒకేవిధమైన పోలికలు కనిపిస్తాయని అన్నారు. తర్వాత **సూరన ప్రతిభ అర్వాచీనకవులపై నతని ప్రభావం** అనే వ్యాసం రాశారు. నన్నయ శ్రీనాథునికి, శ్రీనాథుడు పెద్దనకు పలుకుబడిలో పట్టుబడ్డారు. ఒక్క తిక్కన తప్ప. తిక్కనకు సరియైన అనుయాయి సూరన ఒక్కడే. పలుకుబడిలోనే కాదు, కావ్య శిల్ప ఘటనమున కూడా సూరన తిక్కన వలెనే పట్టుబడిపోవు రకము కాదని పేర్కొన్నారు.

**కవిసన్మానం** వ్యాసంలో కవి అంటే ఎవరు? అనే విషయాన్ని కవిత రూపంలో జోగారావుగారు చెప్పారు. కవి హృదయాన్ని సమ్యగవగాహనం చేసుకోవడం కూడా కవి సన్మానమే అవుతుందని అన్నారు. వాల్మీకి గూర్చి పలు వ్యాఖ్యానాలు, విమర్శలు వెలిశాయే కాని ఆయన గూర్చి ఒక స్మారక సంచిక గాని, శిలా విగ్రహ ప్రతిష్ఠ గాని ఎక్కడ జరిగినట్లు లేదని వాపోయారు. ఇతర దేశాలలో చూస్తే షేక్స్పియరుకు నదీతీరంలో శిలావిగ్రహం ఉంది. ఆయన వాడిన ప్రతివస్తువు భద్రపరచబడ్డాయి. ఒకసారి జోగారావుగారు షేక్స్పియరు మీద ఉన్న అభిమానంతో ఆయన ఊరికి వెళితే ఆక్కడ షేక్స్పియరు పుస్తకాలు, ఆయన గూర్చి ఉన్న బొమ్మల పుస్తకాలు అమ్ముతున్నారు. షేక్స్పియరు అంటే జోగారావుగారికి ఎంత అభిమానం అంటే తన కుమారునికి షేక్స్పియరు అని పేరు పెట్టారు. ఇది ఒకరకంగా జోగారావుగారు షేక్స్పియరుకు చేసిన సన్మానమే అని చెప్పవచ్చు. అలాగే తెలుగు కవుల విషయంలో చూస్తే కొంతమంది కవుల విషయంలో మాత్రమే ఈవిధానం కనబడుతుంది. నెల్లూరులో తిక్కన, శ్రీనాథుల తిరునాళ్ళు ఏటా జరుగుతుంటాయి. తిక్కనకు సంబంధించిన ఇల్లును జాతీయ సంపదగా సేకరించమని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ మూడు ఉత్తరాలు జోగారావుగారు రాశారు. దేనికి సమాధానం లేదు. రాజమండ్రిలో నన్నయపీఠం, గుంటూరులో శ్రీనాథునిపీఠం, ఒంగోలులో ఎర్రనపీఠం, వరంగల్లులో పోతనపీఠం ఉన్నాయి. కందుకూరి, గురజాడ, విశ్వనాథ మొదలైన కవుల విషయంలో జయంతులు, వర్ధంతులు జరుగుతున్నాయి. కాళిదాసు మహాకవికి కార్తీక పూర్ణిమనాడు ఆబ్దిక మహోత్సవం జరుగుతుంది. **ఆంధ్ర విశ్వకళా పరిషత్స్వర్ణోత్సవ సారధి శ్రీ మేకా రంగయ్యప్పారాయ మహోదయ కృతిసమీక్ష!** ఈ వ్యాసంలో రంగయ్యప్పారాయగారి రచనల విశిష్టతలను తెలియజేశారు.

**పాతికేళ్ళ తెలుగు కవిత్వం** అనే మరొక వ్యాసంలో విశ్వనాథ, రాయప్రోలు, వీరేశలింగం, గురజాడ, గిడుగు, శ్రీశ్రీ వంటి కవుల కవిత్వ ధోరణులు వివరించారు. పద్య గేయరచనలు చేసి కొంతమంది రచయితలు క్రమంగా వచన కవితల మీద మక్కువ చూపిన వైనాన్ని పేర్కొన్నారు. సంప్రదాయ అభ్యుదయ మార్గాల గూర్చి చెబుతూ ఈ రెండు కూడా మానవ సమాజ సంక్షేమనే గమ్యం చేరుకోవడానికి పోటీపడతాయని అన్నారు. **ఆధునిక కవితా ధోరణులు** వ్యాసంలో విశ్వనాథవారి కవితా శిల్పంలో నవ్యత్వానికి, దృక్పథంలో సంప్రదాయానికి ఉదాహరణగా ఒక విషయాన్ని ప్రస్తావించారు. కవిత్వంలో పరమ నవ్యుడని పేర్కొన్నారు. ఆధునిక కవులు,

కవిత్వం గూర్చి చర్చించారు. ఇంతవరకు చెప్పిన వ్యాసాలలో ప్రాచీన, ఆధునిక కవులు, కావ్యాలు, కవిత్వం, వారి భావాలు రచనలు గూర్చి విశదీకరించారు. **ప్రక్రియా వైవిధ్యాన్ని, పరిణతిని ప్రదర్శించిన దక్షిణాంధ్ర సాహిత్యం** ఈ వ్యాసంలో దక్షిణాంధ్ర కవుల విశిష్టతలను, రచనలు వాళ్ళు అనుసరించిన పద్ధతులను, రాజుల వృత్తాంతాలు, ప్రజాజీవిత ఉదంతములు, శాస్త్రగ్రంథాలు, స్థలమహాత్మ్యములు, ద్విపదప్రక్రియ, యుగ విశిష్టతలను వివరించారు. దక్షిణాంధ్రరాజులు కవులను తమకై వినియోగించుకున్నారు. కృతి రచన స్వీకృతులు విలాస లాంఛన ప్రాయాలుగా భావించారు. కొంతమంది రాజుల దగ్గర అసలు కవులే ఉండేవారు కాదు. అందుచేత వారి శృంగారమును వారి స్వీయరచనలలో వారే చెప్పుకునేవారు. సాహిత్యాన్ని ప్రజా సన్నిహితము చేసిన యుగం దక్షిణాంధ్రయుగం. విజయనగరం కింద పరిపాలింపబడిన ఆంధ్రసామ్రాజ్యం ఒకానొక కాలంలో తంజాపుర మధురా మండలములలో నాయక రాజుల యాజమాన్యమున ఉంది. అయితే అక్కడి రాజులు మాత్రం ఆచార వ్యవహారాలు తదితర విషయాలు మాత్రం రాయ సామ్రాజ్యమునకు నఖలుగా ఉండేవి. దీనికి సాక్ష్యం అప్పటి సాహిత్యమే అని పేర్కొన్నారు. మరొక వ్యాసం **దేవుని దస్తూరీ.** ఇందులో కళలు, కవిత్వం, సౌందర్యం మొదలైనవాటి గూర్చి వివరించారు.

ఆయన గురువులు గూర్చి, గురు శిష్య సంబంధాలు గూర్చి, వారు సాహిత్యానికి చేసిన కృషిని గూర్చి ప్రస్తావిస్తూ కొన్ని వ్యాసాలు రాశారు. జోగారావుగారు డాక్టరు పట్టపరిశోధన నిబంధానికి ఒక పరీక్షకులు అనంతకృష్ణుడుగారు. వీరిని గురువుగా భావించి వీరిగూర్చి **అనంతకృష్ణుడు** అనే వ్యాసం రాశారు. ఇందులో సంగీత సాహిత్యాలలో అనంతకృష్ణుడుగారి ప్రతిభను తెలియజేశారు. అలాగే జోగారావుగారి మరొక గురువు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు. వీరినిగూర్చి **శర్మగారి ధన్యజీవితం** అనే వ్యాసంలో పేర్కొన్నారు. శర్మగారి హిస్టరీ క్లాసులకు జోగారావుగారు వెళ్లే రోజులు గూర్చి ఇక్కడ చెప్పారు. ఆ రోజులలో బోధనలో వైవిధ్యం, విషయం మీద గాఢత, ధీమా కలిగిన వ్యక్తి శర్మగారు. విజయనగర చరిత్ర పాఠం దృశ్యాలు ఒక్కొక్కటే కన్నులకు కట్టినట్లు ఆవేశంతో చెప్పేవారట. ఆ పాఠాలు విన్నవారంతా పదహారో శతాబ్ది కాలానికి వెళ్ళిపోయేవారట. ఆనాటి మనుషులు అయిపోయేవారు. విజయనగరం పతనం గూర్చి చెప్పేటప్పుడు ఆయనకు సరేసరి - మాక్కూడా సాత్త్వికోదయమయ్యేదని పేర్కొన్నారు. గురు శిష్యులిరువురు మాటల సంభాషణలలో రాజుల చరిత్రల గూర్చి చర్చించుకునేవారని ఈ వ్యాసాన్ని బట్టి తెలుస్తుంది. జోగారావుగారు చరిత్ర గూర్చి ఎన్నోవివరాలు ఈ వ్యాసంలో ప్రస్తావించారు. జోగారావుగారికి శర్మగారిని తలచుకున్నప్పుడల్లా భారత ఇతిహాస కథల్లోని విదుర పాత్రయే అనిపించేదట. **ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ నిర్మాత కీ.శే. మల్లంపల్లి సోమశేఖర శర్మ** అనే పేరుతో మరొక వ్యాసాన్ని కూడా శర్మగారి గూర్చి రాశారు. వైదిక వాఙ్మయ మంతటిని అవగాహన చేసుకుని పరిపూర్ణంగా మహాభాష్యము చేసిన మొదటివాడు విద్యారణ్యుడు. ఇతనికి ఆపేరు ఎలా వచ్చిందో జోగారావుగారు కొన్ని గ్రంథాల ఆధారంగా వారి అభిప్రాయాలను **విద్యారణ్య మహత్వ భూమిక** పేరుతో వ్యాసం రాశారు. **సర్వాంధ్ర** వ్యాసంలో ఆంధ్రజాతి గొప్పదనాన్ని వివరించారు. ఖండ ఖండాంతరాలలో ఆంధ్రప్రజలు విదేశీయులతో వియ్యమందుతూ ఉన్న విషయాల గూర్చి ప్రస్తావించారు. **తరతరాల ..... తెలుగు భాష** వ్యాసంలో యుగాలవారీగా తెలుగుభాష చరిత్రను, గొప్పదనాన్ని విశదీకరించారు. అజ్ఞాతయుగం (ప్రాచీనయుగం), ప్రాఙ్నన్నయయుగం, నన్నయయుగం, అర్వాచీనయుగం, ఆధునికయుగం

మొదలైనవి. ఆధునికయుగంలో వచ్చినమార్పులు గూర్చి చర్చించారు. ఆంగ్ల భాషా సంపర్కం, వ్యావహారిక భాషావాదం, తత్సమం, తద్భవం, అన్యభాషల పదజాలం మొదలైనవి. ఈ వ్యాసంలో జోగారావుగారు తన అభిప్రాయాలను కొన్నింటిని వ్యక్తంచేశారు. కావ్యాలు అందరికీ అర్థం కావాలి అనుకోవడం పొరపాటు. కావ్యభాష లేక గ్రాంథిక భాషలోనే నిత్యవ్యవహారం జరగాలి అన్నచో అది ఎంత అవివేకమగునో కావ్యభాష అంతా వ్యవహారిక భాషలోనే జరగాలి అనుకోవడం అంతే అవివేకం అని ఆయన అభిప్రాయం. **తెలుగు నవల తెన్నులు** వ్యాసంలో నవలా లక్షణాలు, సాంఘిక, చారిత్రక, హాస్య, అపరాధ పరిశోధక మొదలైన నవలలు గూర్చి పేర్కొన్నారు. నవలా వస్తువు మనిషి జీవితంగాని, సాంఘిక చరిత్రగాని అయ్యింది. నవలా రచయితలు వాళ్ళ అభిప్రాయాలను తెలియజేశారు. ఇతర భాషలలోకి తర్జుమా చేయడానికి తగిన తెలుగు నవలలు మూడు నాలుగు కన్నా ఎక్కువ లేవని పి.వి. రాజమన్నారు అన్నట్లుగా ఈ వ్యాసంలో పేర్కొన్నారు.

**నేదునూరి గంగాధరంగారి సెలయేరు పీఠిక**లో జానపద వాఙ్మయంలో కృషి చేసిన వారందరినీ ప్రస్తావించారు. వాఙ్మయసేవలో జీవితమే ఒక ఉద్యమంగా గడిపినవారు నేదునూరివారు. వీరికి పాత పాటల గంగాధరం అనే మరో వ్యవహారం ఉన్నట్లుగా పేర్కొన్నారు. జానపద పాటల సేకరణలో ఉన్న కష్టనష్టాలను వివరించారు. గంగాధరంగారు సేకరించిన పల్లెపాటలు, స్థానికగాథలు, పొడుపుకథలు, మాండలికపదాలు, సామెతలు, అన్ని కలిపి అచ్చులో నాలుగువేల పేజీలయ్యే గ్రంథం వస్తుందనే విషయాన్ని చెబుతూ వారి కృషిని తెలియజేశారు. **ఆంధ్ర సారస్వతశాఖలో యక్షగానము ప్రత్యేకత** వ్యాసంలో ఆంధ్రజాతీయ సంగీత వాఙ్మయ రచనకు కొలమానం యక్షగానం అని పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వతశాఖలో యక్షగానము ప్రత్యేకతను వివరించారు. యక్షగాన ప్రక్రియలో వస్తు వైవిధ్యం కలదని ఇంతటి వైవిధ్యం కలిగిన ప్రక్రియ మరొకటి లేదని అన్నారు. ఆంధ్ర ఛందస్సు సంహితా సర్వసము తయారగు అవకాశం వచ్చినచో దానికి అపురూపమైన సామగ్రిని చాలా సరఫరా చేయగలదు. యక్షగానము నందు పుస్తకాల కెక్కని పదజాలము, ప్రయోగవిశేషములు, జాతీయాలు మొదలైనవి కలవు. సాహిత్యాన్ని ప్రజలకు దగ్గర చేసి ప్రజల హృదయాన్ని సాహిత్యంలో ప్రతిబింబింపజేసిన ప్రక్రియ యక్షగానం. ఇందులో కేవలం సన్నివేశములు మాత్రమే కాదు, కథా వస్తువులు కూడా పూర్తిగా లోకసిద్ధములైన సందర్భాలే ఉంటాయి.

**ముగింపు**

పాఠకులకు ఆసక్తిని కలిగించే అంశాలతో, విషయాలతో ఈ మణిప్రవాళము వ్యాససంపుటి ఉంది. కవితలలో గాని వచనంలో గాని అధిక ప్రసంగాలు, వర్ణనలు కనిపించవు. విషయ స్పష్టతతో కూడిన వ్యాసావళి. తెలుగుజాతి, భాష, నాగరికత, వేదాలు, కావ్యాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు గొప్పదనాన్ని వర్ణించిన తీరు బాగుంది. నవల, కథ, జానపద, యక్షగాన వాఙ్మయ చరిత్ర గూర్చి తెలియజేశారు. చారిత్రక అంశాలు కూడా రుజువులతో చూపించారు. తెలుగు సంప్రదాయాలతో కూడిన కవులు కావ్యాల గూర్చి విశదపరిచారు. అలాగే ఆధునికధోరణులు కలిగిన కవులు, రచనలు గూర్చి పేర్కొన్నారు. చరిత్రకు సంబంధించిన అంశాలతో పాటుగా భాషకు సంబంధించిన అంశాలను కూడా చర్చించారు. సంప్రదాయాలు, కళలు, ఆచార వ్యవహారాలు గూర్చి తెలియజేశారు. ఒక్క శతక

ప్రక్రియ తప్ప సాహిత్యంలోని మిగిలిన అన్ని ప్రక్రియలు మణిప్రవాళము రచనలో కనిపిస్తాయి. విషయం గ్రాంథికంలో ఉన్నప్పటికి విషయ స్పష్టతో కూడిన లఘువాక్యాలు ఉండటం వలన సులభంగా అర్థమయ్యే రీతిలో రచన ఉంది. సాహిత్యం మానవ సంస్కృతికి ఒక ఆయుధం వంటిది. ఇది విశ్వజనీనమైన ఆనందాన్ని పాఠకుని అనుభూతికి తెస్తుంది. యస్వీ జోగారావుగారి ఈ మణిప్రవాళము సాహిత్య రచన కూడా పాఠకులకు అదే అనుభూతుని అందిస్తుంది.




# తెలుగు వారి వలసలు

## డా.తన్నీరు కళ్యాణ్ కుమార్

పూర్వం రాజ్య విస్తరణ కోసమో, వ్యాపార వాణిజ్యాల కోసమో ఒక జాతి వారు తమ ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వలసగా తరలి వెళుతుండేవారు. తెలుగు వారు అత్యంత పరాక్రమ వంతులుగా మహా సామ్రాజ్య నిర్మాతలుగా క్రీ.పూ. నుంచే అనేక దేశాలతో వర్తక వాణిజ్యాలను నెరపి సత్సంబంధాలు కలిగిన వారుగా చరిత్రకెక్కారు. అటువంటి తెలుగు వారు నాటి నుండి నేటి దాకా భారతదేశంలోనే గాక ప్రపంచంలోని అన్ని దేశాలలోను నివసిస్తున్నారు.

ఆంధ్ర ప్రదేశ్ వెలుపల అంటే భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలో నివసించే తెలుగు వారిని రాష్ట్రేతరాంధ్రులని, భారతదేశం వెలుపలి దేశాలలో నివసించే తెలుగు వారిని విదేశాంధ్రులని అనవచ్చు. వీరందరినీ ప్రవాసాంధ్రులుగా చెప్పుకోవచ్చు. వీరిని ప్రధానంగా రెండు వర్గాలుగా పేర్కొనవచ్చు. ఒకరు అంధ్రేతర ప్రాంతాలలో పుట్టి పెరిగిన తెలుగువారు, మరోకరు ఆంధ్రదేశంలో పుట్టి ఉన్నత విద్య కోసమో, ఉపాధి కోసమో ఇతర ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడిన తెలుగువారు.

తెలుగు జాతి చరిత్రలో వలసలకు, ప్రయాణాలకు మరియు సముద్రయానాలకు ముఖ్య భాగమున్నది. తెలుగు వారు ఇతర ప్రాంతాలకు వలస పోయినట్లు చెప్పే ఆధారాలు ఎన్నో చరిత్రలో ఉన్నయి. మధ్యయుగంలోనే ఆంధ్ర వర్తకులు దేశంలోని ఇతర ప్రాంతాలతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉండేవారు. శాతవాహనుల కాలంలో ఆంధ్రులు రోమ్, జావా, సుమత్రా ప్రాంతాలతో వాణిజ్య సంబంధాలను కలిగియున్నారు. రోమన్‌ల నాణెలు మన రాష్ట్రంలోను, దేశంలోని వివిధ ప్రాంతాలలో దిరికాయి. ఆంధ్రదేశాన్ని ఏలిన రాజవంశాలు చైనా, టిబెట్టు, బర్మ, సింహళం వంటి దేశాలతో వాణిజ్య మైత్రిని కలిగియున్నారు. క్రీ.శ 11 నుండి 16వ శతాబ్ద మధ్య కాలంలో ఈ వాణిజ్యం ఉచ్ఛస్థితికి చేరుకుంది. ఆ కాలంలో వేంగి, బెజవాడ(విజయవాడ), గుంటురు, రాజమండ్రి, సింహాచలం, శ్రీకాకుళం మొదలైన ప్రాంతాలు ముఖ్య వాణిజ్య పట్టణాలుగా ఖ్యాతి పొందాయి. 15వ శతాబ్దంలో ఆంధ్రులు మలేషియాతో కూడా

వాణిజ్య బంధాన్ని ఏర్పరచుకున్నారు.

19వ శతాబ్దంలో ఐరోపా ఖండంలో చోటు చేసుకున్న బ్రిటీషు సామ్రాజ్య వాదం, పారిశ్రామిక విప్లవం తదితర కారణాల వల్ల ఆంధ్రదేశంలో చెప్పుకోదగ్గ మార్పులు సంభవించాయి. క్రీ.శ 1857లో సంభవించిన మొదటి స్వాతంత్ర్య సంగ్రామము, అదే కాలంలో సంభవించిన కరువు కాటకాలు, బ్రిటీష్ మరియి నిజాంల క్రూరపాలన ఆంధ్రులు ఇతర ప్రాంతాలకు వలసపోవటానికి కారణభూతమయ్యాయి.

తెలుగు ప్రాంతం నుండి జరిగిన వలసలను రెండుగా విభజించవచ్చు. అందులో మొదటిది స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన వలసలు, రెండవది స్వాతంత్ర్యానంతరం జరిగిన వలసలు. తెలుగు ప్రాంతం నుండి ప్రజలు ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు వలసపోయి ప్రవాసాంధ్రులు కావడానికి అనేక కారణాలున్నాయి.

1. చారిత్రక కారణాలు

ఆంధ్రదేశాన్ని ఏలిన రాజులు రాజ్య విస్తరణార్థమై ఇతర ప్రాంతాలను జయించి, అక్కడ తమ అధికారమును నెలకొల్పినప్పుడు అనేక మంది తెలుగువారు ఆయా ప్రాంతాలకు వలసపోయారు. తమిళనాడు రాష్ట్రంలో స్థిరపడిన తెలుగు వారి పూర్వీకులు పల్లవ రాజుల కాలంలోను, చాళుక్య, చోళ రాజుల కాలంలోను వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. విజయ నగర సార్వభౌముల కాలంలో ఎందరో తెలుగువారు దక్షిణా పథానికి తరలి వచ్చారు. క్రీ.శ 15వ శతాబ్ది నాటి నాయక రాజుల పాలన తంజావూరు, మధురైలో సాగినప్పుడు తెలుగువారు తమిళ దేసమంతా వ్యాపించారు. ఈ విధంగా తెలుగు రాజులు దక్షిణా పథాన్ని జయించి అక్కడ తమ అధికారాలను నెలకొల్పినప్పుడు సామంతులుగాను, సర్దారులుగాని, కవులుగాను, సైనికులుగాను వివిధ వర్ణములను చెందిన తెలుగు కుటుంబములు ఇక్కడికి వచ్చి స్థిరపడిపోయారు.

దక్షిణాపథాన్ని పరిపాలించిన విజయనగర రాజుల కాలంలోను, బాహుమనీ సుల్తానుల కాలంలోను, ఆ తరువాత హైదరాబాదు సమ్స్థాన పాలనలోను తెలుగు, కన్నడ భాషా ప్రాంతాలు కలిసి ఉండేవి.1727లో శ్రీ బాజీరావు శ్రీరంగపట్టణంపై దండెత్తి నిజాంను ఓడించి పూనాకు వచ్చినప్పుడు సైనంలో చేరిన కొందరు తెలుగువారు అహమ్మద్‌నగర్, పూనాలలో స్థిరపడినట్లుగా తెలుస్తుంది.

ప్రాచీన కాలం నుంచి తెలుగు వారికీ, ఉత్కళులకూ సన్నిహిత సంబంధాలున్నాయి. క్రీ.శ. 6వ శతాబ్దం తర్వాత కళింగ దేశమంటే తెలుగుదేశమ్గానే చాలమణి అయినట్లు చరిత్ర చెబుతుంది. 10వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దం వరకు మహేంద్రాచలం నుంచి సింహాచలం వరకు పూర్తిగా తెలుగు ప్రాంతంగానే పరిగణించబడినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పరిపాలించిన గంగరాజులు, గజపతులు తెలుగువారేనని చరిత్రకారుల అభిప్రాయం.

19వ శతాబ్ద కాలంలో మధ్యప్రదేశ్ లోని నాగపూర్ ప్రాంతాన్ని పరిపాలించిన భోన్‌స్లేలకు సహాయకులుగా కృష్ణా, గుంటూరు

జిల్లాలలోని తెలుగువారు ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తుంది. క్రీ.పూ. 38 ప్రాంతంలో కుంతల శాతకర్ణి అనే ఆంధ్ర చక్రవర్తి సుసర్మను ఓడించి మగధ సామ్రాజ్యాన్ని ఆక్రమించినట్లు తెలుస్తుంది. క్రీ.పూ. 28వ సంవత్సరం పులోమావి కాలం నాటికే పాటలీపుత్రం ఆంధ్రుల అధికారంలో ఉన్నట్లు చరిత్ర చెబితుంది. ఆ తరువాత 19వ శతాబ్దం వరకు బీహారులో ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన సరైన ఆధారాలు కనిపించడం లేదు.

క్రీ.పూ. 3 వ శతాబ్దంలోనే ఆంధ్రదేశ చక్రవర్తులు శాతవాహునుల కాలంలో తెలుగువారు మలేషియాలో బౌద్ధమత ప్రచార నిమిత్తం వెళ్ళినట్లు తెలుస్తోంది. శ్రీలంకకు ఆంధ్రదేశానికి క్రీ.శ. 13,14 వ శతాబ్దం నుంచి సంబంధ బాంధవ్యాలున్నట్లు చారితకు నిదర్శనాలున్నాయి. ఆనాటి చక్రవర్తులు ఆంధ్రదేశం నుండి నేతపని వారిని రప్పించేవారని కూడా తెలుస్తుంది. అంతేగాక ఆనాడు సైనికులుగాను, కళాకారులుగాను అనేకమంది తెలుగువారు ఆంధ్రదేశం నుండి శ్రీలంకకు వెళ్ళినట్లు తెలుస్తుంది. బర్మాను, బ్రహ్మదేశమనేవారనీ బుద్ధునికి పూర్వమ్ అంటే క్రీ.పూ 700 నాటికే ఆంధ్రులు ఈ దేశానికి వర్తకం నిమిత్తం వస్తూ పోతూ ఉండేవారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. సముద్రం మీద బర్మాకు వచ్చిన భారతీయుల్లో ఆంధ్రులే మొదటి వారని ప్రతీతి.

2 రాజకీయ కారణాలు

స్వాతంత్ర్యనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాల వల్ల తెలుగు ప్రాంతాలు కొన్ని సరిహద్దు రాష్ట్రాలలో కలిసిపోయాయి. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తర్వాత హైదరాబాదు సంస్థానంలోని రాయచూర్, గుల్బర్గా, బీదర్ జిల్లాలు మైసూర్ రాష్ట్రంలో విలీనమయ్యాయి. ఆంధ్ర రాష్ట్రావతరణ సందర్భంగా బళ్ళారి జిల్లా మైసూర్ రాష్ట్రంలొ కలిసిపోయింది. తత్పర్యవసానంగా రాయచూర్, గుల్బర్గా, బీదర్, బళ్ళారి జిల్లాలోవి తెలుగువారు రాష్ట్రేతరాంధ్రులయ్యారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల్లోని కోలారు,బెంగళూరు, చిత్రదుర్గ, చిక్కమంగళూర్, తుమ్కూర్, ధార్వాడ్ జిల్లాల్లో తెలుగువారున్నారు. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో కూడా తెలుగువారు అధిక సంఖ్యలో ఉండటం విశేషం.

1936వ సంవత్సరంలో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడింది. తెలుగువారు అధికంగా నివసిస్తున్న కోరాపుట్, గంజాం, కోరాపుట్, కటక్, పూరి బాలసూర్, సంబల్పూర్ జిల్లాలలో దాదాపు 12 లక్షలు మందికి పైగా తెలుగువారున్నారు.

3. సామాజిక కారణాలు

బ్రిటీష్ సామ్రాజ్యంలో 1807వ సంవత్సరంలో బానిస వ్యాపారం రద్దు కావడంతో, బానిసల పై ఆధారపడిన రబ్బరు, తేయాకు తోటల సాగులో తీవ్ర శ్రామికుల కొరత ఏర్పడింది. ఈ సమస్య పరిష్కారానికై బ్రిటీష్ ప్రభుత్వం ఒక కొత్త బానిద వ్యవస్థను రూపుదిద్దింది. దీని పేరే 'శ్రామిక ఒప్పందం'(Indentured Labour). ఈ విధానాన్ని అనుసరించి శ్రామికులు 3 లెక 5 సంవత్సరాలు ఒక నిర్ణీత వేతనానికి పని చేయవలని ఉంటుంది. ఆ చేయవలసిన పని మరియు కాలం పూర్తిగా యాజమాన్యమే నిర్ణయిస్తుంది. ఆ

సమయంలో ఆంధ్రులు ముఖ్యంగా దళితులు బ్రిటీష్ వలస దేశాలైన ఆఫ్రికా, కరేబియన్ దేశాలకు వలసవెళ్ళారు.

1850 సంవత్సరానికి వీరి వలసలలో మారిషస్ కూడా ఒక భాగమయ్యింది.19వ శతాబ్దంలో ప్రారంభమైన ఈ శ్రామిక ఒప్పంద వ్యవస్థ 20వ శతాబ్దపు మధ్య భాగం వరకూ కొనసాగింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ వంటి తీర ప్రాంతాల నుండీ అనేక మంది శ్రామికిలు మారిషస్ వెళ్ళారు. ఆనాటి వారి శ్రమశక్తి ఫలితంగా ప్రస్తుతం అక్కడి తెలుగు కుటుంబాలన్నీ సుసన్నంగా ఉన్నాయి.1905వ సంవత్సరంలో రబ్బరు వ్యాపారం బాగా అభివృద్ధి చెందటంతో ఈ శ్రాముకుల వలస ఒక వరదలా ముందుకు సాగింది. మలేషియా, శ్రీలంక దేశాలకు తెలుగువారు మొదటి ప్రపంచ యుద్ధానంతరం 1920-40 మధ్య కాలంలో రబ్బరు, కాఫీ, ఆయిల్‌పామ్ తోటల్లో పనిచేయడానికి నాటి బ్రిటీష్ పాలకులచే పంపబడ్డారు. 1918 ప్రాంతంలో ఫిజీ దీవికి తెలుగువారు వలస వెళ్ళారు. ఇక్కడ కూడా బ్రిటీషు సామ్రాజ్యవాదులు ఇతర భారతీయుల మాదిరిగావే ఆనాడు తెలుగువారిని కూలీలుగా వినియోగించుకున్నారు.

సుమారు 100 సంవత్సరాల క్రితం తెలుగువారు స్వదేశం విడిచి కార్మికులుగా, కర్షకులుగా దక్షిణాఫ్రికా వచ్చి స్థిరపడ్డారు. మొదట వ్యవసాయ కూలీలుగా వచ్చిన తెలుగువారు క్రమేణ విద్యావంతులై ఈనాడు డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులుగా వెలుగొద్ధుతున్నారు. కొందరు వ్యాపార రంగంలో ఉన్నత స్థితికి చేరుకున్నారు.

అట్లే బ్రిటీషు పాలనలో పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడానికి తెలుగువారెందరో బర్మకు వచ్చారు. ముఖ్యంగా అల్పాదాయ వర్గలకు చెందిన వారు నౌకా నిర్మాణ కర్మాగారాలలో పని చేయడానికి బర్మా దేశానికి వలస వెళ్ళారు. బర్మాలో ఒకప్పుడు రెండు లక్షల పైచిలుకుగా ఉన్న తెలుగువారు ఆతరువాత పూర్తిగా తగ్గటమ్ మొదలుపెట్టారు.1962లో బర్మాలో వలసతత్త్వన్ని నిర్మూలించే ప్రయత్నం జరిగింది. 1964లో విదేశీయుల వర్తక, ఉద్యోగాలను జాతీయం చేయడంతో నిరాధారులైన భారతీయులు స్వదేశానికి చేరుకోవడం మొదలుపెట్టారు. బర్మా నుంచి దాదాపు ఆరు వేలమంది తెలుగువారు కాందిశీకులుగా అస్సాం రాష్ట్రానికి వచ్చి అక్కడి తేయాకు తోటల్లో పనిచేసుకుంటూ స్థిరపడ్డారు.

ఈ కాలంలో జరిగిన వలసలకు రెండు ముఖ్య కారణాలు కనబడతాయి. మొదటిది సొంత ప్రాంతాల్లో భరించరాని పరిస్థితులు, కరువులు, వరదలు, మూతపడిన చిన్న పరిశ్రమలు వలన ఆకలితో వీధినపడ్డ వేలాది కార్మకులు గత్యంతరంలేక వలసపోవలసి వచ్చింది. రెండవది బ్రిటీషు వారి విధానాల వల్ల ఉపాధి కోల్పోయిన కులవృత్తిదారులైన చేనేత, కుమ్మరి, వడ్రంగి, చర్మకార వృత్తులవారు గత్యంతరం లేక వలస కార్మికులుగా రూపాంతరం చెందారు.

సుమారు 160 సంవత్సరాలకు పూర్వం భుక్తి కోసం తెలుగువారు మహారాష్ట్రకు వలస వెళ్ళినట్లు తెలుస్తుంది. వీరిలో తెలంగాణా జిల్లాలనుంచే అధిక సంఖ్యలో వెళ్ళినవారున్నారు. మహరాష్ట్ర రాజధాని ముంబాయి నగరంలోనే 10 లక్షలమంది తెలుగువారున్నట్లు తెలుస్తుంది. బ్రిటీష్ వారి పుణ్యమా అని దేశంలో చేతివృత్తుల మీద ఆధారపడి జీవించేవారు చాలా వరకు నిరుద్యోగులయ్యారు. ముఖ్యంగా చేనేత పరిశ్రమ బాగా చితికిపోయింది. బ్రిటీష్‌వారు తమ వ్యాపారాభివృద్ధి కోసం భారతదేశమంతటా

రవాణా వ్యవస్థను పటిష్టం చేశారు. అందుల  భాగంగా 20వ శతాబ్ది ప్రారంభంలో ఈశాన్య భారతదేశనికి మిగిలిన ప్రాంతాల నుంచి రాకపోకలకు వీలుగా రైల్వే లైన్ ఏర్పాటు చేసి రైళ్ళు ను నడిపారు. ఆ సందర్భంలో నిరుద్యోగులైన తెలుగువారంతా రైల్వే ఉద్యోగాల కోసం పశ్చిమబెంగాల్లోని ఖర్గపూర్, కలకత్తా ప్రాంతాలకు వేల సంఖ్యలో వలసవెళ్ళా రు.

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని వాతావరణం అనుకూలంగా ఉండటంతో అనేక జూట్ మిల్లులు స్థాపించపడ్డాయి. శ్రమజూవానానికీ, క్రమశిక్షణకూ పేరుపడ్డ తెలుగువారు జూట్మిల్లుల్లో కష్టపడి పనిచేసి అక్కడ యజమాన్య మెప్పుపొందడంతో వారు. తెలుగువారికే ఎక్కువ ఉద్యోగావకాశాలిచ్చినట్లు తెలుస్తుంది. అట్లే తెలంగాణాలోని మరికొంత మంది కార్మికులు జీవనోపాధి కోసం జూట్ మిల్లుల్లో పనిచేయడానికి గుజరాత్‌కు తరలివెళ్ళా రు. వీరు బట్టల మిల్లుల్లో ఓపికతో పనిచేస్తూ మంచి నైపుణ్యం ప్రదర్శించడం ద్వారా స్థానికులకు తెలుగు వారిపై అభిమానం పెరిగింది. దీంతో తెలుగువారికి ఉద్యోగావకాశాలు బాగా పెరిగాయి.నిజాం పాలనలో ముస్లిముల మతవివక్ష నుంచి తప్పించుకోవడానికి తెలంగాణ ప్రాంతం నుండి తెలుగువారు మధ్యప్రదేశ్‌కు వలసవెళ్ళి అక్కడే స్థిరపడ్డారు.

1.4. ఆర్థిక, విద్యాకారణాలు

20వ శతాబ్దం ఆంధ్రరాష్ట్రంలో చెప్పుకోదగ్గ మార్పులను తీసుకువచ్చింది. విద్యా సౌకర్యాలు అందరికి అందడంతో విద్యావంతులైన బలమైన మధ్య తరగతి వర్గం రూపుదిద్దుకుంది. ఈ వ్రగంవారు శస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన ఫలాలను అందిపుచ్చుకొని, ఆరికంగా బలోపేతమై సుదూర ప్రాంతాలకు వలసపోయారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం జరిగిన వలసలు, అంతకు ముందు జరిగిన వలసల కంటే భిన్నమయినవి. ఆంధ్రరాష్ట్రంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో జరిగిన అభివృద్ధి ఫలితంగా ఉద్భవించిన విశ్వవిద్యాలయాల నుండి బయటకు వచ్చిన విద్యార్థులకు తగిన ఉపాధి అవకాశాలు ఆంధ్రదేశంలో లభించలేదు. శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు కల్పించగలిగిన స్థితిలో ఉండి, విలాస జీవితానికి పట్టుకొమ్మలైన పాశ్చాత్య దేశాలు వీరిని ఆకర్శించాయి. అంతేగాక ఉన్నత చదువులు చదవడానికి కూడా అనేకమంది సుదూర ప్రాంతాలకు వలసపోయి అక్కడే స్థిరపడిపోయారు. ఇదే సమయంలో అమెరికాలో చోటి చేసుకున్న కొన్ని సంఘటనలు కూడా వీరి ఆశలకు ఊపిరిపోశాయి. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత అమెరికా ప్రభుత్వం తమ దేశానికి వచ్చే వైద్యుల, ఇంజనీర్ల, నర్సుల, వ్యాపారస్తుల ప్రవేశాన్ని సరళతరం చేసింది. 1965లో వచ్చిన 'హెలర్‌కెల్లర్ యాక్ట్' అనే వలస చట్టం వలసలను మరింతగా ప్రోత్సహించింది.

అమెరికాకు తెలుగువారు వెళ్లడమనేది ఇటీవలి కాలంలోనే జరిగింది. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి ఫలితంగా తెలుగువారు అమెరికాకు వలస వెళ్ళ డం మొదలైంది. ఇలా వెళ్ళి న వారిలో విద్యార్జన కోసం వెళ్ళి నవారు కొందరైతే, మరి కొందరు

ఉద్యోగాల కోసం వెళ్ళినవారున్నారు. ఉద్యోగాల కోసం వెళ్ళిన వారు అక్కడే స్థిరపడిపోయారు. వీరిలో విశ్వవిద్యాలయాలలోని ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లే అధికం.

ఆస్ట్రేలియాలో ముఖ్యంగా మెల్‌బోర్న, సిడ్నీ ప్రాంతాలలో దాదాపు 100 తెలుగు కుటుంబాలున్నాయి. వీరు ఇటీవలి కాలంలో విద్య, ఉద్యోగాలకోసం వెళ్లినవారే. ఆఫ్రికా ఖండంలోని దక్షిణభాగం ప్రాంతాలలో బోత్స్వానా ఒకటి. 150 సంవత్సరాల క్రితం బ్రిటీషు వారిచేత స్వదేశం నుంచి కూలీలుగా రప్పించబడిన వారిలో కొందరు దక్షిణాఫ్రికా నుంచి బోత్స్వానా వచ్చి స్థిరపడ్డారు. 1920లో మొట్టమొదటి సారిగా ఈ నేలపై 'నరసింహులు' అనే తెలుగు వ్యక్తి కాలుమోపాడు. ఆ తరువాత సుమారు ఒక పదిహేను కుటుంబాల వరకు ఉద్యోగరీత్యా ఇక్కడికి వచ్చాయి. ఇక్కడకు వచ్చిన తెలుగువారు చాలామంది విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగాను, డాక్టర్లుగాను, ఇంజనీర్లుగాను, అకౌంటెంట్లుగాను, పత్రిక రచయితలుగాను పనిచేస్తున్నారు.

ఆఫ్రికా ఖండాతర్గతమైన జాంబియాలో చాలా తక్కువ సంఖ్యలోనే తెలుగువారున్నారు. సింగపూర్ వెళ్ళిన తెలుగువారు ఇటీవలి కాలంలో ఉద్యోగరీత్యా వెళ్ళినవారే. కెనడాకి తెలుగువారు రెండవ ప్రపంచ యుద్ధానంతరమే ఎక్కువగా వెళ్ళారు. ప్రస్తుతం కెనడాలో తెలుగువారు అక్కడి పది రాష్ట్రాలలో విస్తరించి ఉన్నారు. వీరు ఉన్నత విద్య కోసం, ఉద్యోగాల కోసం వచ్చినవారే. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు, పరిశోధకులు, మిగతావారిలో డాక్టర్లు, ఇంజనీర్లు, ఇతర వృత్తులవారు ఉన్నారు. బర్మాలో ఈనాడు ఉన్న తెలుగువారిలో డాక్టర్లు, పోలీసు శాఖలో, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసేవారు, వ్యాపారవేత్తలు, కార్మికులు, కర్షకులూ ఉన్నారు. అట్లే చేతి పనులపై ఆధారపడి జీవించే తెలుగు ప్రాంతానికి చెందిన అనేక మంది ముస్లింలు అరబ్ దేశాలకు వలస వెళ్ళి అక్కడ జీవిస్తున్నారు.

భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌కు కేరళరాష్ట్రం సరిహద్దు రాష్ట్ర కాకపోవడమ్ చేత ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా అక్కడకు వెళ్ళి స్థిరపడిన ఆంధ్రులు తక్కువగా కన్పిస్తారు. 20వ శతాబ్ద ప్రారంభంలో అంధ్రదేశంలోని వఊశ్యులు వ్యాపారం కోసం కళ్ళికోట ప్రాంతానికి వెళ్ళి అక్కడే స్థిరపడిపోయారు. కళ్ళికోట నగరంలో ఒక ప్రధాన వీధి పొడవునా తెలుగువారి దుకాణాలు ఉండటమే ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. స్వాతంత్ర్యానంతరం ఉద్యోగరీత్యా ఇక్కడ స్థిరపడినవారూ ఉన్నారు. కాలికట్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో తెలుగు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

గోవాలో ఉన్న తెలుగువారు ఎక్కువ ఉద్యోగరీత్యా అక్కడికి వెళ్ళి స్థిరపడినవారే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లోను, పరిశ్రమల్లోను తెలుగువారు అధికంగా సన్పిస్తారు మధ్యప్రదేశ్‌లోని ఛత్తీస్‌గడ్ , చందా, యమత్‌మాల్ రాయపుర్ ప్రామ్తాలలో కన్పించే వారిలో 50 శాతం మంది తెలుగువారే కనిపిస్తారు. వీరంతా వ్యాపార, వ్యవసాయ రంగాల్లో రాణించడమే గాక అక్కడి వారితో వివాహ సంబంధాలను కూడా ఏర్పరుచుకున్నారు.

తెలుగుదేశం నుంచి ఉద్యోగాలకోసం బీహారుకు అనేకమంది తెలుగువారు వలస వెళ్ళారు. తాతా కంపెనీ జెమ్‌షెడ్‌పూర్‌లో ప్రారంభం కాగానే దాని మీద ఆధారపడి ఆ ప్రాంతంలో ఎన్నో పరిశ్రమల్లో చేరి అక్కడే స్థిరపడ్డారు. అక్కడ రైల్వేశాఖల్లోను తెలుగువారు వేలసంఖ్యలో పనిచేస్తున్నారు. భారతదేశ భాషా సంస్కృతుకలు ఢిల్లీ నగరం ప్రతిబింబం. అక్కడ స్థిరపడినవారు, అనంతర కాలంలో

ఉద్యోగవ్యాపారాలు కారణంగానో, రాజకీయ కారణంగానో ఢిల్లీకి వలస వెళ్ళినవారు.

స్వాతంత్ర్యానంతరం ఉత్తర కోస్తా ప్రాంతంలోని తెలుగువారు భుక్తికోసం అస్సాం రాష్ట్రానికి వెళ్ళారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోను, అనుబంధ సంస్థల్లోను తెలుగువారున్నారు. మణిపూర్, మేఘాలయ, త్రిపుర, మిజోరమ్, నాగాలాండ్ రాష్ట్రాలలో ఉద్యోగవ్యాపారరీత్యా వలస వెళ్ళి స్థిరపడిన తెలుగు కుటుంబాలు అనేకం ఉన్నాయి. పాండిచ్చేరిలో తెలుగు కుటుంబాలు రెండు వందల పైచిలుకు ఉన్నాయి.

ప్రస్తుతం తెలుగువారు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలల్లోను, ప్రపంచంలోని వివిధ దేశాలల్లోను నివసిస్తున్నారు. కొన్ని దేశాలలో, కొన్ని రాష్ట్రాలలో మరీ తక్కువగాను, మరి కొన్నింతిలో చెప్పుకోదగ్గ సంఖ్యలోను ఉన్నారు. రవాణా మరియు కమ్యూనికేషన్ రంగాలలో వచ్చిన విప్లవాత్మక మార్పులు వలసను మరింత ప్రోత్సహించాయి. ఈ పరిస్థితి ప్రస్తుతం కూడా కొనసాగుతుంది. ఈ విధంగా వలసవెళ్ళిన తెలుగువారు వారివారి రంగాల్లో అగ్రగణ్యులుగా నిలిచి ఆయా దేశాల పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నారు. ఈ మేధోవలసల వలన భారతదేశం కొంతవరకు నష్టంపోతుందనుటలో సందేహం లేదు. ఉన్నత చదువులు చదువుకున్న మేథావులు తమ మేథస్సును పరాయిదేశాల అభివృద్ధికే గాక స్వదేశాభివృద్ధికి కూడా ధారపోయాల్సిన అవశ్యకత ఉంది.

పరాయి దేశాలకు, ఇతర రాష్ట్రాలకు వలసపోయిన తెలుగువారు అక్కడ తమ భాషా, సంస్కృతులను నిలబెట్టుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ కృషిలో ఆయా ప్రాంతాలలో ఉన్న తెలుగు సంఘాలు ప్రధానపాత్రని పోషిస్తున్నాయి. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' అనే సూక్తిని ప్రవాస భారతీయులు మరువలేదు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడి జీవిస్తున్న ప్రవాసాంధ్రులు మాతృభూమి మీద తమకున్న అభిమానాన్ని చాలా సందర్భాలలో ప్రకటించుకున్నారు. భూకంపాలు, తుఫాన్‌లు వంటి ప్రకృతి వైపరీత్యాలు అనేక మంది తమ పెట్టుబడులను స్వదేశంలో పెట్టి పరోక్షంగా మాతృదేశాభివృద్ధికి కృషి చేస్తున్నారు. అంతేకాక వీరిలో చాలా మంది తమ సొంత నిధులను వెచ్చించి తమ గ్రామాలకు మౌళిక సదుపాయాలను చేకూర్చుతున్నారు. మరి కొందరు తాము ఒక్కప్పుడు చదువుకున్న విద్యాలయాల అభివృద్ధికి చేయూతనందిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా జన్మభూమి ఋణాన్ని తీర్చుకుంటున్న ప్రవాసాంధ్రులు అభినందనీయులు.

ఉపాయుక్త వ్యాసాలు

1. కృష్ణారావు, వై.వి.బలరామమూర్తి. ఏటుకూరు. 1987. 'ప్రవాసాంధ్రులు' ; ఆంధ్రప్రదేశ్ దర్శిని; హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింఘౌస్
2. గౌరిశ్‌ంకర్, ట్.మునిరత్నంనాయుడు. డి.1998. 'రాష్ట్రేతరాంధ్రులు-విదేశాంధ్రులు'; ఆంధ్రప్రదేశ్ దర్శిని; హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్.

3. చెన్నకేశవరెడ్డి, జి1992. 'తెలుగు భాషా సంస్కృతులకు విదేశాంధ్రుల సేవ' ; తెలుగు వారధి; నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక; న్యూయార్క్ : ATA

.

# వ్యాస కౌముది



# జాతశ్రీ కథలు

## మండవ సుబ్బారావు

**తెలుగు కథా సాహిత్యంలో తనదైన ముద్రవేసిన రచయిత జాతశ్రీ పూర్తిపేరు జడ్.ఛార్లెస్. సుదీర్ఘకాలం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి 2001 లో పదవీ విరమణ చేసిన జాతశ్రీ గారు ప్రస్తుతం కొత్తగూడెంలో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నారు. అనేక పోటీల్లో పురస్కారాలు అందుకున్న విలక్షణ కథారచయిత జాతశ్రీ గారి కొన్ని కథల గురించిన సమీక్షా వ్యాసం ఇది.**



జాతశ్రీ నిబద్ధత మూర్తీభవించిన కథకుడు.ఏమి చెప్పాలి? ఎలా చేప్పాలి? రెంటికీ జవాబు చెలిసిన కథకుడు.జాతశ్రీ చెప్పే తీరు-వాక్య నిర్మాణంలో సరళతతో స్వచ్ఛత కూడగట్టుకొని సాగుతుంది. పాత్రల చిత్రణ వాటికి అనుగుణంగా సాగే సంభాషణ,భాష,యాస అనితర సాధ్యం. ఇప్పుడు పర్యావరణ విధ్వంసం,నూతన ఆర్థిక విధానం,వస్తు వ్యామోహ సంస్కృతిలో వ్యక్తి పరాయీ కరణ,భావజాలాల విధ్వంసం మొదలయిన అనేక కొత్త వస్తువుల గూర్చి కథలు రాస్తున్న వారిలో జాతశ్రీ ఒకరు. జాతశ్రీ పుట్టి పెరిగిన వాతావరణం గానీ,వారసత్వం గానీ ఆయననీ స్థాయికి చేర్చ లేదు.కేవలం స్వయం కృషి.బాల్యం లోనే పఠనాసక్తి కలగడం వలన 1960 ప్రాంతంలో విరివిగా వస్తున్న డిటెక్టివ్ సాహిత్యం వారిలోని పఠనాభిరుచిని మరింత పెంచింది. ప్రముఖ కథకులు శ్రీపతి,శీలావీర్రాజు,మజుందార్ మొదలగు వారి సహకారంతో రచనా పరంగా ఎన్నెన్నో మెళుకువలు నేర్చుకున్నాడు.1964 నుండి రచయితగా ఆలోచించడం మొదలు పెట్టినా,1970లో ఆంధ్రప్రభ లో "లక్ష్మి" అనేది ప్రచురింప బడిన తొలి కథ.ఆ కథకు రూ.50/- లు. చెక్కు అందుకున్నాక జాతశ్రీ లోని రచయిత జూలు విదుల్చుకొని లేచి నిలబడ్డాడు.

ఇప్పటి వరకు దాదాపు 80కి పైగా కథలు వివిధ పత్రకల్లో ప్రచురింప బడినాయి.1976లో ఇల్లందులో జరిగిన అగ్ని ప్రమాదంలో రాసి పెట్టుకున్న కొన్ని కథలు కాలి పోగా, మిగిలిన కథల్ని ఏర్చి కూర్చి "ప్రభంజనం" పేరుతో 1980లో ఓ కథా సంపుటి ప్రచురించడం జరిగింది.అంతకు ముందే 1973లో ప్రచురింపబడిన "కపోతం" కథా సంపుటి పుస్తకాలు తగలబడి పోయాయి.ఇప్పటి వరకు వారు రాసిన కథలు ఆరు సంపుటాలుగా వచ్చాయి. ఇవి గాక మూడు నవలలు,నాలుగు నాటకాలు రాశారు.

జాతశ్రీని కథకుడిగా రెండు దశల్లో చూడవచ్చు. తొలి దశ 1965-85 మధ్య. మలి దశ 2000-2013 మధ్య.

**తొలిదశ** :- జాతశ్రీ తొలి దశలో సుమారు ముప్పై కథలున్నాయి. వారు రాసిన నవలలు,నాటకాలు ఈ దశలోనే వివిధ పత్రికల్లో ప్రచిరింప బడటమే గాక,కొన్నింటికి అవార్డులు రివార్డులు వచ్చాయి.ఆ దశలో వచ్చిన కథల్ని రెండు సంపుటాల గా ప్రచురించారు.1973లో కపోతం, ప్రభంజనం 1980లో. ఈ రెండు సంపుటాలలోని కథలన్నీ పరిశీస్తే,జాతశ్రీ మొదటి నుండి కష్టజీవి పక్షపాతి అని తెలుస్తుంది.ఏదో ఉబుసు పోక కాలక్షేపానికి రాసిన కథలు కావు.తన చుట్టు జరుగుతున్న సంఘటనలను,తాను నిత్య జూస్తున్న సమాజాన్ని దాని పోకడలను పాఠకుడి కనులముందు ఒక దృశ్యంగా నిలిపే ప్రయత్నం చేశాడు.ఆ ప్రయత్నంలో నూటికి నూరు శాతం కృతకృత్యుడయ్యాడు.అరసం రాష్ట్ర కార్యదర్శిగా చంకకు సంచి తగిలించుకొని ఆంధ్రరాష్టమంతటా పర్యటించి అనేక మంది యువకుల్ని అభ్యుదయ రచయితలుగా తీర్చి తిద్దారు.

**మలిదశ** :- కారణాల వలన 1985-2000ల మధ్య కాలంలో జాతశ్రీ లోని రచయిత అజ్ఞాత వాసంలోకి వెళ్ళిపోయాడు.కుటుంబ బాధ్యతలు మిష కావచ్చు.కానీ, తనలోని రచయిత ప్రపంచ పటంలో వస్తున్న మార్పుల్ని నిశితంగా పరిశీలిస్తూ, ఆకలింపు చేసుకోడానికి మౌనంగా ఉండి పోయాడు.90 దశకంలో గ్లోబలైజేషన్ పరిణామాల్లో-----మన పల్లెల్లో వృత్తులు ఆధారంగా బతుకుతున్న వారి నిస్సహాయతల్ని,నిట్టూర్పుల్నీ చూశాక జాతశ్రీ లోని కథకుడు చూస్తూ ఉండలేక పోయాడు.ఫలితంగా 2000 నుండి నేటి దాక సుమారు 50 కథల్ని ఈ తరం పాఠకుల్లో ఆలోచనల్ని రేకెత్తించే విధంగా రాశాడు,రాస్తూనే ఉన్నాడు.ఈ దశలో వచ్చిన కథలన్నీ నాలుగు కథా సంపుటాలుగా ప్రచురింపబడినవి.2001లో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందాక జాతశ్రీ కలానికి వేగం పెరిగింది.ప్రతి ప్రత్రికలో ప్రతి మాసం వో కథ రావలసిందే. కొత్తగూడెం నుండి విజయనగరం వరకు అనేకానేక సాహితీ సభలకు హాజరౌతూ తన అనుభావాల్ని,అనుభూతుల్ని తోటి రచయితలతో పంచుకుంటూ, కొత్తవారికి ఉత్తేజం కలిగిస్తూ సాహితీ సేద్యం కొనసాగిస్తున్నాడు జాతశ్రీ.

**చలివేంద్రం** :- (2004)-2003లో చలివేంద్రం కథకు "తానా" వారి ద్వితీయ బహుమతి వచ్చింది.ఆ పేరుతోనే మరో 15 కథల్ని జేర్చి 2004 ఓ కథా సంపుటి ప్రకటించాడు జాతశ్రీ.ప్రపంచీకరణ చాప కింద నీరులా వివిధ రకాల వృత్తిదారుల బతుకులలో ముళ్ళు గుచ్చి గ్రామీణ జీవితాలను ఛిద్రం చేసిన తీరును రచయిత ఈ కథల సంపుటిలో చదువరుల కళ్ళకు కట్టాడు.విధ్వంసం కథలో తరతరాలుగా దొమ్మరాటను నమ్ముకొని,ఆదరించి అన్నం పెడాదు తారన్న కొండంత నమ్మకంతో కాలినడకన పల్లెటూళ్ళకు పయనం కట్టిన ఓ కుటుంబం-టెలివిజన్ సీరియల్స్,సినిమాల మోజులో పడి ఊరి జనం పట్టెడన్నం కాదుకదా,పన్నెత్తి పలకరించరు.జాలిదలసి గుక్కెడు

మంచి నీళ్ళు పోసే వాళ్ళు కరువై నిరాశతో వెనుదిరిగిన తీరు ప్రతి చదువరుకి కంటనీరు పెట్టిస్తుంది.తరాలు మారినా దళిత వాడలకు చేరని ప్రభుత్వ పథకాల గురించి వ్యంగ్యంగా చెబుతూనే,పల్లెల్లో శ్రద్ధగా చదువు చెప్పే గురువుల పట్ల పిల్లలు చూపే అభిమానాల్ని దృశ్య మాలిక గా చిత్రించాడు జాతశ్రీ.అన్యాయం చేసే వాడు ఎంత బలవంతుడైనా నీతి గల పది మంది బలహీనులు ఒక్కటైతే తగిన గుణపాఠం చెప్పవచ్చని ఈ సంపుటిలోని ముక్తాయింపు కథ చెబుతుంది.

పోలీసులు,వారి దౌర్జన్యాలు,హింస,విధ్వంసం,పై అధికారుల దర్పం మాటున నలిగిపోతున్న కుమ్మరి వెంకన్న కథే చలివేంద్రం.తీసుకున్న కుండలకు డబ్బులివ్వక పోగా,నక్సలైటు ముద్ర వేసి ఎన్ కౌంటర్ చేస్తామని బెదిరించడాన్ని ఈ కథ చక్కగా వివరించింది.

చలివేంద్రం నాటికి జాతశ్రీ భాషలో కథనంలో,సంభాషణలలో ఎంతో మార్పు వచ్చింది.ఎక్కడా సిద్ధాంతాలు వల్లించడు.జరుగుతున్న ఘోరాలకు ఆవేశం కానీ,ఉద్యమాలు కానీ అవసరమని చెప్పడు.సింపుల్ గా వాస్తవ దృశ్యాల్ని చిత్రీకరించి చదువరికి ఆలోచన కలిగిస్తాడు.చైతన్యం కలిగిస్తాడు.

ఈ కథా సంపుటికి ''రమ్య సాహితీ సమితి'' పెనుగొండ వారి ఉత్తమ కథా సంపుటి సత్కారం లభించింది.

**కుట్ర** :- (2006)-ఈ కథా సంపుటికి వట్టికోట ఆళ్వార్ స్వామి అవార్డు,2007లో రావిశ్రీ కృష్ణమూర్తి మెమోరియల్ ప్రథమ బహుమతి లభించాయి.మానవత్వపు లోపలి పొరల్ని తరచి చూపిన రచయితగా జాతశ్రీ బీదల బాధల్ని వారి కథల్లో చూపించాడు.ఆర్థిక సంస్కరణలు,ప్రపంచీకరణ,సరళీకరణ పేరున జురుగుతున్న కుట్రల్ని చదువరులకు విశదపరచటమే తన ఏకైక లక్ష్యంగా ఈ కథల్లో కనిపిస్తోంది.ఇందులోని కథల్లో ''అమ్మా నీకు దండమే'', ''ఒంటరి'', ''రాజనీతి'', ''వలస'' అనేవి ప్రధానమైన కథలు.'' అమ్మా నీకు దండమేలో'' కిట్టమ్మ పాత్ర పట్ల చదువరులకు సానుభూతి,గౌరం కలుగుతాయి.''దిక్కులేని వారికి దేవుడే దిక్కు'' అన్నట్లుగా ఓ గొప్ప సత్యాన్ని రచయిత ''ఏడుపు'' గురించి చెబుతాడు-''. ఏడిస్తే ఒరిగేదేమీ లేదని తెలిసినా,మనుషులు ఏడవకుండా ఉండలేరు.బాధితులకీ,పీడితులకీ పెద్ద దిక్కు ఏడుపే''-. అంటూ జీవిత సారాన్ని రంగరించి మరీ చెబుతాడు.''ఒంటరి'' కథ వృద్ధాప్యంలోని మతిమరుపు,బలహీనతల్ని చెప్పే కథ.అమ్మా నాన్నల్ని పంచుకొనే కొడుకులు,ఆ వయస్సులో తోడుగా ఊత కర్రలా ఉండ వలసిన భార్యను తన మరో బిడ్డ ఇంట్లో పని చేయడానికి తీసుకు పోవడం,ఏ పని చేయకుండా తింటానికి మాత్రమే ఉన్న తనను ఏదో కర్మ కొద్ది అన్నట్లుగా చూడటం ఆ వృద్ధున్ని ఎంతగానో బాధించింది.తాత గారి మనస్సును అర్థం చేసుకున్నా ఏమీ సాయం లేని మనుమరాలు,నానమ్మకు రాసిన వుత్తరం పోస్టు చేయని తాతకు నానమ్మ ఉత్తరం అనగానే-తాత కళ్ళల్లో కనిపించిన మెరుపు చదువరి గుండెల్ని పిండుతుంది.''రాజనీతి'' కథలో గ్రామల్లో కూలీల శ్రమ దోపిడీనీ,పటేలు రోడ్లనిర్మాణ గుత్తేదారుల ఆగడాల్నీ జాతశ్రీ తనదైన శైలిలో చక్కటి యాస సంభాషణలతో వివరించాడు.వలస కథలో చావ లేక బ్రతక లేక ,చేయడానికి పనులు లేక భార్యా బిడ్డల్ని వదిలేసి వారి బతికించుకోవడం కోసమే పడే బాధల్ని గాథల్నిమేధావుల్ని సహితం ఆలోచించే విధంగా రాశాడు జాతశ్రీ.

**ఆర్తారావం** :-(2009)-ఎల్పీజీ ఫలితంగా ఛిన్నాభిన్నమైన గ్రామీణ వ్యవస్థ,కులవృత్తులు ధ్వంసమై పోయి,చదువుకున్న చదువుకు తగిన ఉద్యాగాలు దొరక్క వలసల పాలై కూలీలుగా మారి పోతున్న వారి ఆర్తారావం అక్షరీకరించాడు.అగ్ర రాజ్యాలకు దాసోహమంటూ మన

పాలకులు అమలు పరుస్తున్న విధానాల వలన గామీణ వృత్తులు ప్రపంచ వాణిజ్య పడగ నీడన ధ్వంసమై మరో దారి లేక తీవ్ర ఆందోళనతో నూతులు గోతులు వెదికే వారు పురుగు మందులు తాగే వారు కొందరైతే,చావ లేక బ్రతక లేక చేస్తున్న "ఆర్తారావం" పదకొండు కథలున్న కథా సంపుటి.ఈ సంపుటిలోని కొన్ని కథలు ఇంతకు ముందే వచ్చిన సంపుటులలో ఉన్నవే,ఐనా కుల వృత్తులకు సంబంధించిన కథలన్నీ ఒక్క చోట ఉండాలనే తలంపుతో ఈ పుస్తకాన్ని ప్రచురించాడు రచయిత."చలివేంద్రం", "విధ్వంసం "కథలు రిపీట్ యైన కథలే."సబ్ ఠీక్ నహి హై", "అగ్ని తూఫాను" కథల్లోని పాత్రలు సృష్టించడంలో జాతశ్రీ పడిన శ్రమ తీసుకున్న శ్రద్ధ నాకు తెలుసు.యానాది ఊరగల్లు సముద్రం మీదకు వేటకెళ్ళి బ్రతుకు నావను నడుపుకుంటున్న వాడ్ని గురించి తెలుసుకోడానికి చీరాల వెళ్ళి వో మిత్రుడి సహాయంతో ఊరగల్లును కలుసుకొని అతని బాధల్ని,వ్యథల్ని ప్రశ్నించి తెలుసుకొని మరీ రాశాడు.జాతశ్రీ తన కథల్లోని ప్రతి పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసి,ఆ పాత్రల్ని సజీవ వ్యక్తులుగా తీర్చి దిద్దాడు.జాతశ్రీ సంధించిన ప్రశ్నలు పాలకులకు,మేధావులకు కను విప్పు కలిగిస్తాయి.శ్రమజీవుల పట్ల ఎంతో ఆర్తి,అనుకంపన,ఆరాటం,ఆరాధన ఉంటే తప్ప ఇంత గొప్ప కథలు రావు.గ్రామీణ వృత్తిదారుల జీవితాలకు సాహిత్య గౌరవం కలిగించడం ద్వారా జాతశ్రీ గొప్ప మానవతా వాదిగా నిరూపించుకో గలిగాడు.

**పైరగాలి**:-(2012)-ఈ సంపుటిలో చేర్చిన రెండు కథలు మినహా మిగతా పధ్నాలుగు కథలకూ వాటి సొంత నేపథ్యాలు ఉన్నాయి.ఆ నేపథ్యాలను దగ్గరగా చూసి, వాటిని గమనంలోకి తీసుకున్నవే తప్ప,రచయిత వాటికి కన్నీళ్ళు , ఆరాటాలు పోరాటాలేవీ కల్పించ లేదు.ఈ 14 కథల్లో ఏ ఒక్కటీ యదాతదంగా వాస్తవం కాదు.అలాగని కల్పనా కాదు.వాస్తవానికి మెరుగులద్దుతూ సాహితీ రంగంలో ఆ సంఘటనలకు ఓ స్థానం కల్పించాలనే బలమైన కాంక్షతో ఆక్షరీకరించినట్లుగా తనే తన ముందు మాటలో చెప్పుకున్నాడు.1976 ఇల్లందు అగ్ని ప్రమాదంలో జాతశ్రీ సాహితీ కృషి సమస్తం ఆహుతై పోతే,ఎంతో శ్రమ పడి మిత్రుల సహాయంతో వేటపాలెం లోని గ్రంథాలయంలో నుండి,వివిధ పత్రికల్లో అచ్చైన కథలన్నింటినీ సేకరించి "పైరగాలి" గా ఇటీవల ప్రచురించడం జరిగింది.ఈ సంపుటిలోని 16 కథల్లో ఎత్తుగడ, కథాగమనం,పాత్రల చిత్రీకరణ చదువరులను కట్టిపడేస్తాయి.పల్లెటూరి జీవితం లోని పచ్చి నిజాలు,పేదరికంలోని పిచ్చి ప్రేమలు,ఆప్యాయతలు,అనురాగాలు,అసూయలు ఈసడింపులు,బడుగు వర్గాలలో త్యాగాలు విషాద రాగాలు,ఎంతో ఏపుగా ఎదిగిన పంట పొలాలు—ఈ కథల నిండా కన్పించే మనోహర దృశ్యాలు.

**ముగింపు**:-జాతశ్రీ సున్నిత మయిన మనసు గలవాడు కావడం వలన ప్రతి చిన్న సంఘటనకు చలించి పోతాడు.అప్పుడు జాతశ్రీ ఎన్నో వారాలు,మాసాలు నిద్ర మరచిపోయి మధన పడిపోతాడు.జ్వరం వస్తుంది.ఆ స్థితిలో జాతశ్రీ తను జూసిన సంఘటనకు అనువైన పాత్రల్ని ఎన్నుకోవడం,ఆ పాత్రలకు తగిన వాతావరణాన్ని కల్పించడం-భాషను-యాసను సరి చూసుకోవడం చకచకా జరిగి పోతుంది.ఫలితంగా ఒక చక్కని కథ సాక్షాత్కరిస్తుంది.న్యాయమైన సామాజిక బాధ్యత గల రచయితగా జాతశ్రీ అనివార్యమైన పరిణామాల దుష్ఫలితాలను రికార్డు చేసి సాహితీ చరిత్రకారుడిగా చిరంజీవి ఐనాడు.




# సతీసావిత్రి

## పి.వి.లక్ష్మణరావు

పాతివ్రత్యమనే సమున్నతమైన భావన మానవాళికి భారత మహిళాలోకం సమర్పించిన ఒక అమూల్య ఉపహారం. ఇతర దేశాల్లో ఇలాంటి భావనని ఈనాటికీ ఎరుగరు. ఏకపురుషాంకిత అయిన స్త్రీకి అత్యంత శీఘ్రంగా, సులభంగా భగవదనుగ్రహమూ, ఆధ్యాత్మిక పురోగతీ కలుగుతాయని మన పూర్వీకులు నమ్మారు. పాతివ్రత్యం అనేది ఒక ప్రేమసూత్రం, ఒక స్వచ్ఛంద నియమం. ఒక మనిషిని ఇంకో మనిషి ప్రాణా ధికంగా ప్రేమించి, అతనికే జీవితాంతం అంకితం కావాలనీ, అతనికి సేవ చేయాలనీ నిర్ణయించుకోవడం పాతి వ్రత్యానికి బలాన్ని చేకూరుస్తుంది.

ప్రాచీన యుగాల స్త్రీలు తమ సమకాలీన సమాజం స్త్రీత్వానికిచ్చిన నిర్వచనాల్ని మనసా, వాచా, కర్మణా అంగీకరించి ఆ ప్రకారం నడుచుకోవడానికి సిద్ధపడ్డారు. వారు పురుషుడి ఆధిక్యాన్ని, అందునా భర్త ఆధిక్యాన్ని శంకించలేదు. సవాలు చేయలేదు. అందుచేత వారు పురుషుడి ఆజ్ఞల్ని శిరసావహించడాన్నీ, అతనికి సేవ చేయడాన్ని అవమానకరంగా భావించలేదు. అలాగే వారు తమను తాము ఏ విషయంలోనూ పురుషుల తో పోల్చుకోలేదు. ఆ పోలికల ప్రాతిపదికగా పురుషుల్ని ద్వేషించలేదు. అందువల్ల వారి మనస్సులు వినయం తోనూ, శాంతి సౌమ్యతలతోనూ పురుషజాతి పట్ల ప్రేమతోనూ నిండి ఉండేవి. అందుచేత వారి జీవితాల్లో పాతివ్రత్య మహిమని అందుకోవడానికి కావాల్సిన నేపథ్యం సగం వరకూ సిద్ధమైపోయేది.

ఆచరణలో పురుషుణ్ణి సేవించినప్పటికీ మానసికంగా పూర్వస్త్రీలకు స్త్రీలే ఆదర్శం. అందుచేత వారు పురుషుల్ని శిరసావహించేవారే తప్ప వారి ఆలోచనల్ని గానీ, జీవనవిధానాన్ని గానీ అనుసరించేవారు కారు. కాబట్టి భర్త నాస్తికుడైన సందర్భాలలో

కూడా అతని భార్య మాత్రం ఆస్తికురాలు కావడం, అతను క్రూరుడైనా ఆమె మాత్రం దయామయి కావడం జరిగేది. కొన్నిసార్లు ఆమె సాంగత్యప్రభావం చేత అతను మంచివాడుగా మారడం కూడా జరిగేది.

కానీ నేడు “అసలు పాతివ్రత్యమనేదే బోగస్ అనీ, అది స్త్రీలని అణచిపెట్టడం కోసం పురుషులు కని పెట్టినదనీ, అది కేవలం వారి మానసిక భద్రత కోసమనీ, అందుచేత దానివల్ల వాస్తవంగా ఎవరికీ ఏ ప్రయో జనమూ లేదనీ” వాదిస్తున్నారు. దీనికి తోడు నేటి భర్తృవిధేయురాళ్ళు పూర్వ పతివ్రతల స్థాయిలో మహి మాన్వితలు కావడం ఎక్కడా దృగ్గోచరం కాకపోవడంతో ఈ వాదానికే ఆధునిక సమాజంలో క్రమంగా బలం చేకూరుతున్నది. ఈ పరిస్థితి మారాలంటే తన యొక్క పాతివ్రత్యంతో,ధర్మబుద్ధితో మృత్యుదేవత వెంట ఒంటరిగా పతికోసం పయనించి యముడిని సైతం నిగ్గదీసి, నిలబెట్టి ధర్మ ప్రసంగాలు చేసి మెప్పు పొంది తన భర్త ప్రాణాన్ని బహుమానంగా తిరిగి తెచ్చుకున్న సావిత్రి వంటి మహా పతివ్రతలను నేటి మన భారతీయ స్త్రీలందరూ ఆదర్శంగా తీసుకొని ధన్యులవ్వాలి.

మృత్యువుని జయిస్తే ప్రపంచాన్ని జయించినట్లే. ఒక ఆడపిల్ల తన భర్త ప్రాణాల్ని తిరిగి సంపాదించు కోగలిగింది. మృత్యువుని జయించగలిగింది. ఆమె ఒక మంత్ర స్వరూపిణి. మద్రదేశానికి అధిపతి అయిన అశ్వ పతి దంపతులు వృద్ధులైనా సంతానం లేకపోయేసరికి మిక్కిలినిష్ఠతో సావిత్రీదేవిని 18 ఏళ్ళపాటు ఉపాసించి పూజలు చేయగా కలిగిన సంతానమే “సావిత్రి”. సావిత్రీదేవి వరం వలన జన్మించినదై, సిద్ధ,సాధ్య,యక్ష, అమర (దేవజాతి) కన్యావలిని అతిక్రమించగలిగిన అందచందాలతో తేటతెల్లమైన యవ్వనంతో ప్రకాశిస్తున్న సౌందర్యవతి అయిన తన కుమార్తెను గుణవయోరూపముల అనుకూలుడైన వరుడికిచ్చి వివాహం చేయ దలిచి నీకు ప్రేమ పాత్రుడైన నచ్చిన వరుడిని, రాజకుమారుడిని వరించమనగా

“చిరకీర్తి సాళ్వభూవరు
వరతనయుండయిన సత్యవంతుడు నాకున్
వరుడుగ గోరుదు మదిలో
నరవర!యాతనికి నిమ్ము నను బ్రీతిమెయిన్”.

రాజభవనానికి వచ్చిన నారదుడికి, తన తండ్రికి సావిత్రి వందనమాచరించి తనకు తగిన వరుడు సాళ్వరాజైన ద్యుమత్సేనుని కొడుకైన సత్యవంతుడని చెప్పగా అశ్వపతి వారిని గురించిన సమాచారం సేక రించాడు. ద్యుమత్సేనుడు వయసు రీత్యా గుడ్డి వాడయ్యాడని శత్రువులు రాజ్యాన్ని ఆక్రమించుకోగా భార్యా పిల్లలతో అరణ్యంలో జీవిస్తున్నాడని చెప్పాడు. నారదుడు సత్యవంతుడికి అన్నీ సుగుణాలు ఉన్నాయనీ కానీ ఒక సంవత్సర కాలంలో అతడు చనిపోతాడని చెప్పాడు. ఆ కారణంగా ఇటువంటి వరుడెందుకు? ఇంకొక వరుడిని అన్వేషించడం మంచిదని తన తండ్రి అయిన అశ్వపతి హెచ్చరించగా

"వినుము మనోవాక్కాయము

లను మూడు తెలంగులందు నంత:కరణం

బనఘ!ప్రధానము గావున

మనమున గైకొన్న భర్త మానుట దగునే?"

మనసులో ఏది అనుకుంటామో దాన్నే చెప్పటం, ఏది చెప్తామో దాన్నే చేయడం త్రికరణశుద్ధి అంటారు. త్రికరణశుద్ధి కలిగినవారు తాము కోరుకొన్న దాన్ని పొందగలరు. ఆత్మవిశ్వాసం,ఆత్మస్థైర్యం అనేవి మానవులకు ఎటువంటి కష్టాన్నైనా సహించే శక్తినిస్తాయని నమ్మిన సావిత్రి మనసులో భర్తగా వరించిన వానిని మానటం తగదు అని నిర్ణయం తీసుకున్నది. తన తండ్రి ఎన్నిచెప్పినా సావిత్రి తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో పరివారంతో అరణ్యానికి వెళ్ళి తన కూతుర్ని సత్యవంతుడికిచ్చి వివాహం చేయగా సావిత్రి అరణ్యంలోనే అత్తమామలతో, భర్తతో జీవనాన్ని గడపసాగింది.

అంతలో నారదుడు చెప్పిన సమయం దగ్గరకు రానే వచ్చింది. సావిత్రి త్రిరాత్రోపవాస మహావ్రతాన్ని (మూడురోజుల నిరాహారదీక్ష)పూనుకున్నది.మామచెప్పినా వినలేదు. నాల్గవరోజు పొద్దుపొడవడానికి ముందే నిదుర లేచి సమిధలు,దర్భలు,పండ్లు తీసుకురావడానికి అడవికి బయలుదేరిన సత్యవంతుడితో అరణ్యానికి వెళ్లింది. గొడ్డలితో కొయ్యను నరుకుతున్న సత్యవంతుడికి తీవ్రమైన తలనొప్పి వచ్చి,శరీరం స్వాధీనం తప్పగా గొడ్డలి వదలి సావిత్రి ఒడిలో అలసటతో శయనించాడు.సావిత్రి తన అంకతలాన్ని భర్తకు తలగడగా చేసింది. రాజకుమారుడైన సత్యవంతుడు నెమ్మదిగా వివశత్వం పొంది చైతన్యం లేని వాడిగా ఉండిపోయాడు. కొంత సేపటికి ఎదురుగా కాలుడు ప్రత్యక్షమయ్యాడు.

"కనియెం గోమలి నీలమేఘవిలాసత్కాలాంజనాకారు,ఘో

రానిశాటోత్కట దంష్ట్రు,నుజ్జ్వల చలద్రక్తాక్షు,బ్రత్యగ్ర కాం

చనవర్ణాంబరు,నంత్యకాలదహన జ్వాలాప్రచండున్,జగ

జ్జనసంత్రాసను,నొక్క దివ్య,పటుపాశ ప్రౌఢ హస్తోద్ధతున్."

నల్లని మబ్బువలె శోభిల్లే నల్లని కాటుకవంటి ఆకారం కలవాడు, భయంకరమైన, వెలుపలికి వ్యాపిం చిన వాడియైన కోరలు గలవాడు, నెత్తురు రంగు కలిగి మిలమిలమెరసే నేత్రాలు కలవాడు,తళతళలాడే బంగారు రంగుతో వెలుగొందే బట్టలు ధరించినవాడు, ప్రళయకాలంలోని అగ్ని జ్వాల వలె మండే వాడు, లోకం లోని జనులకు భీతిని కలిగించేవాడు, గొప్పపాశాయుధాన్ని ఒడుపుగా త్రిప్పే నేర్పుగల హస్తం చేత గర్వించిన వాడైన యముడిని సావిత్రి గుర్తించి అతనికి పాదాభివందనం చేసింది.సావిత్రీ నీవు పతివ్రత అవడం

వల్ల నీకీ దర్శనమిచ్చాను. నీ పతి ప్రాణాలు తీసుకొని వెళ్లడానికే వచ్చానని పాశాన్ని విసిరి అతడి ఆత్మను బంధించి తీసుకెళ్తుండగా తన భర్త ప్రాణాల్ని దక్కించుకోవడం కోసమై సావిత్రి అతడిని వెంబడించింది.

"ఎడపక వాఙ్మనఃక్రియల నేరికి హింస యొనర్పబూన రె
య్యెడలను దీనులం గరుణ యేర్పడ బ్రోవగ చూతురిచ్చుచో
గడమవడంగ నీకెదిరి కాంక్షితముల్ దుదిముట్ట దీర్తు రె
క్కుడు మది కూర్తురాశ్రితులకున్ వినుమిన్నియు నార్యధర్మముల్!"

సావిత్రి యముడికి ఆర్యధర్మాలన్నీ చెప్పింది. మనోవాక్కాయ కర్మలతో ఎవరికీ హింస చేయనివాడు, దీనులను కరుణతో చూసేవాడు, ఇచ్చేటప్పుడు కొంత ఇచ్చి వెనక్కి లాగని వాడు, ఆశ్రితులను సంపూర్ణంగా పాలించేవాడు ఆర్యుడు. ఇది ఆర్య ధర్మం. ఈ లక్షణాలున్న వారంతా ఆర్యులే. ఈ మాటలు చెప్పి "మనం ఆర్యులం" అనడంలో యముడి అహంకారాన్ని సంతృప్తి పరచడమే కాదు, ఇప్పుడు దీనురాలైన తనపై జాలి చూపించాలని, కొంత ఇచ్చి వెనక్కులాగే ప్రయత్నం చేయకూడదని, అలా చేస్తే యముడు ఆర్యుడు కాదనీ చెప్పకనే చెప్పింది సావిత్రి.

చక్కని సందర్భశుద్ధి కలిగిన,పాపాలను పారద్రోలే సావిత్రి మాటలు దప్పికతో ఉన్నవాడికి చల్లని మంచి నీళ్ళు సంతోషభరితుడ్ని చేసేతీరుగా యమధర్మరాజుని సంతృప్తి పరచాయి. యమధర్మరాజు ఆమెను నీపతిప్రాణం దక్క ఇతరమేమైనా కోరుకోమనగా ఆమె తన మామ గారికి అంధత్వము పోయి రాజ్య లాభము కలుగ వలెనని, తన తండ్రికి నూరుగురు పుత్రులు కలుగవలెనని వరమడిగింది. యముడు ఆ వరాలను తీర్చాడు.

చాలా దూరం నన్ను వెంబడించి బాగా అలసిపోయావు ఇక వెనుకకి తిరగడం మంచిదని హితవు పలికిన యమధర్మరాజుతో ఆమె తన మనసు భర్తపాదపద్మాలయందే ఆసక్తి కలిగి మిక్కిలి పూజ్యభావంతో శోభిల్లుతున్నది. ఎన్ని వరాలు లభించినా పతివ్రతలకు భర్తను ఆశ్రయించి ఉండటంతో సరిపోలవు కదా!సతికి ఏకైక ధర్మం భర్తృసంశ్రయమే అని చెబుతూ ముందుకు కొనసాగింది.

సావిత్రి యముడితో అన్న ఈ మాటలు ఎదుటివాడు మనకు వ్యతిరేకంగా ఉన్నా, మాట నేర్పుతో ముందరి కాళ్ళకి బంధం వేసి పనులు సాధించే నేర్పరితనాన్ని నేర్పుతాయి. తన భర్త ప్రాణాన్ని కొనిపోతున్న యముడిని మాటలతో బోల్తా కొట్టించి తాననుకున్న కార్యాన్ని సాధించింది. యముడు తన కర్తవ్యం నిర్వ హిస్తున్నాడు. కానీ దానివల్ల వల్ల తనకు నష్టం కలుగుతోంది. పైగా తీసుకున్న

ప్రాణాన్ని తిరిగి ఇవ్వడం యమధర్మం కాదు. కానీ సావిత్రికి ఆమె భర్త ప్రాణం కావాలి. అంటే యముడితో అధర్మమైన పని చేయించాలి. ఈ పనికి నడుం కట్టిన సావిత్రి తన తెలివి తేటలను ఉపయోగించింది.

నా భర్త ప్రాణం నాకియ్యి, నువ్వెవరవు దాన్ని తీసుకోడానికి అంటూ యుద్ధానికి దిగలేదు. అయ్యో నా భర్తలేకుండా నేను బ్రతకలేను అంటూ ఏడ్చి పెడబొబ్బలు పెట్టి యముణ్ణి కరిగించాలనీ అతని కనికరం కోసం ప్రయత్నించలేదు.అలాగని యముడితో వాగ్యుద్ధానికి కూడా దిగలేదు. ఇందులో ఏది చేసినా ఆమె తన ప్రయత్నంలో విఫలమయ్యేది. ఆమె ఎఱుక గలవారి చరితలు తెలుసుకుంది. సజ్జనసాంగత్యంలో గడిపింది. మంచి విచక్షణ, విజ్ఞానాలు కలది. అందుకనే యుగయుగాల స్త్రీజాతికి ఆదర్శప్రాయురాలైంది.

యముడితో వాగ్యుద్ధానికి దిగి,అతడిని చీకాకు పరచకుండా

“ ఏడు మాటలాడినయంత నెట్టివారు
నార్యజనులకు జుట్టంబులగుదురనిన
చిరసమాలాప సంసిద్ధి చేసి నీకు
నేను జుట్టమనియు వేఱ యేల చెప్ప”

‘సఖ్యం సాప్తపదీనాం” అంటారు. అంటే కలిసి ఏడడుగులు వేసినా, ఏడు మాటలు మాట్లాడినా సత్పు రుషులు ఒకరికొకరు మిత్రులవుతారట. “Birds of the same feather flock together” అని ఇంగ్లీషులో ఒక సామెత కూడా ఉంది. “ఏడు మాటలాడితేనే చుట్టాలవుతారు కదా,మనమింత సేపు మాట్లాడాము చుట్టా లమెందుకు కామని ప్రశ్నించింది. పైగా ఆర్యజనులకు అని వాడటంతో తానూ గౌరవనీయురాలే అని, యముడితో సమానస్థాయి కలదనీ, కాబట్టి బంధువు అయ్యే అర్హత ఉందని చెప్పకనే చెప్పింది. అంటే తాను పరమయోగ్యురాలు కాబట్టే యముడిని చుట్టంగా భావిస్తున్నట్లుగా తెలియపరిచింది.

సావిత్రి తన ధర్మం కోసం పోరాడుతోంది.యముడు తన ధర్మాన్ని నిలుపుకుంటున్నాడు. మనకు సన్నిహితులను మనం ఏమైనా అడగవచ్చు. అవతలి వాడెంత కఠిన మనస్కుడైనా మనకు బంధువైనట్లైతే మనకు కావాలసింది అతడిని అడిగే చనువు మనకు ఉంటుంది. ఈ ఒక్క పద్యంతో సావిత్రి ఆ చనువు సంపాదించింది. ఏడు మాటలాడితేనే సత్పురుషులు బంధువులైతే, ఇన్ని మాటలు

మాట్లాడినవారు బంధువు లైనట్టే కదా! తిరుగులేని వాదం ఇది. అందుకే తనకోసం ధర్మవ్యతిరేకంగా ప్రవర్తించమని యముడిని కోరబోతోంది సావిత్రి.

అంటే మనమనుకున్న కార్యాన్ని సాధించాలంటే ముందుగా మనకు ఎవరితో పని ఉందో వారి మన స్తత్వాన్ని పరిశీలించాలి. వారు మనకు సుముఖంగా ఉంటే పరవాలేదు. వ్యతిరేకంగా ఉంటే ముందుగా వారి అహంకారాన్ని సంతృప్తి పరచాలి. ఆ సంతృప్తి పరచటంలో మన ఆత్మగౌరవాన్ని వదులుకోకూడదు. సావిత్రి యముడికి ఆర్యధర్మాలు చెప్పింది. నువ్వు ఆర్యుడవని ఒప్పుకోవాలంటే ఆ ధర్మాలను నువ్వు పాటిస్తున్నా వని నిరూపించమంది. ఇదంతా వాదంలా కాక ఇద్దరు సన్నిహితుల నడుమ జరిగే సంభాషణలా జరిగింది. అందుకే సావిత్రి యముడి అహంకారాన్ని సంతృప్తి పరచటమే కాదు, అతడితో బంధుత్వాన్ని నెరపి, అతనితో  చేయకూడని పనిని కూడా చేయించింది. విజయం సాధించింది.

అంతే కాదు "అనువు గాని చోట అధికులమనరాదు" అన్న సూక్తిని పాటించటం వల్ల కలిగే లాభాన్ని చూపిస్తాయి. సావిత్రి యముడితో వాగ్యుద్ధానికి దిగకపోవడానికి కూడా ఈ "అనువు గాని చోట అధికులమన రాదన్న విచక్షణయే కారణం. ఎందుకంటే యముడు అధికారి లాంటివాడు. సావిత్రి తన భర్త ప్రాణాలను అభ్య ర్థిస్తున్నది కాబట్టి యముడి దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడి ఉండాలి. తన కార్యాన్ని(లక్ష్యాన్ని) సాధించా లంటే అధికారిలోని దయాదాక్షిణ్యాల భావనను జాగృతం చేయాలి. ఇది తప్ప మరో మార్గం లేదు. ఒక దిగువ స్థాయి ప్రభుత్వ కార్యాలయంలో పని సాధించటం దగ్గర నుంచి అంతర్జాతీయ రంగంలో అనుకున్నది పొందా లన్నా ఇదే మార్గం. అంటే విజ్ఞానం విచక్షణ సత్సాంగత్యం పట్టుదల నిజాయితీ లకు మంచి మాట తోడవా లన్న మాట. ఇందులో ఏ ఒక్క అంశం లోపించినా వికాసం సంపూర్ణం కాదు.ఈ విషయాన్నే

"సత్యం బ్రూయాత్ ప్రియమ్ బ్రూయాత్

న బ్రూయాత్ సత్యమప్రియం

ప్రియం చ నానృతం బ్రూయాత్

ఏష:ధర్మ:సనాతన:" అని చెప్పారు పెద్దలు.

సత్యం చెప్పాలి. అది ప్రియంగా చెప్పాలి. ప్రియమైన సత్యం చెప్పాలి. అప్రియమైన సత్యాన్ని చెప్ప కూడదు. అలాగని ప్రియమైందని అబద్ధం చెప్పకూడదు. యముడిని నువ్వు హంతకుడివి. ప్రాణాలు దొంగి లించేవాడివి అనకూడదు, అవి నిజాలే అయినా అవి అతని అహంకారాన్ని దెబ్బ తీస్తాయి. మొదటికే మోసం వస్తుంది. అందుకే సావిత్రి ప్రియుమైన సత్యాలు ఆర్యధర్మాలు చెప్పి, నువ్వు ఆర్యుడివి అన్న నిజం చెప్పి తన కార్యాన్ని సాధించింది.

వయసులో చిన్నదైనప్పటికీ సావిత్రి ధర్మబుద్ధికి, పాతివ్రత్యానికి మెచ్చుకుని ఆమె భర్తను తిరిగి జీవింపచేసి యమధర్మరాజు సంయమనీ నగరానికి వెళ్ళాడు. సావిత్రి భర్తతో సహా స్వగృహానికి చేరింది. జరిగిన విషయాలు భర్తకి, అత్తమామలకు వివరించింది. అశ్వపతికి నూరుగురు పుత్రులు పుట్టారు. ద్యుమత్సేన దంపతులకు చూపు వచ్చింది. ఆ వెంటనే దాయాదులాక్రమించిన రాజ్యం కూడా తిరిగి చేతికి వచ్చింది. సామా న్యులకు యముడు కనిపించడు. యముడ్ని చూసి,ఆయనతో ధర్మ ప్రసంగములు చేసి మెప్పుపొంది తన భర్తను బహుమానంగా తిరిగి తెచ్చుకున్న సావిత్రి నిత్యజీవితంలో చిన్న పనుల నుంచి పెద్దపనుల వరకూ సాధించటంలో ఉండాల్సిన పట్టుదల, నిజాయితీలను నేటితరం స్త్రీలు (స్త్రీ(పురుషులిరువురూ) పెంపొందించు కోవాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేస్తున్నది.

# వ్యాస కౌముది



# కాళిదాస కవితా వైభవం

## "విద్వాన్" తిరుమలపెద్దింటి నరసింహాచార్యులు

**"పురా కవీనాం గణన ప్రసంగే/**

**కనిష్టికాధిష్టిత కాళిదాసః//**

**అద్యాపి తత్తుల్య కవేరభావాత్/**

**అనామికా సార్ధవతీ భభూవ//**

పై శ్లోకం కాళిదాసు గొప్పతనాన్ని చాటి చెపుతుంది. ఎలాగో తిలకించండి.—పూర్వం గొప్ప,గొప్ప కవులని లెక్కిద్దామని ప్రారంభించగా, ముందుగా చిటికెన వేలుని ( చిటికెన వేలుకి కనిష్టిక అనిపేరు) కాళిదాసు అధిష్టించెనట. ఇక రెండవ వేలు ఉంగరంవేలు దానికి అనామిక అని పేరు. ఆ వేలుని అధిరోహించడానికి కాళిదాసుతో సమానమైన కవులు ఇప్పటికికూడా ( అద్యాపి) ఎవరులేనందున, ఆ రెండవ వేలుకి 'అనామిక' అన్న పదం సార్ధకమైనది. అనిభావం. ఊరు పేరు లేనివారిని అనామకులు అంటారు. కాళిదాసు గొప్పతనాన్ని తెలిపే ఇంకో సన్నివేశం చూడండి.---

"కవిర్ దండీ కవిర్ దండీ/ భావభూతిస్తు పండితః

'కోzహం?----' త్వమేవాహం త్వమేవాహం/ త్వమేవాహం నసంశయః// అనగా -----

పరమ భక్తుడైన కాళిదాసుతో సరస్వతీదేవి ప్రత్యక్షంగా వచ్చి, అతని సందేహాలని తీర్చేదట. ఒకరోజు కాళిదాసు ఆతల్లిని ఇలా ప్రశ్నిస్తాడు? "అమ్మా! ఈలోకంలో కవి ఎవరు? పండితుడు ఎవరు? అని." దానికి ఆమాత పైశ్లోకం చెప్పింది. పైశ్లోకం మొదటి పాదం "దశకుమార చరిత్ర" వ్రాసిన 'దండిమహా కవే' కవిగా పిలవడానికి అర్హుడని, ఈవిషయంలో సందేహమే లేదు అనడానికి రెండు

పర్యాయములు తెలిపి, ఉత్తరరామచరిత్రాది నాటకాలు వ్రాసిన, 'భవభూతి మహా పండితుడు' అని అనగానే'' కాళిదాసుకి చాల కోపం వచ్చి నేను కవిని,కాను,పండితుడుని కాను మరి 'కోహం' నేనెవరిని? అని అక్కడ ఒతిట్టుకూడా అమ్మని తిట్టి గట్టిగా అడుగుతాడట. అపుడు ఆ చదువుల తల్లి బిడ్డపై కోపంతెచ్చుకొనక పరమ శాంతంగా—నీవే నేను, నీవే నేను,నీవే నేను (త్వమేవాహం) అని మూడు మార్లు పలికి తనకి కాళిదాసుకి భేదమే లేదు అనుటలో సందేహమే లేదు అని పలుకుతుందిట'' ఇది కల్పిత గాథ. అయినా కాళిదాసు గొప్పతనాన్ని మనకి తెలుపుతుంది. ప్రపంచ ప్రఖ్యాతి వహించిన కాళిదాసుని

గూర్చి, అతనికవితా వైభవాన్ని గూర్చి అందరికి తెలిసినదే అయినా మహానుభావులను గురించి

మరల,మరల తెలుసుకొనుటలో మనకి ఆనందమేకాని, విసుగు జనించదు. అందుకే ఈ వ్యాసంలో సముద్రంలో నీటి బిందువంత తెలియజేస్తాను.

మహాకవి కాళిదాసు రచనలలో ''రఘువంశం, కుమార సంభవం, ఘసందేశం అనే మూడు మహాకావ్యాలు, మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, అబిజ్ఞానశాకుంతలం అనే మూడు నాటకాలు, ఋతుసంహారం అనే ఖండకావ్యం'' ప్రసిద్ధిగాంచినవి. ఇంకా అనేక రచనలు కాళిదాసు పేరుతో ఉన్నప్పటికీ, పై గ్రంథాలే ముఖ్యమైనవి. పైన చెప్పిన మూడు మహాకావ్యాలు కాళిదాసు రచించడానికి కారణభూతమైన ఒక కథని పెద్దలు చెపుతారు. అది తెలుసుకొందాం;---

'' కాళిదాసు పామరుడైన ఒక గొల్లవాడని, కొంతమంది కుట్రతో, ఆ దేశపు రాజుని మోసం చేసి, ఇతడు మహాపండితుడని తెలిపి రాజకుమార్తెతో వివాహం జరిపిస్తారు. వారిద్దరి ఏకాంతవాసంలో

కాళిదాసు ప్రాకృతంలో మాటాడుతాడు. మహాపండితురాలైన రాకుమార్తెకి అతడు మాటాడే మాటలు అర్థం కాక '' ఆస్తి కశ్చిత్ వాగ్విశేషః'' నీవు మాటాడే మాటలకి విశేషమైన అర్థం ఏదైన ఉందా? అని సంస్కృతంలో ప్రశ్నిస్తుంది. తదుపరి కాలంలో కాళికాదేవి వరప్రభావంతో మహాపండితుడైన కాళిదాసు తన భార్యపై గల ప్రేమతో, ఆమె తనను ప్రశ్నించిన వాక్యంలోని మూడు మాటల్ని ప్రారంభ 'పదాలుగా' పెట్టి పై మూడు కావ్యాల్ని వ్రాసాడని, అవి వరుసగా ------

1. అస్తి. '' అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా'' ( తొలి పదం అస్తి+ఉత్తరస్యాం) అని కుమారసంభవ మహాకావ్యాన్ని.
2. కశ్చిత్. '' కశ్చిత్ కాంతా విరహ గురుణా స్వాదికారాత్ ప్రమత్తః'' అనేప్రారంభంతో మేఘసందేశ కావ్యాన్ని.
3. వాగ్విశేషః. (వాక్+విశేషః) '' వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే

జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ'' అనే శ్లోకంతో రఘువంశ మహా కావ్యాన్నిరచించి లోకానికందించెనని ప్రసిద్ధి. ముందుగా రఘువశంలోని కొన్ని విశేషాలని లుసుకొందాం.

ఆదికవి వాల్మీకి, ఆదికావ్యం రామాయణాల ప్రభావం కాళిదాసుపై చాల కలదని పండితాభిప్రాయం. వాల్మీకి ఉపమాలంకారాలు చాల ప్రసిద్ధి. ఒక ఉదాహరణ.

రామ రావణుల యుద్ధాన్ని వాల్మీకి రామాయణంలో

**"గగనం గగనాకారం/ సాగరం సాగారోపమః/**

**రామ రావణయో ర్యుద్ధం/ రామరావణయోరివ//**

"ఆకాశానికి ఆకాశమే ఉపమానం (పోలిక), సముద్రానికి సముద్రమే ఉపమానం. అట్లే రామ రావణుల యుద్ధమ్ రామ రావణుల యుద్ధము వలే ఉన్నది." దానికి వేరే పోలికేలేదు అని అద్భుతంగా వర్ణిస్తాడు.

అట్లే కాళిదాసుకూడా ఉపమాలంకార ప్రయోగంలో అగ్రగామి. కనుకనే "ఉపమా కాళిదాసస్య" అని కీర్తిగాంచెను. కొన్నిఅద్భుతమైన ఉపమానాలు పరిశీలించండి. రఘువంశ కావ్యాన్ని ప్రారంభిస్తూ ఇలా అంటాడు.---

**"క్వసూర్య ప్రభవో వంశః/ క్వచాల్ప విషయా మతి:/**

**తితీర్షు: దుస్తరం మొహాదుడుపెనాస్మిసాగరం//**

అల్పమతినైన నేనెక్కడ! సూర్యవంశ రాజుల చరిత్ర ఎక్కడ! మహాసాగరాన్ని ఒక చిన్న తెప్పతో దాటాలనుకోవడం సాహసమే అవుతుంది. రఘువంశ చరిత్రని సాగారంతో, తనని తెప్పతో పోల్చడం చక్కని 'ఉపమ' ఇంకొకటి :------

**"మందః కవియశః ప్రార్ థీ/ గమిష్యామ్యుపహాస్యతాం/**

**ప్రాంశు లబ్దే ఫలే లోభాదుద్బాహురివ వామనః//**

మందుడైన కవి గొప్ప కీర్తి పొందాలనుకొంటే అపహాస్యం పలౌతాడు. ఎలాఅంటే 'పొట్టి వాడు చిటారు కొమ్మనున్న పండుని అందు కోవడానికి ఎగిరి క్రింద పడి నవ్వులపాలైనట్లు. అద్భుతమైన ఉపమానం. చూశారా! ఇంకా దిలీపమహారాజు సంతానార్థం వశిష్టుని నందినీధేనువుని సేవిస్తూ వెంట వెళ్లడాన్ని కవి " ఛాయేవ తాం భూపతిరన్వ గచ్ఛత్" నీడవలె ఆవు వెంట వెడలెను" అనియు,

"అవాకిరన్ బాల లతాః ప్రసూనై:/ ఆచార లాజైరివ పౌరకన్యాః" చక్రవర్తియగు దిలీపుడు అడవిలో సంచరిస్తుంటే బాల లతలు పుష్పాలను అతనిపై జల్లినవట (గాలికి పుష్పాలు రాలడం సహజం) ఆ సన్నివేశం, పట్టణపుర వీధులలో సంచరిస్తున్న రాజుపై స్త్రీలు ఆచార నిమిత్తం జల్లే లాజలు అనగా పేలాలవలె ఉన్నదని వర్ణిస్తాడు కవి. లతలని స్త్రీలతో, పుష్పాలని లాజలతో పోల్చడం అద్భుతం! తనని పరీక్షించడానికి వచ్చిన 'మాయా సింహంపై' బాణం ఎక్కుపెట్టాలనుకొన్న రాజు ఆ మాయాసింహ ప్రభావంతో 'కదలక మెదలక' అలా ఉండిపోతాడు. ఆ దృశ్యాన్ని కవి "చిత్రార్పితారంభ ఇవావతస్తే" గోడమీద చిత్రించిన చిత్రం ( బొమ్మ) వలే, మంత్రంచే కట్టుబద్ధ 'భుజంగమివ' పాము వలే ఉన్నాడని చక్కని ఉపమలతో వర్ణిస్తాడు. కనుకనే "ఉపమా కాళిదాసస్య" అన్నారు.

దిలీపుని కుమారుడు రఘుమహారాజు. తండ్రిని మించిన కుమారుడు. దిగ్విజయ యాత్ర సలిపి, రాజులను ఓడించి తెచ్చిన సమస్త సంపదను "విశ్వజిత్" అనే యజ్ఞాన్ని నిర్వహించి ప్రజలకు పంచిపెట్టి గొప్ప దాతగా కీర్తిగాంచి, రఘువంశానికే మణిమకుటమౌతాడు. అట్టి రఘువు వద్దకు

**"తమధ్వరే విశ్వజితి క్షితీశం**

**నిశ్శేష విశ్రాణిత కోశాజాతం**

**ఉపాత్త విద్యో గురుదక్షిణార్థి**

**కౌత్సప్రపేదే వరతంతు శిష్యః"**

గురుదక్షిణకై 'వరతంతు' మహాముని శిష్యుడైన 'కౌత్సుడు' రఘువును అర్థించడానికి వస్తాడు. మట్టిపాత్రలతో అర్ఘ్యపాద్యాలు ఇచ్చి, రఘువు శిష్యుని రాకకి కారణం అడుగుతాడు. గురువు గారుకోరిన పదునాలుగు కోట్ల ధనరాసులు యాచించడానికి వచ్చేను అంటాడు. అర్థి కోరిన ధనాన్ని ఇవ్వమని కుబేరునికి వర్తమానం పంపుతాడు రఘువు. కుబేరుడు రఘువు కోరికని మన్నించి ధనాగారంనిండా ధనవర్షం కురిపిస్తాడు కుబేరుడు. కౌత్సుని ఆ ధనం మొత్తం తీసుకోమంటాడు రఘువు. అంతానాకు వద్దు గురువుగారు కోరిన పదునాలుగు కోట్లు చాలంటాడు కౌత్సుడు. వారిద్దరి త్యాగనిరతికి సంతసించిన దేవతలు వారిపై పుష్ప వర్షం కురిపించి ఆశిస్సులు అందిస్తారు. రఘువు వంటి ఎందరో రాజుల చరిత్రని కాళిదాసు తన 'రఘువంశకావ్యంలో' వివరిస్తాడు. ఇక

"కాళిదాసస్య సర్వస్వం అభిజ్ఞానశకుంతలా" భారతం నుండి కథని గ్రహించి, "భార్యని మరచి పోయాడు అనే అపప్రథనుండి దుష్యంత మహారాజును కపాడుటకుగాను దుర్వాసో ముని శాపము, అంగుళీయకమనే 'అభిజ్ఞ' వృత్తాంతములను కల్పించి" రచించిన మహానాటకం అభిజ్ఞానశాకుంతలం.

ప్రపంచ సాహిత్యానికే తలమానికము, నాన్యతో దర్శనీయము. అందుకే --

**" కావ్యేషు నాటకం రమ్యం/ నాటకేషు శకుంతలా/**

**తత్రాపి చతుర్థాంకః/ తత్ర శ్లోక చతుష్టయం //**

కావ్యాలలో నాటకం, నాటకాలలో శకుంతల, అందులో నాల్గవ అంకం(రంగం), అందులో నాలుగు శ్లోకాలు.అవి-- ౧.యాస్యత్యద్య శకుంతలేతి --- ౨.పాతుం నప్రథమం.--- 3.అస్మాన్ సాధువిచింత్య --- ౪.శుశ్రూషస్వ గురూన్ కురు --- (ఇవి నాలుగు శ్లోకాల ప్రారంభాలు మాత్రమే) అనేవి ప్రసిద్ధాలు, అని పండితులచే ప్రస్తుతింపబడినది. అందుండి కొన్ని ఉదాహరణలు ;----

"శకుంతలని చూసిన దుష్యంతుని మనసులో ఓ సందేహం కలుగుతుంది. ఈమె కణ్వమహర్షి దుహిత అయితే? బ్రాహ్మణ కన్యపై నామనసుపోకూడదు, నామనసు ఆమెపై మరలుతోంది అంటే ఈమె తప్పక క్షత్రియ కాంత అయివుంటుంది. (మేనక విశ్వామిత్రుల పుత్రిక కదా క్షత్రియ పుత్రికే శకుంతములు అనగా పక్షులు పెంచుతాయి కనుక శకుంతలా అనిపేరు వచ్చింది) నా మనసులో కలిగిన సందేహానికి నామనస్సే సరియగు నిర్ణయం తీసుకొంటుంది" అని అనుకొని ఆమెని గాంధర్వవివాహం చేసికొంటాడు. ఇక్కడ కాళిదాసు ఒక అద్భుతమైన, అందరు గ్రహించ తగ్గ సుభాషిత వాక్యాన్ని చెపుతాడు. దర్శించండి- " సతాం హి సందేహ పదేషు వస్తుషు, ప్రమాణమంతః కరుణ ప్రవృత్తయః" ఏదైనా సందేహం కలిగి నపుడు మన మనస్సే మనకి ప్రమాణము. అని. ఇంకా

శకుంతలను విడచి రాజ్యానికి రథంలో వెళ్తున్న దుష్యంతుని మనస్సుని ఎంత గొప్పగా వర్ణిస్తాడో వీక్షించండి-- “ గచ్ఛతి పురశ్శరీరం, ధావతి పశ్చాత్ ------ చేతః” రథంలో ఉన్న శరీరం రథంతోపాటు ముందుకి పోతోంది, తన మనసు మాత్రం వెనుకకి ( శకుంతలవద్దకి ) పోతోంది. అది ఎలా ఉందంటే “చీనాంశుక మివ కేతో:” రథానికి పైన కర్రకి కట్టిన పట్టుజండా వలే ఉందిట. అంటే రథం ముందుకి పోతుంటే గాలివల్ల దానికి కట్టిన జెండా గుడ్డ వెనుకకి ఎగురుతుంది కదా! “ ఉపమా యత్ర సాదృశ్య లక్ష్మీరుల్లసిత ద్వయో:” అన్న ఉపమాలంకార లక్షణానికి తగిన ఉదాహరణలు కాళి దాసకవిత్వంలో కో కొల్లలు.

ఇలా ఎన్నో మరెన్నో “కాళిదాస కవితావైభావాన్ని” గూర్చి చెప్పుకోవచ్చు. కాని గ్రంథ విస్తర భీతిచే “స్థాలీ పులాక న్యాయంగా” మాత్రమే చెప్పడం జరిగింది. చదివి ఆనందించగలిగితే ‘ధన్యోస్మి’

# వ్యాస కౌముది



# నారాయణబాబు అసంకలిత రచనలు

## డా.యు.ఎ. నరసింహమూర్తి

రాయుడుగారితో పరిచయం ఉన్న ఆధునిక సాహిత్య ప్రియులు బెంగుళూరు వెళ్లినప్పుడల్లా ఆయనను ఒకసారి చూసి రావాలనుకుంటారు. వ్యాపార లావాదేవీలతో మునిగి తేలినకంటే సాహిత్య సంసర్గంలో తలమునకలయినప్పుడే మనకెక్కువ ఆనందంగా ఉంటుందంటాడాయన. నేను వెళ్లేటప్పటికి ఎప్పుడూ కనిపించిన దానికంటే నాలుగు రెట్ల ఎక్కువ సాహిత్య సంరంభంలో సమీకృత బుద్ధిగా ఉన్నడాయన, ఒకవంక జాషువా సమగ్రరచనల ప్రచురణ, ఇంకొక వంక శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి సమగ్రరచనల ప్రచురణ, వేరొక వంక కె.సభా సమగ్ర రచనల ప్రచురణ, మరొకవంక బాలగంగాధర తిలక్ సమగ్ర రచనల ప్రచురణ అనే నాలుగు ముఖాలతో కనిపించాడాయన. ఆయన పిడికిట్లో లక్ష పుస్తకాలు, ముప్ఫైవేల పత్రికలు ఉన్నాయి. కుర్చీ కదలకుండానే ఒక రచన కోసం ఎంత దూరమైనా లిప్తిలో పరుగులు తీసి శోధించి సాధించడం ఆయనకొక సాహిత్యవినోదం. నేను వెళ్లేటప్పటికి ఆయన జాషువా ''రక్తగానం'' కోసం వెతుకుతున్నాడు. అది ఇంకా పూర్తిగా దొరకలేదు. మధ్యలో శ్రీపాద ప్రసంగం వస్తే ఆయన రాసిన "రంగరాయ సమవకారం" అనే నాటకం దొరికిందా?' అని అడిగాను. వెంటనే ఆయన తన శోధన కొనసాగించి "1890 లలో ఒకటి, 1920లో ఒకటి, రెండు శ్రీరంగరాయ కదన సమవాకారం" అనే రచనలు కనిపిస్తున్నాయి. మొదటి రచన కాళ్లకూరి సాంబశివరావుది. ఇందులో 112 పుటలున్నయి. రెండవ రచన ఎవరు రాసేరో తెలియదు పేరు లేదు'' అని చెప్తూ రెండింటినీ సరిచూసిన తరువాత అది ఏమార్పూ లేని ఒకే గ్రంథం అని చెప్పారు. 'అనుభవాలు-జ్ఞాపకాలు'లో శ్రీపాద ''నా రంగరాయ సమవకారం'' అని రాయడం చూసి ఆయన వేరుగా రాసారని నేననుకున్నాను. కాళ్లకూరి సాంబశివరావు పిఠాపురం రాజావారి ఉన్నత పాఠశాలలో అధ్యాపకుడుగా 'పనిచేసాడు. వేంకట రామకృష్ణకవుల వద్ద శిష్యరికం చేసిన సందర్భంలో శ్రీపాద కొన్నాళ్లు అక్కడ ఉన్నాడు. ఆ సమయంలో పరిచయం కావడానికి అవకాశం ఉన్న కాళ్లకూరి సాంబశివరావుగారి ''శ్రీరంగరాయ కదన సమవాకారం'' అనే రూపక భేదాన్నే శ్రీపాద రంగస్థలం మీద ప్రయోగించాడా! అదే శీర్షికలో తాను స్వయంగా రాసిన ఇంకొక రూపకాన్ని ప్రయోగించాడా! అనే సందేహం ఇంకా మాలో మిగిలిపోయింది, ఇలా కొన్ని కబుర్లు కొనసాగిన తరువాత "శ్రీరంగం నారాయణబాబు రుధిరజ్యోతిని మీరు ప్రచురించకూడదా!" అని నేను వారిని అడిగాను. అంతే! ఆయన గుప్పుట తెరిచి చూపించారు.

1972లో ఆరుద్ర సేకరించిన శ్రీరంగం నారాయణబాబు వచనగీత సంపుటిని నవోదయ వారు 'రుధిరజ్యోతి' అనే పేరుతో ప్రచురించారు. నారాయణబాబు రాసిన ఏడు కథలను, మూడు నాటకలను, రెండు వ్యాసాలను సేకరించి 2012లో "శ్రీరంగం నారాయణబాబు కథలు-నాటకాలు- వ్యాసాలు" అన్న పేరుతో నేనొక సంకలనాన్ని ప్రచురించాను. అంతకు ముందునుంచి చాగంటి తులసి ''నాగయ్యగారు ప్రేమించిన మనిషి'', ''భానుమతి నీళ్లడిందంటే నేను నమ్మను'' అనే రెండు కథలకు కూడా నారాయణబాబు రాసినట్లుగా చెప్తూ వచ్చారు. నేను ప్రచురించిన పుస్తకం చూసి " నా దగ్గర ఇంకో రెండు కథలున్నాయి, మీరు వస్తే ఇస్తాను" అని అవంత్స సోమసుందర్‌గారు ఫోన్ చేశారు. రుధిరజ్యోతిలో చేరని కవితలు ఇంకా కొన్ని ఉన్నాయని ద్వారం దుర్గ ప్రసాదరావు అన్నారు. రాయుడుగారు తెరచిన గుప్పిట్లో నా సంకలనంలో చేరని మూడు కథలు, ఆరుద్ర రుధిరజ్యోతి సంకలనంలో లేని ఐదు కవితలు కనిపించాయి. అందులో మూడు కథలను నాలుగు కవితలను వెంటనే ఆయన నాకందేలా చేసారు.

ముందు కవితల సంగతి చూద్దాం. ఈ నాలిగింటిలో 'రెండుగీతాలు'' అనేది మాత్రమే అత్యాధునిక కవిత మార్గం లో ఉంది. 1943 మే 'భారతి' లో ప్రకటితమైన ఈ గేయం చివర ''రుధిరజ్యోతి నుంచి'' అని సంపాదకుడు రాయడం గమనించదగ్గ విషయం. దీనిని బట్టి 1972 కంటే ముందే 'రుధిరజ్యోతి' అనే కవితా సంకలనం ఉన్నట్లుగా మనకు తెలుస్తుంది ఆరుద్ర ఈ విషయాన్ని గూర్చి ఏమీ చెప్పలేదు. అది ప్రచురిత మయిందో లేదో కూడా మనకు తెలియదు. ఈగీతం మాత్రం కొద్దిపాటి సవరణలతో ఇంకొక శీర్షికతో "రుధిరజ్యోతి"లో మనకు కనిపిస్తుంది.

తెలుగు పాట, మాను కవిత, మిణుగురు మీట అవే మూడు కవితలు భావకవిత్వ సంప్రదాయానికి చెందినవి. అందుకే ఆరుద్ర తన రుధిరజ్యోతి సంకలనంలో వీటిని చేర్చలేదేమో! అనిపిస్తుంది. నారాయణబాబు ఇందులో తెలుగుపాటను పూడిపెద్ది వెంకటరమణయ్యతో కలసి రాయడం, మానుకవితను కాళూరి వెంకట నరసింగరావుతో కలిసి రాయడం కూడా ఆరుద్ర వాటిని వదులిపెట్టడానికి కారణం కావచ్చును. తెలుగు పాట 1935 ఫిభ్రవరి భారతిలో ప్రచురితమయింది. రెండు వరుసలలో నాలుగున్నర పుటలవరకు కొనసాగిన ఈ గేయం హిందీ వ్యతిరేకోద్యమంలో భాగంగా తెలుగుదేశ భక్తిని ప్రకటిస్తూ రాసినది. గేయమంతా మత్రాచందస్సులో ఉంది. తెలుగుభాషను, తెలుగు నదులను, తెలుగు దేశాన్ని కీర్తిస్తూ రాసిన ప్రభోదగీతమిది. అప్పటకే తెలుగు వాళ్లకు తమ భాష విషయంలో, తెలుగుతనం విషయంలో అలసత, అనాసక్తి ప్రబలినట్లు ఈ గీతం వల్ల తెలుస్తుంది. ఆ అలసతను, అనాసక్తిని వదలించుకొని తెలుగువారు కల్తీ లేని తెలుగుతనాన్ని ఆదరించి అనుసరించాలని నారాయణబాబు, పూడిపెద్ది వెంకటరమణయ్య ఈ గీతంలో చెప్పారు.

"ఆనాడేనాడో / ద్రావిద బాసకు / దండం బెట్టీ / తెలుగు తేటలో / ఈదుకు వచ్చిన / ద్రావిడులము మేము / రాజును చూచిన కళ్లా / మగణ్ణి చూస్తే/ మొత్తాలనిపించింది / తెలుగే చిత్తాలను నించింది.

అనడంలో ఈ జంటకవుల స్వస్థాన వేషభాషాభిమానం ప్రకటిత మవుతుంది.

తను అభిమానంతో పాటు సమకాలీన విషమ పరిస్థితుల పట్ల ఒక ఆక్రోశాన్ని ప్రకటిస్తూ తెలుగువారికి కర్తవ్యప్రభోదం చేయడం ఈ కవుల లక్ష్యంగా కనిపిస్తుంది.

"ఎక్కడి కక్కడె / చిక్కుల బడుతూ/ పెక్కు భాసవా/ నొక్కులు పడుతూ/ నేటికి సూటిగ/ నెగ్గుకు వచ్చిన/ తెలుగు తల్లికే/ గిడిగిళ్లూ!/ తేనె వెల్లితే / గిడిగిళ్ళూ !/ అన్నల్లారా!/ అక్కల్లారా?/ అందుకొ వచ్చిన/ హిందీ వాకిట/ బందిపెట్ట మన / ముందటి బాసను / చిందర వందర/ చేయకుడీ! / చీకటి కొట్లో / త్రోయకుడీ!" - ఇది ఈ కవుల ఆశయం. ఈ గీతంలో పూడిపెద్ది వెంకటరమణయ్య ముద్ర కంటే నారాయణబాబు ముద్ర ఎక్కువగా కనిపిస్తుంది.

శ్రీముఖ సంవత్సరాది సంచికలో నారాయణబాబు కాళూరి వేంకట నరసింగరావుతో కలసి రాసిన ఒక పద్యరచన ప్రకటితమయింది. భావకవిత యుగానికి ప్రాణసదృశమైన కాల్పనికా వేషం ఈ పద్యాలలో నిండి ఉంది. నవ్య కవితా సంప్రదాయానికి చెందిన రచన ఇది.

"జానగు ''మహాత్మ'' నడుమ విన్నాణమతడు
ఎంతొ మెత్తనౌ వలిపట్టు ఏకు నేను
తీగ సాగెడు పూత దేదీప్యమాన
మంజు మోహన సూత్రమ్ము మాదుకవిత."

ఇటు వంటి ఆరు పద్యాలు ఈ కవితలో కనిపిస్తాయి. నారాయణబాబు అత్యధునిక కవితా ప్రవర్తకుడిగా ఎంతటి ప్రాఢుడో భావకవిత్వ మార్గంలో కూడా అంతటి సర్వంకష ప్రజ్ఞను ప్రకటించిన వాడని గ్రహించడానికి ఇంత కంటే గొప్ప సాక్ష్యం వేరే అవసరం లేదు. ఆ రోజుల్లో జంట కవిత్వం రాసేవాళ్లు తమ కలయికతో సాధించిన సాహిత్య సామనస్యాన్ని వెల్లడించే మార్గన్ని అనుసరిస్తూనే గాంధేయ మార్గాన్ని సమన్వయిస్తూ వారందరి కంటే ఉత్కృష్టమైన భావపుష్టిని ప్రకటించడంలో ఈ కవుల విలక్షణత్వం ప్రకటిత మవుతుంది.

కొంపెల్లి జనార్ధనరావు సంపాదకత్వంలో వెలువడిన 'ఉదయిని' సాహిత్యపత్రికలో నారాయణబాబు రాసిన ''మిణుగురు మీటు'' ప్రచురితమయింది. ఇందులో నాలుగు పద్యాలున్నాయి. ఇది కేవలం భావనాప్రధానమైన రచన. కొందరు భావకవుల రచనలలో కనిపించే ప్రౌఢ సమాస గ్రథనం ప్రకృతి పరిశీలనా పాటవం, భావనా గాంభీర్యం ఈ రచనలో కనిపిస్తాయి

"కాల వాహిని కలుష శైవాల వేట
కాలు జారిన యానాటి కాళరాత్రి
గర్భమందున నవయు నా కమ్రగీతి
తేలిపో నొక్క చిరునవ్వు తెప్పలేదె?"-

కృష్ణశాస్త్రి, విశ్వనాథల ప్రభావంలో దిక్కు తెలియని ప్రవాహవేగంలో అటు శ్రీశ్రీ, ఇటు నారాయణబాబు గమనం లేకుండా

కొట్టుకుపోతున్న రోజులలో రాసిన రచన ఇది, అందుకే ఈ పద్యాలలో కృష్ణశాస్త్రి, విశ్వనాధుల ముద్ర ఎక్కువగా కనిపిస్తుంది.

నేను సేకరించిన ఏడు కథలకు అదనంగా ఇంతకు ముందు నాకు దొరకని ఇంకొక మూడు కథలు ఇప్పుడు దొరికాయి.ఈ మూడు కథలు రూపవాణి పత్రికలో ప్రచురితమైనవే. అవి (1) నాగయ్య ప్రేమించిన మనిషి (జన్మదినసంచిక రూపవాణి) (2) భానుమతి నీళ్లాడిందంటే నేను నమ్మను! (జూన్ 1946, రూపవాణి) (3) కులస్త్రీలు-సినిమాల్లోకి రావాలి!!!(ఆగస్టు 1946, రూపవాణి). ఈ మూడింటినీ కథలుగా పేర్కొనడానికి కొందరు అభ్యంతరపెడతారు. ఈ రచనలలో కల్పన కాలుపెట్టలేదు. ఇవన్నీ వాస్తవిక సంఘటనలు. ఆధునిక సాహిత్యంలో ఒక ప్రధానమైన దశగా అందరూ అనుకునే వాస్తవికవాదం కూడా ఈ రచనలలో లేదనాలి. తాను చూచినది చూచినట్లు, అనుభవించినది అనుభవించినట్లు నారాయణబాబు ఈ రచనలలో మనకందించాడు. అయినా ఇవి కథలుగానే ఆయన భావించాడు. కథలనే నేను నమ్ముతున్నాను. ఈ రచనలలో కథా నిర్మాణానికి సంబంధించిన మెలుకువ బాగాఉంది. అందుచేత వీటిని కథలనక తప్పదు. ఇవి కొసమెరుపు కథలు. నా దృష్టిలో కొసమెరుపు కథలు కథకుని ప్రాధమిక దశకు చెందినవిగా కనిపిస్తాయి. కానీ ప్రపంచ కథా రచయితలలో కొసమెరుపు కారణంగా ఒక వెలుగు వెలిగిన కథకులున్నారు. అందుచేత నారాయణబాబును కూడా మంచి కథకులలో ఒకడిగ జమచేయ వచ్చును.

మొదటి పర్యాయం వైద్య విద్యార్థిగా మద్రాసులో కొన్నాళ్లుండిన నారాయణబాబు రెండువదశలో రచయితగా, అందులోనూ సినిమా రచయితగా ఒక వ్యావృత్తిని సంపాదించుకోవడానికి మద్రాసులో కొన్నాళ్లున్నాడు. ఆ సందర్భంలో సినిమా రంగానికి చెందిన ప్రముఖులలో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ సంబంధాల వలన కలిగిన అనుభవాలు ప్రేరణగా నారాయణబాబు ఈ మూడు కథలను రాసాడు. సినిమా రచయితగా నిలదొక్కుకోవాలనే ఆయన కల ఫలించలేదు కానీ ఒకటి, రెండు సినిమాలలో నటించకలిగాడు. సినిమా రంగంలో  ఉన్న సంబంధాల కారణంగానే కలకత్తా బొంబాయి నగరాలకు కూడా వెళ్లివచ్చాడు. అవునో, కాదో, స్పష్టంగా తేల్చి చెప్పలేము గానీ శ్రీశ్రీ , నారాయణబాబుల మధ్య వైమనస్యం ఏర్పడడానికి ఈ సినిమా సంరంభం కూడా ఒక కారణం కావచ్చును. శ్రీశ్రీ నారాయణబాబు కంటే కడు సమర్థుడు. అందుకే ఆయన చివరి దశ వరకు సినిమారంగంలో నిలదొక్కుకో గలిగాడు. ఆ చాతుర్యం కొరవడిన నారాయణబాబు స్వల్పవ్యవధితో కూడిన ప్రయత్నం తరువాత ఆ రంగం నుండి నిష్క్రమించక తప్పలేదు.

తెలుగు సినిమా నిలదొక్కు కున్న ప్రాధమికదశలో నాగయ్య గొప్ప నటుడుగా పేరుపడ్డాడు. 'మీరాబాయి' అనే హిందీ చిత్రంలో నటించిన కారణంగా నాగయ్య నటనా సామర్థ్యం భారతీయ ప్రేక్షకుల కందరికీ తెలిసివచ్చింది. ఆయన సంపన్నుడయాడు. రేణుకాస్టుడియో అధిపతి కూడా అయ్యాడు. కాలక్రమంలో ఆ సంపదంతా  హరించుకు పోయింది. అందుకుగల కారణాలలో ఆయన ఔదార్యం ఒకటి . ఆ రోజుల్లో నాగయ్యగారి ఇల్లు ఒక సత్రంలా ఉండేదట. ఎవరు పడితే వారు వచ్చి తిని పోతు ఉండేవారట. ఇందరికీ వంటచేయడానికి నాగయ్య గారు ఒక వంట మనిషిని కుదుర్చుకున్నారు ఆ వంటమనిషి నాలుగేళ్లుపాటు వంటపనిచేసి ప్రతిరోజూ ఒక లెక్కాజమా లేకుండా వచ్చిపోయేవారికి వండిపోయలేక నాగయ్యగారితో సంబంధం వదలుకోవడానికి ఒత్తిడిచేయడం మొదలయింది .

ఇది ఇలా ఉండగా సినిమా ప్రముఖుల మీద జనాకర్షకాలైన అవాకులు-చెవాకులు రాయడం పనిగా పెట్టుకున్న ఒక రెడ్డి మద్రాసు వచ్చి నారాయణబాబును అటువంటి సమాచారమేదైనా ఉంటే చెప్పమని అడగడంతో నారాయణబాబు ఆయనను నాగయ్య ప్రేమించిన వంటమనిషి దగ్గరకు తీసుకుపోయి తెరవెనుక సంభాషణను ఇలా వినిపించాడు.

"నీవు నాగయ్య గారి పోషణలో వుండి ఎంత కాలమైంది?"

"నాలుగు సంవత్సరాలు" అని జవాబొచ్చింది.

"నీకు పెండ్లి చేస్తామని, ఇల్లు కట్టించిస్తామని నాగయ్యగారన్నారా?"

"ఆహా ముమ్మాటికి"

"ఇప్పుడేమంటున్నారు నాగయ్యగారు?"

"నామీదేమో చెడ్డమాటలు విన్నారట నిజమే. ఇంతమంది భోజనానికుంటే చెయ్యడం కష్టమని నేనన్నమాట నిజమే. వారి సంరక్షణకు లోటుచేసి, వారి సౌఖ్యానికి తక్కువచేస్తే నన్ను విసర్జించాలి, కాని లోకులకందరికీ చేయలేను అంటే నన్నన్యాయం చేస్తాననడం వారికి తగనిపని. ఏం చేస్తామింతకూ.. నారాత ఎలాగుంటే అలాగుంటుంది." అని జవాబిచ్చింది

వంటమనిషి వదలుకోవడం నాగయ్యకిష్టం లేదు. నాగయ్యను వదలి పోవడం వంటమనిషికిష్టంలేదు. ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కానీ ఒకరినొకరు వదులుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇది రెడ్డికి కావలసిన ఆసక్తికరమైన సమాచారం.కానీ ఈ కథలో ఒక గమ్మత్తును ప్రవేశపెట్టాడు నారాయణబాబు. వంటమనిషంటే ఆడదైనా కావచ్చును, మగవాడైనా కావచ్చును. నాగయ్యగారు ప్రేమించిన వంటమనిషి 'వంటవాడు' అని చేర్చడం ఈ కథలోని కొసమెరుపు. కేవలం రెండు పుటల కథలో ఇంత చక్కటి కథానిర్మాణ కౌశలాన్ని కనబరచిన నారాయణబాబును కథకుడు కాదని గానీ, ఇది కథ కాదనిగానీ ఎవరనగలరు?

'భానుమతి నీళ్లాడిందంటే నేను నమ్మను!' అనేది ఇంకొక కథ, ప్రఖ్యాత నటీమణి భానుమతికి విజయనగరానికి చెందిన ప్రసిద్ధ నాటకకారుడు మల్లాది విశ్వనాథ కవిరాజు గురుతుల్యుడు. భానుమతికి హాస్యమంటే ఇష్టం. విశ్వనాథ కవిరాజు నాటకాలన్నీ హాస్యప్రధానమైనదే. ఆ నటీమణి ఇంటికి దగ్గరగా ఉన్న కారణంగా విజయనగరానికే చెందిన నారాయణబాబుతో ఆమెకు పరిచయమేర్పడింది, నారాయణబాబుకు సినిమా కథ రాయాలనే ఉబలాటం ఎక్కువగా ఉండేది. అప్పుడు ఇప్పుడు కూడా ఒక కథ సినిమాకథగా పనికి వస్తుందా! రాదా! అనే అంశాన్నీ గూర్చి నిర్మాత, దర్శకుడు, నటుడు, రచయిత కలసి చర్చించుకునే వాడుక ఉంది. ఆ ప్రయత్నంలో భాగంగానే నారాయనబాబు భానుమతికి ఒక కథను వినిపించడం కోసం చాలా సార్లు ఆమె ఇంటికి వెళ్లాడు. తాను రాసిన కథను ఆమెను వినిపించలేకపోయినా ఆమె పరిచయం కారణంగా ఇంకొక కథ రాయడానికి తగిన ప్రేరణను పొందాడు. ఈ కథలో నారాయణబాబు, భానుమతి, ఆమె తల్లిదండ్రులు, చెల్లెలు, భానుమతి తండ్రికి దూరపు బంధువైన వెంకటేశ్వర్లు పాత్రలు. భానుమతి తండ్రి బ్రాహ్మణుడు, కర్మిష్ఠి. ముసలివాడై మంచాన పడ్డవాడు. ఎదిరించే శక్తి లేకపోయినా అనాచారాన్ని భరించలేని వాడు, భానుమతికొక వింత అలవాటు ఉండేది. వారినికొక్కసారైనా స్నానం చేయకపోవడం. ఆ అలవాటు. అది తల్లిదండ్రులలిద్దరికీ

కంటగింపుగా ఉండేది, వాకిట ఉండవలసిన మూడు రోజుల తరువాత కూడా భానుమతి. స్నానం చేయకుండా ఇంట్లో కలిసిపోవడంతో పెద్ద రగడ జరిగింది. ఆ గృహచ్ఛిద్రం కారణంగా దూరపు బంధువు వెంకటేశ్వర్లు భానుమతి ఇల్లు వదిలి బర్మాకు పోవలసివచ్చింది. ఆ తరువాత కొన్నాళ్లకు భానుమతి తనకు నచ్చిన ఒక యువకుణ్ణి పెండ్లాడి నీళ్లి పోసుకుంది. బర్మాలో ఉన్న వెంకటేశ్వర్లు నారాయణబాబు ద్వారా ఈ సమాచారం తెలుసుకొని "భానుమతి నీళ్లాడిందంటే నేనమ్మను"- అంటాడు. పలుకుబడి ఆధారంగా వ్యక్తమైన కొసమెరుపు ఈ కథకు ప్రాణం పోసింది. నీళ్లు పోసుకోవడం, నీళ్లాడడం, నెలదప్పడం వంటి తెలుగు పలుకుబడులు గర్భవతి కావడమనే అర్థాన్ని సూచిస్తాయి. ఇక్కడ నీళ్లాడిందనే జాతీయానికి స్నానం చేసిందని మాత్రం అర్థం కాదు. ఈ కథలోని చమత్కారం.

చంటి బిడ్డ నెత్తుకొని జీవికకోసం సినిమారంగంలోకి అడుగు పెట్టిన నటి షావుకారు జానకి. సినిమాల్లో చేరిన ముందు, వెనుకా కూడా ఆమె కులస్త్రీయే. కానీ సినిమాలలో చేరినందుకు ఆమె బంధు వర్గమంతా ఆమెను వెలివేసింది. ఇది వాస్తవం. నారాయణబాబు ఈ విషయాన్నే కొంత మార్పుచేసి రాసాడో లేదా ఇంకొక నేపథ్యగాయని జీవితంలో కూడా ఇటువంటి విషమసంధి ఏర్పడిందో మనకు తెలియదు గానీ, ఒక నేపథ్యగాయని తన జీవన సంఘర్షణ ఇతివృత్తంగా రాసిన ఒక పాటను పాడడానికి సిద్ధపడి మానసిక సంఘర్షణ కారణంగా రెండు, మూడు ప్రయత్నాలలో కూడా ఆ పాటను పాడలేక బిగ్గరగా ఏడుస్తూ రికార్డింగురూము బయటకు పరుగు తీయడం ఇతివృత్తంగా నారాయణబాబు ఇంకొక కథ రాసాడు, ఆ కథ పేరు "కులస్త్రీలు- సినిమాల్లోకి రావాలీ???". సినిమారంగంలో సహాయదర్శకుడు ప్రవేశించడానికి నారాయణబాబు చేసిన ప్రయత్నం విఫలమవడానికి గల కారణాలలో ఒక కారణం ఈ కథలో కనిపిస్తాయి.

నారాయణబాబు మంచి కవి అని చెప్పగలిగినంత నికార్సుగా మంచి వచనరచయిత అని చెప్పలేము. ఇతివృత్తాన్ని ఎంచుకోవడం, కథను అల్లడం, కథానిర్మాణం చేయడం, శిల్పదృష్టి అన్నీ బాగానే ఉంటాయి. కానీ అతని భాషాప్రయోగ విషయంలో కొంత తిరకాసు కనిపిస్తుంది. ఇతరుల కంటే భిన్నమైన వచనశైలిని సృష్టించాలని నారాయణబాబు ప్రయాసపడ్డాడు. ఆ ప్రయాసం సాధనదశలోనే మిగిలిపోయింది గానీ సిద్ధిని పొందలేదు.

"ఉదయాన్నే కాఫీచేసి లజ్జులో నెం.12 బస్సు కోసం తపస్సు ప్రారంభించాను"

"మాంబళంలో దిగేక ఊడిపిలో కాఫీ కాస్త వేశాక స్థిమితంగా చెప్పతాను"

"కాఫీ ఆరాధన ప్రారంభించేసరికి అతడు ఇట్లా అందుకున్నాడు"

"కాఫీ ముగించి, సిగరెట్లు అధరాలనలంకరించి 'రేణుకా'కి వెళ్ళాం"

కాఫీ తాగడమనే ఒక అంశాన్ని విలక్షణంగా చెప్పడం కోసం ఒకే కథలో నారాయణబాబు నాలుగు రకాలుగా సాధనచేయడం ఇక్కడ చూస్తాము.

మహాగడ్డు, ముందుభావిలో, బంధువుడు, అర్థాన్నం చేస్తారో, చూపుచాప, నన్నీ మనిషి విసర్జించలేదు, అంటున్నాది, హాస్యంగా మాట్లాడినా అనాచారం చేద్దామని- వంటి పదబంధాలు, వాక్యాంశాలు ఒక ప్రత్యేకశైలి కోసం నారాయణబాబు

అనుభవించిన తపననే తెలియజేస్తాయి. 'ఉదారుడు' అనడం తెలిసికూడా 'ఉదారవంతుడు' అని రాయడం ఇందులో భాగంగానే కనిపిస్తుంది.

"అప్పుడే ప్రముఖ తారలు పాతికమందికి పైగా వారి జీవితంలో ప్రేమగాథల్ని సంపాదించాను కష్టపడి."

"నేనవ్వుకుంటూ యింటికెళ్ళి పోతూ చిత్రంగా ఉంటుంది మానవస్వభావం"

"గౌరమ్మవా మైకు కూడా వారి సమక్షంలో పెట్టబడింది. కొందరి నటకుల భావిజీవితాన్ని సాభాగ్యవంతంగా చేయడానికీ కట్టబడిన రక్షరేకులా, నిదురపోతున్న స్నేహితునిలా ద్యోతకమవుతుంది. మరికొందరికి అంటే నిర్భాగ్యులకు, భావిజీవితం చీల్చిచెండాడె, భయద శార్దూలాలతో కూడిన గుహా గహ్వరంలా తోస్తుంది."

కథనశైలికి విరుద్ధంగా ఉండే కృతకధోరణికి చెందిన ఇటువంటి వాక్యాలు నారాయణబాబు వచనరచనలో తక్కువగానైన ఉంటాయి. ఉర్ధ్వబాహుదు, శిరోజ సంస్కరణం, కలగుండు పెట్టు, చూపోపమి- వంటి బరువైన మాటలను కావాలనే నారాయణబాబు తన వచనంలో వాడుకచేస్తాడు.

"మానవ మానసికంలో ప్రచ్ఛన్నంగా ఉండే పురాతన అనాగరిక మానవుడు వేధిస్తాడు". - ఇలాంటి క్లిష్టమైన వాక్యాలు చోటు కాని చోట కనిపిస్తాయి.

"నాకు చిన్నపుటినుంచి పాటపాడడం పుట్టుకలోనే వచ్చింది."- ఈ వాక్యంలో పుట్టుకతోనే అనిగానీ చిన్నపుటి నుంచి అనిగానీ ఉంటే సరిపోతుంది. నారాయణబాబు వచనంలో ఇటువంటి వాక్యాలు ఇంకా ఉంటాయి. ఇదంతా నారాయణబాబు శైలిలో మనం ఉపేక్షించవలసిన పార్శ్వం . క్లుప్తము చతురము అయిన సంభాషణశైలి, ఆలంకారికత నారాయణబాబు వచన శైలికి వన్నె తెచ్చిన సందర్భాలెన్నో ఉన్నాయి.

"గాలివాన వెలిసిన తరువాత పూలతోటలా కనపడుతున్నాది అమ్మాయి"

"రంగులతో రచించుకున్న నా భావిపటం మీద అమాయకంగా కొక్కిరి గీతలు గీసిన చంటిపిల్లలా కనిపించింది." వంటి సరళములు సరసములు అయిన వాక్యాలతో కూడినశైలి కూడా నారాయణబాబు వచనంలో ఎక్కువగా కనిపిస్తుంది.

●●●




# నారాయణీయం

- ఆర్. శర్మ దంతుర్తి

[తెలుగులో పోతన భాగవతం రాసినట్టే కేరళలో పుట్టిన మేల్పుత్తూర్ నారాయణ భట్టాత్తిరి (1559-1632) సంస్కృతంలో నారాయణీయం రాసారు. ఇది ప్రతిరోజూ గురువాయూర్ లో పారాయణ చేసే గ్రంథం. ఇప్పుడు చెప్పబోయేది నారాయణీయం రాయడానికి వెనకనున్న కథే. ఇది కొన్నేళ్ళ క్రితం ఒక మళయాళీ భక్తుడు ఇంటర్నెట్ న్యూస్ గ్రూపులో పోస్ట్ చేసినది (వెబ్ సైట్లూ, గూగుల్ అవీ అందుబాటులేని రోజుల్లో). దురదృష్టవశాత్తూ ఎంత గాలించినా ఆయన పేరు దొరకలేదు. ఈ కథ క్రెడిట్ అంతా ఆయనదే. పేర్లూ, కథా ఎక్కడైనా తప్పుగా రాస్తే ఆ తప్పులన్నీ పూర్తిగా నావి.]

నారాయణ భట్టాత్తిరి (భట్టాద్రి అని కొందరంటారు) కేరళలో పుట్టిన మహామహుల్లో ఒకరు. చిన్న వయస్సులోనే వ్యాకరణ మీమాంసాలూ అన్నీ చదివి వడకట్టిన మేధావి. బాగా ఆచారవంతుడైన బ్రాహ్మణుడు కూడా. రోజూ అనుష్టానం, జప ధ్యానాదులూ తప్పనిసరిగా చేసే నిష్ఠాగరిష్టుడు.

అయితే పెళ్ళి అవ్వగానే ఇవన్నీ మానేసి బాగా బద్ధకస్తుడిలాగా తయారయేడని చెప్తారు. ఇంట్లో వాళ్ళు ఇతన్ని "బాగు చేయడం" కోసం మేనమామ అయిన అచ్యుత పీషారతి (ఈ పేరు పీషాద్రి అవ్వొచ్చేమో కూడా) దగ్గిర జేర్పించారు. అక్కడ ఆయన్నే గురువుగా ఒప్పుకుని మళ్ళీ గాడిలో పడేసరికి గురువుకి పక్షవాతం (కీళ్ళ వాతం అని కొంతమంది అంటారు) వచ్చింది. ఆ దెబ్బకి ఆయన మంచంలో పడ్డారు. ఆయన రోజూ పడే బాధ చూడలేక మేల్పుత్తూర్ గురువాయూరప్పన్ ని వేడుకున్నారుట - ఆ వ్యాధి తనకి మార్చమని. ఆయన అప్పట్లో గురువుగారికంటే చిన్నవారు కనక వ్యాధి కుదురుతుందనో, కుదుర్చుకోగలను అనే ధీమాతోనో అలా అడిగారు. వారు కోరుకున్నట్టుగానే వ్యాధి శిష్యుడికి సంక్రమించి గురువుగారు పూర్తిగా కోలుకున్నారు. అయితే ఇప్పుడు మేల్పుత్తూర్ కి సంక్రమించిన ఈ వ్యాధి ముందు అనుకున్నట్టుగా తగ్గలేదు.

ఈ వ్యాధికి విరుగుడు కనుక్కుంటూ ఇలాగే జీవితం సాగిస్తున్నప్పుడు అప్పట్లో బాగా ప్రాచుర్యంలో ఉన్న పండితుడైన ఎఝ్హుథాచన్ ని కలవడం తటస్థించింది. ఎఝ్హుథాచన్ సంగతి అంతా విని "చేపతో మొదలు పెట్టు." అని చెప్పేరుట క్లుప్తంగా. దానితో మేల్పుత్తూర్ కీ, ఆయన వెంటనున్నవారికీ చాలా ఆశ్చర్యం వేసింది - ఇంతటి ఆచారవంతుడైన బ్రాహ్మణ్ణి చేపలు తినమంటున్నారేమిటీ అని. తర్వాత మళ్ళీ కలిసి మీరు చెప్పినది అర్ధం కాలేదు, కాస్త విడమర్చి చెప్పండి అన్నప్పుడు, “చేపతో మొదలు పెట్టు అనడంలో నా అంతర్యం ఏమిటంటే నువ్వు సంస్కృతంలో ఉద్ధండమైన పండితుడివి, మత్స్యావతారంతో మొదలుపెట్టి భాగవతం రాయమని” అని చెప్పేరు.

సరే అప్పుడు మొదలుపెట్టి ఒక్కో దశకం రాసుకుంటూ రోజూ గురువాయూరప్పన్ గుళ్ళో కూర్చుని చదవడం మొదలుపెట్టారు. వ్యాధి మెల్లిగా తిరుగుముఖం పట్టింది. నారాయణీయం ఒక మహోన్నత సృష్టి. ఉదాహరణకి రెండో దశకంలో ఆయన రాసిన భగవత్ సౌందర్యంలో కింది స్లోకం చూద్దాం

"యత్ త్రైలోక్య మహీయసోపి మహితం సమ్మోహనం మోహనాత్
కాంతం కాంతినిధానతోపి మధురం మాధుర్యధుర్యాదపి
సౌందర్యోత్తరతోపి సుందరతరం త్వద్రూప మాశ్చర్యరతో
ప్యాశ్చర్యం భువనే న కశ్య కుతుకం పుష్ణాతి విష్ణో! విభో!" [2-03]

(ముల్లోకాలలోనూ పూజనీయమైన అన్నింటికంటే పూజనీయమూ, మోహనములు అయిన అన్నింటికంటే సమ్మోహనమూ, కాంతినిధిల్లో కెల్ల కాంతమూ, మధుర పధార్ధాలలో కెల్ల మధురమూ, చక్కదనాల్లో చక్కదనమూ వింతలలోకెల్ల వింతా అయిన నీ రూపం ఎవరికి కనువిందు చేయదు?)

అయితే మేల్పుత్తూర్ కి నారాయణీయం రాసేటప్పుడు కొన్ని విషయాలు అవగతం అయ్యేవి కాదు. ఉదాహరణకి, భక్తుల్ని కాపాడే విష్ణువు, అత్యంత సుందరమైనవాడూ అయిన భగవంతుడు అంత కౄరంగా నృసింహావతారం ఎలా ధరించగలిగేడు? ఈ రూపం ఎలా ఉంటుంది అనేది ఊహకి అందనప్పుడు ఆయన గురువాయూరప్పన్ దగ్గిరకి వెళ్ళి "ఇదిగో కృష్ణా నేను ఇలా ఇది రాస్తున్నాను కానీ నాకు నువ్వు అలా నృసింహావతారం ఎలా ధరించావో అర్ధం కాలేదు. ఆ రూపం గురించి ఎలా రాయాలి?" అని అడిగేవారు. అప్పుడు గురువాయూరప్పన్ ఆయనికి కావాల్సిన రూపం చూపించేవారు. అదిచూసాక సందేహాలన్నీ తొలిగిపోయి కావ్యం ముందుకి నడిచేది. అయితే మొత్తం మీద ఈ నారాయణీయం "గురువాయూరప్పన్ చెప్తే" మేల్పుత్తూర్ రాసిందే; ఎందుకంటే తనని రాయమని ఎఝ్హుథాచన్ చేత చెప్పించిందీ ఆయనే; తర్వాత గ్రంథం సాగనప్పుడు ఎలా రాయాలో చెప్పి ముందుకి నడిపించిందీ ఆయనే. అందుచేత నారాయణీయం గురువాయూర్ కృష్ణుడిదే. మేల్పుత్తూర్ ఒక గొప్ప పండితుడే కానీ గురువాయూరప్పన్ చెప్పకపోతే

ఆయనేమీ చేయగలిగేవాడు కాదు. వ్యాధి పూర్తిగా కుదిరిపోయింది. నారాయణీయం రాసేసరికి మేల్పుత్తూర్ ముప్ఫై ఏళ్ల కన్నా చిన్నవారు.

ఇలా మొత్తం కావ్యం పూర్తిచేసి రోజూ కృష్ణుడి ముందు పారాయణ చేసేవారు. గుడికి వచ్చే అశేష ప్రజానీకం రోజూ దర్శనానికి వెళ్ళే ముందు ఈ నారాయణీయం వినడం, ఆ తర్వాత లోపలకి దర్శనానికి వెళ్ళడం జరుగుతూ ఉండేది. ఈ ప్రజానీకం అనే "ఆహా, ఓహో" లతో మేల్పుత్తూర్ కి ఎంత గొప్ప గ్రంథాన్ని రాసానో కదా అనే అహంకారం మొదలైంది.

ఇదిలా ఉండగా ఆ రోజుల్లోనే (1547-1640) పూంతానం (పుందరం అని కొందరంటారు) అనే ఒకాయన ఉండేవారు. ఆయనకి పెళ్ళైనా పిల్లలు పుట్టలేదు చాలాకాలం వరకూ. గురువాయూరప్పన్ ని చాలాకాలం ప్రార్థించాక 1586 లో ఒక కొడుకు పుట్టాడు. పుట్టిన ఆనందంలో అందర్నీ పిలిచేరు పండగ జరుపుకోవడానికి. అయితే ఈ శుభకార్యం జరగడానికి ఒక గంటముందే పుట్టిన పిల్లవాడు చనిపోయేడు. ఆ దుఃఖంలో పడి పూంతానం "కుమారహరణం"(సంతానగోపాలం) గురువాయూరప్పన్ సన్నిధిలో పారాయణం చేయడం మొదలుపెట్టారు.మెల్లిగా కొడుకుపోయిన దుఃఖం లోంచి బయటపడి మొత్తం తన సర్వశక్తుల్నీ గురువాయూరప్పన్ కే కేటాయించేవారు పూంతానం. పూంతానం తొంభై ఏళ్ల పై చిలుకు దాకా మళయాళంలో భాగవతం పారాయణ చేసేవారుట. సరిగ్గా ఇదే సమయానికి మేల్పుత్తూర్ గురువాయూర్ లో నారాయణీయం రాయడం, గుడిలో దాని పారాయణ జరుగుతూ ఉండేది.

పూంతానంగారు రాసిన జ్ఞానప్పన, భాసకర్ణామృతం, ఆనందకర్ణామృతం అవీ మళయాళంలో రాసినవి. అయితే అవి పూర్తి భక్తిభావంతో ఊగిసలాడే కావ్యాలు. ఆయన పెద్ద సంస్కృత పండితుడు కాదు. ఒకసారి 'జ్ఞానప్పన' పట్టుకుని మేల్పుత్తూర్ భట్టాత్తిరి గారి దగ్గిరకి వచ్చేడు - ఆయనకి చూపించి ఏమంటారో కనుక్కుందామని. మేల్పుత్తూర్ అప్పటికి బాగా ప్రాచుర్యం పొంది ఉన్నవారు. అయితే జనం కొట్టే ఆహా ఓహో లతోనూ, సంస్కృతం ఒక్కటే మంచి భాషా మిగతావన్నీ పనికిరానివీ అనే భావాలు వంటబట్టడం చేతా పూంతానం పట్టుకొచ్చిన ఈ కావ్యం ఆయనకి చూడాలనిపించలేదు. కొంత నిర్లక్ష్యంగా "భగవంతుడి విభూతి మళయాళం వంటి భాషలు ఎలా పట్టుకోగలవు? దానికి ముందు సంస్కృతం నేర్చుకో, సంస్కృతం ఒక్కటే సరైన భాష" అని ముక్కస్య ముక్కార్థ గా చెప్పేసి పంపించేసారు. అందరి ముందూ ఇలా మాట్లాడ్డంతో పూంతానం సిగ్గుపడి వెళ్ళిపోయేడు.

అయితే ఆ రోజునుంచీ ప్రతీ రోజూ నారాయణీయం పారాయణ చేస్తున్నా మేల్పుత్తూర్ తనకి ముందొచ్చిన వ్యాధి తిరగబెట్టడం గమనించేరు. ఓ రోజు ప్రొద్దుటే గుడిలో పారాయణ చేస్తూంటే ఒక ఇరవై ముప్ఫై ఏళ్ళ మధ్యలో ఉండే యువకుడు ఈయన చేసే పారాయణ ఏమీ వినిపించుకోనట్టూ తిన్నగా ఆలయంలో దర్శనానికి వెళ్ళబోయేడు. మేల్పుత్తూర్ కీ, కూర్చుని వింటున్నవాళ్ళకీ ఆశ్చర్యం వేసింది. అప్పుడు మేల్పుత్తూర్ అన్నాడు.

"నీకు తెలియదా? ఇక్కడకొచ్చే అందరూ ముందు నేను రాసిన ఈ నారాయణీయం విని ఆ తర్వాత దర్శనానికి వెళ్తారని?"

దానికా యువకుడు "ఆ తప్పుల తడక వినడం ఎందుకూ? గుళ్ళో భగవంతుడు ఎదురుగా ఆయన లీలలు చూపిస్తో ఉండగా?" అని సమాధానం చెప్పేడు

ఈ మాట విని మేల్పుత్తూర్ కి తల కొట్టేసినట్టైంది. తప్పుల తడకా? మేల్పుత్తూర్ తో పాటు కూర్చుని వింటున్న వాళ్ళకి కలిగిన విభ్రాంతి అంతా ఇంతా కాదు. కోపం కూడా వచ్చింది. వాళ్లకి. ఎందుకంటే నారాయణీయం అప్పటికే బాగా ప్రాసస్త్యం పొందిన గ్రంథం. అదీగాక ఆ రచన మేల్పుత్తూర్ వ్యాధి కుదిర్చిందని అందరికీ తెల్సిన, జగమెరిగిన సత్యం.

"అయితే నువ్వు పెద్ద గొప్ప పండితుడివా? ఇందులో తప్పులు చూపించగలవా?" అంటూ సవాలు విసిరాడు మేల్పుత్తూర్.

"తప్పకుండా, మీరు చదవడం మొదలు పెట్టండి, నేను తప్పులు చూపిస్తాను" అన్నాడా యువకుడు.

మేల్పుత్తూర్ చదువుతూంటే మొదటి లైనులో ఒక తప్పూ, రెండో లైన్లో రెండూ, మూడో లైన్లో మూడూ, నాలుగో లైన్లో నాలుగూ ఇలా తప్పులు చూపించేడు. ఆ యువకుడు చూపించిన తప్పులకీ అతని సంస్కృత పరిజ్ఞానానికీ మేల్పుత్తూర్ కీ అక్కడున్న శ్రోతలకీ బుర్రలు తిరిగిపోయాయి. సభ పూర్తిగా భంగమైంది. మేల్పుత్తూర్ కి ఆ రోజు తీవ్ర అవమానం జరిగింది. సాక్షాత్తూ ఏ దివ్య సన్నిధిలో కావ్యం పూర్తిచేశాడో అదే గురువాయూరప్పన్ సన్నిధిలో అవమానించబడ్డాడు అందరి ముందూ . వాళ్లని అలా వదిలేసి యువకుడు లోపలకి వెళ్ళిపోయేడు.

ఆ రోజు మేల్పుత్తూర్ ఎంతో చింతించారు. రాత్రి కలలో గురువాయూరప్పన్ కనిపించి చెప్పేడు.

"ఆ గ్రంథం ఎవరు రాయమంటే రాసావు? నేను చెప్పి, నా లీలలు ప్రత్యక్షంగా చూపించి రాయించుకున్నాను నీ చేత. నువ్వొక రాసేవాడివి మాత్రమే అని స్పృహ లేకుండా పోయింది నీకు. అది నేను రాసాననే గర్వం ఎందుకొచ్చింది? అది ఉద్గ్రంథం అయితే ఆ గొప్పదనం నీదేనా? అందులో ఒప్పులుంటే అవి నావి. తప్పులు కూడా నావే. ఎందుక్కాదు? సంస్కృతం తప్ప వేరే భాషల్లో ఏమీ గొప్పదనం లేదనీ పూంతానంతో అన్నావు కదా? నువ్వు పూంతానం అంత గొప్ప భక్తుడివా? నువ్వు రాసే సంస్కృత విభక్తులకన్నా పూంతానం భక్తి ఎంత నిర్మలమైందో నీకు తెలుసా? "

అప్పటికి మేల్పుత్తూర్ కి జ్ఞానోదయం అయింది. ఆ రోజు పొద్దున వచ్చిన యువకుడు గురువాయూరప్పన్ అని గ్రహించాడు. తెల్లవారుతూనే పూంతానం దగ్గిరకి వెళ్ళి క్షమాపణ కోరి ఆయన గ్రంధం తెప్పించి చదివారు. అప్పట్నుంచీ నారాయణీయం, పూంతానం రచించిన గ్రంథం; ఈ రెండూ గురువాయూరప్పన్ సన్నిధిలో చదవడం సాగించారు. అయితే పూంతానంకి సంస్కృతం రాదన్న తేలికభావం ఇంకా పూర్తిగా పోలేదు మేల్పుత్తూర్ కి. అందుచేత పూంతానంచేత రోజూ విష్ణుసహస్రనామం పారాయణ చేయించేవారు గుడి ప్రాంగణంలో. పూంతానం కష్టపడుతూ చదువుతూంటే ఒకసారి

అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమర ప్రభుః

విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః

అనే శ్లోకం చదువుతూ పూంతానం పద్మనాభో- మరప్రభు అని విడివిడిగా చదివారు. సంస్కృతం పలకడంలో దాన్ని మరప్రభు అంటే "చనిపోయిన వాళ్లకి ప్రభువు" అనీ, "చెట్లకి ప్రభువు" అనీ అర్ధాలు తీయొచ్చు (మళయాళంలో). అప్పుడు మేల్పుత్తూర్ కోపం వచ్చి మళ్ళీ పూంతానం కి సంస్కృతం రాకపోవడాన్ని, "అమరులకి, అంటే దేవతలకి ప్రభువయ్యా కృష్ణుడు, మరులకీ చెట్లకీ కాదు" అంటూ వెక్కిరించడం మొదలు పెట్టారు.

అప్పుడొక అశరీరవాణి వినిపించింది "మేల్పుత్తూర్, నేను ముల్లోకాలకీ ప్రభువునైనప్పుడు అమరులకీ ప్రభువునే, మరులకీ ప్రభువునే కదా? అలాగే చెట్లకికూడా ప్రభువునే. అందుచేత పూంతానం తప్పుగా చదివినా అది నిజమే."

దాంతో మేల్పుత్తూర్ కి పూంతానం ఎంతటి భక్తుడో అర్ధమైంది. మళ్ళీ ఎప్పుడు ఆయన్ని వెక్కిరించడానికి సాహసించలేదు.

ఇప్పటికీ నారాయణీయం, పూంతానం రచించిన మళయాళ గ్రంథం గురువాయూరప్పన్ దగ్గిర రోజూ పారాయణ చేస్తారు. నారాయణీయంలో మచ్చుకకి కొన్ని పంచదార గుళికలు చూడండి.

తా మక్షీణాం బలిగర ముపా కర్ణ్య కారుణ్య పూర్ణో
ప్యస్యోత్సేకం శమయితుమనా దైత్యవంశం ప్రశంసన్
భూమిం పాదత్రయ పరిమితాం ప్రార్ధయమాసిథ త్వం
సర్వం దేహీతి తు నిగదితే కస్య హాస్యం న వాస్యాత్ [31-2]

(బలి ఏమి కావాలో కోరుకో అని ఉదారంగా అడుగుతూంటే అతని వంశాన్ని కొనియాడుతూ గర్వం నశింపచేయడానికి మూడడుగుల నేల మాత్రం ఇమ్మన్నావు. అలా కాకుండా నీకున్నదంతా ఇచ్చేయి అని అడిగితే అందరూ నవ్విపోరూ?)

జాడ్యేన బాలక గిరాపి కిలాహమేవ
శ్రీవాసుదేవ ఇతి రూఢమతి శ్చిరం సః
సాయుజ్యమేవ భవదైక్యధియాగతో భూత్
కోనామ కస్య సుకృతం కథమిత్యవేయాత్ [83-2]

(జాడ్యం చేత - అంతే బుద్ధిలేక - నేనే వాసుదేవుడ్ని అని ఎగిసిపడి, పౌండ్రక వాసుదేవుడు చేసిన నీ సారూప్యభావనచేతనే సాయుజ్యసిద్ధి పొందాడు. స్వామీ, లోకంలో ఏ జీవి ఏ పుణ్యం చేసుకుందో చెప్పడం ఎవరితరం?)

తపస్తప్త్వా ఘోరం స ఖలు కుపిత స్సప్తమదినే
శిర శ్ఛిత్వా సద్యః పురహరముపస్థాప్య పురతః

అతిక్షుద్రం రౌద్రం శిరసి కరదానేన నిధనం

జగన్నాథా ద్వవ్రే భవతి విముఖానాం క్వ శుభధీః [89-4]

(శకుని కొడుకు వృకుడు తపస్సు చేసి ఏడవ రోజునే శివుడు ప్రసన్నం కాలేదని తల నరుకుకొని రుద్రుని ఎదుటకు రప్పించుకున్నాడు. అప్పుడు తానెవరి నెత్తినైనా చేయి పెడితే వాళ్ళు చావాలని అతి హేయమైన వరం కోరేడు ఆ జగన్నాథుణ్ణి. స్వామీ నీకు విముఖులైన వారికి మంచి బుద్ధులు ఎలా లభిస్తాయి?)

మేపుత్తూర్ నారాయణ భట్టాత్తిరికి జబ్బు కుదిరినట్టే, ఈ మధ్య కాలంలో చెంబై వైద్యనాథ భగవతార్ అనే గాయకుడు గొంతు పూడుకుపోతే ఒకవారం గురువాయూరప్పన్ సన్నిధిలో నారాయణీయం పారాయణ చేసి మళ్ళీ స్వరలాభం పొందేరని చెప్తారు. పండితుడూ, ఉపన్యాస చక్రవర్తి అని పిలువబడే, సెంగలిపురం ఆనంతరామ దీక్షితార్ కూడా గురువాయూరప్పన్ ని ప్రార్థించాక కుష్టు వ్యాధి నుంచి విముక్తులయ్యారని ఇంకో సంఘటన.

గురువాయూరప్పన్ ని గురువాయూర్ కృష్ణుడనీ, గురువాయూర్ కేశవన్ అనీ పిలవడం కేరళాలో వాడుకలో ఉంది. గురువాయూరప్పన్ విగ్రహం పాతాళాంజన శిల(బ్లాక్ బిస్మత్) తో తయారుచేయబడిందనీ అది అత్యంత అరుదైనదీ తెలుస్తోంది. గురువాయూర్ వెళ్ళిన చాలామంది అక్కడ తులాభారం వేయించుకోవడం చేస్తారు. ఇప్పుడు పంచదారతో తులాభారం బాగా ప్రాచుర్యం పొందింది. కానీ బెల్లం, వెండి, నాణేలు, అనేకానేక సుగంధ ద్రవ్యాలూ, నెయ్యి, వెన్న, వంట చెరకు, ఇలాగ అన్ని విధాలైన తులాభారం భక్తులకి అందుబాటులో ఉంది.

ఇందులో రాసిన విషయాలు చాలా మటుక్కి ఈ కింద వెబ్ సైట్లలో చూడవచ్చు.

http://www.guruvayurdevaswom.org, http://en.wikipedia.org/wiki/Guruvayurappan

నేను చదివిన తెలుగు పుస్తకం కావాలిస్తే

తి.తి.దే వారి నారాయణీయం పుస్తకం (అనువాదకులు - కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు) అందుబాటులో ఉంది.




# తెలుగు వ్యాఖ్యానాలు - సి.పి.బ్రౌన్ కృషి

డా.జడా సుబ్బారావు.

## 1.పరిచయం :

భారతదేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ఆంగ్లేయులు వ్యాపారం కోసమే మనదేశం వచ్చినా స్థానికుల భాషా సాహిత్యాలను, సంస్కృతీ సంప్రదాయాలను అర్థం చేసుకోకుండా వారితో వ్యవహరించడం కష్టమని భావించి, తెలుగు భాషాసాహిత్యాల అధ్యయనంలో, పరిశోధనలో ప్రత్యేక కృషిచేశారు. ఈ విధంగా భారతదేశం వచ్చి, ఇక్కడి భాషలను నేర్చుకుని పరిపాలన సాగించిన పాశ్చాత్యులను మూడు తెగలుగా విభజింపవచ్చని తెలియచేశారు కొత్తపల్లి వీరభద్రరావు గారు. ఇందులో మొదటి తెగవారు క్రైస్తవ మత వ్యాప్తి కోసం భారతీయ భాషలు నేర్చుకున్నవారు. రెండవ తెగవారు ఉద్యోగ బాధ్యతల కోసమే భాషలను నేర్చుకుని కేవలం వ్యవహారిక జ్ఞానంతోనే తృప్తిపడినవారు. ఇక మూడవ తెగ వారు భాషలు నేర్చుకోవడంతోనే తృప్తి పడక తాము నేర్చుకున్న భాషల అభివృద్ధికి యావచ్ఛక్తిని ఉపయోగించి కృషిచేసినవారు.

ఎంతోమంది ఆంగ్లేయులు పరిపాలన చేసినా కొద్దిమంది మాత్రమే వాళ్ళ కృషివల్ల చరిత్రలో మిగిలి పోయారు. అటువంటి గొప్పవ్యక్తులలో సి.పి.బ్రౌన్ అగ్రగణ్యుడు. ఎందుకంటే పఠన పాఠనాదులకు దూరమైన ప్రాచీన కావ్యాలను, ప్రబంధాలను పరిష్కరింపచేసి వ్యాఖ్యానాలతో ప్రకటింపజేశాడు. తెలుగు భాషా సాహిత్యాలు క్షీణదశకు వచ్చాయని భావించి ఎంతోమంది పండితులను తన వద్ద నియమించుకుని గ్రంథ పరిష్కరణలు, వ్యాఖ్యానాలు రాయించాడు. అంతేకాక వ్యాకరణాలు, నిఘంటువులు తయారు చేయించడం మొదలగు కార్యకలాపాల ద్వార తెలుగు భాషకు నూతన జీవాన్ని కల్పించాడు. కనుకతెలుగు ప్రాచీన కావ్యాలు బ్రౌన్ కృషివల్లనే ఇప్పటివరకు నిలిచి ఉన్నాయని చెప్పడం అతిశయోక్తికాదు. బ్రౌన్ దృష్టిలో వ్యాఖ్యానాలు ఎలా ఉండాలని భావించాడో, వ్యాఖ్యానాలు రాయించేటప్పుడు ఏ విధమైన పద్ధతులు పాటించాడో, జాగ్రత్తలు తీసుకున్నాడో తదితర అంశాలను తెలియజేయడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

## 2. తెలుగు కావ్య వ్యాఖ్యానం - పరిచయం:

'వాఖ్యాయతే అనేన ఇతి వ్యాఖ్యానమ్' అన్నట్లు ఏది మరోదాన్ని వివరించి చెపుతుందో అది వ్యాఖ్యానం అని ఆర్యోక్తి. సాధారణార్థంలో కావ్యానికి అర్థం చెప్పడం వ్యాఖ్యానం. పద విభాగం, సమాస పదాలకు విగ్రహ వాక్యాలు చెప్పడం, కావ్యంలోని అలంకారాలను సమన్వయపర్చడం, వ్యాకరణ సంబంధ వివరణలు, ఆక్షేపణలకు సమాధానం అనే అయిందింటిని వ్యాఖ్యాన లక్షణాలుగా చెప్పవచ్చు. అన్ని ప్రక్రియల మాదిరిగానే వ్యాఖ్యాన సంప్రదాయం కూడా సంస్కృతం నుండే తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది. వ్యాఖ్య,

వ్యాఖ్యానం అనే మాటకు వివిధ నిఘంటువులు వివిధ అర్థాలను, నిర్వచనాలను ఇచ్చినప్పటికీ అన్నిటి సారం అంతిమంగా 'విశదీకరించి చెప్పడ'మనే అర్థం చేసుకోవాలి.

**3. బ్రౌన్ కాలానికి ముందు వ్యాఖ్యానస్థితి:**

తెలుగు సాహిత్యంలో వ్యాఖ్యాన సంప్రదాయానికి సంబంధించినంతవరకు బ్రౌన్ పాత్ర మరువలేనిదనే చెప్పవచ్చు. అందుకే బ్రౌనుకు ముందు వ్యాఖ్యాన పరిస్థితి ఎలా ఉండేది? వ్యాఖ్యానాలు పాండిత్య ప్రదర్శనకై రాసేవారా లేక అర్థం చేసుకోవడానికి, భావాన్ని గ్రహించడానికి ప్రాధాన్యం ఇచ్చేవారా అనే విషయం పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగులో తొలి ద్వ్యర్థికావ్యమైన 'రాఘవపాండవీయా'నికి ముద్దరాజు పెదరామన రచించిన 'ఆదర్శవాఖ్య' వ్యాఖ్యాన సంప్రదాయంలో వెలసిన తొలి వ్యాఖ్యానం. ఈ వ్యాఖ్యను పెదరామన క్రీ.శ.1580 ప్రాంతంలో రచించినట్లు పరిశోధకుల అంచనా.

ముద్దరాజు పెదరామన రచించిన ఈ వ్యాఖ్యకు 32 సంస్కృతగ్రంథాలు, 9 తెలుగు పుస్తకాలను ప్రమాణంగా చూపడమే కాక తర్వాత వచ్చిన వ్యాఖ్యానాలకు కూడా మార్గదర్శకుడయ్యాడు. ఈ వ్యాఖ్యలో భారత, రామాయణార్థాలను వేరువేరుగా ఇవ్వడం జరిగింది. పద్యాన్ని చదవగానే మొదటిగా పాఠకునికి స్ఫురించే భావాన్ని అనుసరించి కొన్ని పద్యాలకు మొదట భారతార్థం, తర్వాత రామాయణార్థం, కొన్ని పద్యాలకు మొదట రామాయణార్థం, తర్వాత భారతార్థం ఇవ్వడం జరిగింది. అర్థాలు ఇచ్చినప్పుడు తత్సంబంధిత నిఘము, కావ్య ప్రమాణాలు ఇవ్వడం జరిగింది. సులభమైన పదాలకు అర్థాల్ని ఇవ్వకుండా కేవలం పదాన్ని మాత్రమే ఇచ్చారు. వ్యాఖ్యానానికి ఉపయోగించిన భాష సులభగ్రాంథికం. అవసరమైన చోట పద్యభావం అర్థం కావడానికి భావసమన్వయం ఇచ్చారు. అంతేగాక ఈ వ్యాఖ్యకు నేడు రాయబడుతున్న అనేక వ్యాఖ్యానాలకు కూడా అంతగా వ్యత్యాసం లేకపోవడం గమనించదగిన విషయం.

ఈ విధంగా ముద్దరాజు పెదరామన రచించిన ఈ వ్యాఖ్యానం పూర్వులు రాసిన వ్యాఖ్యానాలు వ్యవహారిక భాషలోనే ఉంటాయనే దానికి నిదర్శనం. ఇతర ప్రబంధాలలాగా ప్రజాదరణనూ, ప్రచారాన్నీ పొందలేకపోయిన, కేవలం పండితులకు మాత్రమే పరిమితమైన ఈ ద్వ్యర్థికావ్యానికి వ్యావహారిక భాషలోనే వ్యాఖ్య రచించడం గమనించదగిన అంశం.

ముద్దరాజు పెదరామన తర్వాత చెప్పుకోదగినవారు చిత్రకవి అనంతయ్య. క్రీ.శ.1600 ప్రాంతంలో 'హరిశ్చంద్ర నలోపాఖ్యానం' అనే ద్వ్యర్థి కావ్యానికి 'ప్రకాశికా వ్యాఖ్య' పేరుతో వ్యాఖ్య వెలువరించారు. అయితే ఈ ప్రకాశికా వ్యాఖ్య అటు అన్వయముఖంగానూ, ఇటు ఆకాంక్షాముఖంగానూ కాక పద్యంలో పదక్రమాన్ని బట్టి అర్థవివరణము రాశాడు. సామాన్యముగా రెండర్థములను వివరించుటకే పరిమితమైన సంగ్రహటీకగా మనం భావించవచ్చు. ఈ వ్యాఖ్యలో మొదట హరిశ్చంద్రుని పరమైన అర్థాలు, తర్వాత నలుని పరమైన అర్థాలు ఇవ్వబడ్డాయి. తాత్పర్యం పేర్కోబడలేదు. అయితే ఈ వ్యాఖ్య రాఘవపాండవీయ వ్యాఖ్యను ఆధారం చేసుకుని రాయబడిందే

పైన పేర్కొన్న ఇరువురి తర్వాత పేర్కొదగినవాడు వేములవాడ సోమనాధుడు. ఈతడు క్రీ.శ 17వ శతాబ్దానికి చెందినవాడు. 'విద్వజ్జనరంజని' పేరుతో వసుచరిత్రకు వ్యాఖ్యానాన్ని రచించాడు. ఈ వ్యాఖ్యానం క్రీ.శ 1650 ప్రాంతంలో వచ్చినట్లుగా అమరేశం రాజేశ్వరశర్మగారు అభిప్రాయపడగా, ఇతడు 1750 ప్రాంతం వాడని, దొరికిన వ్యాఖ్యానాలలో ఇది పూర్వపుదని ఆంధ్రభాషోద్ధారకులు బ్రౌన్ అభిప్రాయ పడ్డారు.

సోమనాధకవి వ్యాఖ్యానం గురించి శేషాద్రి రమణ కవులు చెప్పిన రీతిగా ఈ వ్యాఖ్యానం విపులంగా ఉండటమేకాక అందరికీ అర్థమయ్యే రీతిలో సరళ సుందరంగా కూడా ఉందనే విషయం అర్థమవుతుంది. అంతేగాక సోమనాధకవి వ్యాఖ్యానంలో కేవలం ప్రతిపదార్థ తాత్పర్యాలు మాత్రమే వివరించడం కాకుండా కవి హృదయాన్ని ఆవిష్కరించాలనే తీరు కనిపిస్తుంది పాణినీయాది సూత్రాలనుండి, వరరుచి వార్తికాలనుండి, అప్పకవీయాది ఛందో గ్రంథాలనుండి, నన్నభట్టీయాది కవుల ఆంధ్ర వ్యాకరణ గ్రంథాలనుండి ఆధారాలను చూపిస్తూ విపులంగా వ్యాఖ్య రచించడం, సమాసాలకు విగ్రహవాక్యాలు వివరిస్తూ, ఇతర విద్వాంసులు వ్యాఖ్యానించే పద్ధతులు

పేర్కొని వాటి సామజస్యాలను చర్చిస్తూ సహృదయరంజకంగా ఈ వ్యాఖ్యానం రచించడం తొలినాళ్ళలోని వ్యాఖ్యాన స్వరూపం మనకు అవగతమయ్యేలా చేస్తుంది.

వసుచరిత్రలో వివరించబడిన రత్నశాస్త్రము, సాముద్రిక శాస్త్రము, జ్యోతిష శాస్త్రము, వ్యాకరణ, మీమాంస, తర్క, కామ అలంకార, చందశ్శాస్త్ర, మంత్ర, తంత్రాది బహుశాస్త విషయాలను ఈ వ్యాఖ్యానంలో సోమనాధకవి వివరించాడు. ఒక విధంగా చెప్పాలంటే మల్లినాధుని మార్గదర్శక సూత్రమైన అన్వయముఖంగానే ఈ వ్యాఖ్య కొనసాగడం విశేషం. ప్రమాణభరితంగా, మూలంలో లేని విషయాలేవీ ప్రస్తావించకుండా, అపేక్షిత విషయం వదిలివేయకుండా మల్లినాధుని వ్యాఖ్యలను తలపించే రీతిలో ఈ వ్యాఖ్య కొనసాగడం విశేషం. తెలుగు వ్యాఖ్యాన ప్రారంభ దశ ఏ మాత్రం తక్కువయిందిగానూ, లోపాలతో కూడిందిగానూ కాదని చెప్పడానికి సోమకవి వ్యాఖ్య ఒక తార్కాణం.

***4 బ్రౌన్ కాలం నాటి వ్యాఖ్యానాలు:***

బ్రౌనుకు, తెలుగు సాహిత్యానికి విడదీయరాని సంబంధం ఉంది. క్షీణదశలో ఉన్న తెలుగు సాహిత్యాన్ని క్రొత్త ఊపిరి పోసి బతికించాడు బ్రౌన్. ఆయన మాటల్లో In 1825 I found Telugu literature dead. In thirty years I raised into life అని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఒక విధంగా చెప్పాలంటే ఆధునిక కాలంలో వచ్చిన అనేక కావ్య వ్యాఖ్యానాలకు మార్గదర్శకుడైనవాడు బ్రౌన్. 'ఆయన సమకాలికులలో ఆయనకంటే ఉన్నతోద్యోగులు, పలుకుబడి కలవారు, ఇంగ్లీషువారిలోనే ఎందరో ఉన్నను, మన భాషా సాహిత్యముల అభివృద్ధికి కృషిచేసిన వారున్నను, బ్రౌన్ దొరవలే వాటి కంకితమైన వారుగానీ, సొంత డబ్బు వెచ్చించి గ్రంధాలు సేకరించి వాటికి పండితులతో వ్యాఖ్యానాలు రాయించి, వాటిని అచ్చు వేయించి తరువాతి తరముల వారికి పనికి వచ్చునట్లు జాబులు మొదలగు వాటిని తిరిగి కాపీ వేయించి సంగ్రహపరచిపోయిన వారు లేరనుట పరమసత్యము' అనే కొత్తపల్లి వీరభద్రరావుగారి అభిప్రాయంతో మనం ఏకీభవించక తప్పదు.

ప్రాచీన వ్యాఖ్యాతలకు పాండిత్యాన్ని ప్రదర్శించాలనే కుతూహలమే తప్ప మూలాభిప్రాయాన్ని పాఠకులకు సుబోధకం చేయాలనే ఆలోచన పట్ల శ్రద్ధ తక్కువగా ఉన్నట్లు బ్రౌన్ భావించాడు. అందుచేతనే పండితులైన వ్యాఖ్యాతల దృష్టిలో మార్పు తేవడానికి బ్రౌన్ దొర ఎంతో కృషి చేశాడు. ఒక గ్రంధానికి వ్యాఖ్యానం ఆ గ్రంధాన్ని గురువు సాయం లేకుండా చదివి అర్థం చేసుకుని ఆనందించడానికే అని బ్రౌన్ దొర అభిప్రాయము. అందుకే తెలుగు కావ్యాల వ్యాఖ్యానాల విషయంలో బ్రౌన్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచాడు.

ఈ కారణం చేతనే అనేకమంది పండితులను సొంత ఖర్చు వినియోగించి వారికి వసతి సౌకర్యాలు కల్పించి ప్రాచీన గ్రంధాలను పరిష్కరించడం, వ్యాఖ్యానాలు తయారు చేయడం కోసం నియమించాడు. తన సొంత ఖర్చులతో తెలుగు సాహిత్యానికి సేవ మాత్రమే కాకుండా తాను నివాసముండే బంగ్లాలో కూడా అనేకమంది పండితులను నియమించి తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేసిన బ్రౌన్ గురించి జానుమద్ది హనుమచ్ఛాస్త్రిగారి ఈ క్రింది మాటలు గమనార్హం. 'ఆ బంగళాలో ఒక ప్రక్క స్కూల్, ఒక ప్రక్క తన సొంత గ్రంధాలయం ఏర్పాటు చేసుకున్నాడు. పండితులకు జీతభత్యాలను బ్రౌన్ సొంత పైకం నుంచి ఇచ్చేవాడు. అక్కడే జూలూరి అప్పయ్య వసుచరిత్ర, మనుచరిత్రలకు వ్యాఖ్యలు రాశాడు. పైడిపాటి వెంకటనరసయ్య వేమన పద్యాలను పరిష్కరించేవాడు. కంభం నరసింహాచార్యులు రాఘవ పాండవీయానికి వ్యాఖ్య రూపొందించాడు.' అంతేగాక బ్రౌన్ కాలం నాటి వ్యాఖ్యానాలలో ప్రధానంగా కనిపించే లక్షణాలను ఈ కింది విధంగా చెప్పవచ్చు.

1. కేవలం పండితులకే గాక తెలుగు చదవడం వచ్చిన వారందరికి తెలుగు కావ్యాలు అర్థం కావాలి.

2. ప్రాచీన వ్యాఖ్యాతలు కావ్యంలోని వ్యాకరణ, అలంకార, ఛందో విశేషాలకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి రచించగా తానట్లుగాక ప్రతి పదానికి అర్థాన్ని వివరించి సామన్యులకు కూడా సులభంగా అర్థమయ్యేటట్లు వ్యాఖ్యలను తయారుచేయడం బ్రౌన్ ఆశయం.

3. పద్యాలకు దండాన్వయాన్ని రాయించడం, ప్రతిపదాన్ని విభజించి అర్థమిచ్చే విధంగా వ్యాఖ్య రాయించడం.

4. ప్రతిపదార్థం చేత అర్థం కానివాటికి విపులార్థాలు, వివరణలు ఇవ్వడం.

5. ఛందో వ్యాకరణ విశేషాలను, అలంకారాలను వివరించడం.

ఈ విధమైన లక్షణాలు పాటిస్తూ వ్యాఖ్యానాలు రాయడానికి బ్రౌన్ తన వద్ద పండితులను నియమించుకున్నాడు. ఈ ప్రయత్నంలో భాగమే 'వసుచరిత్ర'కు బుచ్చయ్య శాస్త్రులవారు రాసిన 'ప్రతిపదార్థ ప్రకాశిక'. ఇది సోమనాథకవి విద్వజ్జన రంజనీ వ్యాఖ్యను ఆధారంగా చేసుకుని రాయడం జరిగింది. అయితే సరళోక్తులతో వ్రాయవలసినదని బ్రౌను దొర చెప్పినప్పటికీ 'అందరి కర్థంబై యానందంబొనగూర్పగా టీకను గావింతు'నని ప్రతిజ్ఞ చేసి వ్యాఖ్యానం ఆరంభించాడు బుచ్చయ్య శాస్త్రులు. బుచ్చయ్య శాస్త్రులువారి టీక అర్థం చేసుకోవడానికి వీలుకాదనే భావంతో జూలూరి అప్పయ్య శాస్త్రి చేత 1832-34 సంవత్సరాల మధ్య మరో వ్యాఖ్యానాన్ని తయారు చేయించాడు బ్రౌను. బుచ్చయ్య కంటే అప్పయ్యదే అర్థం చేసుకోవడానికి సులువుగా ఉందని భావించాడు కనుకనే దాన్ని ముద్రణకు స్వీకరించాడు.

ఈ విధంగా వ్యాఖ్యానాలు కేవలం పాండిత్యాన్ని ప్రదర్శించుకోవడానికి కాదనీ, చదువుకునే వారికి ఉపయోగంగా ఉండాలనే సదాశయం కలిగినవాడు బ్రౌన్. ప్రబంధపాఠాలను నిర్ణయించడం మొదలుకుని వాటిని అచ్చు వేయడానికి అనుగుణంగా సంస్కరించడం, నిఘంటువులు, వ్యాకరణాలు రచించడం మొదలైన అనేక సేవలు తెలుగు సాహిత్యానికి అందించి తెలుగు సాహిత్య పునరుజ్జీవనానికి ఎంతో కృషి చేశాడు బ్రౌన్.




# వేమన తత్త్వంలో స్త్రీ

## డా.తన్నీరు కళ్యాణ్ కుమార్

ఆంధ్రదేశంలో వానకు తడవని వారు, ఒక్క వేమన పద్యమైనా రాని తెలుగువాడు ఉండరంటే అది అతిశయోక్తి కాదేమో!. ప్రపంచ సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని పొందిన కవి వేమన. 17వ శతాబ్దానికి చెందిన దక్షిణ భారత కవి. తెలుగు సాహితీ సరస్వతీ ముద్దు బిడ్డలలో అగ్రగణ్యుడు. గొప్ప విమర్శకుడు. సంఘ సంస్కర్త, ప్రజా కవి, వాడుక భాషావేత్త, గొప్ప వేదాంతి, గొప్ప తిరుగుబాటు కవి, ఉపదేశకుడు, ప్రవక్త, నవయుగ పురోగామి మన వేమన. ఆయన అసలు పేరు పైడిపాల పుల్లారెడ్డి. మనుష్యుల మధ్య తిరుగుతూనే జీవిత సత్యాలను నిత్యాన్వేషణ శీలంతో దర్శించి, విమర్శించిన వివేకి వేమన. జీవిత అన్వేషణలో అందివచ్చిన అనుభవాలను ఆటవెలదుల్లో అలవోకగా లోకానికి అందించిన మహర్షి మన వేమన.

వేమనకు జీవితమే గురువు. ఆ జీవితానుభవాలే వేమన కవిని చేశాయి. బాలుడైనా, పామరుడైనా అర్థమయ్యే రీతిలో తాను చెప్పదలిచిన విషయాల్ని దృష్టాంత పూర్వకంగా చెప్పినాడు. సంఘంలో తనకు గల అనుభవాల వల్ల నేర్చిన గుణపాఠాలను ఇతరులకు బోధించాలని, సమాజంలో కుళ్ళును కడిగి శుభ్రపరచాలని ఆయన ఆశయం. వేమన పద్యాలను 1. నైతికత 2. ఆక్షేపణ 3. భ్రాంతి మూలకం అని మూడు భాగాలుగా విభజించవచ్చు. కొన్ని పద్యాలు ఆత్మ చింతనకూ, ఆత్మ శోధనకూ సంబంధించి వ్రాయబడినవి. వేమన మొదట వేశ్యాలోలుడై, ఆ తరువాత మోక్షాన్ని పొందటం జరిగింది. వేమన పద్యాలన్నీ ఆటవెలదుల్లో ఉంటాయి. 'వెలది' అంటే స్త్రీ అని సామాన్యార్థం. కానీ వేమన 'వెలది' అనే పదాన్ని వేశ్యగా వాడాడని కొందరి భావన.

వేమన ఆడవారి జీవితాలను చాలా దగ్గరగా శోధించడం ద్వారా స్త్రీ మనస్సు ఎలాంటిదో వివరించాడు. ఆలనా, పాలనా చేస్తూ భార్యను భర్త తన స్వాధీనంలో ఉంచుకోవాలని, లేని యెడల భార్య మొగత్రాడు లేని ఎద్దులా ప్రవర్తిస్తుందని, అలాంటి స్త్రీకి భర్త దూరం

కావాల్సి ఉంటుందని వేమన వక్కాణించాడు. ''పతికి మారు బల్కు పడతియే శునకంబు'' అని స్త్రీ బుద్ధిని గూర్చి తెల్పాడు. అట్లే భర్త మాట వినని భార్యను గూర్చి

**'ఆలు మగని మాట కడ్డంబు వచ్చినా ?**

**యాలుగాదది మరగాలు గాని,**

**యట్టి యాలు విడిచి యడవి నుండుట మేలు** '' - అని పేర్కొన్నాడు.

ఒక స్త్రీ దుర్మార్గపు బుద్ధి అలవడితే జీవితాంతం దాని బుద్ధి పోదు. అలాంటి సంఘటనను గూర్చి వేమన

**''కుక్కతోక దెచ్చి గొట్టంబు జేర్చిన**

**క్రోవి చెంత నుండు కొంత దడువు**

**యెంత జెప్ప చెడుగు పంతంబు మానునా? ''** -

అని చెబుతూ పుట్టకతో వచ్చిన బుద్ధి పుడకలలో కాల్చినా పోదన్నాడు. ఆపాద మస్తకం ప్రియురాండ్రను చవిచూసిన వేమన లోకంలో అన్ని తీపుల కన్నా చెలి మాటలే తీపని వాటిని ఇలా వివరించాడు.

**''పనస తొనల కన్న పంచదార కన్న**

**జుంటి తేనె కన్న జున్ను కన్న**

**చెరుకు రసము కన్న చెలిమాట తీపిరా**

**విశ్వదాభిరామ వినురవేమా!''**

వేమన సర్ధుబాటు లేని భార్యతో పడే కష్టాలను గురించి తెలుపుతూ ఇలా పేర్కొన్నాడు.

**''చెప్పులోని రాయి, చెవులోని జోరీగ**

**కంటిలోని నలుసు, కాలిముల్లు**

**ఇంటిలోని పోరు ఇంతింత కాదయా**

**విశ్వదాభిరామ వినురవేమా!''**

భర్త దరిద్రములో ఉన్నప్పుడే భార్య నిజమైన గుణము బయటపడుతుందని వేమన ఇట్లు తెల్పాడు.

**''ఆపదలగు వేళ నరసి బంధుల చూడు**

**భయము వేళ చూడు బంటుతనము**

**పేద వేళ జూడు పెండ్లాము గుణమును**

**విశ్వదాభిరామ వినురవేమ''**

స్త్రీల వల్ల త్రిమూర్తులే అవమానింపబడ్డారని వేమన చమత్కరించాడు. -

**"బోటి యొకతె బ్రహ్మనోట మీదనె తన్నె**

**కొమ్మ యొకతి విష్ణురొమ్ము తన్నె**

**సఖియ యొకతి శివుని సగభాగమాయెరా**

**విశ్వదాభిరామ వినురవేమ"**

స్త్రీల వల్ల మహా సామ్రాజ్యాలే  నాశనం అయ్యాయని వేమన కవి ఇలా పేర్కొన్నాడు.

**"కైక పుట్టి చెఱిచెగ రామ పట్టంబు**

**సీత పుట్టి లంక జెఱిచెగాదె**

**కౌరవులను బెఱిచెగద ద్రౌపదియు గూడ**" – ఇలా విభిన్న దృక్కోణాలతో స్త్రీలను వర్ణించాడు.

భార్య మాటలు విని సొంత వారికి దూరం చేసుకొనుట అజ్ఞానమని తెలుపుతూ వేమన కవి ఇలా పేర్కొన్నాడు.

**"ఆలి మాటలు విని యన్నదమ్ముల బాసి**

**వేరె పోవువాడు వెఱ్ఱివాడు**

**కుక్కతోక బట్టి గోదావరీదునా**

**విశ్వదాభిరామ వినురవేమ"**  -

తల్లిదండ్రులను పట్టించుకోకుండా భార్య విధేయులై ప్రవర్తించు వారికి కూడా వేమన చురకలంటించాడు.

**"తల్లిదండ్రులపయి దయలేని పుత్రుండు**

**పుట్టనేమివాడు గిట్టనేమి**

**యింట బుట్టి పెరిగి యిల్లాలి బంటురా**

**విశ్వదాభిరామ వినురవేమ"**

అంతేగాక

**"మాట వినని యాలు మగనికి మృత్యువు**

**యోటి పడవ సర్పమొంటి గృహము**

**తనకు గాని యాలు దానవురాలయా**

**విశ్వదాభిరామ వినురవేమ" -**

లాంటి పద్యాలలో స్త్రీ గుణాన్ని దానవత్వంతో పోల్చడం, పగబట్టిన సర్పంలాగా చూడటం, తూటుపడిన పడవ నీటిలో మునిగిపోవడం లాంటి పోలికలు పురుషాధిక్యాన్ని అనుకూలంగా వేమన మాట్లాడినట్లు అనిపిస్తాయి.

స్త్రీ పట్ల వేమన పలికిన పలుకుల వల్ల కొందరు స్త్రీ అంటే వేమనకు గిట్టదనే ఒక అపవాదు చేశారు. భోగలాలసుడైన వేమన విచ్చలవిడి శృంగారాన్ని అనుభవించడం వల్ల, వేశ్యా వాటికల గడపలు చూడటం వల్ల స్త్రీ అంటే ఒక చులకన భావన ఈయన కవితకు ఉందని కొందరు భావించారు. అందువల్ల వేమనను స్త్రీ విరోధిగా కూడా కొందరు చిత్రించే ప్రయత్నం చేశారు. ఐతే ఇది అంత సమంజసమైన వాదన కాదు.

నిజంగానే వేమన స్త్రీని గూర్చి కొన్ని మాటలు దురుసుగా, కటువుగా పలికారు. స్త్రీ వ్యక్తిత్వాన్ని అవమానపరుస్తూ కొన్ని అసభ్య పదజాలాన్ని కూడా ప్రయోగించారు. స్త్రీలను నమ్మరాదని,...... ఇంకా ఏవేవో స్త్రీ మనస్సును కష్టపట్టే మాటలు కూడా అన్నారు. కానీ ఈ మాటలు స్త్రీ జాతి మొత్తాన్ని అన్న మాటలు కాదు. కొంతమందిని ఉద్దేశించి మాత్రమే అన్నవి. సామాజిక జీవితంలో కొన్ని వర్గాల, కొన్ని రకాల, కొంతమంది స్త్రీల చిత్తవృత్తిని ఆధారంగా చేసుకొని మనిషి ఎదుగుదలకు అడ్డుపడిన స్త్రీ జీవితాన్ని గురించి తిట్టాడే కానీ, అందరిని కాదు.

స్త్రీ లేకపోతే పురుషుడు లేడు అని స్త్రీమూర్తిని చైతన్య దీప్తిగా గౌరవించి వేమన ఆమెకు అగ్ర తాంబూలాన్ని ఇచ్చాడు.

**"తల్లి గర్భమందు తా జనియించియు**
**తనదు ప్రేమ సతికి తానె పుట్టు**
**తల్లు లిరువురయ్య తనువొక్కటయ్యెర**
**విశ్వదాభిరామ వినురవేమ" -**

అనే ఈ పద్యం చూస్తే వేమన భావన ప్రపంచంలో సామాజిక జీవితంలో స్త్రీ ఎంత గొప్పగా కన్పిస్తుందో తెలుస్తుంది. స్త్రీ పురుషునికి ముక్తిని ప్రసాదించే చైతన్యమూర్తిగా వేమన ఈ పద్యంలో కీర్తించాడు. ఈ పద్యంలో పురుషుని మనుగడకు - ఎదుగుదలకు స్త్రీ తల్లిగా, భార్యగా రెండు పాత్రలను పోషిస్తుందని చెప్పాడు. జన్మనిచ్చిన తల్లైనా, బతుకు పంచుకున్న భార్యయైనా ఇద్దరూ పురుషునికి తల్లులే అంటాడు వేమన.

వేమన దృష్టిలో కుటుంబ జీవితంలో స్త్రీ ప్రధాన పాత్ర వహిస్తుంది. గృహస్థు జీవితానికి స్త్రీ యే మూల స్తంభం అని పేర్కొంటూ ఆయన చెప్పిన పద్యం ఇలా వుంది.

**"గుణవతియగు యువతి గృహము చక్కగనుండు**
**చీకటింటి దివ్వె చెలగురీతి**
**దేవియున్న యిల్లు దేవార్చన గృహంబు**
**విశ్వదాభిరామ వినురవేమ" -**

గుణవంతురాలైన స్త్రీ నిర్వహణలో ఇల్లు చక్కగా వుంటుందని, గుణవంతురాలైన గృహిణి ఇంటికి వెలుగునిస్తుందని, అట్టి స్త్రీ మూర్తి వున్న గృహము దేవాలయం వంటిదని ఈ పద్య భావం.

అట్లే ఇంటి ఇల్లాలిని విడిచి వేశ్యల వెంట తిరిగే పురుషుల చిత్తాన్ని కూడా వేమన తీవ్రంగా విమర్శించాడు.

**“ఇంటియాలి విడిచి ఇల జారకాంతల**

**వెంట దిరిగువాడు వెర్రి వాడు**

**పంట చేను విడిచి పరిగె యేరినయట్లు**

**విశ్వదాభిరామ వినురవేమ”** - సహ ధర్మచారిని వదిలి పైపై మెరుగులకు ఆశపడి, ఆకర్షణకు లోనై చిత్త చాంచల్యముతో వెలియాండ్ల గడపలు తొక్కడం నీతి కాదని ఈ పద్య భావం. ‘పంట చేను విడిచి పరిగె యేరిన యట్లు’ అని వేమన చక్కని ఉపమానాన్ని ఈ పద్యం నందు ఉపయోగించాడు.

**“సుగుణవంతురాలు సుధతియై యుండిన**

**బుద్ధిమంతులగుచు పుత్రులొప్ప**

**స్వర్గ మేటికయ్యె సంసారి కింకను**

**విశ్వదాభిరామ వినురవేమ”** - ఈ పద్యం నందు వేమన స్త్రీ ఔన్నత్యాన్ని చక్కగా ప్రశంసించాడు. వేమనకు కుటుంబమంటే చాలా ఇష్టం. కుటుంబ జీవనంలో పాత్రధారులైన అమ్మా, నాన్న, పిల్లలు కలిసి మెలిసి ఉండి కలిగిందేదో పంచుకొని తింటూ, సంతోషంగా ఉండాలని వేమన కోరుకుంటాడు. ఐతే ఈ సంతోషం సుగుణవంతురాలైన భార్య చేతుల్లోనే ఉంటుంది. సుగుణశీలి అయిన భార్య లేకపోతే ఇంటి యజమాని జీవితం నరకమవుతుందని ఈ పద్యంలో వేమన హెచ్చరించాడు.

జీవితం అనేది మంచి చెడుల కలయిక. చీకటి వెలుతురుల సమ్మేళనం. ఈ సత్యాన్ని తెలుసుకుంటే వేమన కవిత బాగా అర్థమవుతుంది. విశ్వశ్రేయస్సును కాంక్షించే వేమన పద్యం మంచిని మాత్రమే చెప్పి, చెడును విస్మరిస్తే అందులో సంపూర్ణత్వం ఉండదు. అందువల్లనే వేమన మంచి ఎక్కడున్నా దాన్ని గొప్పగా చెప్పాడు. చెడు ఎక్కడ, ఏ మూల ఉన్నా దాన్ని తుంచి చెప్పాడు. మంచి చెడుల్లో స్త్రీయైనా, పురుషుడైనా వేమన కవిత కన్నుల్లోంచి తప్పించుకోలేదు. స్త్రీల పట్ల వేమనలో కొన్ని భావాలు కొంచెం ఎబ్బెట్టుగానే ఉన్నా, స్త్రీ అంటే ఆయనకు మరెంతో పూజ్యభావం తొణికిసలాడుతుందని పైన పేర్కొన్న పద్యాల ద్వారా తెలుస్తుంది. ప్రపంచం ఉన్నంత కాలం వేమన పద్యాలు మానవుల హృదయాల్లో నక్షత్రాల్లాగా వెలుగునిస్తూనే ఉంటాయి.

********

# వ్యాస కౌముది



# మహాకవి తెనాలిరామకృష్ణ విరచిత “పాండురంగ మాహాత్మ్యము”

- బాలంత్రపు వేంకట రమణ

## కృతజ్ఞతాభివందనములు

పద్యపఠనం అనే జుంటితేనియ మాధుర్యాన్ని నాకు పరిచయంచేసిన :

- **కవిసమ్రాట్ విశ్వనాథ వారికీ (వారి “సాహిత్య సురభి” ద్వారా),**
- **ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికీ (తమ “పద్యకవితాపరిచయం” ద్వారా)**
- **“తెనాలి రామకృష్ణకవి - శాస్త్రీయ పరిశీలన” అనే మహద్గ్రంధాన్ని రచించిన మాననీయులు శ్రీ ముత్తేవి రవీంద్రనాథ్ గారికీ - భక్తిప్రపత్తులతో కృతజ్ఞతాభివందనములు.**

**ఒక చిన్న మనవి:**

ఛ్ఛందోబద్ధమైన పద్య రచనా ప్రకియ కేవలం తెలుగు జాతికి మాత్రమే దక్కిన ఒక గొప్ప వరం. దాన్ని సద్వినియోగం చేసి తెలుగు భాషకి ప్రాణం పోసిన మన మహా కవులు - నాటి ఆదికవి నన్నయ్య నుండి నేటి కవిసమ్రాట్ విశ్వనాథ వారి వరకూ ఎందరో మహానుభావులు - అందరికీ వందనాలు. అంతటి ఘనత కలిగిన తెలుగు పద్యం యొక్క గొప్పదనం గురించి ముందుగా మనం తెలుసుకోవడం, తదుపరి బంధుమిత్రులకీ ఇంకా ముఖ్యంగా యువతరానికీ తెలియచేయడం ప్రతీ తెలుగువాడి కర్తవ్యం, విద్యుక్త ధర్మం అంటే మీరందరూ ఏకీభవిస్తారని నమ్ముతున్నాను.

మన భాష యొక్క ఔన్నత్యాన్ని మనందరం ఆస్వాదిద్దాం, పంచుకుందాం, ముందుతరాలకి అందిద్దాం.

భవదీయుడు

బాలంత్రపు వేంకట రమణ

## కవిప్రశంస

సాధారణంగా కవులకూ, రచయితలకూ తమ రచనలద్వారా కీర్తి ప్రతిష్ఠలు వస్తాయి. మనుచరిత్రము ద్వారా ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దనామాత్యునికి ఎనలేని కీర్తి లభించింది. కానీ, వారి రచనల గురించి పామరజనానికి తెలియకపోయినా అత్యంత ప్రసిద్ధిని పొందిన వారు మహాకవి కాళిదాసు మరియు తెనాలి రామకృష్ణుడు.

కాళిదాసు మహాకవి రచించిన కావ్యాలన్నీ సంస్కృతంలోనే ఉండబట్టి ఈ కాలంలో అవి సంస్కృతపండితులకి మాత్రమే అర్థమౌతాయి. పామరులకి కాళిదాసు రచించిన కుమారసంభవం, మేఘసందేశం, రఘువంశం, అభిజ్ఞానశాకుంతలం మొదలైన మహాకావ్యాలు అవగతం కాకపోయినా, తను కూర్చున్న కొమ్మను నరుక్కున్న వెర్రి గొల్లడిగా, మంత్రి కుతంత్రం వల్ల రాజకుమర్తెతో వివాహం జరిగి, ఆమె ప్రోద్బలం వల్ల కాళికాదేవి కటాక్షం సంపాదించి మహాకవిగా ఆవిర్భవించడం వగైరా కథలన్నీ యావద్భారతదేశంలో బహుళ ప్రచారాలు.

ఆదే విధంగా మన తెనాలి రామకృష్ణుడు. ఆయన రచనలేమిటో, ఆయన ఎంతటి మహాకవో తెలియని అసంఖ్యాకులకి, తరతరాలుగా ఆయన వికటకవిగా హాస్యకథల హీరోగా సుపరిచితుడు. అతని పేరు చెబితేనే ఫక్కుమని నవ్వు వచ్చేటంతటి ఆంధ్రుల అభిమాన హాస్యరస చక్రవర్తి మన తెనాలి రామలింగడు. ఒక్క తెలుగునాటనేకాక, యావద్దక్షిణ భారతదేశంలోకూడా అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తిగా, హాస్యచతురుడిగా, సరసుడైన వికటకవిగా, సమస్యాపూరణంలో దిట్టగా, ఎటువంటి జటిలమైన సమస్యనైనా చిటికలో సమర్థవంతంగా పరిష్కరించే మేధావిగా ఆయన ఖ్యాతి చెందారు. ఆయన పేరిట తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సాహిత్యాల్లో కూడా ఎన్నో హాస్యకథలు ప్రాచుర్యానికి వచ్చాయి.

కానీ కవిత్వం దగ్గరకొచ్చేసరికి, తెలుగు పండితులకీ తెలుగు భాషావేత్తలకీ మాత్రమే ఆయనయొక్క ఉద్దండ పాండిత్యమూ, భాషా పటిమా, పదగుంఫనమూ, భావగంభీర్యమూ, వగైరాలు తెలుస్తాయి. గ్రంథరచన దగ్గర కొచ్చేసరికి ఆయన వికటకవిత్వ తత్త్వం మాయమౌతుంది. ఆయన వ్రాసిన **పాండురంగ మాహత్మ్యం** తెలుగు పంచమహా కావ్యాల్లో ఒకటిగా పండితులచే పరిగణించబడుతోంది.

అయితే ఆ వికటకవీ, ఈ పాండురంగ మాహత్మ్య కర్తా ఒకరేనా, అతడు రాయలవారి భువనవిజయ అష్టదిగ్గజాలలో ఒకడిగా ఉండే అవకాశం ఉందా – అనేవి చర్చనీయాంశాలు.

అల్లసాని వారి "**మనుసంభవము**"

ముక్కు తిమ్మనగారి "**పారిజాతాపహరణము**"

శ్రీకృష్ణదేవరాయ విరచితమైన "**ఆముక్తమాల్యద**"

తెనాలి రామకృష్ణుని "**పాండురంగ మాహత్మ్యము**"

రామరాజభూషణుని **''వసుచరిత్రము''**

ఈ ఐదు గ్రంథాల్నీ  తెలుగులో పంచమహాకావ్యాలుగా పండితులు నిర్ధారించారు.  ఈ ఐదు గ్రంథాల్నీ క్షుణ్ణంగా పారాయణం చేసి అర్థం చేసుకొంటే తెలుగు భాష సంపూర్ణంగా వచ్చేస్తుంది అని పెద్దల ఉవాచ.

తెనాలి రామకృష్ణుఁడిగా ప్రసిద్ధికెక్కిన ఈ మహాకవి యొక్క అసలు పేరు : గార్లపాటి రామలింగయ్య. జననం క్రీ.శ. 1495. ఊరు తెనాలి. గుంటురు జిల్లా, తెనాలిసమీపంలోని గార్లపాడు వీరి పూర్వీకుల నివాసం.  ఎప్పుడో వచ్చితెనాలిలో స్థిరపడ్డారు. ప్రథమశాఖ నియోగి. కౌండిన్యస గోత్రుడు. ఇతన్ని కన్న ధన్యజీవులు: తల్లి లక్కమాంబ, తండ్రి రామయ్య.

ఈయన తొలిదశలో శైవుడు. గురువు పాలగుమ్మి ఏలేశ్వరుడు. అతిపిన్న వయసులోనే సంస్కృతాంధ్ర కావ్యాలూ, నాటకాలూ చదివి, అలంకారాలూ, వ్యాకరణం, ఛందస్సు, ఆశుకవిత్వంలో నిష్ణాతుడయ్యాడు. అప్పట్లోనే అతనికి **"కుమారభారతి"** అనే బిరుదు కూడా వుండేది.  శివకవిగా **''ఉద్భటారాధ్య చరిత్రము''** అనే శైవకావ్యాని వ్రాశాడు.

బ్రతుకుతెరువుకోసం, రాజాదరణ సంపాదించడానికి తెనాలి నుండి ముందుగా కొండవీటి ఆస్థానానికి, అక్కడినుంచి హంపీలోని రాయలవారి భువనవిజయానికీ చేరుకున్న రామలింగకవి, వైఖాసన సాంప్రదాయ వైష్ణవమతావలంబియై, రామకృష్ణుఁడిగా అవతరించాడు. అతనికి వైష్ణవ దీక్షనొసగిన గురువు శ్రీ భట్టరు చిక్కాచార్యులవారు.  అక్కడ **''కందర్పకేతు విలాసం" , "హరిలీలా విలాసం''** మొదలైన కావ్యాలు వ్రాశాడు.

"ప్రౌఢకవి"గా **''పాండురంగమాహత్మ్యం''** అనే బృహత్కావ్యాన్ని, అవసానదశలో **''శ్రీ ఘటికా చలమాహత్మ్యము''** అనే మహాకావ్యాన్నీ రచించాడు.  ఈ ఆఖరిగ్రంధానికి అవతారిక వ్రాయకుండానే - అంటే దాన్ని ఎవరికీ అంకితమివ్వకుండానే - 95 ఏళ్ళ సుధీర్గ జీవన యానం తరువాత, పరమ పద సోపానాన్నధిరోహించాడు.  ఆయన్ని తీసుకెళ్ళడానికి పరమశివుని ప్రమధగణాలూ, శ్రీమహావిష్ణువు యొక్క దూతలూ చెరో దివ్య విమానాన్నీ తీసుకువచ్చి  వాదులాడుకొని ఉంటారు !

తెనాలి రామలింగని గురించి బహుళ ప్రచారంలో ఉన్న హాస్యకథల జోలికిగానీ, భువనవిజయానికి వచ్చిన వివిధ పండితుల్ని ఆయన తన తెలివితేటలతోనో, కుతంత్రంతోనో (ఉదాహరణకి: తిలకాష్టమహిషబంధనము, మేక-తోక పద్యం వగైరాలు) తికమకపెట్టేసి భువనవిజయం యొక్క పరువు నిలబెట్టిన ఉదంతాలగురించిగానీ నేను ఇక్కడ ప్రస్తావించదలచుకోలేదు. పైన మనవిచేసినట్టు ఆ ఇద్దరూ ఒకటి ఔనో కాదో తెలియదు.  కేవలం ఈ మహాకవియొక్క సాహితీ ప్రజ్ఞాపాటవం గురించి ముచ్చటించడమే నా ఉద్దేశం.

అల్లసానివారి అల్లికజిగిబిగి

ముక్కుతిమ్మనార్య ముద్దుపలుకు

పాదురంగవిజయు పద గుంఫనంబును - అన్నారు పండితులు.

ఈ మహాకవి రచనలలో మూడు గ్రంథాలు మాత్రమే ఇప్పుడు లభ్యాలు. అవి - 1) ఉద్భటారధ్యచరిత్రము, 2) పాండురంగ మాహాత్మ్యము, 3) ఘటికాచలమాహాత్మ్యము.

**"పాండురంగమాహాత్మ్యం"** కథాసంగ్రహాన్నీ, మచ్చుకు కొన్ని పద్యరత్నాల్నీ జ్ఞాపకం చేసుకుందాం.

***

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**




# మహాకవి తెనాలిరామకృష్ణ విరచిత "పాండురంగ మాహాత్మ్యము"

- బాలాంత్రపు వేంకట రమణ

**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

మన తెలుఁగు పంచమహాకావ్యాల్లో ఒకటిగా పరిగణించబడిన **పాండురంగ మాహాత్మ్యం** అనే మహాకావ్యాన్ని తెనాలి రామకృష్ణకవీంద్రుడు విరూరి వేదాద్రి మంత్రికి అంకితమిచ్చి అతడ్ని అమరుణ్ణి చేశాడు. ఈ వేదాద్రి మంత్రి పొత్తపినాటి చోడ ప్రభువైన పెద్ద సంగభూపాలుని వద్ద వ్రాయసకాడు.

ఈ చిగురాకు నీప్రసవ మీపువుఁ దేనియ యెంత యొప్పెడిన్
జూచితిరే యటంచుఁ దనచుట్టు శుకాదులుఁ గొల్వఁగాఁ గప
ర్దాంచిత చంద్ర గాంగజలమైన శివాహ్వాయకల్పశాఖ వే
దాచల మంత్రికీర్తి కలశాబ్ధిని వెన్నెలమాడ్కిఁ జూచుతన్

శివుడు తన కృతిభర్తను పాలించు గాక యన్న యాశీర్వచనము. శివుడు కల్పవృక్షము. శుకమహర్షి మొదలైనవారీ కల్పవృక్షాన్ని ఆశ్రయించి ఉన్నారు. శివుని జుత్తు - జడముడి - చివురాకు. చంద్రుడు పువ్వు. గంగ తేనియ.

**ఉదయం బస్త నగంబు సేతువు హిమవ్యూహంబునం జుట్టి రా**
**విదితంబైన మహిన్ మహేంద్ర కవితా విద్యానల ప్రౌఢి నీ**
**కెదురేరీ? సరసార్థ బోధఘటనాహేల పరిష్కార శా**
**రద నీరూపము రామకృష్ణకవిచంద్రా! సాంద్ర కీర్తీశ్వరా !**

తూర్పు కొండలు, పడమటి కొండలు, దక్షిణసముద్రము, ఉత్తరాన హిమాలయపర్వతం - ఈ నాలుగు ఎల్లల మధ్య గల యావద్భారత దేశంలో మహేంద్ర కవితా విద్యలో, ఓ రామకృష్ణకవీంద్రా, నీ అంతటి మహాకవి వేరొకరు ఎవరు? ఎవరూ లేరు. సరసమైన అర్థబోధ ఘటించెడి ఒయ్యరపు నగలు గల సరస్వతీ దేవి నీ రూపము! అని విరూరి వేదాద్రి మంత్రి అన్నాడని పాండురంగమాహాత్మ్యము అవతారికలో రామకృష్ణకవీంద్రుడు వ్రాసాడు.

కృతి స్వీకరించే సందర్భంలో వేదాద్రి మంత్రి మహాకవికి తాంబూలం ఇచ్చాడు. కవి ఆ తాంబూలాన్ని ఈ రమణీయమైన పద్యంలో వర్ణిస్తున్నాడు.

**పలుకుం దొయ్యలి మోవి కాంతి కెనయౌ బాగాలు నయ్యింతి చె**
**క్కులఁ బోలుం దెలనాకులయ్యువిద పల్కుల్వంటి కప్రంపుఁ బ**
**ల్కులతోఁ గూడిన వీడియంబొసఁగు నాకుం బద్మనాభార్చనా**
**కలనా పావన హస్తకంకణ ఝణత్కారంబు తోరంబుగన్**

పలుకుల తొయ్యలి - సరస్వతీదేవి - పెదవుల (మోవి) కాంతికి సమానమైన (ఎనయౌ) పోకచెక్కలు (బాగాలు) ("మౌళి" కాంతి కెనయౌ - అనే పాఠాంతరం కూడా ఉంది. సర్వశుక్లాం సరస్వతీ అన్నారు; ఆవిడ ఆపాదమస్తకం తెలుపేనట!) ఆ ఇంతి చెక్కులను పోలే పండుతమలపాకులు (తెలనాకులు) (తమలపాకుల్లో కవటాకులెంత భోగమో పండుటాకులు అంతకంటే భోగమట). ఆ యువతి పలుకులవంటి పచ్చకర్పురపు పలుకులతో కూడిన తాంబూలాన్ని ఇచ్చాడు. ఏ చేతులతో అయితే పద్మనాభస్వామిని నిత్యం అర్చిస్తాడో ఆ చేతులతో - కంకణాలు ఝణఝణ ధ్వనులు చేస్తున ఆ హస్తాలతో ఈయనకి తాంబూలం అందించాడట. బంగారపు పళ్ళెరంలో నిండా కాసులు పోసి మధ్యలో తాంబూలం పెట్టి ఇచ్చి ఉంటాడు.

**పాండురంగ మాహాత్మ్యం - కథా సంగ్రహం**

కథారంభంలో శౌనకాది మహామునులు సూతుడ్ని క్షేత్రము, వేల్పు, తీర్థము - ఈ మూడూ సమాన ప్రాధాన్యములుగా కలిగిన క్షేత్రమునుగూర్చి తెలుపమని అడుగుతారు. అప్పుడు సూతుడు "ఈ కథను నేను కృష్ణద్వైపాయనుడు చెప్పగా విన్నాను. దాన్ని విన్నది విన్నట్టుగా మీకు వివరిస్తాను, వినండి" అంటూ ప్రారంభిస్తాడు.

## కాశీపుర వర్ణనము

ముందుగా కాశీపుర వర్ణనతో  కథ ప్రారంభమౌతుంది.

శీతాహార్య సుతాళినీ వికచ రాజీవంబు విశ్వేశ్వర
జ్యోతిర్లింగ విశుద్ధ రత్నఖని మోక్షోపాయ దుగ్ధాబ్ధి వే
లాతీరావని దుంఠి నామక గజాలానంబు గంగామృత
స్రోతోనిస్సృతి చంద్రగోళ మన మించుం గాశి శ్రీరాశియై

కాశీపురము "శీతాహార్య సుతాళినీ వికచ రాజీవ"మట. శీతాహార్యుడు అంటే మంచునే భూషణముగా ధరించిన వాడు - హిమవంతుడు. అతడి సుత - పార్వతీ దేవి - అనే ఆడు తుమ్మెద (అళిని) కోసం,  వికసించిన తామరపువ్వట (వికచ రాజీవంబు) కాశీ.  ఆ నగరం విశ్వేశ్వర జ్యోతిర్లింగమనే విశుద్ధమైన రత్నం లభించే గనియట. మోక్షసాధనమగు పాలసముద్రానికి కాశీ ఒడ్డట; కాశికాపురి "దుంఠి నామక గజాలానంబు" - దుంఠి అనే పేరుగల గజమునకు (వినాయకునకు) ఆలానము (ఏనుగును బంధించే స్తంభం). ఇంకా కాశీపురి గంగయనే అమృత ప్రవాహం స్రవించే చంద్రగోళమట.  ఇంతటి వైభవంతో కాశీ భాగ్యనిలయమై (శ్రీరాశి) ప్రకాశిస్తున్నదట.

కాశీలో మృతి చెందినవారికి -  వారెటువంటివారైనా సరే - జన్మరాహిత్యమట. మరణసమయంలో శివుడే స్వయంగా వారికి చెవిలో పంచాక్షరీమంత్రం ఉపదేశిస్తాడట.  వారికి కైవల్యప్రాప్తట.  వారు శివసారూప్యం చెందుతారట.  అంటే శివుని రూపాన్ని పొందుతారన్నమాట.  అది ఎలాగో చెబుతున్నాడు కవి.

ఒకనాడుఁ దీర్ఘోపయోగిగాని శఠుండు నౌఁదల ధరియించు నభ్రగంగ
నాప్రొద్దు పొయిరాఁజనట్టి నిర్వేదయు భోగించు నైశ్వర్యములెనిమిదియుఁ
బుష్కరాక్షుల పొంతఁబోని వర్షవరుండు దేహార్థమునఁ దాల్చుఁ దీగఁ బోఁడి
నాయుధ ప్రభఁగాంచి యలఁగు భీరువుఁ బూను వాఁడి ముమ్మొనల వేఁడి యలుగు
మలిన వర్తనుఁడును సుధాలలితమూర్తి
మించి వర్తించు, మతిలేని మేదకుండు
మౌనివర్యులఁ జదివించు మట్టి నీడఁ
బంచముఖువీట మేనోసరించెనేని.

పంచముఖుడు అంటే శివుడు. సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానములనే ఐదూ శివుని ముఖాలు. పంచముఖుని వీట (పురములో) - అంటే కాశిలో - మరణిస్తే (మేనోసరిస్తే) - ఒక్కరోజు కూడా ఏతీర్థమూ సేవించని మూఢుడు కూడా నెత్తిమీద గంగని ధరిస్తాడట. కాశీలో మరణించగానే శివుడైపోతాడుగా మరి! ఆ ప్రొద్దు పోయి రాజనట్టి కటిక పేదవాడు కూడా కాశీలో మరణిస్తే అష్టైశ్వర్యాలూ అనుభవిస్తాడట. పుష్కర + అక్షులు - తామరపువ్వువంటి కన్నులు కలవారు - స్త్రీలు; ఏనాడూ స్త్రీల వద్దకు వెళ్ళని నపుంసకుడు (వర్షవరుడు) కూడా శివునిలాగా అర్థనారీశ్వరుడౌతాడు. ఆయుధముల కాంతిని చూస్తేనే భయపడిపోయే పిరికివాడు కూడా కాశీలో మరణించినంత మాత్రాన వాడియైన మూడు మొనలుగల తీక్ష్ణమగు ఆయుధము (త్రిశూలము)ను చేబూనుతాడట.

***

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

# వ్యాస కౌముది



# మహాకవి తెనాలి రామకృష్ణ విరచిత "పాండురంగ మాహాత్మ్యము"

- బాలంత్రపు వేంకట రమణ

**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

చెడునడత గలవాడు కూడా (మలినవర్తనుడు) కాశీలో మరణిస్తే అమృతమువలె స్వచ్ఛమైన దేహముకల చంద్రుని (సుధాలలితమూర్తి) మించి ప్రకాశిస్తాడట. మతిలేని స్థబ్దుడు కూడా కాశీలో మరణిస్తే మఱ్ఱి చెట్టునీడన మౌనివర్యులకే విద్యాబోధ చేస్తాడట. (కైలాసంలో ఒక పురాతనమైన మఱ్ఱిచెట్టు నీడలో పరమశివుడు మునిగణానికి ఆధ్యాత్మికోపన్యాసాలిస్తూ ఉంటాడని ప్రతీతి.)

ఇక కాశీలో ఉన్న వార కాంతల సౌందర్యాని రామకృష్ణుడు ఇలా వర్ణిస్తున్నాడు.

మొలక చీఁకటి జలజల రాల్పఁగా రాదె నెఱులు మించిన వీరి కురులయందు
కెరలించి యమృతంబు గిలకొట్టఁగా రాదె ముద్దుచూపెడి వీరి మోవులందు
పచ్చిబంగారు కుప్పలు చేయఁగా రాదె గబ్బు మీఱిన వీరి గుబ్బలందు
పండు వెన్నెల తేటఁ బరిఢవింపఁగ రాదె నగవు గుల్కెడి వీరి మొగములందు
నౌర! కరవాఁడి చూపుల యౌఘళంబు,
బాపురే! భూరి కటితటీ భారమహిమ
చాఁగు! మదమందగమన లక్షణములనఁగ,
నేరుపుల మింతురప్పురి వారసతులు.

ఆ పురములోని వారసతులు (వేశ్యలు) వాళ్ళ నొక్కులు తిరిగిన (నెఱులు మించిన) శిరోజాల్ని విదిలిస్తే చిమ్మచీకటి జలజలా రాలుతుందిట. అంటే అంత నల్లటి కురులన్నమాట వాళ్ళవి. వాళ్ళ పెదవులనుండి అమృతాన్ని గిలకొట్టవచ్చుట. అంటే వాళ్ళ పెదవులనుంచి అమృతం చిప్పిల్లుతూ వుంటుంది. మదించి, నిక్కిన వారి వక్షోజాలనుండి బంగారం కుప్పలు కుప్పలుగా తీయవచ్చుట. పండు వెన్నెలలోని ప్రసన్నత నవ్వులొలికే వారి ముఖాలలో వెల్లివిరిస్తుందిట. ఇక మిక్కిలి వాడి అయిన వారి చూపుల తీక్ష్ణత, పెద్దవైన పిరుదుల భారంతో మదించిన ఏనుగులవలె మెల్లనైన వారి నడకల సంగతా? భళీ! ఇక ప్రత్యేకించి చెప్పే పనేముంది? వారవిద్యలలోని నేర్పరితనంలో ఎంతో అతిశయించిన వారట - ఒకరిని మించిన వారు ఒకరట - ఆ పురం లోని వేశ్యకాంతలు.

**"సారథి ఛాందసుండు బడిసాగదు చక్రయుగంబు ప్రాత పం**
**చారపు గుఱ్ఱముల్ రథియు శౌర్యమునం దరమానిసాత్మ వి**
**స్తారము ఖండఖండములు తానఁట మాసరి" యంచుఁ దత్పురిం**
**దేరులు నవ్వు శంకరుని తేరిని గేతన కింకిణీ ధ్వనిన్**

కాశీపురిలో ఉన్న రథాలు (తేరులు) శంకరుని రథాన్ని చూసి నీవా మాకు సాటి అని అక్షేపిస్తున్నాయిట. త్రిపురాసుర సంహారానికి శంకరుడు వెళ్ళినప్పుడు, భూమి ఆయనకు రథం అయింది, బ్రహ్మ సారథిగా వ్యవహరించాడు, సూర్య చంద్రులు రథానికి చక్రాలయ్యాయి, నాలుగువేదములు ఆ రథానికి గుఱ్ఱాలు.

సారథి బ్రహ్మ ఛాందసుడట! ఈ పదం చాదస్తుడు అనే అర్థంలో వాడతారు. అసలు ఛాందసుడు అంటే వేదపండితుడు అని అర్థం. ఇక రథచక్రాలంటారా - సూర్యచంద్రులు. ఒకటి పెద్దది ఒకటి చిన్నది - రథం నడవదు! గుండ్రంగా తిరుగుతుంది. లేదా ఒకటి ఉన్నప్పుడు మరొకటి ఉండదు. ఎందుకంటే సూర్యుడు పగలు ఉంటే చంద్రుడు రాత్రి ఉంటాడు కదా.

కట్టినవి ప్రాత పంచారపు గుఱ్ఱాలు. అంటే మార్పులేని పాతరీతి నడకలు కలిగినవని అర్థం. వేదాల్ని ప్రాత పంచారపు గుఱ్ఱాలంటారు. ఇక రథి సంగతి చూద్దామా అంటే అతడు శౌర్యంలో అరమానిసి అట. శివుడు అర్థనారీశ్వరుడు కదా! రథం భూమి కదా. ఆత్మ విస్తారము - అంటే రథం యొక్క స్వరూపము. అతుకులు బొతుకులతో కూడి ఉందట. ఖండఖండములు. మరి ఇలాటి లోపాలున్న రథం మాకు సరిసాటా? అని ప్రశ్నిస్తూ ఎగతాళిగా నవ్వుతున్నాయిట కాశీపురిలోని మేటి రథాలు వాటికి కట్టిన జెండాకి ఉన్న మువ్వలు కింకిణీ ధ్వనులు చేస్తుండగా.

కాశీమహాపుణ్యక్షేత్రంలో పవిత్ర గంగానది ఒడ్డున యోగులు నివసించే సిద్ధాశ్రమంలో అపర సూర్యుడిలా వెలుగొందుతూ అగస్త్యమహర్షి తన భార్య లోపాముద్రతో కలిసి అనుకూలదాంపత్యం నెరుపుతూ వున్నాడు. కలశసూతియైన (కుండలో పుట్టినవాడునూ) తారకబ్రహ్మవిద్యా రహస్యజ్ఞాత (నరులను సంసారసాగరమునుండి తరింపచేసే తత్త్వ విద్యారహస్యములనెరిగినవాడునూ), చుళుకితాంభోరాశి (తన పుడిసిట్లో - అరచేయిని కొంచెం గుల్లగా వంచితే దాన్ని పుడిసిలి అంటారు - సముద్రాన్ని పట్టి త్రాగినవాడునూ), అయిన అగస్త్య మహర్షి మునిజన సముదాయం సేవలందుకుంటూ వైభవంగా నివసించాడు.

అలా ఆయన కాశిలో పెక్కుకల్పంబులున్నతరువాత, ఒకప్పుడు వింధ్య పర్వతం మేరుపర్వతంపై అసూయ చెంది రోజురోజుకీ పైకి పెరుగుతూ సూర్యచంద్రుల గమనానికి అడ్డుగా నిలిచిందిట. దేవతలూ మునులూ దాని గర్వమణచడానికి అగస్త్యుడే సమర్ధుడని అతన్ని ప్రార్ధించగా, గొప్పవారు పరవిపత్ ప్రతికార తత్పరులు (ఇతరులకు ఆపదలు కలిగించిన వారికి ప్రతీకారము చేయుట యందు మిక్కిలి ఇష్టము కలవారు) కావున, వింధ్య యొక్క గర్వమణచేందుకు కాశీపురిని వదలి భార్యాసమేతుడై బయలుదేరాడు.

గాఢతపోనిధియైన అగస్త్యుని చూచి వింధ్యభూధరము (పర్వతము) పొంకము, బింకము దక్కి (కోల్పోయి) భయకంపితమై కలుగులోనికి చొరబడే కుళీరము (ఎండ్రకాయ) లాగ నేలకి శిరస్సువంచి వినమ్రంగా అణిగిపోయింది. ఆప్పుడు అగస్త్యుడు వింధ్యతో "నేను దక్షిణాపథానికి వెళుతున్నాను, నేను తిరిగి వచ్చేదాకా ఇలాగే వుండ"మని ఆదేశించి, సపత్ని లోపాముద్రతో సహా దక్షిణాపథానికి తరలివెళ్ళి అక్కడే ఉండిపోయాడు. వింధ్యాచలము అలాగే వొదిగి ఉండిపోయిందిట.

**ఓ లలితాంగి! ఇందు సుఖముండు మృకండు కణాదగాధి వా**
**ధూలస ముఖాతిరిక్త చరితుండు మతంగ మహాతపస్వి ని**
**ష్కాళగళుండు నిర్యువతిగాత్రుఁడు నిర్నిటలేక్షణుండు ని**
**ర్వ్యాళ విభూషణుండు నగు నంబర కేశుఁడనంగఁ బెంపుగన్**

అగస్త్యుడు లోపాముద్రతో చెబుతున్నాడు. ఓ సుకుమారమైన శరీరము కలదానా! ఇది మతంగమహాముని నివసించే చోటు. ఆయన మృకండుడు, కణాదుడు, గాధి, వాధూలస మొదలైన ఋషులను మించిన చరితము కలవాడు (అతిరిక్త చరితుడు). ఈతడు కంఠమున విషమును ధరించినవాడు కాదు; శరీరంలో నారిని సగభాగంగా ధరించినివాడు కాదు; నుదుట మూడవ కన్ను లేనివాడు; సర్పములని ఆభరణంగా ధరించినవాడు కాదు. ఈ తేడాలు తప్ప అపర కేశవుడు అనదగ్గవాడు !

ఇదే భావాన్ని బహుశః నాలుగు సీసపద్యాల్లో వ్రాయవచ్చు. ఇలా క్లుప్తంగా వ్యక్తం చేయగలగడం ఒక మహా కళ.

వేసవి తాపవర్ణన చూడండి.

పద్మినీ పద్మాత పత్రంబు శిథిల పత్రాగ్రమై రాయంచ యాశ్రయించెఁ
దాలు స్రవత్ఫేన జాలుబుతో ఘోణి పంచల రొంపి గలంచి యాడె
దూరోద్గమద్దావ ధూమ మంబుద బుద్ధి నెమ్మి లో పొదనుండి నిక్కి చూచె
జఠరస్త జలము నాసానాళమునఁ బీల్చి సామజంబరుప్రక్కఁ జల్లుకొనియె

సరసిపై నీరు సలసల తెరలె విపిన
సకల వీథులు నిర్మృగోచ్ఛయములయ్యె
మట్టమధ్యాహ్నమిది సుధామధురవాణీ!
యర్థమిచ్చోఁ బథః శ్రమ మపనయింప.

రాజహంస, వేసవికాకకి ఓర్వలేక శిథిలమైన ఱెక్క చివర కలదియై చెరువు (పద్మిని) లో తామరాకు గొడుగు క్రింద (మిగతా చోటుకంటే అక్కడ ఇంకా ఎక్కువ చల్లగా వుంటుందిట) చేరిందిట. దవడ (తాలువు) నుండి జారుతున్న, కారుతున్న (స్రవత్) నురుగు సమూహముతో (ఫేనజాలమ్ముతో) పంది (ఘోణి) సమీపంలో (పంచల) బురదలో (రొంపి) పొర్లి (కలంచి) ఆడిందిట (యాడె). దూరం నుండి లేస్తున్న (దూర + ఉద్గమత్) దావాగ్ని పొగను (దావధూమ) మేఘమనుకొని (అంబుద బుద్ధిన్) నెమిలి (నెమ్మి) - ఎండకు తాళలేక పొదలో ఎక్కడో లోపల దాక్కొని వున్నది, మెడ నిక్కించి చూసిందిట. కడుపులోపలనున్న (జఠరస్త) నీళ్ళను తొండంద్వారా (నాసా నాళమున) బయటకి పీల్చుకొని ఏనుగు తనమీద అటూ ఇటూ చల్లుకుందిట.

సరస్సులో నీళ్ళు సల సల తెరలుతున్నాయి. వీధులన్నీ ఎక్కడా మృగసంచారం కూడా లేకుండా ఉన్నాయి. మిట్ట మధ్యాహ్నమయింది. ఓ అమృతమయమైన పలుకులు పలికే దానా! ఇక్కడ మన ప్రయాణ బడలిక తీర్చుకుందాము - అని అగస్త్యుడు లోపాముద్రతో అన్నాడు.

"మిట్ట" మధ్యాహ్నాన్ని "మట్ట" మధ్యాహ్నం అని కూడా అనవచ్చని రామకృష్ణుడు తీర్మానించాడు.

కవి తనకత్యంత ప్రీతిపాత్రమైన తుంగభద్రానది నుండి వచ్చే పిల్లతెమ్మెరలెలా ఉన్నాయో వర్ణిస్తున్నాడు.

పంపాతరంగ రింఖణ
ఝంపా సంపాద్య మాన జలకణరేఖ

**సంపాత శీతలానిల**
**సంపద వొదలించెఁ బరమశైవోత్తంసున్**

పంపానది (తుంగభద్ర) లోని అలలయొక్క రింఖణ (పొరలికలతోకూడిన) ఝంపా (దూకుళ్ళ చేత) సంపాద్యమాన (పుట్టించబడిన) జలకణరేఖా (నీటి తుంపరల సమూహము) సంపాత (పడుటవలన) శీతల (చల్లనైన) అనిల (గాలియొక్క) సంపద (కలిమి) ఆ పరమ శైవోత్తంసుని (శివభక్తులలో శ్రేష్ఠుడైన ఆ అగస్త్యమహర్షిని) పొదలించెన్ (సంతోషపెట్టెను).

**గంగా సంగమమిచ్చగించునె? మదిన్ గావేరిఁ దేవేరిగా**
**నంగీకారమొనర్చునే? యమునతోనానందముం బొందునే?**
**రంగత్తుంగ తరంగ హస్తములతో రత్నాకరేంద్రుండు నీ**
**యంగంబంటి సుఖించునేని గుణభద్రా! తుంగభద్రా నదీ!**

సముద్రుడు భర్త, నదులన్నీ ఆతని భార్యలు - అని కవిసమయం. తుంగభద్రా నది ఉపనది, అది సముద్రంలో కలవదు. అందుకని కవి చమత్కారంగా తుంగభద్ర అందాన్ని పొగుడుతున్నాడు.

ఓ తుంగభద్రా! ఆ సముద్రుడు నిన్ను చూడలేదు కానీ, చూసి ఉంటే, గంగా, కావేరి యమునాదులతో సుఖించేవాడా ! ఉండేవాడు కాదు. నీ సౌందర్యం అంతగొప్పది! (యమునా నది కూడా ఉపనదే! రామకృష్ణుని యేమరుపాటై ఉంటుంది - ప్రమాదో ధీమతామపి! అన్నారు).

***

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**




# మహాకవి తెనాలి రామకృష్ణ విరచిత "పాండురంగ మాహాత్మ్యము"

- బాలంత్రపు వేంకట రమణ

**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

అగస్త్యుడు, లోపాముద్ర మరియూ శిష్యబృందముతో దక్షిణాన తీర్థయాత్రలు చేస్తూ స్వామిమలలో కుమారస్వామిని దర్శించి వేనోళ్ళ స్తుతించాడు. అప్పుడు శరవణుడు (రెల్లుదుబ్బులో జన్మించినవాడు) వింధ్యసంస్థంభయుతుడైన అగస్త్యమునికి గంగ, పెన్న, విపాళ, చంద్రభాగ, శరావతి, వేత్రవతి, బాహుద, క్రిష్ణవేణీ, కావేరి, కపిశ, వంజీర (మంజీర) భవనాశని (సరయూనది), తుంగభద్ర, గౌతమి (గోదావరి) మొదలగు నదీతీర్థముల యొక్క దివ్య చరిత్రలను వినిపించాడు.

అప్పుడు అగస్త్యుడు కుమారస్వామితో "దేవా! వేల్పు, తీర్థము మరియు క్షేత్రము సమాన ప్రాధాన్యతతో ఒకే చోటనున్నట్టి పరమ పుణ్యక్షేత్రమెక్కడ ఉన్నదో తెలుప"మని ప్రార్థించాడు. దానికి కార్తికేయుడు ఎంతో ఆలోచించి తనకి కూడా అటువంటి పుణ్యక్షేత్రం ఎక్కడ ఉందో తోచడంలేదు, మా తండ్రియైన పరమశివుణ్ణి అడుగుదాం, పదండి, అనగా అందరూ కలిసి రజతగిరికి (కైలాసానికి) బయలుదేరి వెళ్ళారు.

కైలాసం చేరిన సుబ్రహ్మణ్య స్వామిని దేవవేశ్యలు (అప్సరసలు) పూజించారట.

**స్మరశశి తటిదజ పవమా**
**న రవి సుధా సలిల మునిజన క్ష్మారిష్టా**
**సురమృత్యు జ్వలన - జ లగు**
**సురవేశ్యలు కొలిచిరపుడు సుబ్రహ్మణ్యున్**

ఈ చిన్ని పద్యంలో రంభ, ఊర్వసి, మేనక, తిలోత్తమ, ఘృతాచి, వగైరా సురవేశ్యలు (అప్సరసలు) ఎవరెవరికి పుట్టారో తెలుపుతున్నాడు కవి. వారు పధ్నాలుగు  జాతుల సంతానమట. అవి -

స్మర - మన్మథుడు, శశి - చంద్రుడు, తటిత్  - మెరుపు, అజ - బ్రహ్మ, పవమాన - వాయువు, రవి - సూర్యుడు, సుధా - అమృతము, సలిల - నీరు, మునిజన - మహర్షులు, క్ష్మా - భూమి, అరిష్ట - దక్షప్రజాపతి కుమార్తెలలో ఒకతె, ఈమె పదమూడు మంది అప్సరసలను కన్నదట, సుర - దేవతలు, మృత్యు - మృత్యువు, జ్వలన - అగ్ని;  - వీరందరికీ  -  'జ' లు  - పుట్టిన వారు.

అదేసమయానికి పార్వతీదేవికి కూడా అదే సందేహం కలిగి పరమేశ్వరుడ్ని  అడిగింది : "స్వామీ, క్షేత్రము-తీర్థము-దేవత యీ మూడిటికీ సమానప్రాధాన్యత కల పుణ్యప్రదేశమేదో వివరింప ప్రార్థన" అనగా, ఫరమేష్టి  విష్ణుకథలు చెప్పుటయందిష్టము కలవాడై పార్వతికీ, అక్కడికి వచ్చిన కుమారస్వామి, అగస్త్యాదులందరికీ పాండురంగక్షేత్ర మాహత్మ్యం గురించి సవివరంగా, సమర్థంగా వివరించాడు.

శివుడు ముందుగా పండరీపురంలో వెలసిన విట్టలాధీశుడనబడిన శ్రీకృష్ణావతారవిష్ణువును మదిలో తల్చుకున్నాడు.

**వెడద కన్నులవాని వేయినామములవాని వ్రేతలవలపించు వెరవువానిc**
**జిప్పcకూకటివానిc జిన్ని నవ్వులవానిc జెరివిన మంచి పింఛమువానిc**
**బులుగు తత్తడివానిc బొడవుల తుదివానిc బొక్కిటి వెలిదమ్మిపూవువానిc**
**మినుకుటూర్పులవానిc మిసిమిమేcతలవానిc మెఱుcగు జామనిచాయమేనివానిc**
**దిస్సమొలవాని, బసిcగానc ద్రిప్పువానిc**
**మురళిగలవాని మువ్వంకమురువువానిc**
**విట్టలాధీశుc దలcచి తద్విపులమహిమ**
**నొడువుc బ్రామట్రి క్రీనీడ విడిదిప్రోడ.**

విశాలమైన (వెడద) కన్నులు కలవానిని,  సహస్రనామములు కలవానిని; గొల్లస్త్రీలను (వ్రేతలన్)  ప్రేమింపచేసే ఉపాయము (వెరవు) తెలిసినవానిని, కాకపక్షమని పిలువబడే పిల్ల జుట్టు నుదుటిపై కలవానిని (చిప్పకూకటి వాని), చిఱునవ్వు రాజిల్లెడువానిని,  దోపిన (వెరివిన) అందమైన నెమలి పింఛము కలవానిని,  పక్షిని (పులుగు) - గరుత్మంతుడిని - వాహనముగా కలవానిని,  (తత్తడి అంటే వాహనం; అందుకే శుకవాహనుడైన మన్మధుణ్ణి, చిలుకతత్తడిరౌతు - అంటారు) ; ఉన్నతములకంటే ఉన్నతుడైనవానిని (పొడవుల తుదవాని); నాభియందు (పొక్కిట) తెల్లని (వెలి) తామరపూవు (తమ్మిపూవు) కలవానిని; మినుకు అంటే

వేదం; వేదములే ఊర్పులుగ (నిశ్వాసములుగా) కలవానిని; వెన్న (మిసిమి) తినేవానిని (మేతలవాని) - మెరిసే నల్లని చాయగల దేహము కలవానిని; దిగంబరుని (దిస్సమొలవాని); గోగణముని (పసిన్) అడవియందు (కానన్) (మేతకై) త్రిప్పువాని; మురళిగలవాని ; ముమ్వంక - మూడు వంకల; మురువు అంటే సౌందర్యం. శ్రీకృష్ణుడు మూడు వంకరలుగా నిలబడడం చేత అందము గూర్చువాడట. అలా నిల్చోనడాన్ని త్రిభంగి అంటారు.

తద్విపుల మహిన్ - ఆ వితలాధీశుని గొప్ప మహిమను; ప్రామట్టి క్రీనీడ - ప్రాత మట్టిచెట్టు నీడలో; విడిది - నివాసముగా కల, ప్రోడ - వివేకి అయిన శివుడు; నుడువున్ - చెప్పును.

తదనంతరం పరమశివుడు ఇలా వివరించాడు.

ఆదికల్పమునందలి పద్దెనిమిదవ ద్వాపరయుగపు చివరిభాగంలో శ్రీమహావిష్ణువు ఘర్మవీరానది భైమీ నదితో కలిసినిచోట పుండరీకుడనే ఒక పరమభక్తాగ్రేసరునికి ప్రత్యక్షమై ఆతని కోరికమేరకు అక్కడే వెలశాడు. పుడరీకుడు గొప్ప వివేకి, సుగుణసంపన్నుడు, సత్యము, దయ, ఆర్జవము (సూటితనము), శాంతి, దాంతి (బ్రహ్మచర్యము మొదలుగాగల తమఃక్లేశములను తట్టుకొనే స్వభాము) ("దాంతునికైనా వేదాంతుని కైనా - శాంతము లేక సౌఖ్యము లేదు" అన్నాడు త్యాగరాజస్వామి.) అనే గుణములచే వెలుగొందినవాడు. చలిచీమకైనా హాని తలపెట్టడు. ఎన్నడూ మృషాభాషణములు (అబద్ధపు మాటలు) పలుకడు. కలుషవర్తనులున్న దాపులకుకూడా వెళ్ళడు. కలిమికిపొంగిపోడు, లేమికికుంగిపోడు. పరస్త్రీలను కన్నెత్తైనా చూడడు. ఎంతటిఒడిదుడుకులువచ్చినా ఏమాత్రం ధైర్యంవీడడు. ఇతరుల సంపదలనుచూచి అసూయపడడు. ఎంతటి నీచుడినైనా మనసులోకూడా నిందించడు. ఆకలిగొన్నవారికి చాలామందిలా శుష్కప్రియాలు చెప్పి ఊరుకోకుండా తనచేతనైన సహాయం చేస్తాడు. సకలభూతములయందునూ దయలిగి వుంటాడు. వేదమార్గముననుసరించువారిలో ప్రధానుడు. ఎట్టిలోపమూ లేని వేదాంత శాస్త్రవేత్త ఆ పుండరీకుడు. దేవగురువైన బృహస్పతితో సమానుడయిన ఆ బ్రాహ్మణోత్తముడి మనసులో బంగారానికి తావి అలదినట్లు ఎప్పుడూ అంబుజోదర చరణారవింద సతతస్మృతి (విష్ణుపాదపద్మముల నిరంతర స్మృతి) అనే వ్యసనమేనట !

సమాధిలో ఉన్నంతసేపూ అంతర్నయనంతో శ్రీకృష్ణుని మీదే మనస్సును లగ్నంచేసే పుండరీకుడు సమాధినుండి బయటకురాగానే తల్లిదండ్రుల పాదసేవకే అంకితమైపోతాడు. తానే వేయిసేవకులపెట్టయి తన భార్య ఎదురుతిరగని బుద్ధితో సహకరిస్తూ ఉండగా, తన మాతాపితరులకు సకలసేవలూ చేసేవాడు.

ఆపాదమస్తంబు నంటు నూనియగాచి స్వయముగా నుద్వర్తనంబొనర్చు
జలకమార్చు నఖంపచ స్వచ్ఛజలములఁ గడు మెదుగుడులఁ బొదివి
లఘుధౌత వసనపల్లవములు గట్టించు శిరసార్చు మృదులీల సురటి విసరి
చేయూఁత యొసఁగి వేంచేయించు లోనికి ద్వారావతి గలంతిఁ దానె యొసఁగుఁ

**దెలుపు సంధ్యా సమాధి విధి ప్రయుక్తి,**
**నగ్ని వేల్పించు విష్ణుసహస్రనామ**
**పాఠ మొనరించు తటిఁదోడుపడు గురునకు,**
**గవలు వోకుండఁబుత్రుఁడో కలువకంటి.**

శివుడు పార్వతితో ఇలా చెబుతున్నాడు:

కలువలవంటి కన్నులుగల ఓ పార్వతీ! పుండరీకుడు తన తండ్రికి తానే స్వయంగా నఖశిఖపర్యంతం నూనెతో అంటి నలుగు (ఉద్వర్తనం) పెడతాడు. గోరువెచ్చని (నఖంపచ) స్వచ్ఛమైన నీళ్ళతో జలకమాడిస్తాడు. తదుపరి అతిమెత్తని గుడ్డలతో (కదు మెదు గుడుల) ఒళ్ళు తుడుస్తాడు. తేలికయిన (లఘు) తెల్లని (ధౌత) చిగురుటాకుల్లాటి వలువలు (వసనపల్లవములు) కట్టిస్తాడు. మృదువుగా విసనికర్ర (సురటి) తో వీస్తూ తలతడి ఆరుస్తాడు. చేయూతనిచ్చి లోపలికి తీసుకువెళ్తాడు. చెంబు (ద్వారావతి గలంతి) తానే అందిస్తాడు (ఆచమనం చేసుకోడానికి). తండ్రికి సంధ్య, సమాద్యాది విధులు తానే తెలుపుతాడు. తండ్రిచేత అగ్ని వేల్పించుతాడు. విష్ణుసహస్రనామం పఠించేటప్పుడు వృద్ధుడయిన తండ్రి తడబడి క్రమంతప్పకుండా (కవలుబోకుండా) ఉండేందుకు పుత్రుడైన పుండరీకుడు తోడ్పడేవాడు.

ఇక ఆ పుండరీకుడు విష్ణుపూజలేవిధంగా చేసేవాడంటే -

**అభిషేకమొనరించు నాకాశవాహినీ జననకారణ పాద జలరుహునకు**
**వైచుఁ దోమాలియ వైజయంతీకాంతి వలయిత వక్షః కవాటునకును**
**గౌశేయమర్పించుఁ గాంచనమయ పటీ పల్లవారుణ కటిబంధురునకుఁ**
**జందనం బలఁదు నీళేందిరా కుచకుంభ సంగికుంకుమ పంకిలాంగునకును**
**రత్నహారంబు సాతు నిర్యత్నసిద్ధ**
**కౌస్తుభోదర్చి రభిరామకంధరునకు**
**ధూపకల్పన మున్నుగా దీపమిచ్చు**
**దెఱవ! యాతడు త్రైలోక్య దీపకునకు.**

ఓ తెఱవా! (ఓ ఇంతీ! ఓ పార్వతీ!) పుండరీకుడు ఆకాశగంగ జననానికి కారణమైన పాద పద్మములుగలవానికి (జలరుహమంటే పద్మము) అభిషేకం చేస్తాడు. వైజయంతి అనే పూమాలయొక్క కాంతిచే ఆవరించబడిన తలుపువంటి

రొమ్ముగలవానికి వనమాల (తొమాలియ) వేస్తాడు. చిగురువంటి బంగారు వస్త్రముచే ఎరుపెక్కిన మొలచే చక్కనైనవానికి పట్టువస్త్రాన్ని (కౌశేయము) అర్పిస్తాడు. నీళ (విష్ణుభార్యలలోనొకతె) మరియు ఇందిర (లక్ష్మీదేవియొక్క) కుచ చూచుకముల సాంగత్యముచే (రాపిడిచే) కుంకుమ అంటిన శరీరముకలవానికి మంచిగంధపు (చందనము) పూత పూస్తాడు. కౌస్తుభం లాటి మహామణినే అప్రయత్నంగా సిద్ధించుకొని దాన్ని ధరించిన కారణంగా దాని కాంతి పుంజములచే ఇంపైన మెడగలవానికి రత్నహారాన్ని సమర్పిచును (చాతున్). ముల్లోకాల్నీ వెలుగొందింపచేసే (త్రైలోక్యదీపునకు) ఆ శ్రీమహావిష్ణువునకు ధూపమిస్తాడు పరమభక్తాగ్రేసరుడైన పుండరీకుడు!

తిరువారాధనమొనర్చి విష్ణువుకు అర్పించుటచేత పావనములైన వివిధ ఆహారపదార్ధములను పుండరీకుడు తన తల్లిదండ్రులకు ప్రియముమీరగా కొసరి కొసరి వడ్డించి తినిపించేవాడట ఆ ధన్యచరితుడు.

తల్లిదండ్రులు పరమపదించినపిమ్మట కాశీకివెళ్ళి వారి అస్తికల్ని పరమపవిత్రమైన గంగానదిలో నిమజ్జనంచేసి, గయకి వెళ్ళి అక్కడ వారికి పిండములు పెట్టాడట. పితృదేవతల ఋణమును తీర్చుకొనుటకు అనుకూలవతి అయిన భార్య వలన విశేషజ్ఞానము, అణకువ కలిగిన పుత్రులను కన్నాడు. ఇక ఆయన భార్యాబిడ్డల్ని విడిచి, ఇల్లుమరచి, మదిలో శేషఫణిశయనుడయిన శ్రీమహావిష్ణువును ప్రత్యక్షంచేసుకొనే అభిలాషతో తపస్సు చేయడం ప్రారంభించాడు.

(మన పురాణాలు, గ్రంథాలు, కావ్యాలు ఏమి చెప్పినా అన్యాపదేశంగా చెబుతాయి. కవులు ఏద్దైనా పాత్రగురించి చెప్పినప్పుడు ఆ పాత్ర లక్షణాలన్నిటినీ సమగ్రంగా వివరిస్తారు. అది సన్మార్గుడి పాత్ర అయితే మనం అందరం కూడా అలాగే నడుచుకోవాలి అనిన్నూ, దుర్మర్గుడి పాత్ర ఐతే మనం అలా ఉండకూడదనిన్నీనూ మనకి ఉపదేశాలు. అందుకే కవి పుండరీకుడి పాత్రని సకలసద్గుణాల ప్రోవుగా చిత్రీకరించాడు. తద్వార మనకి ఉపదేశం - అలా నడుచు కోండి - అని.

భాగవతంలో పోతనగారు బాలప్రహ్లాదుడిగుటించి చెబుతూ "కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన మాతృ భావము సేసి మరులువాఁడు" అన్నాడు. అయిదేళ్ళ బాలుడికి స్త్రీల పట్ల వేరే భావనలేముంటాయి గనక? ప్రహ్లాదుడు పెరిగి పెద్దయిన తరవాత కూడా అలాగే ఉన్నాడు. అలాంటి శీలం కలిగిన ప్రహ్లాదుడు ఐదేళ్ల బాలుడిగా ఉన్నప్పుడు ఎమిజరిగేందంటే – అని పోతనగారు వివరంచారు అని మనం గ్రహించాలి. ఆ నీతి మనల్ని పాటించమని అన్యాపదేసంగా మనందరికీ ఉపదేశం! భారతీయుడైనవాడు అలా ఉండాలి - అని.)

***

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

# వ్యాస కౌముది



# మహాకవి తెనాలి రామకృష్ణ విరచిత "పాండురంగ మాహాత్మ్యము"

- బాలంత్రపు వేంకట రమణ

**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

పుండరీకుడు చేసిన ఘోరతపస్సుకి నందగోపబాలుని హృదయం వెన్నలా కరిగిపోయిందిట. గోపికలతో రాసక్రీడలో మునిగి తేలుతూన్న రాసవిహారి తన బంగారపుటందియలు ఘల్లుఘల్లున మ్రోగగా పరుగుపరుగున పుండరీకునివద్దకు వచ్చాడట. పుండరీకుడికి ప్రత్యక్షమయిన శ్రీకృష్ణుడి రూపాన్ని ఆపాదమస్తకం అపూర్వంగా దర్శించి అద్భుతంగా వర్ణించాడు మహాకవి రామకృష్ణుడు.

యతీశ్వరుల హృదయంలో సంచరిస్తున్న గోవర్ధనపర్వతగుహలలో విహరించడం, కొండకొమ్మున నెమలిలా రాధికాహృదయం మీద వాలడం, మేఘాలనుతోలే ఇంద్రుడిలా రంగురంగుల ఆలమందలను మేపడం, పద్మవనంలో హంసలా స్నేహితులతో కేరింతలు కొట్టడం, చంద్రబింబానికి స్వరం నేర్పుతున్నట్టు తెల్లని శంఖాన్ని ఊదడం - ఇలాటి ఆటలన్నీ కట్టిపెట్టి ఆ దేవకీతర్ణకం (కోడెదూడ - బిడ్డ) పుండరీకుడి పర్ణశాలకువచ్చి ప్రత్యక్షం అయింది! ఆ తర్ణకం పాదపద్మాలకు బంగరుటందెలు మ్రోగుతున్నాయి. ఆ మ్రోతని కవి ఇలా ఉత్ప్రేక్షిస్తున్నాడు :

**లలిత శిరీష పుష్పమృదులంబులు నీ చరణంబులక్కటా**
**ఇల ఇది రూక్షమిట్టులలయించుట కాదని ప్రార్థనా మృదూ**
**క్తులు సెలగంగ వేపాదివి తొల్చదువుల్ తగు విన్నపంబులన్**
**బలుమఋ జేయుచందమున బంగరుటందియలుగ్గడింపగన్**

యదుబాలుని పాదపద్మాలకి బంగారపుటందెలున్నాయి. ఆ అందెలు మ్రోగుతుండగా (ఉగ్గడింపగన్) స్వామి నడచివచ్చారు. తొలిచదువులైన వేదాలు ఆ పాదాలను పొదివిపట్టుకొని (వేదాలు విష్ణుపాదాలవద్ద జనించాయట) అడుగడుగుకీ మాటిమాటికీ (పలుమరు) తగిన విన్నపాలు చేస్తున్నట్టు ఉంది ఆ అందెల మ్రోత. "స్వామీ! నీ చరణాలు లలితమైన శిరీషపుష్పాల్లాగా మృదులమైనవి. అయ్యయ్యో, నేల ఇది అతికఠినం (రూక్షం) ('రూక్షం' అనడంలోనే కాఠిన్యమంతా ప్రస్ఫుటమౌతోంది!) ఇట్లా నీ పాదాలని కష్టపెట్టడం (అలయించుట = అలసిపోయేలాచేయడం) తగదు" - అని ప్రార్థనా మృదు + ఉక్తులతో విన్నపాలు చేస్తున్నట్టు అందెలు మ్రోగుతుండగా స్వామి విచ్చేసాడు.

బాలక్రిష్ణయ్య మొలకి గోళీ సంచులు నాలుగు వ్రేలాడుతున్నాయి. ఆలమందలు గడ్డి మేస్తుంటే ఈయన సోదరుడు బలరాముడితో, ఇంకా మిత్రబృందంతో చెట్టుక్రింద గోళీలాడుకుంటారన్నమాట. అందుకని సంచీలో గోళీలు మొలకి కట్టుకుని సిద్ధంగా ఉంచుకుంటాడుకాబోలు!

**మెత్తగ నూఱిన చుట్టుం**
**గత్తిన్ మధుకైటభోరు కంఠము లలనా**
**డొత్తిన హత్తిన చేదుం**
**తిత్తుల క్రియ దొడల నుడ్డ తిత్తు లు వ్రేలన్**

మధుడు - కైటభుడు అనే రాక్షసుల్ని విష్ణుమూర్తి అలనాడు తన చక్రాయుధంతో సంహరించాడు. చుట్టుకత్తి - చుట్టుంగత్తి - గుండ్రటి ఆయుధం - సుదర్శనచక్రం. దాన్ని మెత్తగా నూరి, బాగ పదును పెట్టి ఆ ఇద్దరు రాక్షసుల ఉరు కంఠాలను (బలిసిన మెడలు) ఒత్తేసాడు. ఒత్తడం అంటే చప్పుడు కాకుండా తెగెయ్యడం (మీసాలు వత్తుట, చంపలు వత్తుట అని వాడుక). అలావత్తినప్పుడు వాళ్ళ ఊపిరితిత్తులు స్వామికి హత్తాయి - లభించాయి. చేదడం అంటే తోడడం. గాలిని చేదుకోడానికి ఉపయోగించే తిత్తులు కనుక శ్వాసకోసాల్ని "చేదుంతిత్తులు" అన్నాడు. ఇద్దరివీ చెరో రెండుగా నాలుగు ఊపిరితిత్తులు. ఆ తిత్తులో అన్నట్టుగా నాలుగుసంచులు - బహుశః అటురెండు ఇటు రెండు తొడలమీద వేలాడుతున్నయి. "ఉడ్డ" అంటే నాలుగు. ఉడ్డాముగ్గురు (ఏడుగురు) అనేది రాయలసీమవాడుక.

ఇటనభ మిట భూవలయం
బిట బలిసద్మంబు నుండు నెలవులివి యనన్
బటువులగు వళుల చెలువున
బుట పుటనై యున్న చిన్ని బొజ్జ కదలన్

క్రిష్ణయ్య పరుగున వస్తుంటే నినిగలాడుతున్న (పుటపుటనైయున్న) చిన్ని బొజ్జ కదలాడుతోంది. ఆ చిఱు బొజ్జమీద మూడు మడతల ముడతలు (వళులు) ఉన్నాయి. అవి స్ఫుఠంగా (పటువుగా) ఉన్నాయి. మూడు అరలకు గుర్తులుగా ఉన్నాయి.

"ఇదిగో ఇక్కడ ఆకాశం (నభము), ఇక్కడ భూగోళం, ఇక్కడ పాతాళం (బలిసద్మం - బలిచక్రవర్తికి నిలయం)" అన్నట్టు ఉన్నాయి. మరి జగత్తులన్నీ ఆయన బొజ్జలోనే ఉన్నాయి కదా! ("ఉరికిన నోర్వక ఉదరంబులో నున్న జగముల వ్రేగున జగతి కదల" అన్నాడు పోతన.)

బొజ్జదాటి పుండరీకుని చూపులు ఇంకొంచెం పైకి వెళ్ళాయి. విశాలంగా వక్షస్సు కనిపించింది.

తులసికి పచ్చరాకుదురు తోయదవాహన రత్నవేది య
క్కలిమి మెఱుంగు బోడికిని కౌస్తుభ ఘర్మ గభస్తికిన్ నభ
స్తలము ననంగ బొల్చి నిరతంబు కృపావిభవంబునింటి బో
ర్తలుపు దలంపు సేయుచు నురంబు కరంబు పరిస్ఫురింపగన్

స్వామి వక్షస్థలం (ఉరంబు) మిక్కిలి (కరంబు) ప్రకాశిస్తోంది (పరిస్ఫురింపగన్). "కృపావిభవము" అనే ఇంటి బోర్ తలుపుని (ఏక కవాటం) గుర్తు చేస్తూ ప్రకాశిస్తోంది. ఆ కవాటం వెనక్కాల దయాసంపత్తి ఉంది. పచ్చరాయి + కుదురు - పచ్చరాకుదురు. మరకతమణి వేదిక లేక పాదు. తులసీదేవికి విష్ణుమూర్తి వక్షఃస్థలం మరకతవేదిక. మరకతమణులు పొదిగిన తులసికోటలాగా ఉంది అని. నీలమేఘశ్యాముని ఉరము కనుక మరకతమణి వేదికలాగా ఉంది. మెఱుంగుబోడి అంటే విద్యుల్లతవంటి శరీరం కలిగిన స్త్రీ. కలిమి - సంపద. కలిమి మెఱుంగుబోడి - లక్ష్మీదేవి. ఆ లక్ష్మీదేవికి ఈయన ఉరఃప్రదేశం తోయదవాహన రత్నవేది యట. తోయదం - మేఘము. దాన్ని వాహనంగా కలవాడు - ఇంద్రుడు. తోయదవాహనరత్నం - ఇంద్రనీలమణి ! విష్ణువక్షఃస్తలం లక్ష్మీదేవికి ఇంద్రనీలమణి వేదిక. లక్ష్మీదేవి విష్ణువక్షస్థల నివాసిని కదా.

శ్రీమహావిష్ణువు మెడలో కౌస్తుభహారం ఉంటుందికదా. ఘర్మ గభస్తి - వేడి కిరణాలు (గభస్తులు)కలవాడు - సూర్యుడు. కౌస్తుభం అనే సూర్యుడికి శ్రీహరి ఉరసీమ ఆకాశమట (నభస్తలం). స్వామివారి ఉరస్సీమ నీలంగా వుంటుంది కనుక ఆకాశంతో పోలిక. కౌస్తుభమణికి సూర్యుడితో పోలిక.

ఎల్లవేళలా (నిరతంబు) ఇలా విరాజిల్లుతూ బోర్తలుపుని గుర్తు చేస్తూ (తలంపు సేయుచు) ఉరంబు కరంబు పరిస్ఫురింపగన్ - స్వామి విజయం చేసాడు.

అంత్యానుప్రాసతో పద్యాన్ని ముగించడం పోతనాదుల పద్ధతి. వృత్యనుప్రాసతో చివరిపాదం మ్రోగించడం రామకృష్ణుని పద్ధతి.

**లలిత నిజ వామ కరతల**
**కలిత కనత్కంబు కాంతి కల కల నవ్వన్**
**గలువల చెలి గిలిగింతల**
**నలువగు ఱాలన్ బిసాళి నలువ గుఱాలన్**

మనోహరమైన తన ఎడమ (వామ) అరచేతిలో (కరతలమున) ధరింపబడి ప్రకాశిస్తున్న (కనత్) పాంచజన్య శంఖ కాంతి (కంబువు - శంఖము) చంద్రకాంతపు మణులనీ, బ్రహ్మదేవుడి హంసలనీ పరిహసిస్తూ ఉండగా (కల కల నవ్వన్) స్వామి విచ్చేసాడు.

కలువలచెలి (చంద్రుడు) పెట్టే గిలిగింతలతో అందగించే (నలువు - అందం, నలువు + అగు = నలువగు - ఒప్పిదమగు) `రాలన్ (రత్నాలని) - అంటే చంద్రకాంతమణులను పరిహసించే తెల్లదనం ఆ శంఖానిది.

నలువ అంటే నాలుగు ముఖాలు కలవాడు - బ్రహ్మ. ఆయన వాహనాలు (గుఱ్ఱాలు) - హంసలు.

("గుఱ్ఱం" అనే పదాన్ని ఇప్పటికీ "వాహనం" అనే అర్థం సూచించడం కోసం వాడుతూ ఉంటాం. సైకిలో స్కూటరో రెపేరుకొస్తే నా "గుఱ్ఱం మూలబడింది" అంటాం. రామకృష్ణుడు బ్రహ్మదేముడి హంసల్ని పట్టుకొని ఏకంగా గుఱ్ఱాలన్నాడు!) పిసాళి అంటే ప్రకాశించు.

ఇక ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది నిగనిగ లాడుతున్న దొండపండులాంటి అధరం. శృంగార భావం మేళవించి చెబుతున్నాడు.

**బింకపు వ్రేతల వాతెఱ**

**మంకెన పూదేనె తేట మానక పైపై**

**నింకగ నింకగ బల్మఱు**

**బంకించుట బోలె మోవి బచ్చెన హెచ్చన్**

వ్రేత - గోపిక, వాతెఱ - వాయికి తెఱ - నోరు. మోవి - పెదవి, బంకించుట - పులుముట, రుద్దుట, పట్టించుట ; బచ్చెన - కాంతి, నిగారింపు.

బింకమైన వయసులో ఉన్న గోపికలు వాళ్ళ అధరాలు మంకెనపువ్వులు. ఎర్రగా, మృదువుగా మకరందం చిప్పిలుతూ వుంటాయి. అందుకని అధరాలతో పోలిక. వాతెర (నోరు) అనే మంకెనపువ్వులో ఉండే తేనె తేటను (అధరామృతాన్ని) విడిచిపెట్టకుండా తన పెదవికి పైపైకి ఇంకినకొద్దీ ఇంకొంచెం ఇంకేట్టుగా (ఇంకగన్ - ఇంకగన్) చాలాసార్లు (పల్మఱు) పట్టించడంవల్ల స్వామివారి మోవి రంగు మరింత హెచ్చిందిట. అటువంటి అధరాలతో ఆ గోపికాలోలుడు ప్రత్యక్షమయ్యాడని అన్వయం.

***

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**




# మహాకవి తెనాలి రామకృష్ణ విరచిత "పాండురంగ మాహాత్మ్యము"

- బాలంత్రపు వేంకట రమణ

**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

ఇక స్వామివారి కన్నుల వర్ణన చూడండి.

*తరళమసార సార నిభ తారకముల్ సితపద్మ పత్ర బం*
*ధురములు, రాధికాహృదయ తోయజ కోరక బోధన క్రియా*
*తరుణ తరార్క రుగ్విలసిత స్ఫుట రక్తిమ సక్త కోణ భా*
*స్వరము, లసూక్ష్మ పక్ష్మములు, వాలిక కన్నులు చెన్ను మీఱగన్*

స్వామివి వాలిక కన్నులు - సోగకన్నులు, అవి చాలా అందంగా (చెన్నుమీఱగన్) ఉన్నాయి. తీర్చిదిద్దినట్టు ఒత్తుగా పెరిగిన రెప్పవెంట్రుకలతో బాగున్నాయి. సూక్ష్మము అంటే సన్నని. అసూక్ష్మము అంటే దానికి వ్యతిరేకము - ఒత్తయిన అని. పక్ష్మములు - రెప్పవెంట్రుకలు.

ఇక కనుగుడ్లు (తారకలు) కాంతిమంతంగా (తరళము) ఉన్నాయి. శ్రేష్టమైన (సార) ఇంద్రనీల మణులతో (మసారము) సాటివచ్చేటట్టు (నిభ) ఉన్నాయి. తరళమైన మసార సారంతో నిభమైన తారకలు కలవి ఆ కన్నులు. తెల్ల తామర రేకుల్లాగా (సిత పద్మ పత్రాల లాగా) రమ్యమైనవి (బంధురములు) ఆ కన్నులు.

తోయము - నీరు. తోయజము - నీటినుంచి పుట్టినది - పద్మం. కోరకము - మొగ్గ. తోయజకోరకము - తామరమొగ్గ. రాధాదేవి అనే తోయజకోరకం - దాన్ని మేల్కొల్పడం (బోధన + క్రియా) వికసింపజెయ్యడం అనే పనికి శ్రీకృష్ణుని చూపులు సూర్యకాంతుల్లా పనిచేస్తాయిట. అంటే స్వామివారి చూపులు సోకగానే రాధిక హృదయం పద్మంలా వికసిస్తుంది.

అర్కుడు - సూర్యుడు. తరుణ తర + అర్కుడు - అప్పుడే ఉదయించిన బాల సూర్యుడు. ఆ కాంతులు ఎర్రగా (రుక్) ఉంటాయి. తరుణ తరార్కుని రుక్ + విలాసం తో ప్రస్ఫుటమైన రక్తిమతో (ఎర్రదనంతో) కూడిన కోణాలు ఉన్నయి ఆ కన్నులకి. నేత్రకోణాలలో (కన్నుకొసలు) ఉదయసూర్యుని రక్తిమ ఉంది. అటువంటి రక్తిమతో సక్తమైన కోణాలతో భాస్వరములవుతున్నయి (ప్రకాశిస్తున్నాయి) ఆ సోగకన్నులు. అవి అందాలొలుకుతుండగా (చెన్ను మీరగా) శ్రీకృష్ణపరమాత్ముడు వేంచేశాడు.

ఇంక ఇప్పుడు సర్వాంగీణంగా సమగ్రంగా స్వామిమూర్తిని మన మనోనేత్రం ముందు నిలుపుతున్నాడు.

**దిగ్వాసుండురు పింఛలాంఛిత శిఖోదీర్ణుండు, వర్షాపయో**
**ముగ్వర్ణుండు, నవాంబుజాహిత లతాముక్తాంగదుండున్, సుధా**
**రుగ్విస్మేరముఖుం, డనంగ శతజిద్రూపాధికుం, డగ్రభూ**
**వాగ్వర్గోద్భవభూమి, శ్రీవిభుడు, శ్రీవత్సాంక వక్షుండునై**

దిక్ + వాసుడు - దిక్కులే వాసములుగా కలవాడు. అంటే దిగంబరుడు. మొలకి తీగలుచుట్టుకున్నాడే తప్ప పీతాంబరం కట్టుకోలేదు.

ఉరుపింఛలాంఛిత శిఖోదీర్ణుండు - పెద్దపింఛంతో చిహ్నమైన (లాంఛిత) శిఖతో ప్రకాశిస్తున్నవాడు.

వర్షా పయోముక్ + వర్ణుడు. వర్షాకాలం నాటి మేఘ వర్ణుడు (నీలమేఘశ్యాముడు).

నవాంబుజాహిత లతా ముక్తాంగదుండు. స్వామి ఒకరకం ఆకులతో భుజకీర్తులు (అంగదములు) కట్టుకున్నాడు. ఆముక్తము అంటే అలంకరించుకొనిన. అంబుజ + అహితుడు : పద్మాలకు శత్రువు - చంద్రుడు. నవమినాటి చంద్రలతలు - అర్ధచంద్రాకారంగా ఉండే లతలు.

సుధా రుగ్విస్మేరముఖుడు : సుధా రుక్ అంటే అమృతకిరణుడు - చందమామ. అతన్ని పరిహసించే ముఖంకలవాడు - లేదా చందమామ వంటి విస్మేరంతో (చిరునవ్వుతో) విరాజిల్లే ముఖం కలవాడు అని కూడా చెప్పవచ్చు. నవ్వురాజిల్లెడు మోము వాడు - అన్నాడు పోతన.

అనంగ శతజిత్ + రూప + అధికుడు. వందమంది మన్మధుల్ని రూపంలో జయించగలిగిన వాడు.

అగ్రభూ+ వాగ్వర్గ + ఉద్భవ భూమి. అగ్రభూ - అన్నిటికన్న మొదట పుట్టినది. అలాజన్మించిన వాక్-వర్గానికి - వేదాలకి - మాటలసమూహానికి ఇతడు ఉద్భవుడు - జన్మస్థానం.

శ్రీవిభుడు - లక్ష్మీపతి.

శ్రీవత్సాంక వక్షుండునై - శ్రీవత్సం అనే పుట్టుమచ్చ వక్షస్థలం మీద కలవాడు.

అటువంటి శ్రీమహావిష్ణువు పుండరీకునికి దర్శనం అనుగ్రహించాడు.

అలా ప్రత్యక్షమైన స్వామిని ఆపాదమస్తకం చూడ గానే పుండరీకుని మనస్సు హర్షధారావిలం అయిపోయింది. హర్షం అనే వర్షధారలతో ఒక్క క్షణం వ్యాకులం (ఆవిలము) అయిపోయింది. పట్టరాని ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. దానితో అతడు కృత్యవిమూఢుడయ్యాడు. కళ్ళు అప్పగించి చూస్తూ ఆ ఆనందంలో అలా స్థాణువులా ఉండిపోయాడు. లిఖించిన బొమ్మా? శిలాప్రతిమా? విస్మృతి (మరుపు) అనేది రూపం ధరించిందా ? అన్నట్టు చలన విదూరుడై బిగుసుకుపోయాడు పుండరీకుడు.

పరమాత్మ భక్తపరాధీనుడు, పరమ దయాళువు. తానై వచ్చి అనుగ్రహించడమేకాదు, సంభాషణ కూడా తానే మొదలుపెట్టాడు.

**"నిచ్చలు నిచ్చలో బొదలు నీ పితృభక్తికి జ్ఞానశక్తికిన్**
**మెచ్చితి, నచ్చితిన్ గరము నీయెడ నీ యెడమేల? వేడుకొ**
**మ్మిచ్చెదన్ జెచ్చెరన్ వలయునీప్సితముల్ శతమేని, దీననే**
**పొచ్చెము నొచ్చెముం జొరదు భూసురకేసరి! నమ్ము" నావుడున్**

"భూసురకేసరీ!" అన్న సంబోధనలోనే స్వామివారు ఇతని తపస్సుకి ఎంత ప్రసన్నులయ్యారో తెలుస్తోంది.

నిత్యమూ (నిచ్చలున్) నీ హృదయంలో (ఇచ్చలో) వృద్ధి పొందే (పొదలే) నీ పితృభక్తికీ, జ్ఞానశక్తికీ మెచ్చుకున్నాను. ఇక ఆలస్యం ఎందుకు (ఈ ఎడ ఏల)? ఏంకావాలో కోరుకో! వెంటనే (చెచ్చెరన్) ఇచ్చేస్తాను. కావలసిన వరాలు (ఈప్సితాలు); శతమేని - అంటే లెక్కపెట్టి వంద అని కాదు, ఎన్నైనా. అలా కోరుకోవడం వల్ల తపోశక్తికి ఏమైనా భంగంకలుగుతుందనుకుంటున్నావేమో! అటువంటి ఇబ్బంది ఏదీ ఉండదు. దీనివల్ల (దీనన్) ఏన్యూనత (పొచ్చెమున్) ఏలోపమూ (నొచ్చెమున్) రాదు. నామాట నమ్ము! అని అభయం ఇచ్చాడు.

ఆపుటికి పుండరీకుడిలో చలనం ఏర్పడింది. వెంటనే సాష్టాంగపడ్డాడు.

భస్మోద్ధూళన పాండురాంగము - రమాప్రాణేశు పాదద్వయిన్
విస్మేరాంబుజగామి హంస మిదినాన్ వే వ్రాల్చుచున్, లేచి "దే
వాస్మాకం శరణం త్వమేవ, గతిరన్యానాస్తి, దుర్వాసనా
పస్మారం హర" యంచు బల్కి మఱియున్ భక్తుండు భక్తి స్పృహన్

విభూతి పులుముకోవడం (భస్మ ఉద్ధూళన) వల్ల తెల్లగాఉన్న తన శరీరాన్ని (పాండుర + అంగము) పుండరీకుడు భక్తి తన్మయత్వంతో స్వామివారి పాదాలమీద వెంటనే వాల్చేశాడు. వికసించిన పద్మం (విస్మేర + అంబుజ) దగ్గఱకు పయనించే (గామి) హంసము ఇది అన్నట్టు (నాన్) సాష్టాంగపడ్డాడు.

మునీశ్వరుల్లో హంసలు, పరమహంసలు అనేస్థాయిలున్నాయి. (ఉదా: రామకృష్ణ పరమహంస). పుండరీకుడు ఇప్పుడు హంస స్థితిని పొందాడన్నమాట.

దేవా, అస్మాకం = మాకు, త్వం ఏవ = నీవే, శరణం - దిక్కు. అన్యా = వేరొక, గతిః దిక్కు లేదా మార్గం, న+అస్థిః = లేదు. దుర్వాసనా = దుస్సంసార రూపమైన, అపస్మారం = అపస్మార రోగాన్ని (సంస్కార స్మృతి కోల్పోవడం అనే రోగాన్ని) హర = తొలగించు.

ఆవేశం వచ్చినప్పుడు కొందరి భాష మారిపోతుంది. పుండరీకుడిది భక్త్యావేశం. హఠాత్తుగా దేముడు ప్రత్యక్షం అయ్యేసరికి ముందుగా స్తంభీకృతుడయ్యడు, తరువాత తాను అనుదినమూ చేసే పూజాపునస్కారాల్లోని భాష వచ్చేసిందనుకోవాలి.

అటుపైని పుండరీకుడు దశావతారవర్ణనలతో స్వామిని సుంతుష్టుణ్ణి చేసి - స్వామి అక్కడే వెలసేలా దివ్య వరం పొందాడు. స్వామిలో ఐక్యం అయ్యాడు.

**నిగమశర్మోపాఖ్యానము.**

ఈ నిగమశర్మోపాఖ్యాన్ని రామకృష్ణుడు అత్యంత మనోహరంగా తీర్చి దిద్దాడు.

వేదాధ్యయన సంపన్న, శిష్టాచార పరాయణ నిత్యాగ్నిహోత్రులైన పరమోత్తమవంశంలో జనించి, పండితోత్తముడు, సకలజనులచేత, రాజుచేత గౌరవింపబడిన తండ్రి కడుపున పుట్టి, తాను స్వయంగా సకల శాస్త్రాలు, వేద-వేదాంగాలు అభ్యసించి కూడా చెడు సావాసాలు చేసి, భ్రష్టుడై, చోరుడై, జారుడై, విశ్వాసఘాతకుడై అన్ని విధాలా పతనమైపోయిన పరమ నికృష్టుడు నిగమశర్మ. అంతటి పాపి కూడా పండరీపురంలో మరణించిన ఒక్క భాగ్యంచేత, దివ్య విమానం ఎక్కి వైకుంఠపురం చేరి "కుముదుడు" అనే పేరుతో శ్రీ మహావిష్ణువుకి ప్రీతిపాత్రుడుగా ఉంటున్నాడట!

ఉహ్వాని హోమాగ్ని యూఁద నొల్లఁడుగాని విరహజ్వరార్తితో వెచ్చనూర్చు
సంధ్యకుఁ బ్రార్థనాంజలి ఘటింపఁడుగాని యెరఁగు నీర్ష్యాకషాయితల కర్థి
నాగమవాదంబు లౌఁగాదనఁడుగాని విటవాదములు తీర్చు వేగిలేచి
కంబుభృత్పాదోదకంబు గ్రోలఁడుగాని యౌవతాధర శీధువాని చొక్కుఁ

బుణ్యచిహ్నంబు లపఘనంబున ఘటింప సిగ్గుపడుఁగాని కరనఖశిఖర లసిత
జాతనూత్నక్షతాంకముల్ సమ్మతించు, నారజము మీరి యా దుర్విహార హారి.

నిగమశర్మ హోమాగ్నిని ఊదడట; కానీ విరహమనే జ్వరం యొక్క బాధతో వెచ్చని నిట్టూర్పులూరుస్తాడట. సంధ్యావందనం చేయడట; కానీ ఈర్ష్యాకషాయితలకు (తాను ఇతర స్త్రీల సాంగత్యం చేస్తున్నట్లు తెలుసుకొని ఈర్ష్యతో కళ్ళెర్రచేసే తన ఉంపుడుగత్తెలకు) మాత్రం మక్కువతో (అర్థిన్) నమస్కరిస్తాడట (ఎరగున్). వేద చర్చలలో (ఆగమ వాదంబులన్) ఔను-కాదు అనడు - పాల్గొనడు; కాని పెందలకడనే లేచి (వేగిలేచి) విటవాదములను తీరుస్తాడట (గత రాత్రి విటులకు, విటీజనమునకు ఏర్పడిన కలహాలను తీరుస్తాడన్నమాట). (ప్రత్యేకించి ఇలాంటి కలహాలని తీర్చడానికి ప్రాచీనకాలంలో జారధర్మాసనాలుండేవని వినుకొండ వల్లభరాయని **"క్రీడాభిరామం"** వలన తెలుస్తూంది. అవిలేని తావుల్లో మన నిగమశర్మ లాటి వారే న్యాయమూర్తులు!)

కంబువు (శంఖము) కంబుభృత్పాదోదకంబు - శంఖధారి అయిన విష్ణువు యొక్క పాద తీర్థమును త్రాగడు (గ్రోలడు); కాని యువతీజనం యొక్క అధర (యౌవత అధర) శీధువు (చెఱకురసపు కల్లు) ఆని (త్రాగి) చొక్కున్ - పరవసిస్తాడు.

పుణ్యచిహ్నంబులు - తిరుమణి, తిరుచూర్ణములు మొదలైనవి, అపఘనంబునన్ - శరీరం మీద, ఘటింప (ధరించడానికి) సిగ్గుపడతాడు; కానీ కరనఖ శిఖర లసిత జాత నూత్న క్షతాంకముల - (వారకాంతలు) తమ చేతిగోళ్ళ వాడిమొనలచే చేసే కొత్త (నూత్నంగా, గతరాత్రి చేసిన) గుర్తులను ప్రదర్శించడానికి సమ్మతిస్తాడట. ఆరజము మీరి - ఇంపుమీరగా; ఆ దుర్విహార హారి - చెడునడతకు ఓడిన (తల ఒగ్గిన) ఆ నిగమశర్మ!

దినవెచ్చమునకునై తన మేనఁ గల సొమ్ము కొదుకక బచ్చింటఁ గుదువవైచు
నీఁదు గేచినరీతి నించుకించుక చేరి గిలుబాడుఁ దల్లిపైఁగల పసిండి
తండ్రికి నిద్ద పత్రములు దొంగిలించిపోయి ఘాయినంతకు నిచ్చి పొరయుఁగొంత
మిండవడ్డికి నోర్చి మృత్యురూపములైన సాహులచే ఋణగ్రాహియగుచు

**గుడ్డవృత్తులు, వృత్తులుఁ గొలుచు గుత్త, చేలు గ్రామాంశములు గాదినేలలెల్లఁ**

**జనవరుల కమ్మఁజూపు నిచ్ఛావిహార, వర్తి వాఁడేమి కానున్నవాఁడో మీఁద.**

దినవెచ్చములకు - అంటే రోజువారీ తన చిల్లర ఖర్చుకు, తన ఒంటిమీదనున్న సొమ్ము - నగలను, ఏమాత్రం సందేహించక (కొదుకక) కోమటింట (బచ్చింట) తాకట్టు పెడతాడు. చేరి - మెల్లమెల్లగా తల్లిని) సమీపించి, కొంచెం కొంచెం గా (ఇంచుకించుక) ఈదు గీచిన రీతి (ఈత చెట్టును కల్లు కొరకు అప్పుడు కొంచెం అప్పుడు కొంచెం గీస్తారట) - ఆ విధంగా తల్లి ఒంటిమీద గల బంగారు నగలు, గిలుబాడు - అపహరిస్తాడు.

తండ్రికినిడ్డ - తండ్రికి ఇవ్వబడిన ; తండ్రి దగ్గర ఋణం తీసుకొని ఋణపత్రాలు వ్రాసి ఇచ్చినవారి యొక్క పత్రాలను దొంగిలించి వారివద్దకే తీసుకెళ్ళి వారి పత్రాలు వారికిచ్చేసి ప్రతిఫలంగా ఎంతోకొంత (వారు ఇచ్చినంత) వారినుండి పొరయునట (పొందునట).

ఇక అతనెలా ఋణగ్రస్తమైపోయాడో వివరిస్తున్నాడు.

మిండవడ్డికిన్ - అధిక వడ్డీకి, చక్రవడ్డీకి, ఒర్చి - అంగీకరించి, యములాళ్ళ వంటి వడ్డీవ్యాపారులవద్ద అప్పులు చేసి; పూర్వీకులకి వృత్తి పరంగా (పౌరోహిత్యం, యజ్ఞయాగాదులు చెసినందుకు ప్రభువులు మెచ్చి ఇచ్చిన, ఇంకా దానంవల్ల లభించిన భూములు) కొలుచు గుత్త చేలు (కౌలుకిచ్చిన వాటి మీద వచ్చే ఆదాయం); గ్రామాంశములు (తన తండ్రికి భాగం ఉన్న గ్రామస్తుల ఉమ్మడి ఆస్తి) - గాదెలలో ఉన్న ధాన్యం - ఇలాటి ఆస్తులన్నిటినీ ఇచ్ఛా విహారానికి అలవాటుపడ్డ నిగమశర్మ చనవరులకు - చనువున్న పరిచితులకు - అమ్మేసే వాడట. ఏమి కానున్నాడో అతడు భవిష్యత్తులో మరి.

నిగమశర్మ అక్కగారు తమ్ముడు చెడుతిరుగుళ్ళు మరిగి పిత్రార్జితం అంతా తగలేస్తున్నాడని తెలిసి తమ్ముడికి బుద్ధి గరపి సన్మార్గంలో పెడదామని వచ్చింది.

**ప్రారంభించిన వేదపాఠమునకున్ బ్రత్యూహమౌనంచునో**

**యేరా తమ్ముడ! నన్నుఁజూడఁ జనుదే వెన్నాళ్ళనో యుండి చ**

**క్షూరాజీవ యుగంబు వాఁచె నినుఁ గన్గోకున్కి , మీ బావయున్**

**నీరాకల్ మదిఁగోరుఁ జంద్రు పొడుపున్ నీరాకరంబుం బలెన్**

ఏరా తమ్ముడా! అని పిల్వడం మన సంసారాల్లో ఉండే చనువుని తెలుపుతుంది. మొదలుపెట్టిన వేదపాఠాలకి విఘ్నం (ప్రత్యూహము) కలుగుతుందనా నువ్వు చాలా కాలంగా నన్ను చూడ్డానికి రాలేదు!? (వాడు భ్రష్టు పట్టిపోయాడన్న విషయం తనకి ఇంకా తెలియదని అతడనుకోవాలని). నిన్ను చూడక తామరపువ్వుల్లాంటి నా రెండు కళ్ళూ (చక్షూరజీవయుగంబు) వాచిపోయాయి. ఇక నీ బావగారు కూడా నీ రాక కోసం పున్నమి చంద్రుడి రాక కోసం సముద్రుడు వేచి యున్నట్టు, మదిలో చాలా వేచి చూశారు.
ఏరా తమ్ముడా - నీ కోసం చూసి చూసి కళ్ళు రెండూ వాచాయి - లాటి సామాన్య పదజాలంతో, చక్షూరాజీవయుగంబు; రాక అనే శ్లేష (రాక అంటే రెండర్థాలు; ఒకటి వచ్చుట, రెండు – పూర్ణిమ); సాహిత్య చమత్కారాలు చేశాడు కవి.

నాదు సహోదరుండు సుజనస్తవనీయ నయ ప్రసక్తి బ్ర
హ్మాదుల మెచ్చఁడే నతని యజ్ఞమునం గడుఁ బూజ్యురాలనై
వేదియలంకరింతునని వేవురిలోపల నాడుకొందు నీ
వేదియు లేక సర్వగుణహీనుఁడ వౌట యెఱుంగఁ దమ్ముడా!

ఇక బాహాటంగా మందలించడం మొదలుపెట్టింది. "నేనేమో నా తమ్ముడు సుజనులందరూ మెచ్చుకుంటూ ఉండగా యజ్ఞం చెసి తనని అగ్రస్థానంలో కూర్చోపెట్టి గౌరవిస్తాడని అక్కడ పలుమందికీ సగర్వంగా చెప్పుకుంటూ ఉంటే, నువ్విలాగ ఏమీ లేకుండా గుణహీనుడవౌతా వనుకోలేదురా తమ్ముడా" అని వాపోయింది.

అక్కగారు ఇంత బోధించినా తమ్ముడు పెడచెవిన పెట్టాడు. ఆవిడసొమ్ములతో సహా, ఇల్లంతా ఊడ్చి దోచుకొని ఉడాయించాడు. అతగాడు దొచుకుపోయిన వస్తువుల్ని ఈ చక్కటి పద్యంలో కవి చెబుతున్నాడు.

గోమేధికోపలాంకుర మానితంబులు పుష్యరాగచ్ఛటా పుంఖితములు
వైఢూర్య సంధాన వర్ణనీయంబులు హరినీల కీలనాభ్యంచితములు
కురవింద సందర్భ గురుతరంబులు చతుర్విధ వజ్రదళ సమావేల్లితములు
మహనీయ తర హరిన్మణి పరీతంబులు నకలుష స్థూల మౌక్తిక యుతములు

పద్మరాగ పరీరంభ భాస్వరములు, దంత విద్రుమకృత సముద్గక భృతములు
మాతృభూషలు నత్తికా మండనములు, నిజయువతి దాల్చు సొమ్ములన్నియు హరించి.

గోమేధిక ఉపల (మణుల యొక్క) అంకుర (మొలకలచే) మానితంబులు (కూర్చబడినవి); పుష్యరాగముల చ్ఛటా (గుంపులచేత) పుంఖితములు (పుంఖాను పుంఖలుగా చేయబడినవి); వైఢూర్యముల యొక్క సంధాన (కూర్పుచేత) వర్ణనీయంబులు (పొగడదగినవి); హరినీల (ఇంద్రనీలమణులయొక్క) కీలన (కూర్పుచేత) అభ్యంచితములు (ఒప్పిదమైనట్టివి); కురువింద మణుల; సందర్భ (కూర్పుచేత) గురుతరంబులు (గొప్పవైనట్టివి); రకరకాల వజ్ర దళ (రేకులతో) సమావేల్లితములు (బాగుగా ఆవరించిన ప్రకాశము కలవి); మహనీయతర (గొప్పవైన) హరిన్మణి (పచ్చలచే) పరీతంబులు (పొదగబడినవి); అకలుష (దోషము లేని) స్థూల మౌక్తిక (పెద్ద మంచి ముత్యాలతో; యుతములు (కూడినవి); పద్మరాగ మణులు, పరీరంభ (పొదుగుటచే) భాస్వరములు (వెలుగొందునట్టివి); దంతములతోనూ, విద్రుమ - పగడములతోనూ; కృత (చేయబడిన); సముద్గక (బరిణె లేక, మందసము - పెట్టెలో) భృతములు (ఉంచబడినవి); మాతృభూషలు (తల్లినగలు); అత్తికా మండనములు (అక్క నగలు); నిజ యువతి (తన భార్య) తాల్చు (ధరించు) సొమ్ములు - నగలు ; అన్నియూ అపహరించి -
ఒకనాటి రాత్రి పడుకునే పడకకు కూడా చెప్పకుండా గాఢ తమోనికరము (చిమ్మ చీకట్ల సముదాయమే) తన తోడుగా ఒక్కడే పేరడవిత్రోవ (కారడవి దారి)లో పరిగెత్తుకుంటూ వెళ్ళాడట.

అడవిలో దొంగలు ఇతగాడిని చావబాది, ప్రాణావశిష్టంగా వదిలి అతని సొమ్మంతా దోచుకుపోయారు. ఆ దారిని పోతున్న కాపు ఒకడు దయతలచి అతడ్ని రక్షించి తన ఇంటికి తీసుకువెళ్ళి వైద్యంచేయించి బ్రతికించడమే కాకుండా సొంత కొడుకులా చూసుకోసాగాడు. ఈ కృతఘ్నుడు ఆ కాపు కోడల్ని లేవదీసుకు పోయి అడవిలో కాపురం పెట్టాడు. కొన్నాళ్ళకు ఆ కాపుస్త్రీ నిస్సంతుగా మరణించింది.

తదుపరి నిగమశర్మ వేరొకచోట రూపాజీవ (అందమే జీవనాధారంగా కలది - పడుపు వృత్తి చేసుకొనేది) అయిన ఒక ప్లవకన్యను (ఛండాలస్త్రీని) పెండ్లియాడాడట. ఆ భార్యద్వారా పిల్లల్ని కూడా కన్నాడట. అడవికి వెళ్ళి వెటాడి మృగాలని చంపి తెచ్చేవాడట. ఆమెతో కలిసి కల్లుకూడా సేవించేవాడట. ఆ ప్రకారం ఆమెతో సంసారం సాగించాడు.

***

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**




# మహాకవి తెనాలి రామకృష్ణ విరచిత "పాండురంగ మాహాత్మ్యము"

– బాలంత్రపు వేంకట రమణ

**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

ఒకనాడు అతడు యధాప్రకారం వేటాడి తిరిగి వెళ్ళే సరికి అతని ఇల్లంతా అగ్నికీలలచే ఆక్రమించబడి తగులబడి పోయింది. కల్లు మత్తులో ఉన్న అతని భార్యా పుత్రులు యావత్తూ ఆ మంటలకు ఆహుతి అయినారు.

**ఈ కడజాతి నాతి కిహిహీ! మహిదేవుఁడు చిక్కెనంచు నన్**
**రాకకుఁ బోకకున్ జన పరంపర కెంపగు చూడ్కిఁ జూచి యం**
**బూకృతమాచరించుటకు బుద్ధి దలంకఁ గలంక ముక్త చం**
**ద్రాకృతిఁ బొల్చు నీ ముఖమునందమృత స్థితిఁ గాంచి మించుటన్**

చనిపోయిన భార్యగురించి నిగమశర్మ దఃఖించిన పద్యం ఇది.

ఇహిహి అనడంలో వెక్కిరింత, నవ్వేవారి ఆక్షేపణ అంతా కనబడుతోంది. జనపరంపర - జన సమూహము. కెంపు అగు చూడ్కి - కెంపులా ఎర్రని చూపులతో - కోపానికి సూచన. అంబూకృతము - ఉమ్మి వేయుట. తలంకన్ - భయపడను. కలంక ముక్త చంద్రాకృతి - మచ్చ వదిలిపెట్టబడిన - మచ్చ లేని - చంద్రుని వలెనున్న నీ మొగమునందమృతముండుట చూచి. ఆ అమృతము అధరామృతము.

అలా దుఃఖించి, దుఃఖించి, నిర్భోజనుడై (భోజనము చేయనివాడై) నిరంబుభజనుండునై (నీరుత్రాగనివాడైన) అ కుజనుండు (ఆ దురాత్ముడు) పుండరీ క్షేత్రాన్ని చేరుకున్నాడు.

మిక్కిలి పచేళిమమై (పరిపక్వమైనదై) తనను సమీపిస్తూన్న పూర్వ సంస్కార తపఃఫలము కారణంగా అతడు పాపసమూహములను నాశనం చేసేదైనట్టి సంగమ తీర్థంలో స్నానమాచరించి అక్కడ నరసిం హస్వామిని దర్శించుకున్నాడు.

ఇక నిగమశర్మ సారూప్య మోక్షం పొందే దశ సమీపిస్తూందట. సారూప్యమోక్షం అంటే భక్తుడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు యొక్క రూపాన్ని పొందడమన్నమాట. ఎడతెగని ఉపవాసాలతో అతని చెవులు గడియలు (దిబ్బళ్ళు) పడ్డాయట. మేను వణికిందిట. కాలము గడవక అతడు వడిగా చెడి (ఆరోగ్యం క్షీణించి) పుడమిని పడి విగత జీవుడయ్యాడట.

అతి హీనమైన అతన్ని తీసుకెళ్ళడానికి నల్లగాఉన్న దండధరానుచరులు (యమభటులు) వచ్చారట. అదేసమయానికి విష్ణుదూతల సమూహం వచ్చి దివ్య విమానంపై కూర్చుడపెట్టి, విష్ణుసారూప్యం చెందిన నిగమశర్మను వైకుంఠపురానికి తీసుకువెళ్ళారట.

విష్ణుసారూప్యం చెందిన నిగమశర్మ మహద్భాగ్యాన్ని రామకృష్ణకవి ఈ అద్భుతమైన పద్యంలో వివరిస్తున్నాడు.

**ఉత్తాల ఫణిభుగ్గరుత్తాల వృంతానిలాశాంత ఘర్మాంబు వయ్యె మేను**
**ప్రత్యగ్ర ముక్తాతపత్త్రీ భవచ్ఛేష వారితా తపమయ్యె జారు మౌళి**
**సూత్రవతీశ దోర్వేత్ర దత్తావకాశామరంబయ్యెఁ గటాక్ష విహృతి**
**భృగు భరద్వాజ ప్రభృతి కృత స్వస్తి వాగ్ఝర ముఖరములయ్యెఁ బార్శ్వతలము**
**లరుణ కిరణ సహస్రాభమభ్రగంబు**
**నగు విమానంబుపై నెక్కి నిగమశర్మ**
**తీండ్రఁ బుణ్డ్రేక్షు కోదండ్రు తండ్రిఁ బోలి**
**పరమధామంబునకుఁ బోవు పథమునందు**

ఫణి భుక్ - పాములను తినేవాడు - గరుత్మంతుడు. అతనియొక్క; ఉత్తాల - ఎత్తైన, ఉన్నతమైన, గొప్ప. గరుత్ - ఱెక్కలు (అనెడి) తాలవృంత – విసని కఱ్ఱలచేత; అశాంత - మిక్కిలి చల్లగా చేయబడిన చెమటబిందువులు కలది అయినది అతని శరీరము. అంటే గరుత్మంతుడు తన రెక్కలతో ఇతని ఒంటికి పట్టిన చెమట ఆరిపోయేలా విసిరాడట. ఆదిశేషుడు (ప్రత్యగ్రుడు) తనపడగలను ముత్యాలగొడుగులా పట్టి ఇతనికి ఎండ తగలకుండా చేశాడట. సూత్రవతీదేవి భర్త అయిన విష్వక్సేనుడు (విష్ణువు యొక్క సేనాపతి) విష్ణుమూర్తికి నిత్యం వీచోపులిస్తాడు. ఇతనికీ ఇస్తున్నాడు అంటే వింజామర వీస్తున్నాడు. అలా వీస్తున్నప్పుడు ఆ వింజామర కంటి చూపుకి అడ్డం వస్తోంది, తొలగుతోంది. ఆ తొలగినప్పుడల్లా తనని చూడ్డానికి వచ్చిన అసంఖ్యాకమైన దేవతలు కనుచూపుమేరకి (కటాక్షవిప్రూతి) కనబడుతున్నారట. భృగువు, భరద్వాజుడు మొదలైన సప్తఋషులు ఇరుపక్కలా నిలబడి స్వస్తివచనాలు పలుకుతున్నారట.

అలా వారందరూ సేవిస్తూఉండగా వేయి సూర్యుల కాంతితో ప్రకాశించే దివ్య విమానాన్ని ఎక్కి, నిగమశర్మ చెరకువింటివాని (మన్మథుడి) తండ్రిని (విష్ణుమూర్తిని) పోలి - అనగా విష్ణు సారూప్యం చెంది - దివ్యధామమునకు - పరమపథానికి - వెళ్ళాడట. "పుణ్డ్రేక్షు" అంటే ఎరుపు-నలుపు రంగుకలిగిన కణుపులు ఉన్న చెఱకు, దాన్ని విల్లుగా కలవాడు (కోదండు) మన్మథుడు. అతని తండ్రి అంటే విష్ణువు. అంటే విష్ణు స్వారూప్యం చెందిన నిగమశర్మ పరమధామమునకు చేరుకున్నాడు.

"ఉత్తాల" "గరుత్తాల" అన్న పదాలు రెండూ ప్రాసయతి చెల్లించుకొని యమకముతో కూడి ఆ యమకము "గరుత్ + తాలవృంత" అన్న పద విభాగంతో కూడిన కూర్పు యొక్క చమత్కారం చేత దిగ్భ్రమ కలిగిస్తోంది. ఇది సారూప్య సాలోక్యములోనిది. ఇలా యమకము చేయడం మాత్రం అన్యులకు సాధ్యం కాదు. ఎన్నో చోట్ల రామకృష్ణకవీంద్రుడు చేసిన సమాసాలచేత, ఇలాటి కూర్పులచేత ఆయనతో ఈ విద్యలో పోల్చదగినవాడు దరిదాపుల్లో ఎవరూ లే’’రని పండితుల ఉవాచ.

తెలుగు భాషని సుసంపన్నం చేసిన మహానుభావుల్లో మహాకవి తెనాలి రామకృష్ణుడు ఒకడని నిస్సందేహంగా, నిర్ద్వందంగా చెప్పవచ్చును.

ఆయుత - నియుతల కథలోనుంచి మచ్చుకి రెండు పద్యాలు చూద్దాము.

**వాసోనిగ్రమెన్నరాఁకలియు నీర్వట్టున్ గణింపర్తలల్**

**మాసెంగా యన రంగముల్ బడలినన్ బాటింపరట్టుండనీ**

**యా సాయంబుగ నానిశాత్యయముగా నామ్నాయముల్ గ్రోల్చుచో**

**నాసీన ప్రచలాయితంబయిన లేదాహో వితర్కింపగన్**

అగస్త్యమహర్షికి ఇద్దరు  శిష్యులున్నారు.  వారి పేర్లు: ఆయుతుడు, నియుతుడు. వాళ్ళు వేదాభ్యాసం ఎలా చేసేవారో చెబుతున్నాడు.

వాసస్ అంటే గుడ్డ. వాళ్ళు వేదాలు (ఆమ్నాయంబులు) అధ్యయనం చేసేటప్పుడు లేదా  వల్లె వేసేటప్పుడు (గ్రోల్చుచోన్) వాళ్ళకి వొంటిమీద బట్టలు ఎలా వున్నాయో అనే ధ్యాస ఉండేది కాదట - అసలు ఉన్నాయా లేవా అనే స్పృహే ఉండేది కాదు; ఆకలియు, దప్పికయు  (నీర్వట్టున్) లెక్క చేసేవారు  కారట;  జుత్తు బాగా పెరిగిపోయింది (తలల్ మాసెంగా) అనుకోరు  - జడలు కట్టేస్తూన్న సరే ; అవయవాలు హూనం అయిపోయినా - అదే పనిగా కూర్చోడం వల్ల - పట్టించుకొనేవారు కారట; ఇవన్నీ అలా ఉండనీ - ఉదయం కూర్చుంటే సాయంకాలం అయ్యేవరకూ (ఆసాయంబుగన్)  (ఆబాలగోపాలం, ఆసేతుహిమాచలం లాగ ఆసాయంబుగన్ అన్నాడు); రాత్రి కూర్చుంటే ఉదయం అయ్యేవరకు (ఆ +  నిశః  + అత్యయంబుగన్)  కనీసం కూర్చుని కునుకిపాట్లు పడడం అనేది కూడా లేదే (అసీన ప్రచలాయితంబు అయినన్ లెదే) అహా చూడగా (వితర్కింపగన్).  అంత శ్రద్ధగా చదువుకొనేవారట ఆ ఆయుత నియుతులు.

**హుంకారములు లేవె యుప పురందర హరోత్పాటనంబునకుఁ బాల్పడవుఁ గాక**
**భ్రూభంగములు లేవె యాభీల వింధ్య గర్వస్తంభనమునకు రావుఁగాక**
**చులుకాకృతులు లేవె జలరాశి నిశ్శేష శోషణకుఁ జొరవు గాక**
**జాఠరాగ్నులు లేవె జటిలాపి వాతాపి తనుదాహమున నెదుర్కొనవు గాక**

**నిష్ఠ నీ మాడ్కి లోక ప్రతిష్ఠ గుఱిఁచి**
**దుష్టనిగ్రహ శిష్ట సంతుష్టి హేతు**
**రోషభీషణ రేఖా నిరూఢ గాఢ**
**లీలఁ గ్రీడించు ప్రోడలు లేరుఁ గాక !**

అగస్త్యుడు ఆయుత-నియుతులకోసం తగిన వధువుల్ని కుదర్చడంకోసం సాక్షాత్తు బ్రహ్మదేవుడి వద్దకే వెళ్ళాడు. బ్రహ్మ అగస్త్యుడికి అగ్రాసనమిచ్చి పొగడ్తలతో ముంచెత్తాడు.  ఆసందర్భంలోనిది ఈ పద్యం.

లోకంలో ఎందరు హుంకరించడం లేదు? అవన్నీ ఇంద్రుడంతటివాణ్ణి పదవీభ్రష్టుణ్ణి చేసి హఠాత్తుగా క్రింద పడేలా చేస్తాయా? (నూటు యజ్ఞాలు చేసిన నహుషుడు తాత్కాలికంగా ఇంద్రపదవిలో ఉండగా శచీదేవిని మోహించి, తదుపరి మహర్షులని అవమానించిన సందర్భంలో అగస్త్యుడు హుంకరించగా - శపించగా - కొండచిలువ అయి భూలోకంలో వచ్చి పడ్డాడు).

చుళుకాకృతి అంటే పుడిసిలి పట్టడం - అంటే అరచేతిలోపట్టేటంతటి జలాన్ని స్వీకరించడం. లోకంలో ఎందరు పుడిసిళ్ళు పట్టడంలేదు? వారందరూ అగస్త్యుడిలా సప్తసముద్రజలాల్నీ నిశ్శేషంగా త్రాగగలుగుతున్నారా? (సముద్రంలో దాక్కొన్న కాలకేయులనే రాక్షసుల్ని బయటపడేయడం కోసం, అగస్త్యుడు సప్తసముద్రజలాలన్నిట్నీ పుక్కిట పుడిసిలి పట్టాడని ఐతిహాస్యం).
అందరికీ ఆకలేస్తుంది, కానీ అందరూ అగస్త్యుడిలా వాతాపి లాటి మహా మంత్రశక్తులుకలిగిన రాక్షసుణ్ణి తిని హరాయించుకోగలుగుతారా?

ఇవన్నీ పేర్కొంటూ బ్రహ్మ అగస్త్యుడిని పొగుడుతున్నాడు. "మిత్రావరుణ కుమారా, ఓ అగస్త్యా! ఇలా నీవలె లోకకళ్యాణంకోసం దుష్ట శిక్షణ, శిష్ట సంతుష్టి కోరి రోషభీషణమైన పద్ధతిలో క్రీడించే ప్రోడలు - ఇలాటి మహత్కార్యాల్ని క్రీడప్రాయంగా చేయగలిగే నేర్పరులు - లేరు గాక లేరు!

తెనాలిరామకృష్ణ మహాకవి గురించి ఆయన రచించిన కొన్ని ఆణిముత్యాల్లాటి పద్యాల్నీ, కవితా చమత్కారాల్ని మరికొంత మంది తెలుగు భాషాభిమానులతో పంచుకోవడమే ఈ చిరుప్రయత్నం.

**"పాండురంగమాహాత్మ్యం"** అవతారికలో ఆయన ఇలా వ్రాసుకున్నాడు.

**నను రామకృష్ణకవి గవి**
**జన సహకారావళీ వసంతోత్సవ సూ**
**క్తి నిధి బిలిపించి యర్ధా**
**సనమున గూర్చుండ బనిచి చతురత ననియెన్**

"కవులున్ బాఠకులున్ బ్రధానులు అలంకారజ్ఞులున్, ప్రాజ్ఞులున్" కొలువై ఉండగా నిండుసభలో విరూరి వేదాద్రి మంత్రి రామకృష్ణకవిని సగౌరవంగా పిలిపించి అర్ధాసనం మీద కూర్చోబెట్టుకున్నాడు. ఆ సందర్భంగా "కవిజన సహకారావళీ వసంతోత్సవ సూక్తినిధిని నేను" అని సగర్వంగా చెప్పుకున్నాడు రామకృష్ణుడు. కవిజనులు అనే మామిడితోపునకు వసంతోత్సవం కల్పించే సూక్తులకు నేను నిధిని అన్నాడు.

"సూక్తినిధి" అనే సమాసం నన్నయ్య తరవాత మళ్ళీ ఇక్కడే యథాతథంగా కనిపిస్తుంది. పాఠకహృదయాల్నే కాదు, కవిహృదయాల్ని కూడా ఆనందపరిచి చిగురింపచేసే సూక్తులకు నిధి ఆయన. సూక్తులు అంటే నీతి వాక్యాలు కావు. అలంకారమహితమైన ఉక్తులు. నన్నయ్యదగ్గరా ఇదే అర్థం. పరిపూర్ణ కవితామయోక్తులకు తాను నిధి కనుక కవి జనుల్ని పులకింప జెయ్యగలను అని ధీమాగా ప్రకటించాడు తెనాలి రామకృష్ణుడు. ఆయన కవులకు కవి. కవీనాం కవిః

==:: సమాప్తి ::==

**ఓం సర్వేజనాస్సుఖినోభవంతుః**

***




# ఆదిభట్ల నారాయణదాసు

- ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి

(ఆదిభట్ల నారాయణదాసుగారి 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)



**సంగీతం, సాహిత్యం సరితూచిన** త్రాసు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు - అంటాడు శ్రీశ్రీ ఒక ప్రతిభా సముద్రుణ్ణి ఇంకొక ప్రజ్ఞాచక్షువు అంచనా కట్టిన తీరు ఇందులో కనిపిస్తుంది. సంగీత సాహిత్యాలనే కాదు, భక్తిని రక్తిని కూడా సరితూచిన త్రాసు నారాయణదాసు. బహుముఖీనమైన ఆయన పరిపూర్ణ వ్యక్తిత్వంలో ఎన్నో పార్శ్వాలున్నాయి. అందరూ ఆయనను పూర్ణపురుషుడని కీర్తించారు. ఇప్పుడు కూడా ఆయన కారణవశాన నేలమీద సంచరించిన గంధర్వుడని విశ్వసించేవారనేకులున్నారు. ఆయనలో ఎన్నో సమ్మోహన శక్తులుండేవి. ఒక్కొక్క గుణంలో ఒక్కొక్కరు గొప్పవారుగా గుర్తింపు పొందుతారు. ఆయనలో ఎన్నో గుణాలను అందరూ గుర్తించారు. సాంప్రదాయికులు ఇదంతా దైవదత్తమైన ప్రజ్ఞ అని, పూర్వజన్మ సంస్కారమని, ఉపాసనా బలమని అంటారు. మనకు ప్రత్యక్షంగా కనబడే కొన్ని అంశాలను పరిశీలించి చూస్తే ఇదంతా ఆయన రక్తకణాలలో స్థిరపడిన శక్తిగా ప్రాణధాతువుల్లో ఇవతళించిన అసాధారణ శేముషీ వైభవంగా అనిపించకమానదు.

విజయనగరం జిల్లాలో, ఇప్పటి సీతానగరం - మక్కువ - బలిజిపేట మండలాల పరిసర సువర్ణముఖీ నదీ పరీవాహ ప్రాంతంలో నందాపురం పట్టీ అని పేరు పడిన పద్దెనిమిది ద్రావిడ బ్రాహ్మణ అగ్రహారాలున్నాయి. అజ్జాడ - మద్దివలస - సుమి - కృష్ణరాయపురం - గుడివాడ - బొమ్మికపాడు - వెంకంపేట - కారివలస మొదలైన ఆ అగ్రహారాలు నూరేళ్ళ కిందట మహావైభవంగా ఉండేవి. దక్షిణదేశం నుంచి తరలివచ్చి ఇక్కడ అగ్రహారాలను పొంది స్థిరపడిన ఆ ద్రావిడ బ్రాహ్మణులు వేదాధ్యయన సంపన్నులు. కావ్యశాస్త్రాలలో దిట్టలు. పొలం పనులలో రైతులకు సమ ఉజ్జీలు. కలియుగ భీమునితో కుస్తీకి దిగగల కండబలం కలవారు. పెంకెతనానికి వారిది పెట్టినది పేరు. నిర్భీక ప్రవృత్తి, నిష్కపట స్నేహశీలం, నిర్మొహమాట వైఖరివారి నైజం. నిరంతర దీక్ష వంటి లక్షణాలు వారిలో ఒకటిగానీ, కొన్నిగానీ, అన్నీగానీ కనిపించని ద్రావిడ బ్రాహ్మణుడుండేవాడు కాడు. ఇతరులు ఈ లక్షణాలను చూసి వారిని మొరటువారని చాటుమాటుగా అనుకునేవారు. ఇప్పటికీ అనుకుంటూ ఉంటారు. మాట పెళుసుగా ఉన్నప్పుడు కొందరు మనసు మెత్తదనాన్ని గుర్తించలేక పోవడంలో వింతలేదు. గుణాలను, అవగుణాలను తుల్యగౌరవంతో స్వీకరించగల సమధర్ములు ఆ శాఖలో అనేకులు కనిపిస్తారు. పెట్టడానికైనా, తిట్టడానికైనా తెగువగలవారు వారే అనడానికి చాలా దాఖలాలు కనిపిస్తాయి. కత్తు కలిపితే కౌగిలి ఇస్తారు. కత్తి కడితే కకావికలు చేస్తారు.

నందాపురం పట్టీలో గుడివాడ అని ఒక అగ్రహారం ఉండేది. ఇప్పుడది లేదు. ఇటీవల వెంగళరాయసాగరంలో మునిగిపోయింది. ఆ గ్రామంలోని ద్రావిడ బ్రాహ్మణులకు, కలెక్టరుకు మధ్య కసావా పడింది. దొరలు అప్పుడు కలెక్టర్లుగా ఉండేవారు. కలెక్టరు వారినొక పట్టుపట్టాలను కొన్నాడు. వాళ్ళు కూడా కలెక్టరు నొక ఆట ఆడించాలని ముందుగానే తీర్మానించుకున్నారు. కలెక్టరు గుర్రమెక్కి కమానుకు వచ్చాడు. ఊరి బ్రాహ్మణులందరూ ఎదురేగి స్వాగత సత్కారాలు చేసారు. కలెక్టరు గుర్రం దిగి దానినొక చెట్టుకు కట్టించి ఊళ్ళోకి వెళ్ళాడు. వాళ్ళ సత్కారాలకు ఉబ్బితబ్బిబ్బుపడుతూనే బింకాన్ని కూడా బదలాయించాడు. భేటీ ముగిసింది. తిరుగుముఖం పట్టిన కలెక్టరు వచ్చేటప్పటికి ఉండవలసిన చోటులో గుఱ్ఱం లేదు.

అంతవరకూ కైవారాలు పలికిన వారందరూ ఆ క్షణంలోనే కనుమరుగయ్యారు. కోపాన్ని మింగలేక, కక్కలేక కలవరపడుతూ కళ్ళెత్తిన కలెక్టరుకు తన గుఱ్ఱం గుడిగోపురం మీద చుట్టూ తిరుగుతూ కనిపించింది. ఆ గుర్రం అక్కడ ఉండలేదు – దుముకలేదు – కలెక్టరు దానిని దింపలేడు – ఇలా గడిచిందా ప్రహసనం. అప్పటి నుండి వారు గుడి ఎక్కించినవారుగా పేరు పడ్డారు. వారిలో ఉన్నది ఈ పెంకెతనం మాత్రమే అయితే వారిని గూర్చి చెప్పుకోవలసిన పనిలేదు.

కారివలస అని ఇంకొక అగ్రహారం. ఆదిభట్ల కైలాసం పేరు తెలియని వారు ఆంధ్రదేశంలో ఉండరు. వారి పూర్వులది నూరు గరిసెల పంట. నిత్యాన్నదాతలుగా వారు పేరు పడ్డారు. తోటివారికి, సాటివారికి అన్నదానం చేయడం గొప్పకాదు. ఒకప్పుడు నదికి వరద పోటెత్తింది. మూడు పొద్దులు గడిచినా అది తగ్గలేదు. అటువారటు, ఇటువారిటు నిలిచిపోయారు. ఊరికి ఆవలి ఒడ్డున ఉన్నతోటలో ఒక హరిజనుడు నిలిచిపోయాడు. ఒక పక్క ముసురు. ఒక వంక ఆకలిదప్పికలు. మూడవనాటి మునిమాపువేళ అతడి ఉనికిని, ప్రాణగండాన్ని ఊరు గుర్తించింది. గుర్తించినా ఏమి చేయగలరు? ఏనుగులను తోసుకుని పోయే ప్రవాహంలో దిగడానికి ఎవరూ సాహసించలేకపోయారు. అప్పుడు నిత్యాన్నదాత అయిన ఆ బ్రాహ్మణ గృహస్థు ఒక చట్టిలో అన్నం – ఊరగాయ పెట్టించి నెత్తిమీద పెట్టిన గుడ్డతో కలిపి కదలకుండా కట్టి, ఆ పైన ఒక దీపాన్ని అమర్చుకుని నదిని ఈదుకుని ఆవలి ఒడ్డును చేరుకుని ఆ హరిజనుని ఆకలి బాధను తీర్చాడు. ఇది కట్టుకథ కాదు. కాశీమజిలీ కథ అంతకంటేకాదు, అందరి కళ్ళ ఎదుట జరిగిన నిజ సంఘటన. ఆ ఇంటి వంద గరిసెల పంటనే ఆదిభట్ల కైలాసం అడ్డుకుని మరలించి లేనివాళ్ళకు పంచిపెట్టాడు. ఆ అన్నదాతలు చివరి రోజులలో ఆకలితో అలమటించారు. ఈ శాఖ వారి జీవచైతన్యాన్ని తెలియజేసే ఇంకొక పార్శ్వమిది.

కలువరాయి అని ఇంకొక దేశంలో అయితే ఇప్పుడది ఓ పవిత్ర పర్యాటక కేంద్రంగా వెలుగొంది ఉండేది. ఆ గ్రామానికి ఆ ఖ్యాతిని గడించిన మహావిద్వాంసుడు కావ్యకంఠ గణపతిముని. ఇప్పటికీ తమిళదేశంలో ఇంటింటా ఆయన చిత్రపటాలు కనిపిస్తాయి. "నాయన" అన్న పేరుతో ఆయన పూజలందుకుంటూ ఉంటాడు. భాసనాటక చక్రాన్ని తొలిసారిగా వెలుగులోకి తెచ్చి ప్రపంచ సంస్కృత సాహిత్య ప్రియుల ప్రశంసల భారాన్ని తలకెత్తుకున్న ఆ బక్కపలుచని యోగి కేరళదేశానికి ఒక గౌరవాన్ని సంపాదించి పెట్టాడు. నవద్వీపం సంస్కృత కవి పండిత పరీక్షలకు గీటురాయి. అక్కడి పండిత పరిషత్తు వారు దక్షిణ దేశపు పండితులను తేలిక చూపు చూసేవారు. పండిత పరిషత్తులో వారికి స్థానమిచ్చేవారు కారు, గణపతి వారితో వాదానికి తలపడ్డారు. అంబికాదత్తుడనే పరిషదధ్యక్షుడు ఆయనపట్ల తిరస్కారం ప్రదర్శించాడు. అప్పుడు గణపతి ముని 'నీవు దత్తుడవు, నేను ఔరసుడను. దత్తుడవైన నీకే ఇంత పొగరుంటే కన్నబిడ్డనైన నాకు ఎంతటి శక్తి ఉంటుందో గమనించు' అంటూ ఆయనను ఎదిరించాడు. పార్వతికి గణపతి కన్నకొడుకు, నవద్వీప పండితుడు దత్తుడు. వీరిద్దరి మధ్య జరిగిన వివాదంలో అంబికాదత్తుని పొగరు దించి గణపతి ఇంకొక శ్రీనాథుడయ్యాడు. నవద్వీపం ఆయనకు 'కావ్యకంఠు'డనే బిరుదాన్నిచ్చి దాసోహమన్నది. దక్షిణదేశ ప్రతిష్టకు కారకుడైన ఈ కావ్యకంఠ గణపతిముని భువనేశ్వరీ మాత సమక్షంలో పన్నెండు సంవత్సరాలు కఠోర తపస్సు చేసాడు. అరుణాచల శిఖరాగ్రంలో ఒక కొండగుహలో తపస్సులో ఉన్న గణపతి మునిని భగవాన్ రమణమహర్షి గుర్తించి గౌరవించాడు. ఉమా సహస్రమనే అద్భుత స్తోత్ర గ్రంథంతోపాటు ఎన్నో సంస్కృత గ్రంథాలను రాసాడాయన.

భారత జాతీయ కాంగ్రెసులో ప్రముఖ పాత్రను పోషించి ఒక అఖిల భారత జాతీయసదస్సుకు అధ్యక్షుడయ్యాడు. ఇలా నందాపురం పట్టివోని పద్దెనిమిది అగ్రహారాలలోని ద్రావిడ బ్రాహ్మణుల కథలు చెపితే అది ఒక గ్రంథమే కాగలదు. పైన పేర్కొన్న వారందరూ ఒక్కొక్కరు ఒక్కొక్క గుణంతో ప్రసిద్ధులయ్యారు. నారాయణదాసు రక్తకణాలు - జీవధాతువులు వీరందరి నుండి సంక్రమించినవి, అందుకే వారందరి గుణాలు రాశీభూతమై అవతరించిన పూర్ణపురుషుడయ్యాడాయన, అందుకే తన జీవితంలో ఎవరికీ తలవంచని నారాయణదాసు మైసూరు మహారాజు అత్యంత గౌరవంతో తన ఆస్థానంలో ఉండమని అర్థించినా నరులను సేవించనని ఆయన కోరికను కాదన్నాడు.

కలిమిలేములు కావడి కుండలనే సత్యాన్ని విస్మరించని కారణంగానే పట్టువస్త్రాలతోను, పగిడీలతోను, సుగంధ విలేపనాలతోను సంస్థానాధీశుల కైవారాలందుకున్నా నారాయణదాసు ఎప్పుడూ ఇంట్లో ఒక మట్టగోచీ కట్టుకుని విజయనగరంలో ఉండేవాడు. కానుకుర్తి వీధిలో మేడమీద మట్టగోచీ కట్టుకుని కూర్చుని ఉండేవాడాయన. ఆ తోవన మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రి రోజూ సంస్కృత కళాశాలకు వెళ్ళేవారు. సంస్కృత వ్యాకరణ పండితులందరికీ అసాధురూపాలనిపించే సాధురూపాలను ఒకచోట కూర్చి 'తారకము' అనే అద్భుతమైన సంస్కృత గ్రంథాన్ని రాసిన నారాయణదాసు పాణినికి పడిసం పట్టించే ప్రయోగాలతో రాయుడు శాస్త్రికి మాత్రమే కాక, మన్మధునికి మత్తెక్కించే సరస సల్లాపాలతో ఆ వీధిన పోయే కూరలమ్ముకునే ప్రౌఢ స్త్రీలకు కూడా చిరుచెమటలు పట్టించేవాడు. సరస్వతి ఆయన చెప్పుచేతులలో ఉండి సంగీతంలో లయబ్రహ్మను చేసింది. సాహిత్యంలో తెలుగు దేశభాషా ప్రయోగంలో పట్టాభిషిక్తుడయ్యాడు. కాళిదాసు కంటే షేక్స్‌పియర్ గొప్పవాడని, సంస్కృతం కంటే తెలుగు గొప్పదని చెప్పగల గుండె నిబ్బరం ఆయనకే ఉంది. కళ్ళకు సుర్మా పెట్టేవాడు కానీ కాలికి చెప్పులు తొడిగేవాడు కాదు. ఇదీ ఆయన విలక్షణత. దైవానికి మాత్రమే తలవంచే శీలంగల నారాయణదాసు మరణానికి కూడా తలవంచలేదు. హుమాయున్‌కు ప్రాణదానం చేయడానికి అల్లాను ప్రార్థించిన బాబరు అందుకు బదులుగా స్వచ్ఛంద మరణాన్ని వరించాడని ప్రతీతి. మశూచి సోకి మరణశయ్య మీదనున్న మనుమడు ఉపాధ్యాయుల సూర్యనారాయణ కొరకు చూచి అతడికి ప్రాణదానం చేయడం కోసం దేవిని ప్రార్థించి ఆ వ్యాధిని అక్కడ ఉపశమింపజేసి తనకు ఆవహింపజేసుకుని స్వచ్ఛంద మరణాన్ని వరించిన యోగి నారాయణదాసు. ఉచ్ఛిష్ట గణపతి ఉపాసన చేసేవాడని ప్రతీతి గన్న నారాయణదాసులో ఎన్నో యోగశక్తులు అంతర్లీనంగా ఉండేవి. మర్యాదాపురుషోత్తముడు కాకపోయినా మాననీయుడైన ఆయన ఎంతటి లౌకికుడో అంతటి అలౌకికుడు. అప్పటి ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు సర్ కట్టమంచి రామలింగారెడ్డి ఆయనను 'కళాప్రపూర్ణ' బిరుదాన్ని స్వీకరించమని కోరగా, "భగవంతుడొక్కడే కళాప్రపూర్ణుడు. మానవమాత్రుడనైన నాకు ఆ బిరుదు తగదు" అని వినమ్రంగా తిరస్కరించిన వివేకి నారాయణదాసు.

ద్రావిడ బ్రాహ్మణులు భోజనప్రియులు. వారికి అన్ని రుచులూ ఉల్బణంగా ఉండాలి. సివంగి పులుసు, కటిక పెరుగుపచ్చడి, చల్లచిత్తాలు వంటి ప్రత్యేకమైన వంటకాలు వారివి. అన్నిటికంటే దిబ్బరొట్టె, కొయ్య చేగోడీలు అనేవి వారి బ్రాండు. వీటిని "ఆయసగ్రాసం"(ఐరన్ ఫుడ్) అంటారు. తిని అరిగించుకోవడం కష్టం. భోజనమంతా ముగిసే సమయంలో కూడా ఒలవని కొబ్బరికాయంత అన్నం ఎక్కువేమిటి? తక్కువేమిటి? అని అనుకుంటూ హేలగా తినేసేవారు. పసనక్రరతో చేసిన రెండెడ్ల బండిని ఒకచేత్తో పైకెత్తి పట్టుకున్నట్లే ఒక పనసకాయ కూరను కూడా ఒక చేతిమీదుగానే తినేసేవారుండేవారు ఉత్తరాపోసన పట్టేవేళ కూడా తత్తరపాటు లేకుండా వందలడ్లు తినడానికి వెనుకాడేవారు కాదు. ఇటువంటి వాళ్ళ కారణంగానే అగ్రహారాలన్నీ నేతి జారీలలోంచి జారిపోయాయనే మాట పుట్టింది.

గురజాడ మార్గం వేరు, ఆదిభట్ల మార్గం వేరు. సాహిత్యంలోనే కాదు స్వభావంలో కూడా వీరిద్దరూ 'అష్టమచంద్రుడు - నైధనతార' అనే రీతిగా ఉండేవారు. అయినా వ్యక్తిగతంగా వీరిద్దరూ మంచి స్నేహితులు. అరమరికలు లేకుండా ఉండేవారు. 1909లో తన

రెండవ కన్యాశుల్కం ముద్రణపూర్తి అయిన వెంటనే ఆ ముద్రిత పాఠాలను పంపిస్తూ ఉదకమండలం నుండి గురజాడ "ప్రియమైన కవిరాజా! కన్యాశుల్కం చాలా గొప్పనాటకం. ఈ నాటకాన్ని గూర్చి మీరు ఒక సమీక్షరాసి పత్రికలో ప్రచురించండి" అని కోరారు. సమదర్శి అయిన సాహిత్యకారుడు ప్రదర్శించే సాహిత్యగౌరవం ఎలా ఉంటుందో ఈ లేఖ వెల్లడి చేస్తుంది. ఇటువంటి మనస్తత్వం ఏ కొద్దిమందికో గానీ ఉండదు. గురజాడ అపస్మారక దశలో ఉన్నప్పుడు నారాయణదాసు ఆయనను చూడడానికి వెళితే "దాసూ! మీ ఇంటి దిబ్బరొట్టె తినాలని ఉంది" అన్నాడట ఆయన. నారయణదాసు ఇంటికి వెళ్ళి దిబ్బరొట్టె కాల్పించి పంపించాడు. విజయనగరం ఏకకాలంలో ఒకరికొకరు తీసిపోని ఎందరో ప్రతిభావంతుల ప్రజ్ఞావిలసనంతో, జాజ్వల్యమానంగా వెలుగొందిన రోజులవి. ఆ వీధుల్లో ఆనందగజపతి, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామినాయుడు, తాతా సుబ్బరాయశాస్త్రి, గురజాడ అప్పారావు, కోడిరామమూర్తి వంటి మహనీయులు సంచరిస్తూ ఉండేవారు. ఆభాగ్యమెంతటిదో!

2

సువర్ణముఖీనది ఒడ్డున పార్వతీపురానికి ఎనిమిది మైళ్ళదూరంలో 'అజ్జాడ' అగ్రహారం ఉంది. అజ్జాడకు దిగువ ప్రాంతంలో నాగావళి ఒడ్డునే 'వంతరాం' అనే ఇంకొక గ్రామం ఉంది. నారాయణదాసు వంశకర్త ఆదిభట్టుకాలం నుండి అజ్జాడ వారి స్వగ్రామం. వంతరాం నారాయణదాసు తల్లి తాతగారి ఊరు. పుట్టినగడ్డ, తాగిననీరు, పీల్చేగాలి - ఇవన్నీ మనిషి శరీరం మీదనే కాక మనోజగత్తును మేధోమండలాల్ని కూడా ప్రభావితం చేస్తాయన్నది భారతీయుల విశ్వాసం. రక్తం వీటన్నింటికంటే గొప్పది. అందుకే పెళ్ళిచేసేటప్పుడు అటు పదితరాలు - ఇటు పదితరాలు చూసి చేసేవారు. రక్తం కలుషితం కాకుండా కాపాడుకునేవారు, ఇటు ఆదిభట్ల - అటు మరువాడవంశాల రక్తకణాలతో రక్తాక్షి నామ సంవత్సర శ్రావణ బహుళ చతుర్దశి (31-08-1864) మఖానక్షత్రయుక్త నాల్గవ పాదంలో బుధవారం రాత్రి పదిగంటలకు నారాయణదాసు అజ్జాడలో పుట్టాడు.

అజ్జాడలో ఆదిభట్లవారు బ్రాహ్మణరాజులు. ఎడతెరిపి లేకుండా అన్నదానం చేసినవారు. ఆ చుట్టు పరగణాలన్నింటిలో వారికి పేరుండేది. దాసుగారి తండ్రి వేంకటచయనిశాస్త్రి. పొలం దున్నుకుని బ్రతికేవాడు. కండపుష్టిగల మనిషి. ఒడ్డూ - పొడుగూ ఉన్నవాడు. సంస్కృతంలో గొప్ప పండితుడు. తాటాకుల మీద వడివడిగా గంటతో రాసేవాడు. వారి ఇంట్లో ఆయన చేత్తో రాసిన భారత, భాగవత, రామాయణాలు, శాస్త్రగ్రంధాలు ఉండేవి. ఎవరి దగ్గర ఏమీ తీసుకోకుండా బ్రతకడం ఆయన నియమం. పురాణం చెప్పేవాడు. ఇంటిదగ్గర చెప్పినా, తన ఊరికి దూరంగా ఉన్న చాకరాపల్లి వెళ్ళి చెప్పినా ఎవరి దగ్గరా ఏమీ ఆశించేవాడు కాదు. గంభీరమైన సుస్వరం ఆయనది.

దాసుగారి తల్లి వంతరాం మరువాడ వారి ఆడబిడ్డ. ఆ తల్లి అంటే దాసుగారికి ఎనలేని భక్తి. ఆవిడ తాతగారు బహుభాషా కోవిదుడు. వారి ఇంట సరస్వతి నిలిచి ఉండేది. దాసుగారి మేనమామలు చేయెత్తు మనుష్యులు. వారి దండలు మనం రెండు చేతులతో పట్టుకోవాలి. వెడల్పాటి ముఖంతో కన్ను, ముక్కు, చెవి తీర్చిదిద్దినట్లు తిరిగి తిరిగి చూచేటట్లు ఉండేవారు. మాట్లాడితే గంభీరధ్వని వినిపించేది. గట్టిగా కేక పెడితే రెండు క్రోసుల దూరం దాకా వినిపించేదట. దాసుగారు విజయనగరంలో కన్యకాపరమేశ్వరి కోవెల దగ్గర హరికథ చెప్తూ మధ్యలో 'శంభో' అంటూ గొంతెత్తి పలికితే విజయనగరం అంతటా వినిపించేది. ఆయనలో మేనమామల పోలిక ఎక్కువ. పుట్టినింటా, మెట్టినింటా చదువుల తల్లి కొలువు చేయడంతో దాసుగారి తల్లి నరసమ్మగారికి ఎవరూ చెప్పవలసిన పని లేకుండానే విద్యాగంధం అబ్బింది. పురాణజ్ఞానం కలిగింది. సాహిత్యసౌరభం అందింది. తరువాత తరువాత ఆమె పురాణాల నరసమ్మ అని, చదువులవ్వ అని పేరు పడింది. ఆమెకు ఐదుగురు మగబిడ్డలు. నలుగురు ఆడబిడ్డలు. అజ్జాడకు బాగా దూరంగా ఉన్న చాకరాపల్లికి రోజూ ఉదయస్నానం, సంధ్యావందనం చేసి నడిచివెళ్ళి పురాణం చెప్పి తిరిగి సాయం సంధ్యావందనానికి ఇంటికి చేరుకునే శ్రమ కారణంగా దాసుగారి తండ్రికి క్షయవ్యాధి కొద్దిగా సోకింది. ఆ జబ్బును పోగొట్టుకోవాలని ఆయన సూర్యుణ్ణి ప్రార్థించాడు. ఆ

సూర్యుని దయ కారణంగా దాసుగారు పుట్టారు. అందుకే ఆయనకు సూర్యనారాయణ అని పేరు పెట్టుకున్నారు. ఇంటివారందరు సూరన్న, సూరి అనిపిలుచుకునేవారు. హరికథలు చెప్పడం మొదలైన తరువాత క్రమంగా ఆయన నారాయణదాసుగా ప్రసిద్ధులయ్యారు.

పార్వతికి పూర్వజన్మతో నేర్చిన విద్యలు తమంత తాముగా వచ్చాయని కాళిదాసు చెప్తాడు. ఇది ఒక అతీతశక్తిగా కొందరు భావిస్తారు. కానీ మనమధ్య కూడా ఎవరూ నేర్పకుండా ఎన్నో విద్యలు నేర్చిన మహానుభావులుంటారు. నారాయణదాసు అటువంటివాడు. ఆయన రక్తంలో, పుట్టిన గడ్డలో తాగిన నీటిలో, పీల్చిన గాలిలో ఇవతళించిపోయిన అద్భుతశక్తులు ఆయనలో విద్యలుగా తమంత తాముగా బయటపడ్డాయి. వేదం చదువుకునే పేరుతో నదిలో ఈతకొట్టడం, పెద్దపెద్ద చెట్లెక్కి పుల్లలు విరవడం, చిట్టడవుల్లో తిరిగి ఆకులు, ఈనెపుల్లలు ఏరడం ఇలాంటి పనులు చేసిన కాలం నుండి నారాయణదాసు గొంతు విడింది, ఆయనకు తెలివైన వాడన్న పేరున్నంతగా మంచివాడన్న పేరు చిన్నతనంలో కూడా ఉండేదికాదు, అల్లరి చేష్టలతో అందెవేసిన చేయి, మూడేళ్ళ వయసుకే ఆయన ఏ పుస్తకమైనా చదువగలిగేవాడు. వేగంగా ఒక పుట తిరుగవేసినంత సమయంలోనే ఆ పుటలో ఉన్న విషయమంతా అనర్గళంగా చదివే విద్య ఆయనకు చిన్నప్పుడే పట్టుబడింది. ఆయనకు అది ఒక క్రీడ. ఆయన గొంతెత్తి పాడితే మనుష్యులేకాదు చుట్టుప్రక్కల మొక్క - మోడు, పిట్ట - మెట్ట, ఏరు - ఊరు కూడా నిలిచి వినేవి.

నాగావళి, జంఝావతి నదుల కూడలిలో "గుంప" అని ఒక శివక్షేత్రం ఉంది. శివరాత్రికి అక్కడ జాతర జరుగుతుంది. ఆ రోజుల్లో అటువంటి జాతరలో అమ్మని వస్తువు ఉండేదికాదు. ఐదేళ్ళ నారాయణదాసు తల్లితో కలిసి ఆ యాత్రకు వెళ్ళినప్పుడు జరిగిన ఒక అద్భుత సంఘటనతో ఆయన పేరు మొదటిసారిగా ప్రసిద్ధమయింది. దాసుగారి తల్లి ఒక పుస్తకాల వ్యాపారి దగ్గర భాగవతం కొనుగోలు చేయాలనుకున్నది. ఆవిడ ఆడది, దాసు పసిబిడ్డ. "ఇది భాగవతం, మీకు వద్దులెండి" అన్నాడట వ్యాపారి. పసివాడు భాగవతం చదివి, నేను అర్థం చెపితే ఆ పుస్తకం ఊరకనే ఇస్తావా? అని ఆ తల్లి నిలదీసింది. వ్యాపారి ఒప్పుకున్నాడు. నారాయణదాసు కఠిన ఘట్టాన్ని అలవోకగా చదివాడు. ఆ తల్లి అరటిపండు ఒలిచినట్లుగా అర్థం చెప్పింది. వ్యాపారికి ఆశ్చర్యం కంటే ఆనందం ఎక్కువయింది. ఆ పుస్తకాన్ని ప్రత్యేకించి తోలుతో బైండు చేయించి కానుకగా ఇచ్చాడు. ఈ గుంపులోనే నారాయణదాసు ఇంకొక సన్నివేశంతో కూడా నేటికీ అందరి మనసులలో నిలిచిపోయాడు. కార్తవీర్యార్జునుడని ఇతిహాసంలో ఒక రాజు కనిపిస్తాడు. ఆయనకు వెయ్యి చేతులు. ఆ వేయి చేతులతోను పారుతున్న నదికి అడ్డుకట్ట కట్టి తన భార్యలు జలకాలాడుకోడానికి వీలు కల్పించడంతో ఆయన పేరు పడ్డాడు. నారాయణదాసుకు రెండేచేతులు. ఆ రెండు దండలను జన సముద్రానికి అడ్డుపెట్టి, తన తల్లి ఏటిలో స్నానం పూర్తిచేసేవరకు నిలిపి ఉంచాడు. ఇది ఆయన బలానికి ఒక మచ్చుతునక. గర్వం ఆయనకు సహజాతం. బలం ఆయనకు తల్లిదండ్రులిచ్చారు. చదువులు ముందు జన్మలనుండి అంటిపెట్టుకుని వచ్చాయి. బిరుదులు, భూషణాలు, కైవారాలు, కనక తప్పెటలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. ఆయన అతిలోక సామాన్యుడయ్యాడు.

వంతరాంలో తన తల్లి తాతగారి ఇంట్లో ఆయన పాడుతూ ఉంటే బొబ్బిలినుండి వచ్చిన సంగీత విద్వాంసుడు వాసా సాంబయ్య పరవశుడై తనతో తీసుకునిపోయి పాట నేర్పిస్తానన్నాడు. నారాయణదాసు ఆయన వెంట బొబ్బిలి వెళ్ళాడు. బొబ్బిలి నది ఒడ్డున లేదు. అక్కడ చెరువు నీరు వాడేవారు. పైచోటు నుంచి వచ్చిన వారందరికీ ఆ చెరువు నీరంటే భయం. దాసుగారికి సంగీతం వస్తుందన్న సంతోషం కంటే చీడపడుతుందన్న భయం ఎక్కువై ఆ ఊరు వదిలిపెట్టాడు. అక్కడున్నప్పుడు వారాలు చేసుకుని కాలం గడిపాడు. చాలమంది ఆ చిన్నవయసులో ఆయన పాటను మెచ్చుకున్నారు. అయినా అక్కడ ఉండక అజ్జాడ తిరిగివచ్చాడు. దాసుగారి అన్నదమ్ములలో సీతారామమూర్తి మాత్రమే ఆ రోజులలో ప్రయోజకుడయ్యాడు. ఆయన విజయనగరంలో ఆ పనీ, ఈ పనీ చేసి చివరకు ప్లీడరయ్యాడు. వీరిలో పెద్దవాడు జగ్గవధాని, ఆయనను చూస్తే భయం పుట్టేది. తాడి ఎత్తున భీకరంగా ఉండేవాడు. అందుకే విజయనగరం మహారాజావారి నాటక సంఘంలో ఆయన రాక్షసవేషాలు వేసాడు. వెంకన్న అనే ఇంకొక సోదరుడు పాట కమ్మగా

పాడతాడు. తంత్రీవాద్యనిపుణుడు. నారాయణదాసు అజ్జాడలో అదుపు - ఆజ్ఞ లేకుండా తిరుగుతూ చెడిపోతూ ఉండడం చూసి సీతారామమూర్తి ఆయనను ఇంగ్లీషు చదువు చెప్పిస్తానని విజయనగరం తీసుకుని వచ్చాడు. అప్పటికే దాసుగారికి వెన్నుముదిరింది. గాలిబారి చదువుకు రావడం వల్ల తోటి పిల్లలకంటే ముదురుగా కనబడేవాడు. విజయనగరంలో గురజాడ వేంకట అప్పారావు, గిడుగు వేంకట రామమూర్తి, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ మిత్రులు, వీరందరికీ వెలుగు చూపిన మహోపురుషుడు మహారాజా కళాశాల అధ్యక్షులు చంద్రశేఖర శాస్త్రి. ఆయన ఉపకార వేతనం ఇప్పించి దాసుగారి ఇంగ్లీషు చదువును ప్రోత్సహించారు. 1880 నుండి 1886 వరకు దాసుగారి మెట్రిక్యులేషన్ చదువు కొనసాగింది.

పేరుకు కళాశాలకు వెళ్తూన్న నారాయణదాసు దృష్టి ఎప్పుడూ ఆటపాటల మీదే ఉండేది. చదువుమీద అంత శ్రద్ధ ఉండేదికాదు అయిన ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతం ఆయన చెప్పుచేతుల్లో మెలిగేవి. గణితంలో కూడా ఆయన మెరుగ్గా ఉండేవాడు. ఒకసారి ఒక గణితోపాధ్యాయునికి తాను బోధపరుస్తున్న సమస్యకు పరిష్కారం కుదరలేదు. రాత్రి అంతా ఆటపాటలతో గడిపి ఆ నల్లబల్ల వెనుక నిద్రపోతూన్న నారాయణదాసు గబుక్కున లేచి - "ఇలా అయితే దీనికి పరిష్కారం కుదురుతుంది" అని చెప్పి ఆ లెక్కను సాధించాడు. ఆయన అవిధేయత కంటే బుద్ధికుశలతను అందరూ మెచ్చుకున్నట్లే ఆ అధ్యాపకుడు కూడా మెచ్చుకున్నాడు. ఆ రోజుల్లోనే 1883లో జరిగిన ఒక సంఘటన నారాయణదాసు జీవితాన్ని ఒక గొప్పమలుపు తిప్పింది. ఆయన కీర్తిని శాశ్వతం చేసింది. కోటకు ఎదురుగా ఉండే గురాచారి వారి వీధిలోంచి ఎడమ ప్రక్కకు మలుపు తిరిగితే వేణుగోపాలస్వామి మఠం ఉంది. అది మాధ్వమఠం. ఒకనాటి సాయంత్రం ఆ మఠంలో చెన్నపట్నం నుండి వచ్చిన కుప్పుస్వామినాయుడు హరికథ చెప్పాడు. అప్పటికి తెలుగువారికి హరికథ అంటే తెలియదు. ఆట - పాట - అభినయం - భక్తి కలగలసిన ఆ అపురూప ప్రక్రియ దాసుగారిని బాగా ఆకర్షించింది. "మానవ గంధర్వోహం విజయనగరా దాగతః" అని తనను తాను పరిచయం చేసుకునే దాసుగారికి ఆ గాంధర్వ ప్రక్రియ తనకోసమే పుట్టిందని అనిపించింది. ఆ రాత్రి ఇంటికి వచ్చినది మొదలు ఆయనకు వేరొక ధ్యాసలేదు తనకు తెలిసిన ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతం పాటలన్నీ కలిపి ఒక కథను కూర్చి పాడడం మొదలుపెట్టాడు. నాలుగవ అన్నగారు వెంకన్నగారు, సహకారవాద్యం, సహకార గానం నిర్వహించేవారు. పదిరోజులపాటు ఈ తతంగమంతా చూసి రెండవ అన్న సీతారామయ్యగారు కంచుమువ్వలు కొన్నారు. అక్కడి నుండి హరికథా జైత్రయాత్ర మొదలయింది. శ్రీకాకుళం, నరసన్న పేట, టెక్కలి, బరంపురం, ఇలా ఊరూరా తిరిగి హరికథలు చెప్పి పేరు ప్రతిష్టలతో పాటు ధనం కూడా సంపాదించేవాడు. కుప్పుస్వామినాయుడు పండితుడు కాదు. సంగీత విద్యలో నిష్ణాతుడు కాదు. కవి అసలే కాదు. నారాయణదాసు కవి, పండితుడు, సంగీత విద్వాంసుడు, అభినయ కౌశలం కలవాడు. అద్భుత ప్రతిభానిధి. అందుచేత ఆయన చేతిలో హరికథ స్వరూపమే మారిపోయింది. అది జగన్మోహనమైన ప్రక్రియగా తయారయి జయకేతనం ఎగురవేసింది. నృత్యగాన సాహిత్య అభినయ కళల సమాహారమైన హరికథ అప్పుడు ఆంధ్రదేశానికే కాదు. యావద్భారతదేశంలోనూ ఒక పెద్దమార్పు తెచ్చింది. రక్తికి - ముక్తికి ఏకైక సాధనమయింది.

పుస్తకమును గిరగిరా తిప్పుతూ శరవేగమున సంస్కృతాంధ్ర భాషలను చదవడం, ఒకసారి విన్నంతనే ఏ విషయాన్నైనా తిరిగి చెప్పడం, కోరిన తాళంలో పల్లవి పాడడం, ఎన్నో రాగాలలో పాటలు పాడడం, అటు సంస్కృతంలోనూ - ఇటు తెలుగులోనూ కూడా అడ్డులేకుండా కవిత్వం చెప్పడం, అష్టావధానం చెయ్యడం, వేలకొలది ప్రేక్షకుల ముందు తెలుగులోను, ఇంగ్లీషులోను అపూర్వ కల్పనలతో పాటలు పాడడం - అనే విద్యలు దాసుగారికి హరికథలు చెప్పడం మొదలు పెట్టకముందే అబ్బాయి.

1886లో నారాయణదాసు మెట్రిక్యులేషన్ పూర్తిచేసేటప్పటికి ప్రిన్సిపాల్ చంద్రశేఖర శాస్త్రిగారు మరణించారు. ఆ తరువాత వచ్చిన కిళాంబి రామానుజాచార్యులుగారు కూడా గొప్ప మనస్వి, ఉదారుడు. కానీ విశృంఖలత్వం వెన్నముకగా కలవారిని ఆయన ఆదరించేవారు కాదు. గానాబజానాలంటే ఆయనకు సరిపడేదికాదు. దాసుగారి విచ్చలవిడితనం చూసి నచ్చక వారు ఆయనకిచ్చే

ఉపకారవేతనం ఆపుచేసారు. అప్పటికే దాసుగారికి విజయనగరంలోని వడ్లమాని అన్నపూశాస్త్రిగారి కుమార్తె లక్ష్మీనరసమ్మతో వివాహం జరిగింది. ఎఫ్. ఏ చదవడం కోసం ఆయన విశాఖపట్టణం ఎ.వి.ఎన్ కళాశాలకు వెళ్ళారు. తన సానికి సంగీత పాఠాలు చెప్పాలనే షరతు మీద ఆ ప్రిన్స్‌పాల్‌గారు నారాయణదాసుకు ఉపకారవేతనం ఇచ్చి, భోజనం కూడా పెట్టేవారు. సానికి సంగీతం చెప్పడంతోనే కాలం గడచి నారాయణదాసుగారి ఎఫ్.ఏ అటకెక్కింది. దాసుగారు ఇంగ్లీషు తప్ప ఇంకొక విద్య ఎవరి దగ్గరా నేర్చుకోలేదు, తన చదువు తన ఆనందం కోసం, మంచీ - చెడూ తెలుసుకోవడం కోసం తప్ప ఐహికమైన ఇతర ప్రయోజనాలకు కాదని దాసుగారు భావించేవారు. 1900-1901 సంవత్సరాల మధ్య నామమాత్రంగా ఒక మౌల్వీ సహాయంతో ఫారసీ అక్షరాలను గుర్తుపెట్టుకుని పర్షియన్, ఉర్దూ, అరబ్బీ భాషలను స్వయంగా నేర్చుకున్నారు. హిందూస్థానీ అంతకుముందే ఆయనకు కొట్టిన పిండి.

(కొనసాగింపు వచ్చేసంచికలో)

●●●

# వ్యాస కౌముది



## ఆదిభట్ల నారాయణదాసు

- ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి

(ఆదిభట్ల నారాయణదాసుగారి 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)



3

నారాయణదాసు లోకులనెప్పుడూ లక్ష్యపెట్టలేదు. తన ఇష్టం వచ్చిన వేషం వేసేవారు. తనకు తోచినదల్లా మాట్లాడేవారు. కారణం లేకుండానే ఇతరులతో కలహించేవారు. అలాగే తగిన కారణం లేకుండానే ప్రేమించేవారు. ఆయనకు ముందు చూపే గానీ వెనుకచూపులేదు. బరంపురం వీధులలో ఆయన సంచరించిన తీరు ఆయన మాటలలోనే ఇలా తెలుస్తుంది. "అప్పట్టణమునం బడుచులం గని బోరవిరచి బోరచూపులు చూచుచు, నూత్నయౌవన మదంబున నెట్టివారనైన నలక్ష్యముగ గనుచు, గడియ గడియ కద్దము చూచికొని గేరా దిద్దుకొనుచు సిగకు బూలుముడుపు, కనులకు గాటుక, మెడలో బూలదండ, మొలకు బట్టుధోవతి, కాళ్ళకు గజ్జెలు, చేత జిరుతాళములు ధరించి గావుకేకలు వేయుచు నందరిని హాస్యములు సేసివెక్కిరించుచు పిట్టకథలచే బామరులను సంతోషవెట్టుచు, శివాచారివలె గోలబెట్టి దిరుగు దాసుని రీతి, పోతు పేరంటాల పోల్కి, సానిపాపకైవది శృంగార రసమును, శక్తిహీనుని భంగి మెట్టవేదాంతమును, ఆపన్నుని గతి భక్తియం దెలుపుచు హరికథల జెప్పుచు నొక నెల యచట గడిపి పళాసకు బోయినారము. నా వయసపుడు పందొమ్మిదేండ్లు" ఈ మాటలవల్ల శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, గంజాం, సామర్లకోట, పిఠాపురం, కాకినాడ, రాజమండ్రి, బందరు మొదలైన చోట్ల హరికథలు చెప్తూ సంచారం చేసే పాతికేళ్ళ వయసులో ఆయన ప్రవర్తన ఎలా ఉండేదో మనకు తెలుస్తుంది. మొలక మీసం వచ్చిననాటినుండి ఆయనకు వేశ్యలతో సావాసం ఉండేది. చాలా ఊళ్ళలో ఆయనతో స్నేహం చేసిన వేశ్యలు ఉండేవారు. భంగు సేవించడం, వేశ్యలతో గడపడం, కవిత్వం చదవడం - చెప్పడం, పైలా పచ్చీసు లోని నారాయణదాసుకు ఎక్కువ మత్తెక్కించేవి. వేశ్యలతో ఆయనకు శారీరక సంబంధం కంటే సంగీత సంబంధం ఎక్కువగా ఉండేది. ఆ వైభవం ఎటువంటిదో ఆయన చెప్పిన ఈ కింది మాటలలో తెలుస్తుంది. "ఒక యువతి కాళ్ళు పిసుకుచు నిద్రలేపుట, యొక జవ్వని పలుదోముపుల్లయు నీరందించుట - యొక వన్నెలాడి తల దువ్వుట - యొక మదిరాక్షి చిన్నగురుని తయారు చేసి వెండిగిన్నెలో వడబోసి ఇచ్చుట - యొక పూబోడి

స్నానమాడించుట - యొక లతాంగి బ్రాహ్మణునిచే మృష్టాన్నములం దెప్పించి వడ్డించుట - యొక నీలవేణి భోజనానంతరము చుట్ట యందించుట - యొక మధురరాశి విడెమిచ్చుట - యొక హరిమధ్యశయ్యనమర్చుట - యొక సరోజముఖి చందనమలదుట - యొక హరిమధ్య పూలు ముడుచుట, యొక మదవతి వీవనబట్టి విసురుట - ఇట్లహోరాత్రములు విడువక పెక్కు వేశ్యారత్నములు శుశ్రూష జేయుచు నన్వీథిలోనికి గదలనీక గానమభ్యసించుచుండిరి." తరుణ ప్రాయం గడిచేవరకు ఆయన జీవితంలో ఇలాంటి అనుభవాలు ఎన్నో ఉన్నాయి. ఆయన జుట్టు నీలాలు పొదిగిన ఉంగరాల్లా ఉండేది. ఆ ముంగురులు పాయదీసి దిద్దుకునేవారు. కురులు నున్నగా దువ్వి పట్టెడు సిగవేసుకునేవారు. కళ్ళకు సుర్మా పెట్టుకుని నుదుట చిన్న అగరుబొట్టు పెట్టుకునేవారు. విడుపులేకుండా చుట్టలు కాల్చేవారు. మొగవాళ్ళను సైతం మోహింపజేసే రూపమది.

మాంసం తినడం, అబద్ధమాడడం అనే పాపాలు తప్ప మిగిలినవన్నీ చేసినా, అచ్చు విడిచిన ఆబోతుకోడెలా వన్నెగా తిరిగినా నారాయణదాసు చరిత్రకెన్నడూ లోపం కలుగలేదు. అందుకు సంగీత, సాహిత్యాలలోను, కవిత్వంలోను ఆయన చూపిన లాఘవం కారణం. ఈ లాఘవం చిన్నతనం నుండి ఆయన శీలంలో ఉంది. "నా లాఘవమనగ మునువేళ్ళందిన మాత్రమున గోడపై కెగురుట, నా మూరతో బన్నెండు మూరలు దాటుట, వెనుకకు గానీ ముందునకు గాని పాదములు మాత్రము మోయునట్లు తలక్రిందుమొగ్గలు వేయుట, యయ్యకోనేటి ఈవలి వడ్డునుండి యావలి వడ్డువరకు గజమెత్తు నాచు విడిచేతుల జింపుచు నీదుట, సామాన్యపు పొడవుగల ఇండ్లపై నుండియు, మిద్దెలపైనుండియు చప్పుడు సేయక క్రింద దుముకుట, మైళ్ళకొలది పరుగిడుట, రెండు గజముల ఎత్తుగల యరుగుల మీదికి గుప్పించి ఎగురుటయును" అని వారే వివరించారు. ఈ విధంగా తొలినుండి అబ్బిన లాఘవంతో పాటు నిరంతరం తెలుగు, సంస్కృత కావ్యాలను చదవడం, గాత్రసంగీతంతో పాటు వీణావాదన సాధన చేయడంతో సంగీత సాహిత్యాలలో ఆయన తనకెదురులేదనిపించుకున్నారు. ఆయన ఇంగ్లీషు చికిలీ చేసిన కత్తిలా సాపుగా ఉండేది. తెలుగులోను, సంస్కృతంలోను కొన్ని గంటలలో కూర్చిన లేదా ఆశువుగా చెప్పిన హరికథలను వెనువెంటనే ఇంగ్లీషులోకి తర్జుమా చేసి చెప్పే ఆయన ప్రతిభ మైసూరు మహారాజును సైతం ముగ్ధుణ్ణి చేసింది. జయంతి కామేశం పంతులు ఆయన పల్లకీని తన భుజంతో మోసి సింహతలాటపు మురుగులు, ఒక పట్టుపంచల చాపు, ఒక బనారసు కండువా, ఒక జల్తారు తౌజు, నాలుగువందల రూపాయల నగదు ఇచ్చి ఇంకా ఇవ్వలేని తన లేమిని గూర్చి దుఃఖించాడు. నాలుగైదు రోజులు వరుసగా దాసుగారి హరికథలు విని పరవశించి పోయిన విజయనగరం దివాను తన చేతికర్రతో దాసుగారి పొట్టమీద పొడిచి "ఇంత విద్య నీ కడుపులో ఎలా ఉంది?" అంటూ విస్తుపోయాడు. పిఠాపురం మహారాజు ఆయన హరికథ విని చేసినంత సన్మానం చేసి గవర్నరు దర్శనం కోసం తాను తొడుక్కోదలచిన కొత్త శహలుతో కుట్టబడిన అంగీని ఆయనకు తొడిగి గౌరవించాడు. దాసుగారి జీవితంలో ఇటువంటి సన్మానాలెన్నో, లోకం ఆయన శీలం కంటే ప్రజ్ఞను, శేముషిని గౌరవించి తలదాల్చింది.

ఆ రోజుల్లో విజయనగరంలో సంగీతం తెలియనివారు లేరు. సంస్కృత విద్యకు అది రెండవ కాశీనగరం. దాసుగారు ఏ గురువు దగ్గర మఠం వేసుకుని కుదురుగా నేర్చుకోవలసిన పని లేకుండానే కేవలం వినికిడికి తన ఊహను జోడించి సంగీతం పాడడంలోను, సంస్కృతాంధ్రాలలో అడ్డులేకుండా కవిత్వం చెప్పడంలోను గడితేరిన వారయారు. పాట పాడతానని కవిత్వం చెప్తానని తన ఎదుట పడినవారిని మూడుచెరువుల నీళ్ళు తాగించనిదే ఆయన ఎప్పుడూ వదిలిపెట్టలేదు. ఆయనది గంభీరమైన శరీరం. అంతటి శరీరం ఆ రోజులలో ఎవరికీ లేదని చాలామంది మెచ్చుకునేవారు. హిందూస్థానీ - కర్ణాటకం జోడించి పాడే నేర్పుతో ఆయన శ్రోతలను ఆశ్చర్యచకితులను చేసేవారు. మైసూరు మహారాజావారి దగ్గర గ్రామ్‌ఫోన్ రికార్డు కోసం నారాయణదాసు హిందూస్థానీ భైరవి పాడారు. అది విని పరవశించిపోయిన మహారాజావారు "ఈ రాగం ఇలా పాడడం ఎక్కడ నేర్చుకున్నావ"ని మహారాజావారు అడిగారు. దానికి "కొంత విజయనగరంలో విన్నానని, మిగిలినది నా యూహను బాడుచుంటి"నని దాసుగారు బదులు చెప్పారు. పల్లవి పాడడం దాసుగారి ప్రత్యేకత. అందులో తన ప్రజ్ఞను వివరిస్తూ దాసుగారు ఇలా రాశారు.

బందరులో 60 మంది సంగీత విద్వాంసులు ఒక చోట సభ చేసినపుడు దాసుగారిని కూడా పల్లవి పాడమన్నారు. "నాల్గవ కలమున నారక్షరములు జాగా చేసి పాడుచున్న పల్లవి నైదవకాలము విలంబముగా మార్చి యొంటి యక్షరము జాగా చేసి మూడావృత్తములు పాడినాడను. ఫిడేలర్లుగాని, పాటకులు గాని, మద్దెలవాడు గాని, కొలిపింపు విద్వాంసులు గాని లయకణిశము కాచుకొనలేక, జాగా తెలిసికొనలేక తడబడజొచ్చిరపుడు నేను ఇందరు విద్వాంసులున్నారు, కానీ యొకడైనం జాగాకు రాలేకుంట యాశ్చర్యమాయెనని ముక్తాయించి జాగా వెల్లడిచేసినాడ" పల్లవి పేరుతో ఆయనకు ఎదురు నిలిచిన వారందరికీ ఇదే అనుభవం కలిగేది.

అవధాన విద్యలో కూడా దాసుగారి మార్గం చాలా విలక్షణంగా ఉండేది. లోకనాధమనే గ్రామంలో ఆయన ఒక అవధానం చేశారు. అందులో ముప్పైగంటలకు ఒక్కొక్క చరణంగా కోరిన ఛందస్సులో కవిత్వం చెప్పడం, ముప్పైరెండు అక్షరాల వ్యస్తాక్షరీ చేయడం, నోటిలెక్కలకు సమాధానం చెప్పడం, పువ్వులు లెక్కపెట్టడం, నిషేధాక్షరి చెప్పడం, అప్రస్తుత ప్రసంగం చేయడం, కోరిన రాగములలో పురాణం చదవడం, గంటలు లెక్కపెట్టడం, అనే ఎనిమిది ప్రక్రియులున్నాయి. అల్లిపురంలో జరిపిన అష్టావధానంలో గ్రీకు భాషలో ఏభైమాటల వ్యస్తాక్షరి, పుస్తకాన్ని గిరగిరా త్రిప్పుతూ కోరిన రాగాలలో పురాణం చదవడం, ఆల్జీబ్రాలో ఒక చిన్న సమీకరణాన్ని నోటితో పరిష్కరించడం, ఇద్దరికి తెలుగులోను, ఇద్దరికి సంస్కృతంలోను కవిత్వం చెప్పడం, పువ్వులు లెక్కపెట్టడం, నిషేధాక్షరి చేయడం, ఒక్కొక్క పాదం చొప్పున ఒకమారు చదివిన శ్లోకమును మళ్ళీ చదవడం, ఛందోభాషణం చేయడం అనే ఎనిమిది ప్రక్రియలున్నాయి. దాసుగారు ఏకసంధాగ్రాహి. ఎంత కఠినమైన పద్యమైనా ఎవరైనా ఒకసారి చదవగానే విని వెంటనే తిరిగి చదవగలిగేవారు. బందరులో టిక్కెట్టు పెట్టి అవధానం చేసారు. ఆ అవధానంలో రెండు పాదములు రెండు తాళములు, రెండు చేతుల రెండు తాళములు వేసి పల్లవి పాడుతూ కోరిన జాగాకు కోరిన ముక్తాయిలు వేయించడం, లెక్కను మనసులోనే గుణించి సమాధానం చెప్పడం, నలుగురికి తెలుగులోను - నలుగురికి సంస్కృతంలోను కోరిన ఛందస్సులో కవిత్వం చెప్పడం, వ్యస్తాక్షరీ, ఇంగ్లీషులో ఉపన్యాసం చెప్పడం, పువ్వులు - గంటలు లెక్కబెట్టడం, ఛందస్సంభాషణం చేయడం అనే అంశాలను అనితరసాధ్యమైన రీతిలో నిర్వహించారు. రాజమండ్రిలో దాసుగారు చేసిన అవధానంలో వీరేశలింగంగారు పృచ్ఛకులుగా ఉన్నారు. వీరేశలింగంగారు తన అభిజ్ఞానశాకుంతలానువాదంలో "నఖలు నఖలు బాణః" అనే చిన్న మూల శ్లోకాన్ని రెండు పద్యాలలో అనువదించడాన్ని ఆక్షేపిస్తూ దాసుగారు ఆ శ్లోకాన్ని ఒక చిన్న గీత పద్యంలో ఎంతో సమర్ధంగా అనువదించి చూపారు. వీరేశలింగం, విధవా వివాహాలు, బ్రహ్మసమాజం అనగానే దాసుగారికి అరికాలి మంట నెత్తికెక్కేది. స్త్రీల విషయంలో ఆయన ఎంతో పాతపద్ధతిలో ఆలోచించేవారు. ఆయన అభిప్రాయాలు కొన్ని వింతగా ఉంటాయి. "వెలయాండ్ర సహవాసము సేయుట, కొంచెము గురునిసేవ కలవడుట, సంగీత సాహిత్య రసజ్ఞత కలిగియుంట - ఈ మూడు కలవారే లోకములో దరచు భూతదయాపరులు, పరోపకారులు, వితరణశీలురునై యుండెదరు. తక్కిన వారల హృదయము సరసము కాదని యనుకొనుచుందును." అనడం ఇందుకు ఉదాహరణం. తనవైనా, ఇతరులవైనా తప్పులను బాహాటంగా చెప్పడం ఆయన అలవాటు. ఆయనకు ఒకరి లక్ష్యం లేదు, ఒకరి దగ్గర భయమూ లేదు.

తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషలలో సంగీత - సాహిత్య - నృత్యాల మేళవింపులో అపూర్వము - రసవత్తరము అయిన హరికథాగానం చేసేవారాయన. సాధారణంగా ఆయన హరికథ తొమ్మిదిగంటలకు మొదలయేది. ఒంటిగంట వరకు ఉపోద్ఘాతం కొనసాగేది. మరి మూడుగంటలసేపు అసలు కథ చెప్పేవారు. ఇంచుమించు హరికథ పూర్తి అయ్యేసరికి తెల్లవారిపోయేది. పిఠాపురం మాధవస్వామి గుడిలో హరికథ చెప్పినప్పుడు "తెల్లవార్లు వేలకొలది జనులు నిశ్చేష్టులై హరికథ విని ఎవ్వడో గంధర్వుడు వచ్చెను. లేకున్న నీ తేజస్సు, నీ ధోరణి, ఈ పాట, ఇట్టి కవిత్వమెన్నడైనా గంటిమే - యనుచు నన్ను శ్లాఘించి సంతసించిరి." అని దాసుగారు రాసిన విషయం ఆయన చెప్పిన ప్రతి హరికథకూ వర్తిస్తుంది. మద్రాసులో దాసుగారి హరికథలు విన్న తరువాత "హిందూ", "స్టాండర్డు"

పత్రికలు వారి సంగీత సాహిత్యాలను ఎంతగానో ప్రశంసిస్తూ ఆయన శరీరము వంటి ఘనగంభీర మధురధ్వని అంతకుముందు ఎన్నడూ వినలేదని కొనియాడాయి.

## 4

మనలో చాలామంది దాసుగారిని హరికథా పితామహులుగానే ఎరుగుదురు. హరికథ ఆనాడు జనబాహుళ్యంలో విస్తృత ప్రచారం గల కళకావడం చేత దాసుగారికి ఆ విధమైన ప్రచారం లభించి నిలిచిపోయింది. ఆయన కేవలం హరికథకుడే కాదు. ఆంధ్రదేశం గర్వించదగిన కవి, అనువాదకుడు, రచయిత, పండితుడు, బహుభాషావేత్త, సంగీత విద్వాంసుడు. తెలుగులో ఇతరులెవ్వరకూ సాధ్యంకాని అపూర్వ గ్రంధాలను రాసారు వారు. ఆ రచనలు వివిధ ప్రక్రియలకు సంబంధించినవి. ఆయన హరికథలు పండిత పామరులను పరవశింపజేస్తే ఇతర రచనలు మాత్రం కేవలం పండితులనే సమ్మోహపరిచేవిగా ఉంటాయి. ఆయన మార్గంలో అంత గొప్ప గ్రంధాలను నేటికి కూడా ఎవరూ రాయలేకపోయారు. పండితులను సైతం పాదాక్రాంతులను చేసుకోగల అప్రతిమాన ప్రతిభా పాటవాలను దాసుగారు ఆ గ్రంధాలలో ప్రకటించారు.

నారాయణదాసుగారు ధ్రువచరిత్రము, అంబరీష చరిత్రము, గజేంద్ర మోక్షణము, రుక్మిణీ కళ్యాణము, ప్రహ్లాద చరిత్రము, శ్రీహరి కథామృతమ్, గోవర్ధనోద్ధరణము, భీష్మచరిత్రము, సావిత్రీ చరిత్రము, యధార్ధ రామాయణము, జానకీ శపథము, హరిశ్చంద్రోపాఖ్యానము, మార్కండేయ చరిత్రము, గౌరమ్మ పెండ్లి, హరికథలు - ఫలశ్రుతి - అనే హరికథలను రాసారు.

తొలిదశలో రసభరిత నృత్యహేలగా తాను ఊహించి రూపకల్పన చేసి సాధన చేసే ప్రయత్నంలో ధ్రువ చరిత్రాన్ని రాశారు (1883) ఇది ఒక కూర్పు. ఇది దాసుగారి తొట్టతొలి రచన. ఛత్రపురము శ్రోతల ఎదుట తన రచనా సామర్ధ్యాన్ని నిరూపించుకోగలచి ఒక రాత్రికి రాత్రి రాసి, ధారణ చేసి చెప్పిన హరికథ అంబరీష చరిత్రము (1884). తనకత్యంత ప్రీతిపాత్రమయిన భాగవతం అష్టమస్కంధంలోని కథను ఏమాత్రం మార్చకుండా తన రచనా వైభవాన్ని, విశేషవృత్తాలను వాడడంలో, తనకు గల అధికారాన్ని ప్రదర్శిస్తూ భక్తిరస పోషకమైన మార్గంలో దాసుగారు "గజేంద్ర మోక్షము" (1886) రాసారు. దాసుగారికి బాల్యం నుండి రుక్మిణీ కళ్యాణ కథంటే ఇష్టం. భాగవతంలోని ఆ ఘట్టం ముందుగా వారికి నోటికి పట్టింది. రుక్మిణీ అనే బుద్ధి బ్రాహ్మణుడనే వేదశాస్త్ర సహాయంతో శ్రీకృష్ణుడనే పరబ్రహ్మన్ని తెలుసుకుని లీనం కావడమే తన రుక్మిణీ కల్యాణ హరికథలోని అంతరార్ధమని దాసుగారు స్వయంగా చెప్పారు. దాసుగారు ఎక్కువగా చెప్పిన కథ ఇది. తన చెలికాడు బొడ్డు వెంకటేశం దొర కోరిక మీద దాసుగారు 'ప్రహ్లాద చరిత్రము' అనే హరికథ రాసారు. మిగిలిన హరికథలలో కంటే ఈ హరికథలో పోతన భాగవతం ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. శ్రీకృష్ణజననము, పితృబంధ విమోచనము, ధర్మసంస్థాపనము అని మూడు భాగాలుగా రాసిన కథలను జోడించి దాసుగారు 'శ్రీహరి కథామృతం' అనే సంస్కృత హరికథను ప్రకటించారు. శ్రోతల కోరిక మేరకు 'గిరికథ' చెప్పదలచి దాసుగారు 'గోవర్ధనోద్ధరణము' అనే హరికథను ఆశువుగా చెప్పారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా, చేబ్రోలులో జరిగింది. భీష్ముని జీవితంలోని మూడు ప్రధాన ఘట్టాలను ఆధారంగా చేసుకుని దాసుగారు 'భీష్మచరిత్రము' అనే హరి కథ రాసారు. తల్లి ఆజ్ఞమేరకు సంతానం కోసం దాసుగారు మహాభారతంలోని సావిత్రికథను 'సావిత్రీ చరిత్రము' అనే పేరుతో హరికథగా రాసారు. ఆ వెంటనే ఆయనకొక కుమార్తె జన్మించింది. ఆమెకు సావిత్రి అని పేరు పెట్టారు. 1915లో తన భార్య మరణించిన తరువాత ఆమె ఆత్మకు శాంతి కలగాలని దాసుగారు 'యధార్ధ రామాయణము' అనే హరికథను రాసారు. దాసుగారు హరికథలలో కెల్లా ఇది పెద్దది. దాసుగారు తన సంగీత శాస్త్రవైదుష్యాన్నంతటినీ ప్రదర్శిస్తూ 'జానకీ శపథ'మనే గొప్ప హరికథను రాసారు. గౌరన 'హరిశ్చంద్రోపాఖ్యానము' నాధారంగా చేసుకుని వారు 'హరిశ్చంద్రోపాఖ్యానము' అనే హరికథ రాశారు. సత్య నిష్ఠ గల తన తండ్రికి ఈ కథను అంకితం చేశారు. సర్వేశ్వరునకు అంకితం చేస్తూ దాసుగారు రాసిన మొదటి

శైవకథ 'మార్కండేయ చరిత్ర'మనే హరికథ. సీమపలుకు అంటే తెలుగు మాట. సంస్కృత పదాలు లేకుండా కేవలం తెలుగు మాటలతో దాసుగారు రాసిన చివరి హరికథ 'గౌరప్ప పెండ్లి' అనే హరికథ. ఈ కథ రాసేటప్పటికి దాసుగారికి ఎనభై ఏళ్ళు. దాసుగారు రాసిన కథలన్నీ భారత, భాగవత, రామాయణ, శైవపురాణ కథలు. పై హరికథలలో ధ్రువచరిత్రము, గోవర్ధనోద్ధరణము అనే రెండూ ఇప్పుడు దొరకడంలేదు. దాసుగారు తన తరువాతి వారికి తెలియడం కోసం తాను రాసిన ప్రతీ హరికథలోనూ రాగ, తాళగతులను తెలియజేసారు.

హరికథకు ఆ రోజులలో తెలుగునాట గజ్జె కట్టిన వాళ్ళందరూ నారాయణదాసుగారి శిష్యులే. వాజపేయయాజుల సుబ్బయ్యగారు, నేమాని వరహాలుగారు, నేతి లక్ష్మీనారాయణగారు, వేదన భట్ల వేంకట నారాయణగారు, పేరి నరసింహముగారు, కరూరు కృష్ణదాసుగారు, చిట్టిమళ్ళ రంగయ్యదాసుగారు, వడ్లమాని నరసింహదాసుగారు, శ్రీపాద లింగమూర్తిగారు, చెరుకుపల్లి కనక దుర్గాదాసుగారు, మల్లికార్జున దాసుగారు, టేకి రామమూర్తిగారు, పరిమి సుబ్రహ్మణ్య దాసుగారు, అడుసుమిల్లి నారాయణదాసుగారు, జగన్నాథ దాసుగారు, బంక బాలకృష్ణదాసుగారు, నారాయణదాసుగారి ప్రత్యక్ష శిష్యులలో ప్రధానులు. పరోక్ష శిష్యులెందరో ఉన్నారు. వారి శిష్యసంతతి నేటికీ కొనసాగుతోంది.

దాసుగారు హరికథల తరువాత శతక ప్రక్రియలో ఎక్కువ రచనలు చేశారు. కాశీశతకమ్, రామచంద్ర శతకమ్, సూర్యనారాయణ శతకము, మృత్యుంజయ శివశతకము, ముకుంద శతకము, సత్యవతి శతకము అనేవి దాసుగారి శతక రచనలో ప్రసిద్ధములైనవి. ఇవికాక సీమపలుకులో 'వేల్పువంద' అనే శతకాన్ని కూడా రాసారు. 1914లో దాసుగారు సతీసమేతంగా విశ్వేశ్వర సందర్శనానికి వెళ్ళి ఆ స్వామిని దర్శించి సంస్కృతంలో కాశీశతకాన్ని రాసారు. వయఃపరిణతిలో అద్వైత చింతనతో శ్రీరామచంద్రుని కీర్తిస్తూ "భుజంగప్రయాత"మనే ఛందంలో దాసుగారు సంస్కృతభాషలో రామచంద్ర శతక రచన చేసారు. సూర్యనారాయణ వరప్రసాది అయిన దాసుగారు 1895-98 మధ్యకాలంలో శార్దూల, మత్తేభ వృత్తాలలో తెలుగులో సూర్యనారాయణ శతకరచన చేసారు. 1908లో తన నాల్గవ అన్నగారు తనకు అత్యంత ప్రీతిపాత్రుడు అయిన పేరన్నగారు మరణశయ్య మీద ఉన్నపుడు ఆయనను రక్షించమని వేడుతూ దాసుగారు తెలుగులో "మృత్యుంజయ శతకాన్ని" రాసారు. ఒక రాత్రిలో రాసిన ఈ శతకం కారణంగా పేరన్నగారికి మరణగండం తప్పి ఆరోగ్యం చేకూరింది. దాసుగారు ఆ అల్పాక్షరాలతోనే అనల్పార్థాన్ని ఇమిడ్చి ఈ శతకాన్ని రాసారు. ఆనందగజపతి మహారాజు 'సతతము సంతసమొసంగు సత్యవతికిన్' అనే సమస్యనిచ్చి ఒక పద్యం రాయమని కోరితే ఎన్నడూ ఎవరూ ఎక్కడా చేయని విధంగా దాసుగారు ఆశువుగా ఆ సమస్యను నూరు భావాలతో నూరు పద్యాలుగా రచించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తారు. అదే సత్యవతిశతకము. 'వేల్పువంద' సింహాచలంలోని వరాహలక్ష్మీ నృసింహ స్వామి నుద్దేశించి సీసపద్యాలలో రాసిన శతకం. ఇందులో దాసుగారు ఉపయోగించిన భాషను సీమ తెలుగు అని, నాటు తెలుగు అని అంటారు. ఈ భాషకు సంస్కృత స్పర్శ ఉండదు.

దాసుగారు 1888లో 'బాటసారి' అనే ప్రబంధాన్ని రాసారు. ఇది గూఢార్థకావ్యం. అయినా దీనిని సహజంగాను, సులభంగాను, సుందరంగాను రాయడం దాసుగారి లక్ష్యం. ఇది లఘుకావ్యం. దీనినే దాసుగారు 'ట్రావెలరు' (Traveller) అనే పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. తెలుగుకావ్యంలో వచనం లేదు. ఆంగ్ల రచన పూర్తిగా వచనంలోకి కొనసాగింది. ఇది స్వతంత్ర రచన. గోల్డుస్మిత్ 'ట్రావెలరు'కు, దీనికి ఏవిధమైన సంబంధము లేదు. 'మేలుబంతి' ఒక సంకలన గ్రంథము. దాసుగారు వేరు వేరు సందర్భాలలో చాలాకాలం పాటు అక్కడా అక్కడా ఆశువుగాను, లిఖిత పూర్వకంగాను చెప్పిన పద్యాలివి. ఇందులో ఒక కథ అంటూ ఉండదు. ఎప్పుడు ఏ విషయం మీద చెప్పాలనుకుంటే ఆ విషయం మీద చెప్పే ఇటువంటి పద్యాల కూర్పును "చాటు ప్రబంధము"ని అంటారు. ఇందులోని పద్యాలను పన్నెండు విభాగాలుగా చేసి ఆ విభాగాలకు 'స్తబకము'లని పేరు పెట్టినవారు ఆచార్య యస్వీ జోగారావుగారు. 1910లో దాసుగారు సంస్కృత భాషలో 298 శ్లోకాలలో 5 సర్గలుగా 'తారకమ్' అనే అద్భుత స్వతంత్ర ప్రబంధాన్ని రాసారు. దాసుగారు

తన పాండిత్యాన్ని ప్రదర్శించడానికే ఈ పుస్తకాన్ని రాసారు. తన రచనా ప్రణాళికకు సంబంధించి ఎన్నో కఠిన ప్రతిజ్ఞలను చేసారు. తాతా సుబ్బరాయశాస్త్రి వంటి మహావైయాకరణులు కూడా ఈ ప్రతిజ్ఞా నిర్వహణంలో దాసుగారు ప్రదర్శించిన అద్భుత ప్రజ్ఞకు ఆశ్చర్యచకితులయ్యారు. దాసుగారు తన కథనే 'తారకమ్' అనే పేరుతో కావ్యంగా రాసారని పరిశోధకులందరూ భావించారు.

19వ శతాబ్ది ఉత్తరార్ధంలో ప్రహసనాలు, నాటకాలు విరివిగా పుట్టాయి. ఆ ప్రభావం దాసుగారి మీద కూడా పడింది. సహజంగా కవి, వాగ్గేయకారుడు అయిన దాసుగారు కాలంతో పాటు తన కలాన్ని కలిపి ఒక ప్రహసనాన్ని, ఒక నాటకాన్ని రాసారు. ఆయన రాసిన ప్రహసనం పేరు 'దంభపుర ప్రహసనం' దీని రచనాకాలం 1890. ఈ ప్రహసనంలోని దంభపురం విజయనగరమేనని సమకాలీనులైన కొందరు వ్యక్తులను పాత్రలుగా చేసి దాసుగారు ఈ అధిక్షేప రచన చేసారని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ ప్రహసనం అచ్చయిందా! లేదా! అన్నది నిర్ధారణగా తేలలేదు. ఇప్పుడది ఎక్కడా దొరకడంలేదు. 'సారంగధర' దాసుగారు రాసిన 5 అంకాల స్వతంత్ర నాటకము. ఇందులో అంకవిభజనతో పాటు రంగ విభజన కూడా కనిపిస్తుంది. ఈ నాటక ప్రదర్శనకు సంబంధించిన వివరాలేమీ దొరకడం లేదు.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో వెలసిన తొలిమూడు స్వీయ చరిత్రలలో దాసుగారి 'యెఱుక' అనే స్వీయచరిత్ర మొదటిది కావచ్చునని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ రచన 1898 నాటికి జరిగినట్లు తెలుస్తోంది. దాసుగారు తన 30 సంవత్సరాల వయసు వరకు ఉన్న జీవితాన్ని గూర్చి మాత్రమే 'నా యెఱుక'లో రాసారు. తెలుగులోని స్వీయచరిత్రలలో ఇది ఎన్నదగినది. ఒక్క విషయాన్ని కూడా దాచుకోకుండా తన గుణాలతోపాటు అవగుణాలను కూడా లోకానికి వెల్లడి చేసిన స్వీయ చరిత్ర ఇది. చాలమంది దాచుకునే విషయాలను దాసుగారు దాపరికం లేకుండా ఈ పుస్తకంలో వెల్లడించారు. ఇది దాదాపుగా అచ్చతెలుగులో రాసిన వచనగ్రంథం. ఇందులో తెలుసుకోదగిన సమకాలీన విషయాలెన్నో ఉన్నాయి.

భగవద్గీత ప్రేరణగా మంజరీ ద్విపదలో 8 విభాగాలుగా దాసుగారు 'వేల్పుమాట' అనే రచన చేసారు. ఇది ఉపదేశ కావ్యం. కానీ శ్రీకృష్ణుని గీతోపదేశం కాదు. ఇది నారాయణదాసుగారి ఉపదేశం. ఈ వేదాంత విషయాన్ని దాసుగారు తేట తెలుగులో రాసారు. ఇందులోని ప్రతీ చరణం ఒక వాక్యమే. దాసుగారికి తెలుగుభాషమీద పెరిగిన మమకారం సంస్కృత భాషపై ద్వేషంగా మారింది. బడిపిల్లలకు సంస్కృతం సోకని తెలుగే నేర్పాలని ఆయన కోరారు. తెలుగు తీయనిదని, మెత్తనిదని, తేటతెల్లమైనదని, భాషలన్నింటిలోకి గొప్పదని ఆయన అన్నారు. "తేఁటతీయని యచ్చ తెలుఁగురాకున్న - తెలుగువారి కెద్ది తెలియుట సున్న" అని చాటడానికి "అచ్చ తెలుఁగు పల్కుబడి" అనే పుస్తకాన్ని రాసారు.

దాసుగారు (1) నవరస తరంగిణి (2) ఉమరుకయాము రుబాయెతు (3) నూఱుగంటి (4) వెన్నుని వేయిపేర్ల వినకరి (5) మొక్కుబడి (6) తల్లివిన్కి అనే ఆరు అనువాద గ్రంధాలను రాసారు. ఈ ఆరూ అపురూపగ్రంధాలే. షేక్సుపియరును కావ్యభాషలోనికి, కాళిదాసును అచ్చతెనుగులోనికి అనువదించారు. పారశీక భాషను స్వయంగా నేర్చుకుని నేరుగా ఆ భాషనుండి ప్రపంచ ప్రసిద్ధములైన ఉమార్ ఖాయామ్ రుబాయీలను దాసుగారు సంస్కృతంలోనికి, తెలుగుకావ్యభాషలోనికి, అచ్చతెనుగులోనికి అనువదించారు. ఈ మూడు భాషలకు పారశీకమూలము, దాని ఆంగ్ల అక్షరానుకరణము, ఫిడ్జిగెరాల్డు ఆంగ్లానువాదము కలిపి ఒక దృక్కులో కనిపించేటట్లుగా ఒకచోట ప్రచురించిన అద్భుత గ్రంధమిది. ఈసప్ కథలను నూరింటిని మేలిమిలా మెత్తనైన తెలుగులో 'నూరుగంటి' అనే పరపద్యరూపంలో దాసుగారు అనువదించారు. ఒక గీతపద్యంలో రెండు చరణాలలో నీతినీ, రెండు చరణాలలో కథను ఇమిడ్చి రాయడం ఈ కృతిలోని విశిష్టత. విష్ణుసహస్రనామాలను 'వెన్నుని వేయిపేర్ల వినకరి' అనే పేరుతో అచ్చ తెలుగులో అనువదించారు. దాసుగారు ఇందులో వాడిన పద్యాలకు తెలుగు పేర్లు పెట్టారు.

సంస్కృతంలోని మూడువందల నాలుగు బుక్కులను 'మొక్కుబడి' అనే పేరుతో అచ్చ తెలుగు పద్యాలుగా అనువదించారు. తెలుగు పద్యాలకు బడి, తండ్రి, సైదోడు అనే కొత్త పేర్లు పెట్టారు. వేదంలోను, శరీరశాస్త్రంలోను దాసుగారికి గల పాండిత్యం ఈ

గ్రంథంలో తెలుస్తుంది. లలితా సహస్రనామాల్ను 'తల్లివిన్కి' అనే పేరుతో నాటు తెలుగులోకి అనువదించారు. "ఎల్లనుడులకుఁ దెల్గే మేటిమాట" అనే విశ్వాసంతో ఈ అనువాదం చేశారు.

దాసుగారు వేదంతో పాటు అనేక శాస్త్రాలు కూడా చదువుకున్నారు. శాస్త్రమర్మాలను ఆకళించుకున్నారు. తన శాస్త్రీయ విజ్ఞానాన్ని వెల్లడిస్తూ తర్కసంగ్రహము, వ్యాకరణ సంగ్రహము, చాతుర్వర్గ సాధనమ్, మన్కిమిన్కు, సీమపల్కువహి, జగజ్జ్యోతి, పురుషార్థసాధనమ్, దశవిధరాగ నవతి కుసుమ మంజరి అనే ఎనిమిది శాస్త్ర గ్రంథాలను రాసారు. సీమపల్కువహి అచ్చ తెలుగు నిఘంటువు. 'మన్కిమిన్కు' ఆయుర్వేద గ్రంథము. 'జగజ్జ్యోతి' వేదాంత గ్రంథము, ఎనిమిది ప్రకాశములుగా లభించిన ఈ గ్రంథాన్ని రెండు భాగాలుగా అచ్చువేశారు. ఇది 879 పేజీల బృహద్గ్రంథము. దాసుగారు ఈ విషయాన్ని గూర్చి ఇంకా కొన్ని ప్రకాశములను రాసి ఉంటారని పరిశోధకులు ఊహిస్తున్నారు. 'పురుషార్థసాధనమ్' అనేది సంస్కృతంలో రాసిన చిన్న శాస్త్రీయ రచన. 1938లో కన్యాకుమారిని దర్శించి ఆ దేవిని స్తుతిస్తూ దాసుగారు 'దశవిధ రాగ నవతి కుసుమ మంజరి' అనే సంగీత శాస్త్రగ్రంథాన్ని రాసారు. సంగీత శాస్త్రంలో దీనికి సాటిరాగల గ్రంథమింకొకటి లేదు. ఈ గ్రంథాలే కాక దాసుగారు ఇంకా కొన్ని గ్రంథాలను రాసినట్లుగా తెలుస్తోంది. అవి మనకు ఇప్పుడు దొరకడంలేదు.

## 5

ఎనభై ఏళ్ళ నిండు జీవితాన్ని అసదృశ ప్రజ్ఞతో అద్భుతశక్తులతో గడిపిన మానవ గంధర్వుడు ఆదిభట్ల నారాయణదాసు. ఆయన జీవితంలో రెండు ప్రముఖ దశలు మనకు కనిపిస్తాయి. పుట్టినది లగాయితు మైసూరు సంస్థానాధీశుని సన్మానాలను పొందిన మొదటిదశ. ముప్పై ఏళ్ళ ఈ తొలిదశలో ఆయన రచ్చగెలిచాడు. ఆనందగజపతి మహారాజు పరిచయంతో ఆయన ఇంట గెలిచిన రెండవదశ మొదలయింది. బాల్యం నుండి విజయనగరమే ఆయన నివాసం. తొలినుండి విజయనగరం సంస్థానం పట్ల, సంస్థానాధీశుల పట్ల ఆయన గౌరవాన్నే ప్రదర్శించారు. కానీ ఆనందగజపతి మహారాజు ఆశ్రితుల వ్యతిరేకత కారణంగా ఆయన అవసానదశకు చేరుకునేవరకు దాసుగారికి విజయనగరం కోటలోకి ప్రవేశం దొరకలేదు. లింగం లక్ష్మాజీపంతులు ఆనంద గజపతి మహారాజుకు దాసుగారిని పరిచయం చేసారు. దాసుగారి అద్భుతప్రజ్ఞ రెండేళ్ళపాటు వారిని ఆ మహారాజుకు చెలికానిగా చేసింది. వారి స్నేహం సంగీత, సాహిత్య వినోదములకు మాత్రమే పరిమితం కాక చదరంగం, పేకాట వంటి వినోదాలకు కూడా విస్తరించింది. ఇది మొదలు సంస్థానంతో దాసుగారి సంబంధం ఎదురులేకుండా నడిచింది. అప్పల కొండయాంబ (రీవాసర్కారు), విజయరామ గజపతి కూడా దాసుగారిని ఎంతో గౌరవించారు. అప్పలకొండ యాంబ ఒక్క రుక్మిణీ కళ్యాణ హరికథ విన్న సందర్భంలోనే నలభై పెద్దకాసులు కానుకగా ఇచ్చారు. విజయరామ గజపతి పేర 1919లో ఏర్పడిన విజయరామగాన పాఠశాలకు దాసుగారిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ పదవిలో ఆయన 1936 వరకు కొనసాగారు. ఈ కాలమంతటా ఈ కళాశాల ఆయన ఆడింది ఆటగా, పాడింది పాటగా నడిచింది. మహా విద్వాంసులెందరో ఇక్కడ సంగీత విద్యను అభ్యసించారు.

దాసుగారిని అనేక బిరుదాలు వరించాయి. 1904లో భారతదేశంలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన సంగీత విద్వాంసులందరితో కూడిన మహాసభలో బెంగుళూర్‌లో దాసుగారిని అనేక బిరుదాలు వరించాయి. 1904 లో భారతదేశంలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన సంగీత విద్వాంసులందరితో కూడిన మహాసభలో బెంగుళూర్‌లో దాసుగారిని 'లయబ్రహ్మ' అనే బిరుదాన్నిచ్చి గౌరవించారు. బందరులో 1914లో జరిగిన విద్వత్సభలో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు దాసుగారిని 'హరికథాపితామహ' అనే బిరుదంతో గౌరవించారు. శ్రీనాథుడు డిండిమభట్టు ఢక్కను పగులగొట్టినట్లుగా 1914లోనే దాక్షిణాత్యుడైన సుబ్రహ్మణ్య అయ్యరును పల్లవిలో ఓడించి ఆయన ముంజేతి సువర్ణ ఘంటాకంకణాన్ని తొలగించిన సందర్భంలో సభవారు దాసుగారిని 'పంచముఖీ పరమేశ్వరుడు' అనే బిరుదంతో సత్కరించారు. మద్రాసు

విద్వాంసులు 1928లో దాసుగారిని 'ఆంధ్రదేశ భూషణం'గా అభివర్ణించారు. 1933లో విశాఖపట్టణంలో జయపుర సంస్థానాధీశుడైన విక్రమదేవవర్మ దాసుగారికి 'సంగీత సాహిత్య సార్వభౌమ' అనే బిరుదాన్నిచ్చారు. ఆ సంవత్సరమే ఆ ఊళ్ళోనే "శృంగార సర్వజ్ఞ" అనే బిరుదప్రదానం చేశారు. విజయనగరంలోని 'భారతీతీర్థ' అనే సంస్థ 1935లో దాసుగారికి "ఆటపాటల మేటి" అనే బిరుదాన్నిచ్చింది.

బిరుదాలే కాదు దాసుగారి జీవితంలోని రెండవదశలో కూడా వారికెన్నెన్నో ఘన సత్కారాలు జరిగాయి. ఇంగ్లండు దర్శించమని వచ్చిన ఆహ్వానాన్ని ఆయన సున్నితంగా తిరస్కరించారు. నోబెల్ బహుమానం కోసం దరఖాస్తు చేయడానికి కూడా ఆయన సుముఖత చూపలేదు. ఆయన సంస్కృత రచనలను ఇతరదేశాల పండితులు ప్రశంసించారు. సువర్ణ ఘంటాకంకణాలు, గండపెండేరాలు వంటి సామాన్య సత్కారాలు అనేకం జరిగాయి. దాసుగారు తనను వ్యతిరేకించినా వీరేశలింగంగారు 1912లో ఆంధ్రసారస్వత పరిషత్ పక్షాన నవరత్న ఖచిత భుజకీర్తులతో దాసుగారిని సత్కరించారు. 1913లో కాకినాడలో జరిగిన గానసభలో దాసుగారి పాటవిని తన్మయులైన ప్రజలు ముత్యాల కర్ణకుండలాలిచ్చి పూజించారు. హిందూస్థానీ సంగీత విద్వాంసురాలైన జానకీబాయిగారు అలహాబాదులో దాసుగారిమీద ప్రశంసల వర్షం కురిపించారు. 1913లో సంస్కృత హరికథకు హిందీ వ్యాఖ్యానం చేస్తూ దాసుగారు పాడిన బేహాగు రాగాన్ని విశ్వకవి రవీంద్రనాథ ఠాగూరు కొన్ని సంవత్సరాల వరకు మరచిపోలేకపోయారు. 1914లో చల్లపల్లిలో జరిగిన పండిత సభలో దాసుగారి అద్భుత వీణావాదన ప్రదర్శనకు పరవశించిపోయిన జమీందారు అంకినీడు మల్లికార్జున ప్రసాదరావుగారు ఇరవైనాలుగు నవరసులతో చేసిన బంగారు గండపెండేరాన్ని దాసుగారికి కాలికి స్వయంగా తొడిగారు. నూజివీడులో గజారోహణం జరిపించారు. నందిగ్రామములో బ్రహ్మరథం పట్టారు. 1923లో కాకినాడ కాంగ్రెస్‌లో దాసుగారి హరికథ విని సరోజినాయుడు వేనోళ్ళ ప్రశంసించారు. అలక నారాయణ గజపతి, బరోడా మహారాజు కలసి దాసుగారి కథ వినాలని ఊటీకి పిలిపించుకున్నప్పుడు అక్కడ బస చేసిన మైసూరు మహారాజుతో సహా ఇతర సంస్థాధీశులు కూడా ఆయన కథను విని ఘనంగా సన్మానించారు. జీవించినంతకాలం అనుదినం నిత్యవసంతంగా వీరభోగ వసంతరాయలుగా ఆటపాటలతో ఆ బాలగోపాలాన్ని అలరించిన ఆదిభట్ల నారాయణదాసు 2-1-1945న స్వచ్ఛంద మరణాన్ని పొందారు. మరణంలో కూడా ఒక ధీరత్వాన్ని ప్రదర్శించిన దాసుగారి వంటి పూర్ణపురుషుడు ఆయనకు ముందు వెనుకలలో కనబడరు. ఆయన జీవితం ఒక సాహిత్య నృత్యగాన హేల. అది చిరస్మరణీయమైనది.